PLACED ON THE SHELF
Date

ప్రథమ ముద్రణము
వేయి ప్రతులు
1984

సర్వస్వామ్యములు-
ప్రచురణకర్తవి

ప్రచురణకర్త :
జోయనపల్లి కామేశ్వరరావు బి. ఏ.,
కామరాజుపేట (వయా) రాజమండ్రి.
తూర్పుగోదావరిజిల్లా.

గ్రంథములు వలయువారు పై చిరునామాకు
వ్రాసి పొందవచ్చును.

మూల్యము : రు. 16_00

SRI VENKATESWARA
CENTRAL LIBRARY &
RESEARCH CENTRE.
Acc. No. 33082
Date
TIRUPATI.

ముద్రణ :
విజయశ్రీ ప్రింటింగువర్క్సు,
కందకంవీధి, రాజమండ్రి - 1.

విజయతే శ్రీ వేంకటేశః ప్రభుః

శ్లో॥ లభ్యతే దర్శనాద్యస్య
నిర్వృతి ర్నేత్రయోః, హృది।
బ్రహ్మానందానుభూతి శ్చ
తం భజే వేంకట ప్రభుమ్ ॥

శ్లో॥ వినుతిః కలిదోష శోషణాయ
ప్రణతి ర్వాంఛిత సిద్ధయే చ యస్య।
స్మరణం చిరసౌఖ్య లబ్ధయే స్యాత్
కలయే తం హృది వేంకటాధినాథమ్ ॥

శ్లో॥ యో దేవ స్స్వజనావనాయ కృపయా సంకల్ప్య అవతీర్ణః క్షితౌ
లక్ష్మీ భూమి సమేత విగ్రహః ప్రవిలసద్వైకుంఠ రమ్యాలయః,
అరవిందోత్పల రాజితో ఘన దయాసింధు స్స బంధు స్సతాం
భక్తాభీష్ట వరప్రదో విజయతే శ్రీవేంకటేశః ప్రభుః॥

శుభోదినీ సమర్పకులు:

[illegible]యానపల్లి	[illegible]లవరపు
[illegible] రావు, బి. ఏ.;	సుబ్రహ్మణ్యము

శ్లో. తృణ మంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా

(రావణుని నీచబుద్ధి తనకు ఈసడింపుతో గూడిన చిఱునవ్వు కలిగించుచుండగా సీతాదేవి వానికిని తనకును నడుమ నొక గడ్డిపోచ నడ్డముగ వైచి ఇట్లు బదులు చెప్పదొడగెను.)

పుట 131. సర్గము 21. శ్లో. 3

* * *

"ధీరా స్వధర్మనిరతా భవతీ న భీతా
హ్రీరాత్ త్రిలోకభయదాత్ దశకంఠదైత్యాత్,
కించ త్వయా ఖలు ఖల స్స తృణీకృతో ఽభూత్
శ్రీరామచంద్రహృదయేశ్వరి। తే నమోఽస్తు॥"

(త్రిలోక భీకరుడైన దశకంఠుడు నీ యెదుట నిలచి గద్దించుచుండగా వాని శౌర్యదర్పముల కిసుమంతయు చలింపక వాని నీసడించుచు గడ్డిపోచగజేసి మాటలాడి మృత్యుముఖమునందు సైతము ధీరతను గోల్పోవని ధర్మవీరురాలవు. ఓ రఘువీర ధర్మపత్నీ। నీకు వందనము.)

సీతామాతృవందనము. శ్లో. 9 పుట ౬.

వి ష య సూ చి క

1. ఆమోదము — శ్రీ దివాకర్ల వెంకటావధానిగారు
2. ప్రశంస — శ్రీ తుమ్మలపల్లి సీతారామమూర్తిగారు
3. అభినందనము — శ్రీ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసుగారు
4. సీతామాతృవందనము — సుబోధినీ సమర్పకులు]

	సర్గము	శ్లో.	పుట
1. సీతాదేవి శీల సౌందర్యములకు హనుమ ఆనందాశ్చర్యములు	16	1	1
2. సీత దీనస్థితికి హనుమ విషాదము		26	23
3. సీత చుట్టును కావలియున్న రాక్షసస్త్రీలు	17	1	31
4. రాక్షసస్త్రీల నడుమ సీత దీనస్థితి		18	44
5. సీతనుజూచిన హనుమకు కలిగిన తృప్తి		30	51
6. సీతతో మాటాడుటకు రావణుని రాక	18	1	54
7. ప్రియాంగనలతో రావణుని అశోకవన ప్రవేశము		10	62
8. చెట్టుపైనున్న హనుమకు రావణుని దర్శనము		20	68
9. రావణుని జూచిన సీత భయవిహ్వలత	19	1	80
10. సీతనుగూర్చి రావణుని ప్రలోభన ప్రలాపములు	20	1	99
11. రావణునితో మాటాడుటకు సీతగావించిన తృణవ్యవధానము	21	1	134
12. సీత రావణునకు చేసిన హెచ్చరిక		5	138

13. క్రుద్ధుడైన రావణుడు సీతకొసగిన మాసద్వయావధి	22	1	165
14. రావణుని నీచబుద్ధికి సీత మందలింపు		12	171
15. సీత మాటలకు రావణుని క్రోధము		23	183
16. సీతమనసు మార్చుటకై రాక్షసస్త్రీల కాజ్ఞాపనము		32	191
17. ధాన్యమాలిని శాంతివచనములు - రావణుని ప్రతినివర్తనము		39	198
18. సీతను మనసు మార్చుకొనుమని ఏకజటాదుల నిర్బంధము	23	1	203
19. రాక్షసస్త్రీల జానకీదూషణము	24	1	219
20. సీతా నిజ నిశ్చయ కథనము		6	223
21. వినతాది రాక్షసస్త్రీల సీతా నిర్భర్త్సనము		14	227
22. సీతాదేవి శోకసంతాపము	25	1	253

—0—

ఆమోదము

కళాప్రపూర్ణ
డాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు,
M A. (Hons.) P. H D.
హైదరాబాదు – 27

యథా సర్వేషు దేవేషు రామః ప్రియతమో మతః,
తథా రామాయణే సర్వే సుందరః కాండ ఉత్తమః''

అను నభియుక్తోక్తి రామాయణము నందలి సుందరకాండమునకు గల ప్రాశస్త్యమును విశదీకరించుచున్నది. అందు కనేక కారణము లున్నవి. వాల్మీకి మహర్షి రామాయణమునందలి యితరకాండములకు, అందలి కథా సందర్భములనుబట్టి పేరు పెట్టి. సుందర కాండమును మాత్రము వేఱుగా పేర్కొనెను. సుందరుడనగా, హనుమంతుడని చెప్పుటకు ఆధారము లున్నవి. పద్మపురాణమున శివుడు పార్వతితో ''మదంశజో మహా బాహుః మహాబల పరాక్రమః। సుభగ స్సుందర శ్శ్రీమాన్ భక్తః రఘుపరాయణః'' అని చెప్పుచు, హనుమంతునికి సుందరుడను విశేషణమును గూడ వేసియుండెను. ఆంజనేయుడు సుందరుడా? అను సందేహము కొందఱి కుదయింపవచ్చును. కాని అతడు కాంచనాద్రి కమనీయవిగ్రహుడు, బుద్ధిమతాం వరిష్ఠుడు. అదిగాక, వానరుల సౌందర్యమును సమీక్షించునపుడు వారిని, వానరులతోడనే పోల్చవలయునుగాని, తదితరులతో పోల్చరాదు. ఆ వానరులలో హనుమంతుడు సుందరు

డనుటలో సందేహములేదు. సుందరశబ్దమునకు - "సుం = శోకం, దారయతి = ఖండయతి, ఇతిసుందరః" అని వ్యుత్పత్తి, హనుమంతుడు సముద్రమును దాటి, సీతను దర్శించి, రాముని క్షేమవార్త నామెకును, తిరిగి వచ్చి, సీతాక్షేమవార్త రామునకునుతెలిపి, వారిరువురిశోకములను రూపుమాపెను, అందుచే గూడ నతడు సుందరు డనుచున్నాడు. సుందరశబ్దమునకు "సుతరాం నన్ద్రియతే"అనువ్యుత్పత్త్యర్థముగూడ కలదు. అనగా మిక్కిలి ఆదరింపబడు వాడని యర్థము. హనుమంతుడు రుద్రాంశ సంభూతుడగుటచే శైవులకును. రామభక్తుడగుటచే వైష్ణవులకును, వాయుసూనుడగుటచే మాధ్వులకును అదరణీయుడగుచున్నాడు' ఏ మతమువారుకాని, అతనిని ఆదరముతో పూజింపని వారుండరు. మఱియు

"సుందరే సుందరో రామః సుందరే సుందర కపిః...

సుందరే సుందరీ సీతా సుందరే కిం న సుందరమ్మను"

నార్యోక్తి కూడ కపిసత్తముడైన యాతడు సుందరుడని తెల్పుచున్నది.

సాధారణముగా కావ్యములందు ఆరంభము నందే నాయక ప్రశ్న ముండును. కాని రామాయణమున రాముని సంపూర్ణ సౌందర్యము నెఱుంగవలెనన్న, సుందరకాండమునే పరింపవలయును. ఏలయన, సీత రాముని అవయవములను వర్ణింపుమని కోరినపుడు హనుమంతు డాతని సర్వావయవముల సౌందర్యమును వివరించి చెప్పెను. రాముని సౌందర్యమును తెల్పు కాండముగావున, దీనిని సుందర కాండమని పిలువవచ్చును. కవితా విషయమునగూడ ఇతర కాండము లందలి కవిత్వముకంటె, సుందర కావ్యమునందలి కవిత్వము సుందరతరముగా నుండును. మఱియు నొక్క విశేషము కలదు. రామాయణము నంతను పరింపలేనివారు, ఒక్క సుందరకాండమునైన పరించి, తత్పుణ్యమును బడయఁజాలుదురని పెద్ద లందురు. హనుమంతుడు అశోక వృక్షశాఖపై కూర్చుండి, తాను హఠాత్తుగా సీతను దర్శించినచో నామె సందేహించునేమో యను భయమున శ్రీరామ జననము మొదలు, తానచ్చటికి వచ్చువరకును జరిగిన వృత్తాం

రము నంతయు చెప్పెను. తరువాత సీతకు తన్నాలింగించికొని, ముందు రాముడు లక్ష్మణునితోడను, వానర సైన్యముతోడను వచ్చి, రావణుని సంహరించి, యామెను గొనిపోవునని ధైర్యము చెప్పెను. ఈ విధముగా రామాయణ కథయంతయు సుందర కాండమున హనుమత్ప్రోక్తమై సంగ్రహ రూపమున గానవచ్చును.

సుందరకాండము పారాయణము చేయునపుడు, వినాయక సరస్వతీ వాల్మీకి ప్రార్థనలతోపాటు, హనుమత్ స్తోత్రమునుకూడ చేయుట సంప్రదాయసిద్ధమైయున్నది. ఇక్కడ హనుమంతుని స్తుతించు శ్లోకములలో వర్ణింపబడిన హనుమంతుని గుణములన్నియు సుందరకాండమున కానిపించును. అతడు మనోజవుడు, మారుత తుల్యవేగుడు. సీతాన్వేషణమునకై రావణాంతఃపురమును దర్శించునపుడు అతని మనస్సున ఎట్టి వైకల్యమును కలుగకుండుట, అతని జితేంద్రియత్వమును చెప్పక చెప్పుచున్నది. అతడు సాధారణ వానరుడుకాడు. రామాయణ మహామాలా రత్నమని ప్రశస్తిపొందినవాడు. మరియు పురుషసూక్తమున త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః'' అను వాక్యమున్నది. హనుమత్సహస్రనామములలో త్రిపాదూర్ధ్వగాయ నమః అను నామముకూడ కానవచ్చుచున్నది. దీనిని బట్టి పెద్దలతనిని పరబ్రహ్మస్వరూపునిగా భావించిరని తెలియుచున్నది. అట్టిమహానుభావుని గుణగణములను వర్ణించు కాండము సుందరము కాక, మరియేమగును?

హనుమంతుడు గొప్పయోగివలె కన్పించును. శ్రీరాముడు ప్రథమ దర్శనమునందే అతని మాహాత్మ్యమును గ్రహించెను. అందుచేతనే, అతడు ఉంగరము ఇతరవానరులకీయక హనుమంతుని కొసంగెను. సుగ్రీవుని పరివారములో నున్న వానరులలో అతడొక్కడే సీతను దర్శింపగలడను విశ్వాస మాతనికి కలదు. మనుచరిత్రకారుడు శ్రీరామునికిని, హనుమంతునికిని సాద ఘట్టించు. అటుల

“తరుణార్క శబళక్షోద్ధతిఁ జూపె నెవ్వాఁడు రుచులచే ఫలమోహారుచులచేత” ఇత్యాది సీసపద్యమున “అక్షశిక్షా ప్రౌఢి నలరారె నెవ్వాఁడు రణముచే నియమధారణముచేత”

“అనికూడ చెప్పియుండెను ఇందలి రెండవర్ణమున, అతడు నియమ ధారణముచే అనగా యోగాభ్యాసాదులచే ఇంద్రియదమనము కావించెనని చెప్పవలయును. అతడట్టి మహాయోగి కావుననే శతయోజన విస్తీర్ణ మయిన సముద్రమును దాటఁ జాలెను. మఱియు లంకను దహించునపుడు, అందలి యిండ్లన్నియుకాలెను గాని ఆతని తోకమాత్రము కాలియుండ లేదు. ఇదంతయు యోగమహిమమే. జగద్గురు శంకరాచార్యులవారు మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం స్థితం స్వాధిష్ఠానే” అను సౌందర్య లహరి యందలి శ్లోకమునందు కుండలి నీశక్తి నుత్థాపనముచే యగలయోగి. కసాధ్యమేదియు నుండదని చెప్పి యున్నారు. సాంకేతికముగా చూచినచో అశోకవనము సహస్రారమనియు, హనుమంతుడను మహాయోగి అన్ని ప్రలోభనములను తరించి, జగజ్జ ననియు, పరబ్రహ్మస్వరూపిణియు నగుసీతను దర్శింపఁ జాలెననియు చెప్పవచ్చును. యోగాభ్యాసము చేయువాని కెట్టి ప్రలోభనములు కల్గునో, ఎట్టి యాటంకములుప్పతిల్లునో, అవి అన్నియు వాల్మీకి హనుమంతునికి కలిగించెను, ఆ యోగి శిఖామణి వానిని లెక్కచేయక జగజ్జననీ దర్శనము కావించి, తిరిగి, రామునికడకు రాఁజాలెను. సుందరకాండ మంతయు హనుమంతుని పరాక్రమ మనోనిగ్రహాది గుణ గణము లన్నింటిని చక్కగా వర్ణించును.

కొందఱు విద్వాంసులు త్రిజటా స్వప్నమున గాయత్రీ వర్ణనము కలదని చెప్పుదురు. మఱియు వాల్మీకి, గాయత్రీమంత్రము నందలి యొక్కొక్క యక్షరమునకు, ఒక్కొక్క వేయిచొప్పున శ్రీమద్రామా యణమున మొత్తము 24 వేల శ్లోకములు రచించియుండెను. అందు సుందరకాండమున మూడు బీజాక్షరములు నిక్షిప్తములై యున్నవి. ఇట్లే సుందరకాండ మహాత్మ్యమును నిరూపించుట కింకను వేఱుకారణము లనేక ములున్నవి.

అట్టి సుందరకాండమునకు తెలుగున గద్య పద్యానువాదము లెన్నో వెలువడియున్నవి. పలువురు టీకా తాత్పర్యములను కూడ రచించి యున్నారు. ఇటీవల శ్రీ బి. కామేశ్వరరావుగారి ప్రేరణమున పండిత వరేణ్యులయిన, శ్రీ మైలవరపు సుబ్రహ్మణ్యముగారు సుందరకాండము నందలి ప్రతిశ్లోకమునకును అన్వయక్రమమును, ప్రతిపదార్థమును, తాత్పర్య విశేషములను వెలయించి యుండిరి. ఇట్లు చేసినచో సుందర కాండము బహు సంపుటములతో కూడిన పెద్ద గ్రంథ మగును. అయిన నేమి! సామాన్యులకు కూడ ఉత్తమమయిన యా కాండమునందలి ప్రతి పదము నర్థముచేసికొని పారాయణము చేయుటకు అవకాశము లభించును.

ఈ మహాకార్యమును నిర్వహించుచున్న రచయిత తిరుపురికిని లభించు పుణ్యమింత యంతయని చెప్పజాలము వ్యయప్రయాసములతో గూడిన యీ పనిని వారెంతో ఆనందోత్సాహ విశేషముతో చేయుచున్నారు. వారు నన్ను చూచుటకు వచ్చినపుడు, వారి యుత్సాహానందముల నేను స్వయముగాచూచి, ఆశ్చర్యచకితుడనైతిని.

అన్వయక్రమమును, అర్థతాత్పర్య విశేషములను రచించుటలో రచయితలు బహువ్యాఖ్యానముల సాహాయ్యమున చూపిన పాండితీ పరిశ్రమ, పాటవమును వర్ణింపఁజాలము. జగద్ధితకరమయిన యీ కార్యమును చేయుచున్న వారిని శ్రీరామచంద్రుడును, తద్భక్తుడగు హనుమంతుడును, అనుగ్రహింతురనుటలో సందేహములేదు. పారాయణము చేయువారును వారి యనుగ్రహమునకు పాత్రులు కాఁగలరు, ఈ వ్యాఖ్యకు సుబోధినీ వ్యాఖ్య అను పేరన్వర్థమైయున్నది. మిగిలిన సర్గములను కూడ నిట్లే సత్వరముగా ప్రకటించి, ఆ పుణ్యాత్ములిరువురును ఆంధ్రలోకమునకు సుందర కాండమును ప్రతిపదార్థ తాత్పర్య విశేషములతో పారాయణము చేసి, సర్వశుభముల నందుట కవకాశము కల్గింతురని వేడుచు; వారిని హృదయపూర్వకముగా నభినందించుచున్నాను.

దివాకర్ల వేంకటావధాని

ప్రశంస

కళా ప్రపూర్ణ

శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారు,

అప్పికట్ల, తెనాలితాలూకా.

రవికులవార్ధి సోముఁడగు రామునకున్ సకలప్రపంచ గౌ
రవము లభింప భారత ధరాప్రజ కీ నరపాల మౌళి వే
ల్పవుట విచిత్రమా! తనువు నందిన ధర్మువు గాన రాముఁ డీ
భవికము పొందఁగల్గె; మనపల్లెకు, పేటికి, వాడవాడకున్
నవనవశోభ గూర్చుచు ననారతపూజల నందుచున్ రఘు
ప్రవరుని కోవెలల్ వెలసె, భవ్యగుణాకర సీత పీనికిన్
దవిన వెలంది యయ్యెఁ; శుచితానిధిగా జగదేక మాతగా
నవనము లందె; నీయుగళి నామములన్ దనబిడ్డలన్ మహో
త్సవమునఁ బిల్వసాగె మనధాత్రి దనర్చు గృహస్థకోటి; శ్రీ
నవమికి సీత పెండ్లి నభినంద్యకళాకమనీయ వార్షికో
త్సవముగ నూరనూర నియతమ్ముగఁ జేయ నుపక్రమించె; సత్
త్కవికులచక్రవర్తి యనఁగా నతికెక్కిన పుట్టపర్తి వీ
కవకథ పల్కి ముమ్మొదటి కైనరుఁ డయ్యెఁ దదీయకావ్య మీ
భువి కెనలేని భాగ్యముగఁ బొల్చె; శతాధిక దేశభాషలం
దవితథ రూపముం బడసె; నాంధ్రకవుల్ పడినన్నవారు మ
క్కువపడి రీచరిత్రమునకున్; విదుషీమణి మొల్ల కప్రపున్

భపలకు ; దేవసేనలకు రంగముగా, శరదిందుచంద్రికా
భవనముగాఁ బటేంగిరి పంచిన మందసమీరవీచిగా,
జిపగల తల్లిబాస కొకచిన్నయగాఁ దనకైత గూర్చి మా
న్యవవిత యయ్యె; నింత నిజ,మైనను మూలముగుబ్బెటుంగఁగాఁ
దపులము సూపువారలకు దక్కదు సంస్కృతవాణిరాక ని
క్కవమగు తుష్టి, యూకొఁటఁతకున్ గుటియై దిగులందు వెల్గవా
రవహితచిత్తులై తనియునట్లు మహర్షిగభీర వాణికిన్
సవరని తెన్గుఁబలుక్కుల రసజ్ఞులపాలిటి మేలివిందుగా,
వివిధ విశేషముల్ పగటు పేదికగా, రుచిరార్థ రాశిగా
వివరణ సంతరించిన కవిప్రవరున్, రఘునాథభక్తిపై
భవుని, వినీతు "మైలవర"పావనవంశ్యునిఁ సాహితీయశః
ప్రవణత రామమంత్రజపపారగతన్ నిఖిలాంధ్రమండల
స్తవముల నందుకొన్న బుధచంద్రుని "బోయనపల్లి" సత్కులున్
సువచన దీప్తితోడ నొకసుందర కాండము కాక జానకీ
ధవ కథయెల్లఁ జాటఁగ నితాంత జయమ్ముల నందఁగా శతా
యువునిడి రామమాత, కరుణోదధి మారుతి ప్రోచుఁగావుతన్ ।

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

అభినందన ప్రసూనోపాయనమ్

కథాగాన కళాప్రపూర్ణ

శ్రీమాన్ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసుగారు

తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన విద్వాంసులు.

నరసాపురము (ప॥ గో॥ జిల్లా.)

శ్లో॥ శ్రీమ ద్రామ పదాంబుజాత మధుపాన ప్రస్ఫుర ద్బృంభరం
గోష్పాదీకృత వార్ధి లంఘన విధౌ చుంబ ద్విశాలాంబరమ్,
లంకాదాహక విక్రమోజ్జ్వలిత సాక్షీభూత వైశ్వానరం
వందే ధీర సమీర నందన మహం భక్త్యా కపీనాం వరమ్ ॥

శ్లో॥ శ్రీమైలవరపు వంశ్య స్సుబ్రహ్మణ్యాఖ్య కవివరేణ్యశ్చ సదా,
విజయేతాం శ్రీబోయనపలి కామేశ్వర కవీంద్ర వర్యశ్చ ముదా॥

శ్లో॥ శ్రీమద్రామాయణే కాండే సుందరే శ్లోక సంతతేః,
అన్వయక్రమ తాత్ప ర్యాద్యర్థ వ్యాఖ్యాన విస్తృతా,
సుబోధినీ వివరణ ప్రఖ్యాతా భవతోః కృతిః,
భూయాత్ లోకోపకారాయ తథైవ విదుషాం ముదే ॥
తనిశ్లో కాద్ది ప్రాచీన వ్యాఖ్యానాంశ విభూషితా,
సుబోధినీ సుధీబోధి న్యపి స్యాత్ భవతోః కృతిః ॥
"తృణ మంతరతః కృత్వా" ముఖ్య శ్లోకార్థ సంచయే,
భవతో స్సాహితీ శ్లాఘ్యా నాన్యసామాన్యతాం గతా ॥

శ్లో॥ శ్రీవాణీ ధృతవల్లకీ మృదుకరాబ్జా గాన సాహిత్యవి
జ్ఞానానందమయీ విధాతృవదన శ్రీసద్మ సంవాసినీ,
విద్వల్లోక సమర్చి తాంఘ్రియుగళా విష్ణుస్నుషా సంతతం
పాయాత్ వాఙ్మయసేవకౌ కృషిఫలం దత్వా భవంతా వుభౌ॥

శ్లో॥ నవనవ భావసంభృత, మనన్య సుధీమహి మాభిరామ, మా
ర్యవినుత మాది సత్కవివర ప్రవిగీత మనోజ్ఞ కావ్య శి
ల్పవిభవ నిర్భరం బగుచు వాసి గడించెడు మీ సుబోధినీ
వివరణ మక్షరాక్షర పవిత్రము సన్నుతి పాత్రి మెన్నగన్.

ఉ. కవి కల్పించును కావ్యశిల్పమున; తత్కావ్య ప్రశస్తిన్ నిస
ర్గవిధిన్ వ్యాకృతి చేసి పుష్టి నమకూర్పం జాలు వ్యాఖ్యాతలో
కవి జీవించును, కావ్యమున్ కవిని ఉత్కర్షించి తాదాత్మ్య సి
ద్ధి విడంబించు రసజ్ఞబుద్ధిఁ గవి శాంతింబొందు నశ్రాంతమున్॥

మ. భవ దుత్కృష్ట మనీష స్తుత్య మగు సుబ్రహ్మణ్య కామేశరా
య విఖ్యాతయశులార! సర్వజన మాన్యత్వం బుటంకించు న
ధ్యవసాయంబున అద్వితీయకృషి సేయంజాలు మీశక్తి ధీ
లవ ఘూన్యుండను నేను వర్ణనము సల్ప న్నేర్తు నే లేశమున్॥

శ్లో॥ స్వస్త్యస్తు నిర్మల జయో ఒస్తు చిరాయు రస్తు,
ఆరోగ్యమస్తు భవదన్వయ వృద్ధి రస్తు॥
సారస్వత ప్రవణ ధీబల సిద్ధి రస్తు,
వాం సంతతం దశది శావృత సద్యశో ఒస్తు॥

సుధీ విధేయుడు
దీక్షితదాసు.

శ్రీ

సీతామాతృవందనము

శ్లో॥ శ్రీరామ వామ లలితాంక విరాజమానే!
భూపుత్త్రికే! భువనపావన సచ్చరిత్రే!
మాతః! కృపామృత నిధే! శ్రిత కల్పవల్లి!
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో ఽస్తు. 1

తా॥ శ్రీరామచంద్రుని కోమల సుందరమైన వామాంకతలమున వెలయుచున్నదానవు, లోకములను పావనముచేయు పుణ్యచరిత్రము కలదానవు; ఆశ్రయించిన భక్తులను తనియజేయు దయామృత నిధివి; కామితఫలము లొసగు కల్పవృక్షమవు; రామచంద్రప్రభుని హృదయాధీశ్వరివి; దేవీ! భూపుత్రీ! సీతామాతా! నీకు వందనము.

శ్లో॥ యజ్ఞావనే ర్జనకరాట్ సుకృతాత్ త్వ మాప్తా
యజ్ఞే మహేశధనుషా సుపరీక్ష్య దత్తా,
యజ్ఞ ప్రభావ జనితాయ హి; యజ్ఞసేవ్యే!
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో ఽస్తు. 2

తా॥ జనకభూపాలుని భాగ్యవిశేషముచే అతని యాగభూమినుండి ఉద్భ వించినదానవు; ఆ మహీపతి ఏర్పఱచిన ధనుర్యాగమునందలి పరీక్షలో మహేశ్వరచాపము నెక్కు పెట్టి విజయము నొందినట్టి యజ్ఞప్రభావ సంభవుడైన వరుని చేపట్టినదానవు; తల్లీ! నీ జననము, పరిణయము అన్నియు యజ్ఞప్రభావమూలములే గదా! యజ్ఞసేవ్య వైన మైథిలీ! రామపత్నీ! నీకు వందనము.

శ్లో॥ వైదేహ రాజముని శిక్షణ నీత బాల్యే!
బాల్యా దవాప్త మునిదుర్లభ దివ్యవిద్యే!
విద్యా సమేధిత మహా సుషమాభిరామే!
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో ఽస్తు. 3

తా॥ బ్రహ్మవేత్తయైన జనక రాజయోగి శిక్షణమునందు గడచిన బాల్యము గలదానవు; ఆ మహాయోగి యొడిలో పెరుగుచు మహామునులకు గూడ దుర్లభమగునట్టి అనుభవయుక్తమైన అధ్యాత్మవిద్యను గడించి తివి; ఆ దివ్యవిద్యాప్రభావముచే నీయందు అద్భుతమైన దివ్యశోభ నెలకొనియుండగా జగదేక సుందరిగా వన్నెకెక్కి శ్రీరామచంద్రుని హృదయేశ్వరివైతివి; దేవీ! వైదేహీ! నీకు వందనము.

శ్లో॥ ధాత్రీ బభూవ తవ మంగళగాత్రి! ధాత్రీ
రాజర్షివర్య జనకో జనక స్తథా తే,
భర్తా హి తే రఘువరో ఽఖిలలోక భర్తా
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో ఽస్తు. 4

తా॥ ఓ మంగళ స్వరూపిణీ ! నీ కుటుంబ మెంత విశిష్టమైనది ! భూత ధాత్రియే నీధాత్రి గదా, (భూమాతయే మాత) రాజర్షి జనకుడే నీ జనకుడుగదా ! లోకైకనాథుడే (శ్రీరాముడు) నీ నాథుడుగదా! అపూర్వ దివ్యచరితా ! రామదయితా ! జానకీమాతా! నీకు వందనము.

శ్లో॥ ప్రాప్య స్నుషాం నిరుపమాం శుభలక్షణాం త్వాం
వృద్ధ స్తదా దశరథో మహిషీ తథా సా,
సమ్మోదితా వియ ది తీరితు మంబ! కో౽ర్హాః
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో౽స్తు. 5

తా॥ అనాడు వృద్ధదంపతు లైన ఆ దశరథమహారాజును, కౌసల్యామహిషి యును తమ బహిఃప్రాణమైన ప్రియపుత్రుని ప్రక్క నిలచి కోడలుగా తమకు పాదాభివందనము చేయుచున్న నిన్ను చూచుకొని నీ నిరుపమాన రూపాతిశయమునకును, నీ శుభ లక్షణ సంపత్తికిని ఎంత ఆనంద తన్మయత్వము నొందిరోగదా ! ఆ మహా సంతోషము మాటలలో వర్ణింప నెవరితరము ! కౌసలేయ వధూరత్నమా ! శ్రీరామ హృదయేశ్వరీ ! నీకు వందనము.

శ్లో॥ లోకాభిరామ మధురాకృతి శోభితస్య
కళ్యాణ దివ్యగుణ నిర్ఝర ధర్మమూర్తేః,
సర్వాత్మనా రఘుపతే స్సదృశీ సతీ త్వం
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమో౽స్తు. 6

తా॥ లోకమోహనమైన మధుర సౌందర్యముతో విరాజిల్లు చుండువాడును, కళ్యాణ దివ్యగుణ సాగరుడై, ధర్మ ప్రవర్తనము, ధర్మరక్షణము తన జీవిత సర్వస్వముగా నున్నవాడును అగు రఘుపతికి "దేవతాని

స్సమా రూపే సీతా శ్రీ రివ రూపిణీ " (దేవతా సౌందర్యముతో ప్రకాశించు సీతాదేవి, మానవ రూపముతో కాన్పించుచున్న లక్ష్మీదేవియే.) అనియును, " త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్." (త్రిలోకసామ్రాజ్య వైభవముల విలువ, సీతాదేవి రూపశీలముల విలువయందు శతాంశమునకు కాజాలదు) అనియును, " తపసా ధారయే ల్లోకాన్ క్రుద్ధా వా నిర్దహే దపి " (తన పాతివ్రత్య తపఃప్రభావముచే సీతాదేవి ముల్లోకములను నిలిపి యుంచగలదు; లేదా క్రుద్ధురాలైనయెడల దగ్ధముచేయగలదు.) అనియును, " రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా " (రఘురాముడే జానకిని చేపట్టగల అర్హతగలవాడు; ఆ కమలాక్షునికి అర్ధాంగి కాదగినది ఈ నీలిసోగ కన్నుల శోభనాంగియే) అనియును ప్రశంసింపబడినదానవైన నీవు సర్వవిధముల తగినట్టి సతివి. తల్లీ! శ్రీరాము ధర్మపత్నీ! నీకు వందనము.

శ్లో॥ ప్రీతి ర్న తే నిజ సుఖానుభవే, సదైవ
ధర్మానువర్తనపరా భవతీ,హ్యాత స్త్వమ్,
ప్రేమైకపాత్ర మసి ధర్మపరస్య భర్తుః
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 7

తా॥ అఖండమైన భోగభాగ్యములు గలిగి నిత్యసుఖోచితవై సుకుమారురాలవైయున్న, నీకు ఆసక్తి భోగానుభవములందు గాక ధర్మాచరణము నందు మాత్రమేగదా! ఉదాత్తమైన ఇట్టి నీ గుణవిశేషములచేతనే నీవు ధర్మమూర్తియైన శ్రీరాముని మనసును చూఱగొని అతని హృదయేశ్వరి వైతివి; ఆ ప్రేమమూర్తి వనవాసము

నకు వెడలు సమయమున "స పూ మనాదాయ వనం న త్వం ప్రస్థాతు మర్హసి" ఇతి జానన్ పరాం ప్రీతిం గచ్ఛ రామ మయా సహ" (ధర్మజ్ఞుడవగు నీవు నన్ను వెంటగొని పోకుండ అడవికి వెడల దగవు-ధర్మసమ్మతమైన నా నిశ్చయమును, ప్రేమను గుర్తించి నాతోగూడియే అరణ్యమునకు బయలుదేరుము.) అని అతనిని ఆజ్ఞాపించుచున్నట్లే మాటలాడి పిమ్మట అతనిచేతనే "నేదానీం త్వదృతే సీతే స్వర్గోఽపి మమ రోచతే." (సీతా, నీమనసు గ్రహించితిని, నాకిపుడు నీవు లేనిదే స్వర్గముకూడ రుచింపదుసుమా) అనిపించు కొంటివిగదా! అట్లు నీవల్ల ఘని హృదయము నీ వశమై యుండుటచేతనే నీ వియోగకాలమున "తయా విహీనః కృపణః కథం లక్ష్మణ ధారయే,-నజీవేయం క్షణమపి తాం మృతే జనకాత్మజామ్; అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా, (లక్ష్మణా! సీతలేని దీనుడను, నాప్రాణముల నెట్లు నిలుపుకొందును! జానకిలేనిదే నేను క్షణము కూడ జీవింపజాలను, సూర్యుడును తేజస్సును వేరు వేరుగా నుండనట్లు సీతనానుండి వేరుగా నుండునదికాదు.)" అనియు, భవభూతి కథనమున "త్వంజీవితం త్వమసి మే హృదయం ద్వితీయమ్" (సీతా, నీవు నా జీవితము. నా రెండవహృదయమే నీవు) అనియు ఆ ధర్మమూర్తిచే అనిపించుకొన్న ధన్యవుగదా నీవు! తల్లీ! శ్రీరామచంద్రహృదయేశ్వరీ! నీకు వందనము.

శ్లో॥ కర్తవ్యపాలన విధౌ న విగణ్య బాధాః
ధర్మే స్థిరా బహుళ కష్టదశాసు చాపి,
త్వం లక్ష్యభూత చరితా హ్యసి మానవానాం
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. ౪

తా॥ రాజ్యభ్రంశము, అరణ్యవాసము, దనుజ వంచనము, పతి వియోగము, రాక్షస నిర్భర్త్సనము, భర్తతిరస్కారము వంటి దారుణములైన ఆపదలందుసైతము ధర్మమునుండి చలింపని దానవు. ఎదురైన క్లేశములనెల్ల సహించుచు నీవు "జీవితసాఫల్యము భోగ సంపాదనమునందు కాదు, ధర్మనిర్వహణమునందు మాత్రమే" అని లోకమునకు జీవిత లక్ష్యమునుగూర్చి నీ ఆచరణ మూలముగా బోధించియున్నావు గదా! తల్లీ! శ్రీరామ ధర్మపత్నీ! నీకు వందనము.

శ్లో॥ ధీరా స్వధర్మనిరతా భవతీ న భీతా
క్రూరాత్ త్రిలోక భయదా ద్దశకంఠ దైత్యాత్,
కించ త్వయా ఖలు ఖల స్స తృణీకృతోఽభూత్,
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 9

తా॥ "ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి" (జానకీ! నీవు రావణుని అంగీకరింపకున్నచో నీరొమ్ముచీల్చి నీ గుండెను తినివేసెదను) అనుచు రావణపరిచారికలు నిన్ను హింసలకు గురిచేయుచుండగా "కామం ఖాదత మాం సర్వా నకరిష్యామి వో వచః" (మీ యిష్టము వచ్చినట్లు నన్నుతినివేయుడు, మీ మాటలను నేను పాటింపను, - అని నిర్భయముగా బదులుచెప్పుచు, త్రిలోకభీకరుడైన ఆ రాక్షసరాజే నీ ఎదుటికివచ్చి ప్రగల్భములు పలుకుచుండగా వాని క్రౌర్యదర్పములకు భీతినొందకుండ ఒక గడ్డి పోచ నడ్డముగానుంచి ఈసడించుచు ఇట్లు పలికితివిగదా!" "కథం వ్యాహరతో మాం తే న జిహ్వా వ్యవశీర్యతే? ... శూరేణ ధనదభ్రాత్రా బలైస్సముదితేన చ, వ్యపోహ్య

రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్?”
(రావణా! రఘుకుల పదుపునైన నన్నుగూర్చి యిట్లు నీచముగామాట లాడుచున్న నీనాలుక ఏల చీలికలైపోవకున్నది? . మహావీరుడను; కుబేరుని అన్నను; అమితబలసంపన్నుడను; అనుచున్నావే! అంతటిఘనుడవు నా నాథుని మోసముచే దూరముచేసి కుత్సితమైన పరస్త్రీచౌర్యమున కేల పాల్పడితివి?) అనుచు ఇట్లు మృత్యుముఖము నందు గూడ ధీరతనుజూపిన ఓ ధర్మవీరా! రఘువీరధర్మపత్నీ! జానకీ! నీకు వందనమమ్మా!

శ్లో॥ సంసేవతే స్మ జననీ మివ లక్ష్మణ స్త్వాం
స్వాత్మేష్ట దైవ మితి మారుతి రర్చతి త్వామ్,
త్వాం శంసతి స్మ కమలే య మితి స్వయం భూః
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 10

తా॥ నీ మఱది లక్ష్మణుడు నిన్ను తన మాతృదేవిగా భావించి సేవించినాడు; రామదూత మారుతి నిన్ను తన యిష్టదైవముగా మనసున నిలుపుకొని అర్చించుచున్నాడు, బ్రహ్మదేవుడు స్వయముగా నిన్ను గూర్చి “సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుః” (సీత లక్ష్మిదేవి; రామా! నీవు విష్ణుడవు) అని యుగ్గడించి యున్నాడుగదా! సకల విబుధ సంపూజితా! రామదయితా! సీతామాతా! నీకు వందనము.

శ్లో॥ వాల్మీకినా మధుగిరా హ్యుపవర్ణితా ఽసి
తేనైవ వత్సలహృదా హ్యుపలాలితా ఽసి,
లోకస్తుత స్వచరితా ఽపి కృతా ఽసి తేన
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 11

తా॥ మహాముని వాల్మీకి తనకు వాణీప్రసాదముచే లభ్యమైన మధుమయ ఫణితితో రామాయణమను పేర 'సీతాయా శ్చరితం మహత్.' అనుచు నీదివ్యచరిత్రమునే తనివిదీఱ వర్ణించినాడు. దైవవశమున నీవు క్లేశములలో చిక్కుకొనగా ఉప్పొంగిన దయా హృదయముతో ఆ తపస్వి కన్నబిడ్డనువలె నిన్ను దగ్గఱకుతెచ్చుకొని ఆదరించినాడు. మఱియు నీపై మూర్ఖజనులలో కలిగిన అపవాదను దూరముచేసి లోకము నీ పావనశీలమును గ్రహించి నీకు తలవంచి మ్రొక్కునట్లు చేసెనుగదా! తల్లీ! ధర్మవిజయమునకు తార్కాణమైన దివ్యచరిత్రము గల రామపత్నీ! సీతాసతీ! నీకు వందనము.

శ్లో॥ త్వత్ప్రీతయే తవ సుతౌ సముగాయతాం తౌ
రామాయణం గురుకృతిం మధురం పురా యత్,
తచ్ఛ్రూయతే హి సకలై రధునాఽపి నిత్యం
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 12

తా॥ పూర్వ మానాడు నీ ముద్దుబిడ్డలు కుశలవులు, వ్యాకులత తొలగి నీవు సంతోషము నొందుటకొఱకై తమ గురువు తమకు గఱపిన ఏ రామకథను మధురమైన తమకోమలకంఠముతో గానముచేసి నీకు వినిపించి యుండిరో! "రామస్య మధురం వృత్తం గాయంతౌ మాతు రగ్రతః। తద్వియోగ వ్యథాం కించి చ్ఛిథిలీ చక్రతు స్సుతౌ." (బిడ్డలు కుశలవులు తల్లి యెదుట శ్రీరాముని మధురగాథను గానముచేయుచున్నవారై ఆమె మనసు నందలి పతి వియోగవ్యథను కొలదిగ తొలగింపగలుగుచుండిరి కాళిదాసు - రఘువంశము) ఆనాటి ఆ మధురకావ్యము నేటికిని అట్లె లోకమున ఎల్లయెడల ఎల్లరికిని వీనులవిందుగా వినిపించుచున్నదై ఆనందతన్మయత్వము గూర్చుచున్నది సుమా! తల్లీ! శ్రీరామరమణీ! నీకు వందనము.

శ్లో॥ రామో వికుంఠనిలయో భగవాన్ స విష్ణుః
త్వాం విష్ణుభగవద్ హృదయాలయా శ్రీః,
తత్ త్వాం నతో భజతి విష్ణుపదం ప్రమోదాత్
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 13

తా॥ వైకుంఠ విలసితుడైన విష్ణుభగవానుడే శ్రీరాముడు; ఆ మహా విష్ణువు వక్షమున అధివసించు లక్ష్మీదేవివే నీవు; కావున తల్లీ! నిన్ను భక్తితో మ్రొక్కు సుకృతాత్ముడు సహజముగనే సంతోషముతో విష్ణుపదప్రాప్తినొందుచున్నాడు. (విష్ణుపదమనగా ఆకాశము అని కూడ అర్థము కాబట్టి మహానందముతో మిన్నుముట్టుచున్నాడని కూడ భావము.) తల్లీ! శ్రీరామహృదయేశ్వరీ! నీకు వందనము.

శ్లో॥ సర్వజ్ఞ యోగి పురుషా భవతీం వదంతి
భక్తౌఘ రక్షణ విధాన గృహీత దేహామ్,
శక్తిం పరాం నిఖిల విశ్వ నియంత్రిణీం తాం
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు. 14

తా। పరబ్రహ్మతత్త్వమును పరిపూర్ణముగా నెఱిగిన జ్ఞానయోగులు నీ నిజ రూపమును గ్రహించినవారై నీవు పరాశక్తివి, సమస్తవిశ్వమును శాసించి నడిపించు మూలప్రకృతివి, భక్తకోటిని అనుగ్రహింపగోరి లీలావిగ్రహధారిణివై సీతారూపమున లోకమున కుపాస్యవగుచున్నావని తెలుపుచున్నారు. "ఉత్పత్తి స్థితి సంహార కారిణీ సర్వ దేహినామ్, సీతా భగవతీ జ్ఞేయా మూలప్రకృతి సంజ్ఞితా, ... శ్రీరామసాన్నిధ్యవశా జ్జగదానంద కారిణీ, ... తద్ బ్రహ్మసత్తాసామాన్యం సీతాతత్త్వ

ముపాస్మహే,'(సీతాభగవతి యనగా సర్వజీవుల సృష్టి స్థితి సంహారకారిణియగు మూలప్రకృతి; తానుకోరి శ్రీరాముని సన్నిధినున్నదై జగత్తునకు ఆనందప్రదాయిని యగుచున్నది ; కావున మూలకారణ శక్తియైన ఆ సీతాతత్త్వము నెఱిగి యుపాసించెదము. (అధర్వణీయము – సీతోపనిషత్తు, శౌనకీయము) శ్రీరామహృదయేశ్వరీ! జగదీశ్వరీ! సీతామాతా! నీకిదే మా వందనము.

శ్లో॥ శ్రీరామ వామ లలితాంక విరాజమానే!
భూపుత్త్రికే! భువనపావన సచ్చరిత్రే!
మాతః! కృపామృతనిధే! శ్రిత కల్పవల్లి!
శ్రీరామచంద్ర హృదయేశ్వరి! తే నమోఽస్తు''

హరి: ఓం తత్ సత్.

—•—

శ్రీరామాయ నమః

శ్రీరామశరణ్ గురుభ్యోనమః

శ్రీమద్వాల్మీకి రామాయణే

సుందరకాండే

షోడశస్సర్గః

శ్లో॥ ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుంగవః,
గుణాభిరామం రామం చ పునశ్చింతాపరో ఽభవత్.

పదచ్ఛేదము :- ప్రశస్య - తు - ప్రశస్తవ్యాం - సీతాం-తాం హరిపుంగవః - గుణాభిరామం - రామం - చ - పునః - చింతాపరః - అభవత్.

అన్వయక్రమము :- హరిపుంగవః ప్రశస్తవ్యాం తాం సీతాం గుణాభిరామం రామం చ, ప్రశస్య, పునః చింతాపరః అభవత్.

ప్రతిపదార్థము :- హరిపుంగవః = వానరశ్రేష్ఠుడైన హనుమ; ప్రశస్తవ్యాం తాం సీతాం = ప్రశంసింపదగినట్టి ఆ సీత దేవిని; గుణాభిరామం రామం చ = సద్గుణములచే ప్రకాశించుచున్నవాడగు శ్రీరాముని, ప్రశస్య = మిక్కిలి శ్లాఘించి, పునః = తిరిగి, చింతాపరః అభవత్ = చింతానిమగ్నుడయ్యెను.

తాత్పర్యము .- ఈరీతిగా స్తుతింపదగిన చరిత్రముగల సీత మ్మను, సద్గుణములచే శోభించుచున్న శ్రీరాముని, ప్రశంసించి వానర శ్రేష్ఠుడైన హనుమ తిరిగి చింతానిమగ్నుడయ్యెను.

శ్లో॥ స ముహూర్త మివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః,
సీతా మాశ్రిత్య తేజస్వీ హనుమా న్విలలాప హ. 2

పదచ్ఛేదము :- సః - ముహూర్తం - ఇవ - ధ్యాత్వా - బాష్పపర్యాకులేక్షణః - సీతాం - ఆశ్రిత్య - తేజస్వీ - హనుమాన్ - విలలాప - హ.

అన్వయక్రమము :- సః తేజస్వీ హనుమాన్ సీతాం ఆశ్రిత్య ముహూర్తంఇవ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః (సన్) విలలాప హ.

ప్రతిపదార్థము .- సః తేజస్వీ హనుమాన్ = ఆ తేజశ్శాలి యైన హనుమంతుడు, సీతాం ఆశ్రిత్య = సీతాదేవినిగూర్చి, ముహూర్తం ఇవ, ధ్యాత్వా = కొద్దిక్షణముల కాల మాలోచించి, బాష్పపర్యాకులేక్షణః (సన్) = కన్నీటితో నిండిన నేత్రములు గలవాడై, విలలాప హ = విల పించెను.

తాత్పర్యము .- మహాతేజస్సంపన్నుడైన హనుమ, సీతాదేవి పరిస్థితినిగూర్చి, కొద్దిసేపు ఆలోచించి, దుఃఖబాష్పములతో నిండిన కన్నులు గలవాడై, ఈ విధముగ విలపింపసాగెను.

శ్లో॥ మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా,
యది సీతా ఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః. 3

పదచ్ఛేదము :- మాన్యా - గురువినీతస్య - లక్ష్మణస్య - గురుప్రియా - యది - సీతా - అపి - దుఃఖార్తా - కాలః - హి - దురతిక్రమః.

అన్వయక్రమము :- గురువినీతస్య లక్ష్మణస్య మాన్యా గురుప్రియా సీతాఅపి దుఃఖార్తాయది, కాలః దురతిక్రమః హి ।

ప్రతిపదార్థము :- గురువినీతస్య లక్ష్మణస్య = వసిష్ఠాది గురువులచే శిక్షింపబడినట్టి లక్ష్మణునకు, మాన్యా = పూజ్యురాలైనది యును, గురుప్రియా = మహనీయులకు ప్రీతిపాత్రురాలైనదియునగు సీతా అపి = సీతాదేవిగూడ, దుఃఖార్తాయది = దుఃఖముచే దీనస్థితినొంది యున్నదియైనచో, కాలః = కాలము, దురతిక్రమః హి = అనుల్లంఘ నీయమైనదిగదా ।

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు :

తిలకము :- 'లక్ష్మణస్య మాన్యా సీతా' = లక్ష్మణునియంతటి వానిచే ఉపాస్యదైవముగ సేవింపబడుచున్న సీత ఇట్టి కష్టములకు గురి కావుట ఆశ్చర్యకరమని భావము. భగవదిచ్ఛారూపమైన కాలమున ఎన్ని ఆశ్చర్యకరమైన సంఘటనలైనను జరుగవచ్చును; అవి సీతారాములకు సమ్మతములే; వారు భగవత్స్వరూపులైనను, మానవ శరీరమును ధరించి నట్టివారుగాన మానవోచితమైన సుఖదుఃఖములను ప్రదర్శింపదలచియున్న వారే గదా ।

మహేశ్వరతీర్థులు :- సకల జగద్రక్షకులైన రామలక్ష్మణులచే రక్షింపబడినట్టి సీతాదేవికిగూడ ఇట్టి మహాదుఃఖము సంభవించుట కాలవైపరీత్యమే.

వాసుదాసస్వామి :- లక్ష్మణస్య మాన్యా- 'యస్యదేవే పరా భక్తిర్యథాదేవే తథాగురౌ'- అన్నట్లు భగవంతునందెంత భక్తియో యంత భక్తి యన్నయందు గలవాడు. అటువంటి వానికి మాన్య. సీతమ్మ ప్రకృతిక్షితి. అనగా అందరివలె పాంచభౌతికమైన గర్భమున్నుండి, కర్మానుభవమునకై పుట్టినదిగాదు. అట్టి ఈమెకే వ్యసనము ప్రాప్తించినచో, నింక లోకమునందు కాలము నతిక్రమించువాడెవడు ?

తాత్పర్యము :- వసిష్ఠుడు, విశ్వామిత్రుడు, సుమిత్ర మున్నగు పెద్దలచే శిక్షణమునొందియున్న లక్ష్మణునకు ఉపాస్య దైవమైయుండి, శ్రీరామునకు ప్రియురాలైయున్న సీతాదేవిగూడ దుఃఖములకు చిక్కినదైనచో, ఈ లోకమున కష్టములను జయింప నెవరికి సాధ్యమగును ? ఈ కష్టసుఖములను నియమించునది కాలమే గాన దానిని ఉల్లంఘించుట ఎవ్వరికిని సాధ్యముగాదు.

శ్లో॥ రాఘవస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః,
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గంగేవ జలదాగమే. 4

పదచ్ఛేదము :- రాఘవస్య - వ్యవసాయజ్ఞా - లక్ష్మణస్య - చ - ధీమతః - న - అత్యర్థం - క్షుభ్యతే - దేవీ - గంగా - ఇవ - జలదాగమే.

అన్వయక్రమము .- రామస్య, ధీమతః లక్ష్మణస్యచ, వ్యవసాయజ్ఞా దేవీ, జలదాగమే గంగాఇవ అత్యర్థం నక్షుభ్యతే.

ప్రతిపదార్థము :- రామస్య = శ్రీ రాముని యొక్కయు, ధీమతః లక్ష్మణస్యచ = ప్రజ్ఞావంతుడైన లక్ష్మణుని యొక్కయు, వ్యవసాయజ్ఞా = ప్రయత్నమునుగూర్చి తెలిసినదైన, దేవీ = సీతాదేవి, జలదాగమే = వర్షాకాలమునందు, గంగాఇవ = గంగానదివలె, అత్యర్థం = మిక్కిలిగా, నక్షుభ్యతే = క్షోభనొందుటలేదు.

విశేషార్థములు — వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— రామస్య లక్ష్మణస్య వ్యవసాయజ్ఞా— ఇట్టి దుర్గమమైన లంకయందున్నప్పటికిని సముద్రమును లంఘించి ఇచ్చటికివచ్చి తమ దివ్యాస్త్రములతో శత్రువును జయింపగలరని వారి పరాక్రమమును గూర్చి తెలిసినట్టిది సీత యని భావము. ''అత్యర్థం నక్షభ్యతే" — నిరాశను బొంది ప్రాణత్యాగము నొనరించుకొనలేదని భావము. 'జలదాగమే గంగాఇవ' — వర్షాకాలమునందు పొంగిపొర్లునట్టి క్షుద్ర నదులవలెగాక గంగ ఎల్లప్పుడును కల్లోలము నొందక యుండునది యని భావము.

గోవిందరాజీయము :— రామస్య వ్యవసాయజ్ఞా —"అప్యహం జీవితం జహ్యాం" అని ఆశ్రితసంరక్షణమునుగూర్చి పూర్వము శ్రీరాముడు ప్రతిజ్ఞ చేసినవిధము ఇట సీత స్మరించుచున్నది. 'ధీమతఃలక్ష్మణస్య'— మాయామృగముయొక్క యథార్థరూపమును సకాలమున గుర్తించి ఆసందర్భమునందు శ్రీరాముని కంటెను ఆశ్రిత సంరక్షణమున శ్రద్ధ వహించినవాడై సీతమ్మ రక్షణమే ప్రధాన మని భావించిన బుద్ధిశాలి గదా లక్ష్మణుడు!

వాసుదాససాన్ని :— సుమిత్ర కొడుకగు లక్ష్మణుని బుద్ధి ఎప్పుడును ప్రమాదపడునదిగాదు. మాయా మృగవిషయమున సీతా రాములిర్వురును ప్రమాదపడినను లక్ష్మణుడు ప్రమాదపడలేదు. అది మాయామృగమనియే చెప్పెను. మారీచుని కూతవిషయమున సీత పొరబడినను లక్ష్మణుడు ప్రమాదపడలేదు. అతడట్టి ధీమంతుడు. అతని బుద్ధి చక్కని ఆలోచనలతో నిండియుండును.

తాత్పర్యము :— అనుపమాన పరాక్రమశాలియైన శ్రీరాముని యొక్కయు అమిత బుద్ధిశాలియైన లక్ష్మణునియొక్కయు ప్రయత్న తీవ్రతనుగూర్చి నమ్మకము గలదికాబట్టి సీతాదేవి వర్షాకాలమునందు పొంగిపొరలు ఇతరనదులవలెగాక, నిత్యము ప్రశాంతముగనే యుండు గంగానదివలెనే యుండెను. విపరీతమైన క్షోభ నొందుటలేదు.

శ్లో॥ తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్
రాఘవో ఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా॥

పదచ్ఛేదము .— తుల్యశీలవయోవృత్తాం - తుల్యాభిజనలక్షణామ్ - రాఘవః - అర్హతి - వైదేహీం - తం - చ - ఇయం - అసితేక్షణా.

అన్వయక్రమము .— తుల్యశీలవయోవృత్తాం, తుల్యాభిజనలక్షణాం వైదేహీం రాఘవః అర్హతి, తం చ ఇయం అసితేక్షణా అర్హతి।

ప్రతిపదార్థము :— తుల్యశీలవయోవృత్తాం = సమానమైన స్వభావము, వయస్సు చరిత్రము కలిగినట్టి, తుల్యాభిజనలక్షణాం = సమానమైన వంశమును, ఉత్తమలక్షణములను కలిగినట్టి, వైదేహీం = సీతాదేవిని (పొందుటకు) రాఘవః అర్హతి = శ్రీరాముడు తగియున్నాడు. తం చ = ఆ శ్రీరాముని (పొందుటకును) ఇయం అసితేక్షణా అర్హతి = ఈ సౌందర్యవతి తగియున్నది.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :— "తుల్యాభిజనలక్షణాం" = సాముద్రికశాస్త్రము నందు చెప్పబడిన లక్షణములని భావము: ఈ పరస్పరార్హత యుండుట చేతనే సీతమ్మకు ఇతరపురుషునియందును, శ్రీరామునికి ఇతరస్త్రీయందును దృష్టిలేకుండుట సహజమని సూచింపబడినది.

గోవిందరాజీయము :— 'తుల్యాభిజన లక్షణాం'-షోడశవర్ష వయస్కుడైన శ్రీరామునకు ద్వాదశవత్సర వయస్కురాలైన జానకి తుల్య వయస్కురాలేయని చెప్పబడుచున్నది. తుల్యవయోవృత్తము లనగా అనురూపమైన వయస్సు చరిత్రము స్వభావము మొదలగునవి.

తుల్యాభిజనలక్షణాం = సార్వభౌమ లక్షణములు గలిగిన రామునకు పట్టమహిషిగాగల సాముద్రికశాస్త్ర లక్షణములు కలిగియున్నట్టిది సీత అని భావము. లోకములో సామాన్యముగ సౌందర్యాది సల్లక్షణములు గల పురుషునకు అనురూపమైన భార్యయును, సౌందర్యాది గుణాతిశయముగల వనితకు అనురూపమైన వరుడును దొరకుట అసంభవముగా నుండును. సీతారాముల దాంపత్యమునందు అట్టి అన్యోన్యానురూప్యము లభించినది యనుట ఆశ్చర్యకరమైన విషయము. "అసితేక్షణ" యనుటచే కమల పత్రాక్షుడైన శ్రీరాముని కంటెను గూడ సీతమ్మ నయన సౌందర్యము అత్యధికమైనదని తెలుపబడినది. అందుచేతనే శ్రీరాముడు "న జీవేయం క్షణమపి వినా తాం అసితేక్షణాం" అని పలికెను.

వాసుదాసస్వామి :- ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తికి ముప్పదితొమ్మిది సంవత్సరములు; సీతమ్మకు ముప్పదిరెండు సంవత్సరములు. సీతారాములు వయస్సు నందెట్లుతగియున్నారో శీలమునందట్లే తగియున్నారు. ఎట్లులనిన - రామచంద్రమూర్తి 'వానియెడనుండెనేని యేదేని దోషమద్ది గర్హ్యంబుకాదు సదాళుల' కని చెప్పెను. సీతమ్మయో! "వధకు పాత్రులపట్లన్ గృపజూపవలయు సజ్జను; డపరాధము చేయనట్టి యతడుం గలడే" యని చెప్పెను.

సాముద్రిక శాస్త్రప్రకారము సార్వభౌముడుతాగల చిహ్నములు రామచంద్రునందు గలవు. అట్టివానికి భార్యగా నుండదగిన స్త్రీకి ఉండవలసిన లక్షణములు సీతమ్మ యందున్నవి. ఇక వంశమునందు శ్రీరాముడు సూర్యవంశమున ప్రసిద్ధికెక్కిన వాని కుమారుడు. సీతమ్మ చంద్రవంశమున జగత్ప్రసిద్ధిగన్న జనకుని కూతురు.

"అయోధ్యాపుర నేతారం మిధిలాపుర నాయకీం
రాఘవాణా మలంకారం వైదేహానా మలంక్రియామ్

" రఘూణాం కులదీపంచ నిమీనాంకులదీపికామ్
సూర్యవంశ సముద్భూతం సోమవంశ సముద్భవామ్.

సర్వలోక విధాతారం సర్వలోక విధాయినీమ్
లోకాభిరామం శ్రీరామం అభిరామాంచ మైథిలీమ్

అన్యోన్య సదృశావేతౌ త్రైలోక్య గృహదంపతీ "
(హనుమద్విరచిత సీతారామ స్తోత్రము)

కావుననే వ్యాసవిద్యయందు శరణాగతి ఇరువురకును చెప్పబడెను.
శ్రీరాముడు స్మరణమాత్ర సంతుష్టుడు. జానకమ్మ ప్రణతిప్రసన్న.

తాత్పర్యము:- అనురూపమైన ఉత్తమస్వభావము, యౌవనము, చరిత్రము, ఉన్నతవంశము, సాముద్రిక శాస్త్రప్రసిద్ధమైన శుభలక్షణములను కలిగియున్న ఈమెను భార్యగా బడయుటకు శ్రీరాముడే తగియున్నాడు. లోకోత్తర శుభలక్షణ విశిష్టుడైన శ్రీరాముని భర్తగా పొందుటకు ఉత్తమమైన గుణ సౌందర్యాది సర్వయోగ్యతలు కల్గిన ఈ జానకియే తగియున్నది.

శ్లో॥ తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాంతా మివ
శ్రియమ్
జగామ మనసా రామం వచనం చేద మబ్రవీత్ ॥ 6

పదచ్ఛేదము :- తాం - దృష్ట్వా - నవహేమాభాం - లోకకాంతాం - ఇవ - శ్రియమ్ - జగామ - మనసా - రామం - వచనం - చ - ఇదం - అబ్రవీత్.

అన్వయక్రమము :- నవహేమాభాం లోకకాంతాం శ్రియం ఇవ (స్థితాం) తాం దృష్ట్వా మనసా రామం జగామ. ఇదం వచనంచ అబ్రవీత్.

ప్రతిపదార్థము :- నవహేమాభాం = నూతన సువర్ణచ్ఛాయ గలదియును, లోకకాంతాం శ్రియంఇవ = లోకమును మోహింపజేయు లక్ష్మివలె, (స్థితాం = ఉన్న) తాం = ఆ సీతాదేవిని, దృష్ట్వా = చూచి, మనసా = మనస్సుచేత, రామం జగామ = రాముని చేరెను. ఇదంవచనం చ అబ్రవీత్ = ఈ మాటనుగూడ పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

వాసుదాసస్వామి :- 'నవహేమాభాం' — 'హిరణ్మయీం లక్ష్మీం 'అని శ్రీసూక్తమున చెప్పినట్లు సీతమ్మ హేయగుణరహితయగు సుగుణములరాశి, పుటము పెట్టిన బంగారము. లోకకాంతా మివశ్రియమ్— సీతమ్మ లోకేశ్వరియయిన శ్రీమహాలక్ష్మియనియే హనుమ స్పష్టముగ చెప్పుచున్నాడు. సకల సమృద్ధిస్వరూపయగు లక్ష్మియున్నచోట శ్రీనివాసు డుండును. కనుక శ్రుతులు సీతమ్మను భగవంతుడైన శ్రీరామునికన్న భిన్నమని చెప్పవు.

తాత్పర్యము :- లోకమునంతను ప్రకాశింపచేయు లక్ష్మివలె, తప్తకాంచన ప్రభలలో విరాజిల్లు ఆ సీతాదేవిని గాంచి, హనుమ ఒక్కమారుగ తన మనస్సునందు రాముని స్మరించి, ఈరీతిగా పలుకదొడగెను.

శ్లో॥ అస్యా హేతో ర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః,
రావణప్రతిమో వీర్యే కబంధశ్చ నిపాతితః. 7

పదచ్ఛేదము :- అస్యాః - హేతోః - విశాలాక్ష్యాః - హతః - వాలీ - మహాబలః - రావణప్రతిమ - వీర్యే - కబంధః - చ - నిపాతితః.

అన్వయక్రమము - విశాలాక్ష్యాః అస్యాః హేతోః మహాబలః వాలీ హతః: వీర్యే రావణప్రతిమః కబంధః చ నిపాతితః.

ప్రతిపదార్థము :- విశాలాక్ష్యాః అస్యాః హేతోః = విశాలమైన కన్నులుగల ఈమెనిమిత్తమే, మహాబలః వాలీ హతః = మహాబలుడైన వాలి సంహరింపబడినాడు. వీర్యే = పరాక్రమమునందు, రావణప్రతిమః = రావణ సమానుడైనట్టి, కబంధః చ = కబంధుడును, నిపాతితః = కూల్చివేయబడినాడు.

తాత్పర్యము :- ఈ సౌందర్యవతిని గూర్చియేగదా మహాబలాఢ్యుడైన వాలిని శ్రీరాముడు హతమార్చెను। పరాక్రమమునందు రావణునికి సాటిరాగల కబంధుని ఆతడు సంహరించినదిగూడ ఈ సీతాదేవి నిమిత్తమే గదా।

శ్లో॥ విరాధశ్చ హత స్సంఖ్యే రాక్షసో భీమవిక్రమః
వనే రామేణ విక్రమ్య మహేంద్రేణేవ శంబరః ॥ 8

పదచ్ఛేదము :- విరాధః - చ - హతః - సంఖ్యే - రాక్షసః - భీమవిక్రమః - వనే - రామేణ - విక్రమ్య - మహేంద్రేణ - ఇవ - శంబరః

అన్వయక్రమము :- సంఖ్యే మహేంద్రేణ శంబరః ఇవ, వనే భీమవిక్రమః విరాధః రాక్షసః రామేణ విక్రమ్య హతః

ప్రతిపదార్థము :- సంఖ్యే = యుద్ధమునందు, మహేంద్రేణ = దేవేంద్రునిచే = శంబరః ఇవ = శంబరాసురుడువలె, వనే =

అరణ్యమునందు, రామేణ = శ్రీరామునిచే, విక్రమ్య = విజృంభించి, భీమవిక్రమః = భయంకరమైన శౌర్యము గలిగినట్టి, విరాధః రాక్షసః = విరాధుడను రక్కసుడు, హతః = పరిమార్చబడినాడు.

తాత్పర్యము :- ఈ సీతాదేవి నిమిత్తమేగదా, పూర్వము భీకరమగు యుద్ధమునందు, దేవేంద్రుడు శంబరాసురుని సంహరించినట్లు శ్రీరాముడు అరణ్యమునందు తన పరాక్రమమునుజూపి భయంకర విక్రమమును జూపుచున్న విరాధుని అల్పకాలములోనే హతమార్చినాడు.

శ్లో॥ చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్
నిహతాని జనస్థానే శరై రగ్నిశిఖోపమైః ॥ 9

పదచ్ఛేదము :- చతుర్దశ సహస్రాణి - రక్షసాం - భీమకర్మణామ్ - నిహతాని - జనస్థానే - శరైః అగ్నిశిఖోపమైః

అన్వయక్రమము :- జనస్థానే భీమకర్మణాం రక్షసాం చతుర్దశ సహస్రాణి అగ్నిశిఖోపమైః శరైః నిహతాని.

ప్రతిపదార్థము :- జనస్థానే = జనస్థానమునందు, భీమకర్మణాం రక్షసాం = భీకర కృత్యములుగల రాక్షసులయొక్క, చతుర్దశ సహస్రాణి = పదునాల్గువేలు, అగ్నిశిఖోపమైః శరైః = అగ్నిజ్వాలల వంటి బాణములచే, నిహతాని = సంహరించబడిరి.

తాత్పర్యము :- ఈ సీతాదేవి నిమిత్తమేగదా, ఆ నాడు జనస్థానమునందు పదునాల్గు వేలమంది మహా భయంకరులైన దుష్టరాక్షసులను అగ్ని జ్వాలలవంటి తన బాణపరంపరలచే నేలగూల్చినాడు.

శ్లో॥ ఖరశ్చ నిహత స్సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః,
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా ॥ 10

పదచ్ఛేదము :- ఖరః - చ - నిహతః - సంఖ్యే-త్రిశిరాః చ - నిపాతితః - దూషణః - చ - మహాతేజాః- రామేణ- విదితాత్మనా.

అన్వయక్రమము :- సంఖ్యే విదితాత్మనా రామేణ ఖరఃచ నిహతః; త్రిశిరాఃచ నిపాతితః; మహాతేజాః దూషణఃచ నిపాతితః.

ప్రతిపదార్థము :- విదితాత్మనా రామేణ = ఆత్మతత్త్వవేత్త యైన శ్రీరామునిచే, సంఖ్యే = సంగ్రామమునందు, ఖరఃచ నిహతః = ఖరుడు అను రాక్షసుడును సంహరింపబడినాడు, త్రిశిరాః చనిపాతితః = త్రిశిరుడను రక్కసుడును నేలగూల్పబడినాడు, మహాతేజాః దూషణశ్చ (నిపాతితః) = మహాపరాక్రమశాలియైన దూషణుడను అసురుడును కూల్ప బడినాడు.

తాత్పర్యము .- మహాప్రభావ సంపన్నుడైన శ్రీరాముడు క్షణమె కొరకేగదా అనాడు సంగ్రామమునందు ఖరుడను రక్కసునిగూల్చి నాడు! త్రిశిరుడను అసురుని రూపుమాపినాడు, మహాపరాక్రమోపేతుడైన దూషణాసురునిగూడ నేలగూల్చినాడు.

శ్లో॥ ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితమ్
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్ ॥

పదచ్ఛేదము :- ఐశ్వర్యం - వానరాణాం - చ - దుర్లభం వాలిపాలితమ్ - అస్యాః - నిమిత్తే -సుగ్రీవః - ప్రాప్తవాన్ - లోక సత్కృతమ్ -

అన్వయక్రమము :- అస్యాః నిమిత్తే వాలిపాలితం లోక సత్కృతం దుర్లభం వానరాణాం ఐశ్వర్యం సుగ్రీవః ప్రాప్తవాన్.

ప్రతిపదార్థము :- అస్యాః నిమిత్తే = ఈమె కారణముగా లోకసత్కృతం = లోకముచే ప్రశంసింపబడినట్టి, దుర్లభం = అనితర లభ్యమైనట్టి, వాలిపాలితం = వాలిచే పరిపాలింపబడుచున్న, వానరాణాం ఐశ్వర్యం = వానరుల సామ్రాజ్యమును, సుగ్రీవః = సుగ్రీవుడు, ప్రాప్తవాన్ = పొందెను.

తాత్పర్యము :- ఈ మహాత్మురాలి కారణముగానే లోకముచే మెచ్చబడినట్టి, వాలివశమునందుండి, పరులకు కన్నెత్తి చూచుట కశక్యమైనట్టి, వానర సామ్రాజ్యమును సుగ్రీవుడు అనాయాసముగా సంపాదించుకొనగలిగినాడు।

శ్లో॥ సాగరశ్చ మయా క్రాంత శ్శ్రీమా న్నదనదీపతిః
అస్యా హేతో ర్విశాలాక్ష్యాః పురీ చేయం నిరీక్షితా॥

పదచ్ఛేదము :- సాగరః - చ - మయా - క్రాంతః - శ్రీమాన్ - నదనదీపతిః - అస్యాః - హేతోః - విశాలాక్ష్యాః - పురీ - చ - ఇయం - నిరీక్షితా -

అన్వయక్రమము :- విశాలాక్ష్యాః అస్యాః హేతోః నదనదీపతిః శ్రీమాన్ సాగరః చ మయా క్రాంతః; ఇయం పురీచ నిరీక్షితా;

ప్రతిపదార్థము :- విశాలాక్ష్యాః అస్యాః హేతోః = విశాలాక్షియైన ఈ సీతాదేవిని గురించియే, నదనదీపతిః = సమస్త నదీనదములకును ప్రభువైనట్టి, శ్రీమాన్ సాగరః = శ్రీమంతుడైన సముద్రుడు, మయా క్రాంతః = నాచే దాటబడెను; ఇయం పురీ చ = ఈ లంకానగరమున్ను, మయా = నాచే, నిరీక్షితా = చక్కగా పరికింపబడినది.

తాత్పర్యము - ఈ లోకోత్తర సుందరి నిమిత్తమే గదా సమస్త నదీనదములకును ప్రభువై, నిరుపమాన శోభాసంపదలకు నిలయ

మైయున్న మహాసాగరమును నేను దాటవచ్చితిని। ఈమెను గూర్చియే కదా లంకనంతను నేను పరిశోధించి చూచితిని।

శ్లో॥ యది రామ స్సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్,
అస్యాః కృతే జగచ్చాపి యుక్త మిత్యేవ మే మతిః.

పదచ్ఛేదము :- యది - రామః - సముద్రాంతాం - మేదినీం - పరివర్తయేత్ - అస్యాః - కృతే - జగత్ - చ - అపి - యుక్తం - ఇతి - ఏవ - మే - మతిః.

అన్వయక్రమము :- అస్యాఃకృతే రామః సముద్రాంతాం మేదినీం, జగత్‌చ పరివర్తయేత్‌యది, యుక్తం ఇతిఏవ మే మతిః.

ప్రతిపదార్థము :- అస్యాఃకృతే=ఈమె నిమిత్తమై, రామః = శ్రీరాముడు, సముద్రాంతాం మేదినీం=సముద్రములవరకునుగల భూమిని, జగత్‌చఅపి = సమస్త జగత్తునుగూడ, పరివర్తయేత్‌యది = తలక్రిందులు చేసినయెడల, యుక్తం ఇతిఏవ = యుక్తము అనియే, మే మతిః = నా యభిప్రాయము.

తాత్పర్యము :- ఈ మహనీయురాలిని గూర్చి శ్రీరాముడు చతుస్సముద్రపర్యంతమునుగల ఈ భూమినంతను, అట్లే సమస్త జగత్తును కూడ తలక్రిందులు చేసివైచినను సముచితమైన కృత్యమేయగునని నా నిశ్చయము.

శ్లో॥ రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా,
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్.

పదచ్ఛేదము :- రాజ్యం - వా - త్రిషు - లోకేషు - సీతా - వా - జనకాత్మజా - త్రైలోక్యరాజ్యం - సకలం - సీతాయాః - న - అప్నుయాత్ - కలామ్.

అన్వయక్రమము :- త్రిషులోకేషు రాజ్యంవా, జనకాత్మజా సీతావా, (కింశ్రేష్ఠం ఇతి శంకాయాం) సకలం త్రైలోక్యరాజ్యం, సీతాయాః కలాం నఅప్నుయాత్.

ప్రతిపదార్థము .- త్రిషు లోకేషు రాజ్యం వా = ముల్లోకముల సామ్రాజ్యమా ? జనకాత్మజా సీతా వా = జనకతనయ యగు సీతాదేవియా ? (కింశ్రేష్ఠం ఇతిశంకాయాం = ఏది గొప్పదను శంక కలిగినప్పుడు) సకలం త్రైలోక్యరాజ్యం = సమస్తమైన త్రిభువన సామ్రాజ్యము, సీతాయాః = సీతాదేవియొక్క, కలాం నఅప్నుయాత్ = ఒక్క అంశమునుగూడ పొందజాలదు.

తాత్పర్యము :- ఒకవంక ముల్లోకముల ఆధిపత్యము, వేరొక వంక సీతాదేవి, యున్నప్పుడు ఈ రెండింటిలో ఏది గొప్పదని సంశయము కల్గినచో ఆ త్రిభువన సామ్రాజ్యము సీతాదేవి కాలి కొనగోటికికూడ సరిపోదు అనియే చెప్పవలెను.

శ్లో॥ ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః,
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా. 15

పదచ్ఛేదము :- ఇయం - సా - ధర్మశీలస్య - మైథిలస్య - మహాత్మనః - సుతా - జనకరాజస్య - సీతా - భర్తృదృఢవ్రతా.

అన్వయక్రమము .- భర్తృదృఢవ్రతా, ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః జనకరాజస్య సుతా, సాసీతా ఇయమ్ ;

ప్రతిపదార్థము :- భర్తృవ్రతా = పతిభక్తిపరాయణురాలైనదియు, ధర్మశీలస్య = ధర్మాచరణపరుడైనట్టి, మహాత్మనః మైథిలస్య జనకరాజస్య = మహాత్ముడైన మిథిలాపతియగు జనకునియొక్క, సుతా సా సీతా = తనయ యగు ఆ సీతాదేవి, ఇయమ్ = ఈమెయే ;

తాత్పర్యము :- పతిభక్తిపరాయణురాలైనట్టిదియును, ధర్మశీలుడు, మహనీయుడు, మిథిలాపతి యగు జనకుని కుమార్తెయైనట్టిదియు నగు ఆ సీతాదేవి ఈమెయే ; సందేహములేదు.

శ్లో॥ ఉత్థితా మేదినీం భిత్వా క్షేత్రే హలముఖక్షతే,
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః. 16

పదచ్ఛేదము :- ఉత్థితా - మేదినీం - భిత్వా - క్షేత్రే - హలముఖక్షతే - పద్మరేణునిభైః - కీర్ణా - శుభైః - కేదారపాంసుభిః.

అన్వయక్రమము :- హలముఖక్షతే క్షేత్రే మేదినీం భిత్వా, పద్మరేణునిభైః శుభైః కేదారపాంసుభిః కీర్ణా, ఉత్థితా.

ప్రతిపదార్థము :- హలముఖక్షతే క్షేత్రే = నాగేటిమొనతో దున్నబడినట్టి పొలమునందు, మేదినీం భిత్వా = భూమిని బ్రద్దలుచేసికొని, పద్మరేణునిభైః = తామరపువ్వొడివంటి, శుభైః కేదారపాంసుభిః = మంగళకరమైన పొలమునందలి మట్టికణములచే, కీర్ణా = నిండియున్నదై, ఉత్థితా = మీదికి వెడలివచ్చినట్టిది. (ఇయమ్ = ఈమెయే).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- మేదినీం భిత్వా ఉత్థితా = ఈమె భూమిజ గావుననే అయోనిజయగుటచే లోకోత్తరమైన సౌందర్యము పొందగల్గి యున్నదని హనుమ ఊహించుచున్నాడు.

తాత్పర్యము :- యాగనిర్వహణము కొరకై నాగలితోదున్నిన పవిత్ర క్షేత్రమునుండి భూమిని బ్రద్దలు చేసికొని. తామర పుప్పొడివంటి ఆ పొలమునందలి పవిత్రమైన ధూళికణములను ఒడలిపై దరించి, ఈలోక మునవెలసిన మహనీయురాలు ఈమెయే.

శ్లో॥ విక్రాంత స్యార్యశీలస్య సంయుగే ష్వనివర్తినః।
సున్షా దశరథ స్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ॥ 17

పదచ్ఛేదము .- విక్రాంతస్య- ఆర్యశీలస్య-సంయుగేషు-అనివర్తినః - స్నుషా - దశరధస్య - ఏషా - జ్యేష్ఠా - రాజ్ఞః-యశస్వినీ.

అన్వయక్రమము ·- విక్రాంతస్య, ఆర్యశీలస్యసంయుగేషు అనివర్తినః దశరథస్య రాజ్ఞః జ్యేష్ఠా యశస్వినీ స్నుషా ఏషా॥

ప్రతిపదార్థము :- విక్రాంతస్య = పరాక్రమశాలియును, ఆర్య శీలస్య=ఉత్తమ చరిత్రగలవాడును, సంయుగేషు అనివర్తినః= యుద్ధము నందు వెన్నుజూపనివాడునగు, రాజ్ఞః దశరధస్య=మహారాజైన దశరథునికి, యశస్వినీ = గొప్పకీర్తిగల్గిన, జ్యేష్ఠా స్నుషా = పెద్దకోడలు, ఏషా = ఈమెయే।

తాత్పర్యము :- పరాక్రమమునకును, ఉత్తమ చరిత్రకును, సాహసమునకును, పేరుబడిన దశరధమహారాజునకు తగినట్టి సత్కీర్తి గల్గిన పెద్దకోడలు ఈమెయే।

శ్లో॥ ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః।
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశ మాగతా॥ 18

పదచ్ఛేదము :- ధర్మజ్ఞస్య - కృతజ్ఞస్య - రామస్య - విదితాత్మనః - ఇయం - సా-దయితా - భార్యా - రాక్షసీవశం - ఆగతా.

అన్వయక్రమము :- ధర్మజ్ఞస్య, కృతజ్ఞస్య, విదితాత్మనః రామస్య దయితా భార్యా సా ఇయం రాక్షసీవశం అగతా॥

ప్రతిపదార్థము :- ధర్మజ్ఞస్య = ధర్మవేత్తయును, కృతజ్ఞస్య = కృతజ్ఞుడును, విదితాత్మనః = ఆత్మజ్ఞానియునగు, రామస్య = రామునకు, దయితా = ప్రియురాలయినట్టి, భార్యా = ధర్మపత్నియగు, సా ఇయం = ఆ ఈమె, రాక్షసీవశం అగతా = రాక్షసస్త్రీల వశమై యున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'రాక్షసీవశం' అగతా - అనింద్యమైన కాలము యొక్క ప్రభావము చేతనని భావము.

తాత్పర్యము :- పరమధార్మికుడైన, మహాత్ముడైన శ్రీరాము నకు ప్రియురాలుగానున్న ఈ పూజ్యురాలుగూడ రాక్షసస్త్రీలకు వశమై దీనస్థితి నొందియున్నదిగదా!

శ్లో॥ సర్వాన్భోగాన్పరిత్యజ్య భర్తృస్నేహ బలాత్కృతా।
అచింతయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్॥ 19

పదచ్ఛేదము :- సర్వాన్ - భోగాన్-పరిత్యజ్య-భర్తృస్నేహ బలాత్కృతా - అచింతయిత్వా- దుఃఖాని - ప్రవిష్టా - నిర్జనం-వనమ్.

అన్వయక్రమము :- భర్తృస్నేహ బలాత్కృతా, సర్వాన్ భోగాన్ పరిత్యజ్య - దుఃఖాని అచింతయిత్వా, నిర్జనం వనం ప్రవిష్టా.

ప్రతిపదార్థము :- భర్తృస్నేహ బలాత్కృతా = భర్తయందలి ప్రేమచే బలాత్కరింపబడినదై, సర్వాన్ భోగాన్ పరిత్యజ్య = సమస్త భోగములను పరిత్యజించి, దుఃఖాని అచింతయిత్వా = క్లేశములను

లెక్కించక, నిర్జనం వనం = నిర్మానుష్యమైన అరణ్యమును, ప్రవిష్టా = ప్రవేశించినది.

తాత్పర్యము :- ఈమె భర్తపై గల ప్రేమకు లోబడినదై, రాజభవనమునందలి, సమస్తభోగములను విడిచిపెట్టి, ముందుకాలమున సంభవింపబోవు కష్టములను గూర్చి ఆలోచింపకుండ భీకరమైన నిర్జనారణ్యమును చేరినది.

శ్లో॥ సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా।
యా పరాం భజతే ప్రీతిం వనే ఽపి భవనే యథా॥ 20

శ్లో॥ సేయం కనకవర్ణాంగీ నిత్యం సుస్మిత భాషిణీ।
సహతే యాతనా మేతా మనర్థానా మభాగినీ॥ 21

పదచ్ఛేదము :- సంతుష్టా - ఫలమూలేన -భర్తృశుశ్రూషణే- రతా - యా - పరాం - భజతే - ప్రీతిం - వనే - అపి - భవనే-యథా. సా - ఇయం - కనక వర్ణాంగీ - నిత్యం - సుస్మిత భాషిణీ - సహతే - యాతనాం - ఏతాం - అనర్థానాం - అభాగినీ.

అన్వయక్రమము :- యా, ఫలమూలేన సంతుష్టా, భర్తృశుశ్రూషణేరతా (సతీ), వనే అపి భవనేయథా పరాంప్రీతిం భజతే, సా కనక వర్ణాంగీ, నిత్యం సుస్మిత భాషిణీ, అనర్థానాం అభాగినీ, ఇయం ఏతాం యాతనాం సహతే।

ప్రతిపదార్థము :- యా = ఏ మహాసీయురాలు, ఫలమూలేన సంతుష్టా=పండ్ల చేతను, కందమూలాదులచేతను సంతృప్తినొందుచున్నదై, భర్తృశుశ్రూషణే రతా (సతీ) = పెనిమిటియొక్క పరిచర్యయందు నిమగ్నురాలగుచు,వనే అపి = ఆడవియందుగూడ, భవనేయథా = ఇంటియందువలెనే, పరాంప్రీతిం = గొప్పదైన సంతోషమును, భజతే =

పొందుచుండెడిదో, సా = అట్టి, కనక వర్ణాంగీ = సువర్ణఛాయగల, దేహముగలదియును, నిత్యం సుస్మిత భాషిణీ = ఎల్లప్పుడును చిరునగవుతో మాటలాడునట్టిదియును, అనర్హానాం అభాగినీ=కష్టములకు అనర్హురాలైనట్టిదియనగు, ఇయం = ఈమె, ఏతాం యాతనాం = ఇట్టివ్యధను, సహతే = సహించుచున్నది.

తాత్పర్యము :- అరణ్యము సంచరి పండ్లతోడను, కంద మూలములతోడను సంతుష్టినొందుచు, భర్తృపరిచర్యనే ప్రధానకర్తవ్యముగా ఎంచుకొని, నట్టడవియందుగూడ అంతఃపురమునందువలెనే గొప్పదైన ఆనందము ననుభవించుచు, ఎల్లప్పుడును చిరునగవుతోడనే మాటలాడుచు, దుఃఖముల కర్హముగానట్టి తన బంగారు మేనితో ఈ యాతనలను ఎట్లు ఓర్చుకొనుచున్నదోగదా!

శ్లో॥ ఇమాం తు శీల సంపన్నాం ద్రష్టు మర్హతి రాఘవః।
రావణేన ప్రమథితాం ప్రపా మివ పిపాసితః॥ 22

పదచ్ఛేదము :- ఇమాం-తు - శీలసంపన్నాం - ద్రష్టుం - అర్హతి - రాఘవః - రావణేన - ప్రమథితాం - ప్రపాం- ఇవ-పిపాసితః.

అన్వయక్రమము :- శీలసంపన్నాం, రావణేన ప్రమథితాం, ఇమాం రాఘవః, పిపాసితః ప్రపాంఇవ, ద్రష్టుం అర్హతి.

ప్రతిపదార్థము :- శీలసంపన్నాం = ఉత్తమమైన శీలసంపద గలదియును, రావణేన ప్రమథితాం=రావణునిచే హింసింపబడుచున్నదియు నగు, ఇమాం=ఈమెను, రాఘవః=శ్రీరాముడు, పిపాసితః ప్రపాం ఇవ= దప్పిగొన్నవాడు చలి పందిరినివలె, ద్రష్టుం అర్హతి=చూడదగియున్నాడు.

తాత్పర్యము :- రావణాసురునిచే క్రూరముగ హింసింపబడుచుగూడ గొప్పదైన శీలసంపద కల్గియున్నట్టి ఈ మహా నీయురాలిని,

శ్రీరాముడు, దప్పికతో తపించుచున్న వాడు చల్లనిపానీయశాలను కనుగొని నట్లు, మహానందముతో చూడవలసియున్నాడు.

శ్లో॥ అస్యా నూనం పున ర్లాభా ద్రాఘవః ప్రీతి మేష్యతి।
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్॥ 23

పదచ్ఛేదము :- అస్యాః-నూనం-పునః - లాభాత్- రాఘవః- ప్రీతిం- ఏష్యతి, రాజా-రాజ్యాత్-పరిభ్రష్టః-పునః-ప్రాప్య-ఇవ-మేదినీమ్.

అన్వయక్రమము :- రాఘవః అస్యాః లాభాత్ రాజ్యపరిభ్రష్టః రాజా మేదినీం పునః ప్రాప్య ఇవ నూనం ప్రీతిం ఏష్యతి.

ప్రతిపదార్థము :- రాఘవః = శ్రీరాముడు, అస్యాః పునః లాభాత్ = ఈమె తిరిగి దొరుకుటవలన, రాజ్యపరిభ్రష్టః రాజా = రాజ్యముసుగోల్పోయినట్టి రాజు, మేదినీం= రాజ్యమును, పునః ప్రాప్య ఇవ= తిరిగి పొందివలె, నూనం = నిశ్చయముగా, ప్రీతిం ఏష్యతి=ఆనందమును పొందగలడు.

తాత్పర్యము :- శ్రీరాముడు ఈమె తనకు తిరిగి లభించి నందులకు, రాజ్యమును గోల్పోయిన రాజు, తిరిగి తనరాజ్యమును లభించి నప్పుడువలె, ఎంతయో ఆనందము నొందునుగదా।

శ్లో॥ కామభోగైః పరిత్యక్తా హీనా బంధుజనేన చ।
ధారయ త్యాత్మనో దేహం తత్స మాగమకాంక్షిణీ॥ 24

పదచ్ఛేదము :- కామభోగైః-పరిత్యక్తా-హీనా-బంధుజనేన - చ-ధారయతి - ఆత్మనః- దేహం - తత్సమాగమ కాంక్షిణీ

అన్వయక్రమము :- కామభోగైః పరిత్యక్తా బంధు జనేన హీనాచ, తత్ సమాగమ కాంక్షిణీ (ఏషా) ఆత్మనః దేహం ధారయతి.

... CENTRAL LIBRARY & RESEARCH ... 33082

ప్రతిపదార్థము :- కామభోగైః పరిత్యక్తా = కోరిన భోగములచే విడువఁబడినదియు, బంధుజనేన హీనా చ = కావలసినవారికి దూరమైనదియును (ఏషా = ఈమె) తత్ సమాగమ కాంక్షిణీ = భర్త యొక్క సమాగమమును ఆశించుచున్నదై, ఆత్మనః దేహం = తన శరీరమును, ధారయతి = నిలుపుకొనుచున్నది.

తాత్పర్యము :- తానుకోరుకొన్న భోగములు తొలగిపోవగా, కావలసినవారు దూరమైపోవగా, దుఃఖసముద్రమునందున్న ఈమె, భర్త యొక్క పునస్సమాగమము నాసించుచున్నదై, తన శరీరము నెట్లో నిలుపుకొనుచున్నది.

శ్లో॥ నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్॥
ఏకస్థహృదయా నూనం రామ మేవాను పశ్యతి॥ 25

పదచ్ఛేదము :- న - ఏషా - పశ్యతి-రాక్షస్యః- న-ఇమాన్-పుష్పఫలద్రుమాన్ - ఏకస్థహృదయా - నూనం - రామం - ఏవ- అను పశ్యతి-

అన్వయక్రమము :- ఏషా రాక్షస్యః నపశ్యతి; ఇమాన్ పుష్ప ద్రుమాన్ నపశ్యతి; నూనం ఏకస్థ హృదయా రామం ఏవ అను పశ్యతి.

ప్రతిపదార్థము :- ఏషా = ఈమె, రాక్షస్యః, నపశ్యతి = రాక్షస స్త్రీలను చూచుటలేదు, ఇమాన్ పుష్పఫలద్రుమాన్ నపశ్యతి = ఈపుష్పవృక్షములను పండ్లచెట్లను చూచుటలేదు, నూనం = నిశ్చయముగా, ఏకస్థహృదయా = ఏకాగ్ర చిత్తముగలదై, రామం ఏవ అనుపశ్యతి = శ్రీరాముని కనుగొనుచున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- తనకు భయమునుగొల్పు రాక్షసీ గణముగాని ఆనందమునుగూర్చు పుష్పఫల వృక్షములు గాని సీతమ్మయొక్క దృష్టికి గోచరించి ఎట్టి వికారమును కల్పింపలేకున్నవి. ఎటుచూచినను ఆమెకు శ్రీరాముడొక్కడే గాన్పించుచుండెను.

తాత్పర్యము :- ఇప్పుడీమె తనచుట్టునున్న ఈ రాక్షస స్త్రీలనుగాని, ఈపూలచెట్లనుగాని, ఫలవృక్షములనుగాని ఏమియును చూచుట లేదు. ఏకాగ్రమైన మనస్సుగలదై నిశ్చయముగా ఒక్క శ్రీరామునే చూచుచున్నది.

శ్లో॥ భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి।
ఏషాతు రహితా తేన భూషణార్హా న శోభతే॥ 26

పదచ్ఛేదము :- భర్తా - నామ - పరం - నార్యాః - భూషణం - భూషణాత్ - అపి - ఏషా - తు - రహితా - తేన - భూషణార్హా - న - శోభతే -

ప్రతిపదార్థము:- భర్తా నామ = భర్తయనగా, నార్యాః = స్త్రీకి, భూషణాదపి = ఆభరణముకంటెనుగూడ, పరం భూషణం = శ్రేష్ఠమైన ఆభరణము, భూషణార్హా = ఆభరణములకు తగియున్నట్టి, ఏషాతు = ఈసీతాదేవి మాత్రము, తేన రహితా = అట్టి భర్త లేకున్నదై, న శోభతే = ప్రకాశించుటలేదు.

తాత్పర్యము :- స్త్రీకి భర్తయే సమస్తాభరణములకంటెను, గొప్ప శోభను గూర్చు మేటి ఆభరణమై యుండును. ఈనాడు, ఈసీత ఇచ్చట అట్టి భర్త దూరమై, భూషణహీనయైనట్లుగా శోభారహితయై యున్నది.

శ్లో॥ దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః।
ధారయత్యాత్మనో దేహం న దుఃఖే నావసీదతి॥ 27

పదచ్ఛేదము :- దుష్కరం - కురుతే-రామః-హీనః-యత్ - అనయా-ప్రభుః,-ధారయతి-ఆత్మనః-దేహం-న-దుఃఖేన-అవసీదతి.

అన్వయక్రమము :- అనయా హీనః, రామః, ప్రభుః (సన్) ఆత్మనః దేహంధారయతి, దుఃఖేన న అవసీదతి (ఇతియత్) (తత్) దుష్కరం - కురుతే -

ప్రతిపదార్థము :- అనయా హీనః = ఈ సీతాదేవికి దూరమైన వాడై, రామః = శ్రీరాముడు, ప్రభుః (సన్) = సామర్థ్యము గలవాడై, ఆత్మనః దేహం = తన శరీరమును, ధారయతి = నిలుపుకొనుచున్నాడు. దుఃఖేన న అవసీదతి = దుఃఖముచే అణగి పోవలేదు. (ఇతియత్, = అనునదేది గలదో), తత్ = అది, దుష్కరం కురుతే = దుర్ఘటమైన కార్యము నాచరించుచున్నాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

వాసుదాసస్వామి :- "అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా" "సూర్యునకు ఎండవలె సీతనాకనన్య అని రాముని వాక్యము. ఎండనువిడిచి సూర్యుడువలె, సీతను విడిచి రాముడుండుట దుష్కరము గదా!

తాత్పర్యము - ఇట్టి సీతాదేవిని పోగొట్టుకొని, శ్రీరాముడు సామర్థ్యముతో తన శరీరమును నిలుపుకొనుచున్నాడు. విషాదమగ్నుడై క్రుంగి పోవలేదనునది చూడగా అతడు గొప్పదైన దుర్ఘట కార్యము చేయుచున్నాడని నాకు తోచుచున్నది.

శ్లో॥ ఇమా మసితకేశాంతాం శతపత్రనిభేక్షణామ్।
సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః॥

పదచ్ఛేదము :- ఇమాం - అసితకేశాంతాం - శతపత్రనిభేక్షణాం - సుఖార్హాం - దుఃఖితాం - దృష్ట్వా - మమ - అపి-వ్యథితం - మనః.

అన్వయక్రమము - అసితకేశాంతాం, శతపత్రనిభేక్షణాం, సుఖార్హాం, ఇమాం దుఃఖితాం దృష్ట్వా మమ మనః అపి వ్యథితమ్॥

ప్రతిపదార్థము :- శతపత్రనిభేక్షణాం = పద్మపత్రముల వంటి కన్నులు గలదియును, సుఖార్హాం = సుఖములకే తగియున్నట్టిది యును అగు; ఇమాం = ఈపూజ్యురాలిని, దుఃఖితాం దృష్ట్వా = దుఃఖము నొందియున్న దానినిగా జూచి, మమ మనః అపి = నా (వంటివాని) మనస్సు గూడ, వ్యథితం = వేదనను చెందినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "అసితకేశాంతాం" - కేశములయొక్క కొనల యందు నీలిమయుండుట స్త్రీలకు దుర్లభమైన విషయము. సీతయొక్క నల్లని కేశములు ప్రత్యేకమైన సౌందర్యము గలిగినవి. 'శతపత్రనిభేక్ష ణాం'- కమలాక్షుడైన శ్రీరామునకు గూడ సీతకన్నులు వ్యామోహమును కలిగించునట్టివని భావము. సుఖార్హాం - రఘురాముని యొడిలో ఉయ్యాలలూగ యుండు సుఖార్హత కలిగినట్టిది. దుఃఖితాం - రాక్షసస్త్రీల నడుమ చిక్కి యున్నది. 'మమాపివ్యథితం మనః' - శాఖాచర మృగమునైన నామనస్సే వ్యథనొందుచున్నది; పరమదయాళువైన రాముని హృదయముమాట చెప్ప వలసిన దేమున్నది? లేక కోటికష్టములను ఓరము చేసికొన్న నాకే వ్యథ కలుగుచున్నది. ఇక ప్రేమపాత్రుడై యున్నవాని విషయము చెప్పనేల?

గోవిందరాజస్వామి :- 'జీవే దుఃఖాకులే విష్ణోః కృపా కా ప్యుపజాయతే' అన్నట్లు తన యంశమైన జీవునకు తాను భర్తగాను,

స్వామిగాను, ఆధారముగను, శరణ్యుడుగను నుండునట్టి జీవుడు, సంసారములోబడి దుఃఖించుచుండ జగత్పతియు, కరుణానిధియు, వాత్సల్యసాగరుడునైన భగవంతునకు దయ పుట్టకుండునా!

తాత్పర్యము .- అతి మనోహరములైన నల్లని కేశములును, విశాలములై సుందరములైన కన్నులునుకలిగి సుఖమునకు మాత్రమే అర్హురా లనిపించుచున్న ఈమె శోకగ్రస్తురాలై యుండుట చూడగా, శాఖామృగమునైనట్టి నా మనస్సుగూడ విషాద భరితమై యున్నది. పరమకారుణికుడైన శ్రీరాముని హృదయము ఎట్లుండునో ఇంక వేరుగ చెప్పవలయునా?

శ్లో॥ క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్,
సా రాక్షసీభి ర్వికృతేక్షణాభి
స్సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే॥ 29

పదచ్ఛేదము :- క్షితిక్షమా - పుష్కరసన్నిభాక్షీ - యా - రక్షితా - రాఘవలక్ష్మణాభ్యామ్ - సా - రాక్షసీభిః - వికృతేక్షణాభిః - సంరక్ష్యతే - సంప్రతి - వృక్షమూలే -

అన్వయక్రమము .- క్షితిక్షమా, పుష్కరసన్నిభాక్షీ. యా రాఘవలక్ష్మణాభ్యాం రక్షితా, సా సంప్రతి వృక్షమూలే వికృతేక్షణాభిః రాక్షసీభిః సంరక్ష్యతే.

ప్రతిపదార్థము - క్షితిక్షమా = భూదేవిని బోలిన సహనము గలదియును, పుష్కరసన్నిభాక్షీ = తామర పువ్వులను బోలిన కన్నులు గలదియునగు, యా=ఏ మహనీయురాలు, రాఘవ లక్ష్మణాభ్యాం రక్షితా= శ్రీరామునిచేతను, లక్ష్మణునిచేతను సంరక్షింపబడి యుండెనో, సా=అట్టి

అమె, సం[ప్రతి=నేడు, వృక్షమూలే = చెట్టుమొదట, వికృతేక్షణాభిః రాక్షసీభిః = వికారమైన చూపులు గల రాక్షస స్త్రీలచే, సంరక్ష్యతే = కావలి కాయబడు చున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభి[ప్రాయములు.

తిలకము :- క్షితిక్షమా - తన కంటి చూపుచేతనే రావణుని భస్మము చేయకపోవుటకు కారణ మామెయొక్క సహనశీలమే గదా కారణము. రాక్షసీభిః సంరక్ష్యతే= పరులు అపహరింపకుండ కావలికాయ బడుచున్నది.

తాత్పర్యము :- భూదేవితో సమానమైన ఓర్పు గలదియును, పద్మప[త్రములనుబోలు సుందర నే[త్రములుగలదియును, మహావీరులైన రామలక్ష్మణులచే కంటికి రెప్పవలె కాపాడబడుచున్నట్టిదియునగు ఈమె నేడు మహాభయంకరమైన చూపులుగల రాక్షసస్త్రీలచే చుట్టుకొన బడి యున్నదిగదా।

శ్లో॥ హిమహతనళినీవ నష్టశోభా
వ్యసన పరంపరయా నిపీడ్యమానా,
సహచరరహితేవ చ[క్రవాకీ
జనకసుతా కృపణాం దశాం [ప్రపన్నా॥ 30

పదచ్ఛేదము :- హిమహత నళినీ - ఇవ-నష్టశోభా - వ్యసన పరంపరయా - నిపీడ్యమానా - సహచరరహితా - ఇవ - చ[క్రవాకీ- జనకసుతా - కృపణాం - దశాం - [ప్రపన్నా -

అన్వయ[క్రమము :- హిమహత నళినీ ఇవ నష్టశోభా, వ్యసన పరంపరయా నిపీడ్యమానా జనకసుతా, సహచర రహితా చ[క్రవాకీ ఇవ, కృపణాం దశాం [ప్రపన్నా.

ప్రతిపదార్థము :- హిమహతనళినీ ఇవ = మంచుచే శిథిలమైన తామరతీగవలె, నష్టశోభా = చెడిపోయిన సౌందర్యము గలదియును, వ్యసనపరం పరయా = దుఃఖముల పరంపరచే, నిపీడ్యమానా = మిక్కిలి పీడింపబడుచున్నదియునై, జనకసుతా = జానకీదేవి, సహచరరహితా = ప్రియునికి దూరమైనట్టి, చక్రవాకీ ఇవ = ఆడుచక్రవాక పక్షివలె, కృపణాం దశాం = దయనీయమైన స్థితిని, ప్రపన్నా = పొందియున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- 'సహచర రహితా చక్రవాకీ ఇవ, చక్రవాకాంగన-విశ్రాంతిని పొందవలసిన రాత్రికాలమున ప్రియవియోగము గలిగి, దానిని భరింపలేక బాధనొందుచుండుట ప్రసిద్ధము.

తాత్పర్యము :- మంచు దెబ్బచే శిథిలమైన తామరతీగవలె, తన సహజశోభను గోల్పోయి ఎడతెగని దుఃఖములచే తీవ్రముగ పీడింపబడుచున్న ఆసీతాదేవి, తన ప్రియ విరహముచే రాత్రికాలము నందు పరితాపము నొందునట్టి చక్రవాకాంగనవలె మిక్కిలి దయనీయమైన స్థితి నొందియున్నదిగదా!

శ్లో॥ అస్యా హి పుష్పావనతాగ్రశాఖాః
శోకం దృఢం వై జనయంత్యశోకాః,
హిమవ్యపాయేన చ మందరశ్మి
రభ్యుత్థితో నైక సహస్ర రశ్మిః॥ 8।

పదచ్ఛేదము :- అస్యాః-హి- పుష్పావనతాగ్ర శాఖాః-శోకం-దృఢం - వై - జనయంతి - అశోకాః - హిమవ్యపాయేన - చ - మందరశ్మిః - అభ్యుత్థితః - నైక సహస్రరశ్మిః.

అన్వయక్రమము :- అస్యాః, పుష్పావనతాగ్రశాఖాః అశోకాః, హిమవ్యపాయేన మందరశ్మిః, అభ్యుత్థితః నైకసహస్రరశ్మిః చ దృఢం శోకం జనయంతి.

ప్రతిపదార్థము :- అస్యాః=ఈమెకు, పుష్పావనతాగ్రశాఖాః= పుష్పముల (బరువు)చే వంగిపోయిన కొనకొమ్మలు గలిగినట్టి, అశోకాః = అశోక వృక్షములును, హిమవ్యపాయేన=మంచువ్యాపించుటచే (తొలగుటచే), మందరశ్మిః = మందమైన కాంతులు గల్గినట్టివాడై, అభ్యుత్థితః= ఉదయించినట్టి, నైక సహస్రరశ్మిఃచ = పెక్కువేల కిరణములుగల చంద్రుడునుగూడ, దృఢం = మిక్కుటముగా, శోకం జనయంతి= శోకమును పుట్టించుచున్నారు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము.- హిమవ్యపాయేన=వసంతఋతువుచేత.

తాత్పర్యము:- ఈ సీతాదేవి కిప్పుడు పూలబరువుచే వంగిన కొమ్మలు గల్గినట్టి, సుందరమైన అశోక వృక్షములును, శిశిరఋతువు తొలగుటచే స్పష్టమైన తన వేలకొలది కిరణములతో ఉదయించిన చంద్రుడును గూడ, తీవ్రముగ దుఃఖమును కలిగించుచున్నారుగదా!

శ్లో॥ ఇత్యేవ మర్థం కపి రన్వవేక్ష్య।
సీతేయ మిత్యేవ నివిష్టబుద్ధిః,
సంశ్రిత్య తస్మి న్నిషసాద వృక్షే
బలీ హరీణా మృషభ స్తరస్వీ 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
హనూమత్పరితాపో నామ
షోడశ స్సర్గః

పదచ్ఛేదము :- ఇతి - ఏవం - అర్థం - కపిః - అన్వవేక్ష్య - సీతా - ఇయం ఇతి - ఏవ - నివిష్టబుద్ధిః - సంశ్రిత్య - తస్మిన్ - నిషసాద - వృక్షే - బలీ - హరీణాం - ఋషభః - తరస్వీ.

అన్వయక్రమము :- బలీ హరీణాం ఋషభః, తరస్వీ కపిః ఇతి ఏవం అర్థం అన్వవేక్ష్య, ఇయం సీతాఏవ, ఇతి నివిష్టబుద్ధిః, (సన్) తస్మిన్ వృక్షే సంశ్రిత్య నిషసాద.

ప్రతిపదార్థము :- బలీ=బలాఢ్యుడును, హరీణాం ఋషభః= వానరులలో శ్రేష్ఠుడును, తరస్వీ = బలవంతుడును అగు, కపిః = హనుమ, ఇతి = ఈ విధముగా, ఏవం అర్థం = ఈ రీతి భావమును, అన్వవేక్ష్య = భావించి, ఇయం సీతాఏవ = ఈమె సీతయే, ఇతి=అని, నివిష్టబుద్ధిః = నిశ్చయించుకొన్న మనస్సుగలవాడై, తస్మిన్ వృక్షే = ఆ శింశుపావృక్షమునందు, సంశ్రిత్య = అణగియుండి, నిషసాద = కూర్చుండెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'తస్మిన్వృక్షే నిషసాద' - తరువాత చేయదలచిన కృత్యము నాచరించగోరి, అవృక్షమునందే విశ్రమించినవాడై, ఆ రాత్రి శేషమును మరుదినమును గూడ కూర్చుండెనని భావము. సముద్ర లంఘన దినమునాటి రాత్రియందే రావణాంతఃపురముతో సహా లంకనంతను అరాత్రి మొదటి మూడు జాములయందును అన్వేషించి యుండెను. నాల్గవ జాముననే అశోకవనమును ప్రవేశించెనని తెలిసికొనవలెను.

తాత్పర్యము :- వానరశ్రేష్ఠుడును, మహావీరుడునగు హనుమ, ఈ విధమైన ఆలోచనలనుచేసి ఈమె సీతయే యను నిర్ణయమునకు వచ్చి

భావికార్యనిర్ణయము చేయగోరుచు అప్పటిమునంచే అరాత్రి శేషము గడపుటకై కూర్చొనియుండెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
'సుబోధిని' యను ఆంధ్ర వివరణమునందు
"హనూమత్పరితాపము" అను
పదునారవ సర్గము.

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ్ గురుభ్యో నమః

సప్తదశ స్సర్గః

శ్లో॥ తతః కుముదషండాభో నిర్మలో నిర్మలం స్వయమ్।
ప్రజగామ నభ శ్చంద్రో హంసో నీల మి వోదకమ్॥ 1

పదచ్ఛేదము :- తతః - కుముదషండాభః - నిర్మలః - నిర్మలం - స్వయమ్. ప్రజగామ - నభః - చంద్రః - హంసః - నీలం - ఇవ - ఉదకమ్.

అన్వయక్రమము :- తతః కుముద షండాభః, నిర్మలః, చంద్రః, హంసః నీలం ఉదకం ఇవ, నిర్మలం నభః స్వయం ప్రజగామ.

ప్రతిపదార్థము:— తతః = అటుపిమ్మట, కుముదషండాభః = తెల్లకలువల సమూహమువంటి ప్రకాశము కలిగినట్టి, నిర్మలః చంద్రః = స్వచ్ఛమైన రూపముగల చంద్రుడు, హంసః నీలం ఉదకం ఇవ = రాజహంస నల్లని తటాక జలమునువలె, నిర్మలం నభః = నిర్మలమైన ఆకాశమును, స్వయం = స్వయముగా, ప్రజగామ = చేరెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :— 'తతః' అనగా ఆ పగటిని గడిపిన తరువాత. ఆకాశము నల్లగా నున్నదనుట కవి సమయము.

బాంబాయిప్రతి .— కుముదషండమునకు మారుగా కుముదఖండమని గలదు, ఖండమన్నను సమూహమనియే అర్థము.

తాత్పర్యము :— అటుపిమ్మట రాజహంస నల్లని తటాక జలమును చేరినట్లుగా, తెల్లకలువల రాశివలె, స్వచ్ఛమైన ధవళకాంతితో ప్రకాశించుచున్న చంద్రుడు వినీలాకాశమునుచేరి మనోహరముగ గానవచ్చుచుండెను.

శ్లో॥ సాచివ్య మివ కుర్వన్ స ప్రభయా నిర్మల ప్రభః
చంద్రమా రశ్మిభి శ్శీతై స్సిషేవే పవ నాత్మజమ్॥ 2

పదచ్ఛేదము :— సాచివ్యం - ఇవ - కుర్వన్ - సః - ప్రభయా - నిర్మలప్రభః - చంద్రమాః - రశ్మిభిః - శీతైః - సిషేవే- పవనాత్మజమ్.

అన్వయక్రమము:— సః నిర్మలప్రభః చంద్రమాః, ప్రభయా సాచివ్యం కుర్వన్ ఇవ, శీతైః రశ్మిభిః పవనాత్మజం సిషేవే.

ప్రతిపదార్థము .- నిర్మలప్రభః = స్వచ్ఛమైన కాంతిగలిగి నట్టి, సః చంద్రమాః = ఆ చంద్రుడు, ప్రభయా = వెలుగుతో, సాచివ్యం కుర్వన్ ఇవ = సాహాయ్యము చేయుచున్నవాడువలె, శీతైః రశ్మిభిః = చల్లని కిరణములచే, పవనాత్మజం = వాయునందనుని, సిషేవే = సేవించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'సాచివ్యంకుర్వన్ ఇవ' - పగటి భాగమున ఎక్కడో ఒకచోట ఏకాంత ప్రదేశమున గడిపియుండుటచేతను, నిద్రా వ్యాకులుడై యుండుటచేతను, సీతను, రాక్షస స్త్రీలను సరిగా చూడలేక పోయెను. సమీపముననున్న హనుమకు రాత్రి యందు సీతమ్మను చూచుటలో చంద్రోదయమే సహాయమైనది.

తాత్పర్యము :- స్వచ్ఛమైన కాంతిగల చంద్రుడు తన చల్లని వెన్నెలతో హనుమకు సహాయము చేయురీతిగా తన శీతకిరణములతో ఆతని శ్రమను పోగొట్టుచు సేవించెను.

శ్లో॥ స దదర్శ తత స్సీతాం పూర్ణచంద్రనిభాననామ్
శోకభారై రివ న్యస్తాం భారై ర్నావ మి వాంభసి. 3

పదచ్ఛేదము :- సః - దదర్శ - తతః - సీతాం - పూర్ణ చంద్ర నిభాననామ్। శోకభారైః- ఇవ - న్యస్తాం - భారైః- నావం - ఇవ - అంభసి.

అన్వయక్రమము :- సః తతః, అంభసి, భారైః న్యస్తాం నావం ఇవ శోకభారైః న్యస్తాం, పూర్ణచంద్రనిభాననాం సీతాం దదర్శ.

ప్రతిపదార్థము :- సః = ఆ హనుమ, తతః = పిమ్మట, అంభసి = జలమునందు, భారైః న్యస్తాం నావం ఇవ = బరువులతో నింపబడిన నావవలె, శోకభారైః న్యస్తాంఇవ (స్థితాం) = దుర్భరమైన దుఃఖభారములతో నింపబడినట్లుగ నున్నట్టి, పూర్ణచంద్రనిభాననాం సీతాం = నిండు చంద్రుని బోలిన ముఖము గలిగిన సీతాదేవిని, దదర్శ = కనుగొనెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- శోకభారైః న్యస్తాం ఇవ - దుఃఖభారముచే తీవ్రముగా అణచి వేయబడుచున్నట్టి సీతను;

తాత్పర్యము :- నీటిలో అమితమైన భారముచే మునిగిపోవు చున్న నావరీతిగా, దుఃఖభారముచే అణగి క్రుంగిపోవుచున్న ఆ నిండు చంద్రుని వంటి ముఖముగల సీతాదేవిని హనుమ గాంచెను.

శ్లో॥ దిదృక్షమాణో వైదేహీం హనుమా న్మారుతాత్మజః
స దదర్శావిదూరస్థా రాక్షసీ ర్ఘోరదర్శనాః. 4

పదచ్ఛేదము :- దిదృక్షమాణః - వైదేహీం - హనుమాన్ - మారుతాత్మజః । సః - దదర్శ - అవిదూరస్థాః - రాక్షసీః - ఘోర దర్శనాః.

అన్వయక్రమము :- సః మారుతాత్మజః హనుమాన్, వైదేహీం దిదృక్షమాణః, అవిదూరస్థాః, ఘోరదర్శనాః రాక్షసీః దదర్శ.

ప్రతిపదార్థము :- మారుతాత్మజః సః హనుమాన్ = వాయు నందనుడైన యా హనుమ, వైదేహీం దిదృక్షమాణః = సీతాదేవిని చూడ

గోరుచున్నవాడై, అవిదూరస్థాః = సమీపముననే యున్నట్టి, ఘోరదర్శనాః రాక్షసీః = భీకరాకారలగు రాక్షస స్త్రీలను, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- హనుమ సీతాదేవిని స్పష్టముగ చూడగోరినవాడై ఆమెవైపు చూచుచు ఆమె చుట్టునుగల భీకరాకారలైన పలువురు రాక్షస స్త్రీలను గాంచెను.

శ్లో॥ ఏకాక్షీ మేకకర్ణాంచ కర్ణప్రావరణాం తథా,
అకర్ణాం శంకుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాస నాసికామ్. 5

ఇటనుండి 15వ శ్లోకము వఱకును పదచ్ఛేదము, అన్వయక్రమము కూడ సుగమములు.

ప్రతిపదార్థము :- ఏకాక్షీం = ఒంటికన్ను గల దానిని, ఏకకర్ణాంచ = ఒక్క చెవి గల్గిన రాక్షసిని, తథా కర్ణప్రావరణాం = అట్లే వ్రేలాడు చెవులు గల దానిని, అకర్ణాం = చెవులులేని దానిని, శంకుకర్ణాంచ = సూదియైన చెవులుగల దానిని, మస్తకోచ్ఛ్వాసనాసికాం = తలయందే శ్వాసను పీల్చు ముక్కుగల్గిన రాక్షసిని (హనుమాన్ దదర్శ = హనుమంతుడు చూచెను.)

తాత్పర్యము :- సీతచుట్టునుగల వికారమైనట్టి ఆకారములుగల ఆ రాక్షస స్త్రీలలో, ఒక్కతెకు ఒక కన్నే యుండెను. ఒకతెకు ఒకచెవియే యుండెను. వేరొక్కతె చెవులు దాని భుజము వరకును వ్రేలాడు చుండెను. ఇంకొకతెకు చెవులే లేకుండెను. ఒక్కతె చెవి శంకువువలె సూదిమొన గల్గియుండెను. ఒక రాక్షసికి తన తలపైని నాసిక గల్గి ఆమె దానితోనే శ్వాసించు చుండెను.

శ్లో॥ అతికాయోత్తమాంగీంచ తనుదీర్ఘశిరోధరాం,
ధ్వస్తకేశీం తథా ఽ కేశీం కేశకంబళ ధారిణీమ్. 6

ప్రతిపదార్థము :- అతికాయోత్తమాంగీం = శరీరమునకు మించిన పెద్ద శిరస్సుగల దానిని, తను దీర్ఘశిరోధరామ్ = సన్ననై పొడవైన మెడకలిగి నట్టిదానిని, ధ్వస్తకేశీం = రాలిపోయిన తలవెంట్రుకలు గలదానిని, తథా అకేశీం = అట్లే పూర్తిగా కేశములే లేనట్టిదానిని, కేశకంబళధారిణీం = కంబళమువలె బొచ్చు వెంట్రుకలు గల దానిని (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను).

తాత్పర్యము :- చిన్న శరీరముపై పెద్దతల గలది యొకతె, సన్ననై పొడవైన మెడగలది యొకతె, కేశములు పూర్తిగా రాలిపోయినది ఒకతె, తలపై కేశములేలేని దొకతె, గొర్రెబొచ్చువంటి కేశములు గలది యొకతె - అట్టి ఆ రాక్షస స్త్రీలను హనుమ గాంచెను.

శ్లో॥ లంబకర్ణలలాటాంచ లంబోదరపయోధరాం,
లంబోష్ఠీం చుబుకోష్ఠీంచ లంబాస్యాం లంబ జానుకామ్.

ప్రతిపదార్థము .- లంబకర్ణలలాటాంచ = వ్రేలాడుచున్న చెవులను, నుదురును గలదానిని, లంబోదర పయోధరాం = వ్రేలాడుచున్న కడుపును, స్తనములును గల్గిన దానిని, లంబోష్ఠీం = వ్రేలాడుచున్న పెదవిగలదానిని, చుబుకోష్ఠీం = గడ్డము వరకు వ్రేలాడుచున్న పెదవి గలదానిని, లంబాస్యాం = పొడవైన నోరు గలదానిని, లంబజానుకాం = పొడవైన మోకాళ్లు గలదానిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో ఒకతెకు చెవులును సుదురును వ్రేలాడు చుండెను. ఇంకొకతెకు కడుపును స్తనములును వ్రేలాడుచుండెను. ఒకతెకు పెదవి వ్రేలాడు చుండెను. ఇంకొకతె పెదవి తిన గడ్డము వంకకును వ్రేలాడు చుండెను. ఒకతె నోరు మిక్కిలి పొడవుగ నుండెను. ఇంకొకతెకు మోకాళ్లు మిక్కిలి పొడవై యుండెను.

శ్లో॥ హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా
కరాళాం భుగ్నవక్త్రాం చ పింగాక్షీం వికృతాననామ్. 8

ప్రతిపదార్థము :- హ్రస్వాం = పొట్టిగానున్న దానిని, తథా కుబ్జాం = అప్లే మఱుగుజ్జుదానిని, వికటాం = వంకరయైన దానిని, వామనాం = పొట్టిగనున్న దానిని, కరాళాం = భయంకరమైన దానిని, భుగ్న వక్త్రాంచ = అణగియున్న ముఖము గలదానిని, పింగాక్షీం = పచ్చని కన్నులుగల దానిని, వికృతాననాం = వికారమైన ముఖము గలదానిని, (హనుమాన్ దదర్శ = హనుమంతుడు చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో ఒకతె మిక్కిలిపొట్టిగ నుండెను. ఒకతె మిక్కిలి పొడవుగ నుండెను. ఒకతె మరుగుజ్జుగ నుండెను. ఒకతె అవయవములు వికటముగా నుండెను. ఒకతె భీకరయై యుండెను. ఒకతె ముఖము వెనుకకు అణగి యుండెను. ఒకతె పిల్లి కన్నులు గలదై యుండెను. ఒకతె వికారమైన నోరు కలిగియుండెను.

శ్లో॥ వికృతాః పింగళాః కాళీః క్రోధనాః కలహప్రియాః
కాలాయస మహాశూల కూటముద్గర ధారిణీః. 4

ప్రతిపదార్థము :- వికృతాః = వికారమైన అవయవములు గల వారిని, పింగళాః = పచ్చనిదేహముగల వారిని, కాళీః = నల్లని శరీరము గలవారిని, క్రోధనాః = తీవ్ర కోపస్వభావముగలవారిని, కలహప్రియాః =

కర్యములకు సిద్ధమై యుండువారిని, కాలాయస = నల్లని ఇనుముతో నిర్మించిన, మహాశూల = పెద్దశూలములను, కూట = సమ్మెటలను, ముద్గర = గుదియలను, ధారిణీః = ధరించిన వారిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను).

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు వికారమైన శరీరము గలవారు. కొందరు పచ్చని రంగుగలవారు, కొందరు నల్లని రంగు గలవారు. కొందరు తీవ్రమైన కోపశీలము గలవారు. కొందరు కలహప్రియులు. కొందరు స్థూలమైన ఇనుపశూలములను, నల్లని ఇనుప సమ్మెటలను, గుదియలను ధరించిన వారుగా నుండిరి.

శ్లో॥ వరాహమృగ శార్దూల మహిషాజశివాముఖీః,
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాత శిరసో ఽపరాః. 10

ప్రతిపదార్థము :- వరాహమృగ శార్దూల మహిష + అజ శివాముఖీః = అడవిపంది ముఖములు, లేడి ముఖములు, పెద్దపులి ముఖములు, దున్నపోతు ముఖములు, గొఱ్ఱె ముఖములు, నక్క-ముఖములు గల్గినట్టివారిని, గజోష్ట్రహయపాదీశ్చ = ఏనుగు ఒంటె గుఱ్ఱముల యొక్క- పాదములవంటి పాదములు గలవారిని, నిఖాత శిరసః అపరాః = మొండెములోనికే దిగిపోయిన తలగల వారిని మరి కొంతమందిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను).

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు అడవిపంది ముఖములు, లేడిముఖములు, పెద్దపులిముఖములు, దున్నపోతుముఖములు, గొఱ్ఱె ముఖములు, నక్క- ముఖములు గలవారుగా నుండిరి. ఏనుగు పాదములుగలవారుకొందరు, ఒంటెకాళ్లు గలవారు, కొందరు గుఱ్ఱముకాళ్లు గలవారు కొందరు నుండిరి. కొంతమంది శిరస్సులు వారి మొండెములోనికి అణిగిపోయి యుండెను.

శ్లో॥ ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాః,
గోకర్ణీ ర్హస్తికర్ణీశ్చ హరి కర్ణీ స్తథాఽపరాః. 11

ప్రతిపదార్థము :- ఏకహస్తైక పాదాశ్చ = ఏకహస్తము, ఏక పాదము గలవారిని, ఖరకర్ణీ + అశ్వకర్ణికాః = గాడిద చెవులును, గుఱ్ఱము చెవులును గలవారిని, గోకర్ణీః = ఆవు చెవులవంటి చెవులు గలవారిని, హస్తికర్ణీశ్చ = ఏనుగు చెవులు గలవారిని, తథా హరికర్ణీః అపరాః = అట్లే సింహము చెవులు గల మరికొందరిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు ఒకే చెవిగల వారు, ఒకే పాదముగలవారు; అట్లే కొందరు ఒకే చెవిగలవారు, గుఱ్ఱము చెవులవారు, ఆవు చెవులవారు, గాడిద చెవులవారు, సింహము చెవులవారునుగా నుండిరి.

శ్లో॥ అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః,
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాస నాసికాః. 12

(ప్రతిపదార్థము :- అనాసాః = ముక్కులేని వారిని, అతి నాసాః = బొఱ్ఱముక్కు గలవారిని, తిర్యఙ్నాసాః = అడ్డుతిరిగినముక్కు గలవారిని, వినాసికాః = వంకర తిరిగిన నాసికగలవారిని, గజసన్నిభ నాసాశ్చ = ఏనుగు తొండముతో సమానమైన నాసిక గలవారిని, లలాటో చ్ఛ్వాస నాసికాః = నుదుటియందే శ్వాసను తీసికొను నాసిక గలవారగు రక్కసులను (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు ముక్కులేని వారు, బొఱ్ఱముక్కులవారు, అడ్డుతిరిగిన ముక్కు గలవారు, వంకరలు

తిరిగిన ముక్కు గలవారు ఏనుగు తొండమునంటి ముక్కు గలవారు నుదుటియందె రంధ్రముకలిగి దానితోనే శ్వాసించుచుండువారునుగా నుండిరి.

శ్లో॥ హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాః
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీః. 13

ప్రతిపదార్థము:- హస్తిపాదాః =ఏనుగు పాదములు గలవారిని, గోపాదాః =గోవుపాదములవంటి పాదములు గలవారిని, పాదచూళికాః= పాదములయందు బొచ్చుగలవారిని, అతిమాత్ర శిరోగ్రీవాః = విపరీతమైన తలకాయలును మెడలును గలవారిని, అతిమాత్ర కుచోదరీః = విపరీతమైన స్తనములు, కడుపులు గలవారిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు ఏనుగు పాదములవారు, విపరీతమైన పాదములవారు, గోవు పాదములు గలవారు, తమ పాదముల నిండుగ బొచ్చుగలవారు, విపరీతమైన కంఠముగలవారు అతి స్థూలమైన స్తనములు, పొట్టలుగలవారునుగా నుండిరి.

శ్లో॥ అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వానఖా స్తథా,
అజాముఖీ ర్హరిముఖీ ర్గోముఖీ స్సూకరీముఖీః. 14

ప్రతిపదార్థము :- అతిమాత్రాస్యనేత్రాశ్చ = మిక్కిలి విపరీతమైన నోళ్లు, కన్నులు గలవారిని, తథా దీర్ఘజిహ్వానఖాః = అట్లే విపరీతమైన పొడవుగల నాలుకలు, గోళ్లు గలవారిని, అజాముఖీః = మేక ముఖముగలవారిని, సూకరీముఖీః = పంది ముఖము గలవారిని, గోముఖీః = ఆవుముఖము గలవారిని, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షస స్త్రీలలో కొందరు మిక్కిలి పెద్దవైన నోళ్లను, కన్నులను గలవారు, మిక్కిలి పొడవైన నాలుకలను గోళ్ళను గలవారునుగా నుండిరి. అట్లే మరికొందరు మేకముఖము గలవారు, ఏనుగు ముఖము గలవారు, ఆవు ముఖము గలవారు పంది ముఖము గలవారునుగా నుండిరి.

శ్లో॥ హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీ ఘోరదర్శనాః,
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః. 15

పదచ్ఛేదము :- హయోష్ట్రఖరవక్త్రాః - చ - రాక్షసీః - ఘోరదర్శనాః - శూలముద్గరహస్తాః - చ - క్రోధనాః - కలహప్రియాః.

ప్రతిపదార్థము - హయ + ఉష్ట్రఖర వక్త్రాః = గుఱ్ఱము యొక్కయు, ఒంటె యొక్కయు, గాడిద యొక్కయు ముఖము వంటి ముఖము గలవారును, ఘోరదర్శనాః = భయంకరమైన రూపము గలవారును, శూలముద్గర హస్తాః చ = శూలములను, ఇనుపగుదియలను చేతియందు ధరించిన వారును, క్రోధనాః = తీవ్రమైన క్రోధ స్వభావము గలవారును, కలహప్రియాః = కయ్యమునందు ఇష్టముగలవారును అగు, రాక్షసీః = రాక్షస స్త్రీలను, (హనుమాన్ దదర్శ = హనుమంతుడు చూచెను.)

తాత్పర్యము :- ఆ రాక్షసస్త్రీలు గుఱ్ఱపు మూతులు, ఒంటె మూతులు, గాడిద ముఖములను కలిగి భయంకరమైన రూపములో నుండిరి మరియు శూలములను, ఇనుపగుదియలను తమచేత ధరించి కలహ స్వభావముగలవారై కయ్యమునందు గాలుదువ్వువారుగా నుండిరి.

శ్లో॥ కరాళా ధూమ్రకేశీశ్చ రాక్షసీ ర్వికృతాననాః,
పిబంతీ స్సతతం పానం సదా మాంససురాప్రియాః. 16

పదచ్ఛేదము :- కరాళాః - ధూమ్రకేశీః - చ - రాక్షసీః - వికృతాననాః - పిబంతీః - సతతం-పానం - సదా-మాంస సురాప్రియాః.

ఈ ఘట్టము నందలి శ్లోకములకు అన్వయక్రమము సుగమము.

ప్రతిపదార్థము :- కరాళాః = భీకరాకారము గలవారును, ధూమ్రకేశీః = బూడిదవన్నెగల జుట్టు గలవారును, వికృతాననాః = వికారమైన మిట్టపల్లములుగల ముఖములుగలవారును, సదా మాంస సురాప్రియాః = నిత్యము మాంసమునందును, మద్యమునందు నధికమైన ప్రీతి గలవారై, సతతం పానం పిబంతీః = ఎడతెగకుండగా మద్యమును పానము చేయుచున్నవారునగు, రాక్షసీః = రాక్షసస్త్రీలను, (హనుమాన్ దదర్శ = హనుమ చూచెను.)

తాత్పర్యము :- భయంకరమైన శరీరములును, బూడిద రంగుగల జుట్టును, వికారమైన ముఖములును, గలవారై మద్యమాంసము లందు అత్యధిక ప్రీతిగలవారై అదేపనిగ విడువకుండ సురాపానము చేయుచున్న రాక్షసస్త్రీలు అచట హనుమకు గానవచ్చిరి.

శ్లో॥ మాంసశోణితదిగ్ధాంగీ ర్మాంసశోణితభోజనాః,
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః
స్కంధవంత ముపాసీనాః పరివార్య వనస్పతిమ్. 17

పదచ్ఛేదము - మాంసశోణితదిగ్ధాంగీః - మాంసశోణిత భోజనాః - తాః - దదర్శ - కపిశ్రేష్ఠః - రోమహర్షణ దర్శనాః - స్కంధవంతం - ఉపాసీనాః - పరివార్య - వనస్పతిమ్.

ప్రతిపదార్థము :- మాంసశోణిత దిగ్ధాంగీః = మాంసముతో, రక్తముతో పూయబడిన శరీరముగల వారును, మాంసశోణితభోజనాః =

మాంసము, రక్తము మాత్రమే ఆహారముగా కలిగినవారును, రోమహర్షణ దర్శనాః = ఒడలికి గగుర్పాటు కలిగించు రూపము గలవారునగు, స్కంధవంతం వనస్పతిం = పెద్ద బోదెగల ఆ శింశుపా వృక్షమును, పరివార్య ఉపాసీనాః = చుట్టునుజేరి కూర్చుండియున్న, తాః = ఆ రాక్షస స్త్రీలను, కపిశ్రేష్ఠః = వానరశ్రేష్ఠుడైన హనుమ, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- ఒడలినిండ మాంసము యొక్కయు, రక్తము యొక్కయు ముక్కలును, చారలును గలిగి, మాంసము రక్తము మాత్రమే ఆహారముగానున్న వారును, చూడగనే ఒడలు గగురుపొడుచు భీకరమైన ఆకారము గలవారునై, పెద్ద కొమ్మలును, బోదెయును గలిగియున్న ఆ శింశుపావృక్షము చుట్టును చేరి కూర్చున్న అచ్చటి ఆ రాక్షస స్త్రీలను హనుమ చూచెను.

శ్లో॥ తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీ మనిందితామ్
లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్.

పదచ్ఛేదము :- తస్య - అధస్తాత్ - చ - తాం - దేవీం - రాజపుత్రీం - అనిందితామ్। లక్షయామాస - లక్ష్మీవాన్ - హనుమాన్ - జనకాత్మజామ్.

ప్రతిపదార్థము :- లక్ష్మీవాన్ హనుమాన్ = శోభాసంపన్నుడైన హనుమ, తస్య అధస్తాత్ = ఆ శింశుపావృక్షము యొక్క క్రింది భాగమునందు, అనిందితాం = ఉత్తమురాలైనట్టి, దేవీం = మహనీయురాలైనట్టి, రాజపుత్రీం = మహారాజ కుమార్తెయైనట్టి, తాం జనకాత్మజాం = ఆ జానకీదేవిని, లక్షయామాస = కనుగొనెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- లక్ష్మీవాన్ = సీతమ్మతల్లి దర్శనము చేత కలిగినట్టి దివ్యమైన శోభగలవాడు.

తాత్పర్యము - ఆ శింశుపావృక్షము క్రిందనేయున్న ఉత్తమురాలైన జనకమహారాజు కుమార్తెయగు ఆ సీతాదేవిని హనుమంతుడు తన చిరకాలతపః ఫలితముగా మహానందముతో విప్పారిన నేత్రములతో కనుగొనెను.

శ్లో॥ నిష్ప్రభాం శోకసంతప్తాం మలసంకుల మూర్ధజామ్,
క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ,
చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్. 19

పదచ్ఛేదము .- నిష్ప్రభాం - శోకసంతప్తాం - మలసంకుల మూర్ధజామ్, క్షీణపుణ్యాం - చ్యుతాం - భూమౌ - తారాం - నిపతితాం - ఇవ, చారిత్ర వ్యపదేశాఢ్యాం - భర్తృదర్శన దుర్గతామ్.

ప్రతిపదార్థము - నిష్ప్రభాం = ప్రభను గోలుపోయి యున్నదియును, శోకసంతప్తాం = దుఃఖముచే పరితపింపజేయబడు చున్నదియును, మల సంకుల మూర్ధజామ్ = దుమ్ముతోనిండి చెదరి పోయిన కేశములు గలదియును, భూమౌ నిపతితాం తారామివ = భూమిపై రాలిన నక్షత్రమువలె, క్షీణపుణ్యాం = క్షీణించియున్న పుణ్యముగలదియును, చ్యుతాం = (క్షీణస్థితికి) జారినదియును, చారిత్రవ్యపదేశాఢ్యాం = ప్రసిద్ధమైన గొప్ప చరిత్ర గలిగి యున్నదియును, భర్తృదర్శనదుర్గతాం = భర్తృదర్శనము లభింపకుండుటచే దుస్థితి నొంది యున్నదియునగు, (జానకీం లక్షయామాస = జానకీదేవిని చూచెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము - చారిత్రవ్యపదేశాఢ్యాం = పతివ్రతా ధర్మాచరణమున ఖ్యాతిని పొందియున్నది.

తాత్పర్యము :- సహజమైన తన శరీరప్రభను గోల్పోయి శోకసంతప్తురాలై, ధూళి ధూసరితములైన కేశములు గల్గి, పుణ్యము నశించుటచే దివినుండి రాలి భూమిపైబడిన నక్షత్రమువలె గాన్పించుచు, పాతివ్రత్యప్రధానమును వెల్లడించు రూపముకలిగి, భర్త కాన్పింపకపోవుట యనెడి దుస్థితి నొందియున్నట్టి ఆ జానకీదేవిని హనుమ కనులారం గాంచెను.

శ్లో॥ భూషణై రుత్తమై ర్హీనాం భర్తృవాత్సల్య భూషణామ్,
రాక్షసాధిప సంరుద్ధాం బంధుభిశ్చ వినాకృతామ్. 20

పదచ్ఛేదము :- భూషణైః - ఉత్తమైః - హీనాం - భర్తృవాత్సల్య భూషణామ్, రాక్షసాధిప సంరుద్ధాం - బంధుభిః - చ - వినాకృతామ్.

ప్రతిపదార్థము - ఉత్తమైః భూషణైః హీనాం = శ్రేష్ఠమైన ఆభరణములు లేనట్టిదియును, భర్తృవాత్సల్య భూషణాం = భర్తయొక్క ప్రేమయే ఆభరణముగా నున్నదియును, రాక్షసాధిప సంరుద్ధాం = రాక్షసరాజైన రావణునిచే బంధింపబడినదియును, బంధుభిః వినాకృతామ్ = అనవారికి దూరమైపోయియున్నదియును అగు, (జానకీం లక్షయామాస = సీతాదేవిని గాంచెను.)

తాత్పర్యము :- శ్రేష్ఠమైన ఇతరాభరణము లేమియును లేక పోయినప్పటికిని భర్తృప్రేమ యనెడి అమూల్యమైన అభరణముతో శోభించు చున్నదియును బంధువులకు దూరము చేయబడి రావణునిచే బంధింపబడి యున్నదియునగు ఆ సీతాదేవిని హనుమ గాంచెను.

శ్లో॥ వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ,
చంద్రరేఖాం పయోదాంతే శారదాభ్రై రివావృతామ్.

పదచ్ఛేదము :- వియూథాం - సింహసంరుద్ధాం - బద్ధాం - గజవధూం - ఇవ, చంద్రరేఖాం - పయోదాంతే - శారదాభ్రైః - ఇవ - ఆవృతామ్.

ప్రతిపదార్థము :- వియూథాం = తన మందనుండి తప్పిపోయినదియును, సింహసంరుద్ధాం = సింహముచే అడ్డగింపబడినదియు నగు, బద్ధాం గజవధూం ఇవ = బంధింపబడినట్టి ఆడుఏనుగువలె నున్నదియును, పయోదాంతే = వర్షాకాలపు చివరి కాలమున, శారదాభ్రైః ఆవృతాం = శరత్కాల మేఘములచే ఆవరింపబడినట్టి, చంద్రరేఖాం ఇవ = చంద్రరేఖవలె నున్నదియు నగు, (జానకీం లక్షయామాస = జనకీదేవిని చూచెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- పయోదాంతే శారదాభ్రైః ఆవృతాం - అనుటచే సీతాదేవియొక్క దుఃఖములు అత్యల్పములే మిగిలియున్నవని సూచింపబడినవి.

తాత్పర్యము :- తన మందనుండి దూరమైపోయి, సింహముచే అడ్డగింపబడి, బంధములో చిక్కుకొన్న ఆడుఏనుగు వలెను, వర్షాకాలము తొలగిపోగా శరత్కాల మేఘములచే కప్పబడుచున్న, సన్నని చంద్రరేఖ వలెను కాన్పించు చున్నట్టి ఆ సీతాదేవిని హనుమ గాంచెను.

శ్లో॥ క్లిష్టరూపా మసంస్పర్శా దయుక్తామివ వల్లకీమ్,
సీతాం భర్తృవశే యుక్తా మయుక్తాం రాక్షసీవశే. 22

పదచ్ఛేదము :- క్లిష్టరూపాం - అసంస్పర్శాత్ - అయుక్తాం - ఇవ - వల్లకీమ్ - సీతాం - భర్తృవశే - యుక్తాం - అయుక్తాం - రాక్షసీవశే-

ప్రతిపదార్థము :- అసంస్పర్శాత్ = శరీర సంస్కారము లేకుండుటచే, క్లిష్టరూపాం = నలిగిపోయియున్న రూపముగలదియును అయుక్తాం వల్లకీం ఇవ = తీగలు కూర్చబడని వీణవలెనున్నదియును, భర్తృవశే యుక్తాం = భర్తయధీనమునందుండదగినదియును, రాక్షసీనాం అయుక్తాం = రాక్షసుల అధీనమునందుండుటకు తగనిదియును అగు, సీతాం = జానకీ దేవిని, (హనుమాన్ లక్షయామాస = హనుమంతుడు గాంచెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- అసంస్పర్శాత్ = భర్తయొక్క స్పర్శ లేకుండుటచే, 'అయుక్తాం వల్లకీమివ' — ప్రయోగించుటయను ఉపయోగము లేనిదై యుండుటచే మూలబడియున్నట్టి వీణవలెనున్నది.

బొంబాయి ముద్రణమున భర్తృవశేయుక్తాం-అనుదానికి బదులుగా, భర్తృహితే యుక్తాం - అను పాఠము గలదు. అనగా భర్తృక్షేమమును కోరుచున్నది యని అర్థము.

తాత్పర్యము :- తన సుఖముపై శ్రద్ధలేకుండుటచే సంస్కారహీనమై మలినమై నలిగిపోయియున్న దేహముతో తీగలుకూర్చని వీణవలె నున్నదియును, భర్తృలాలనమునందుండి సుఖించు చుండవలసినట్టిదియును, రాక్షసుల అధీనమున నుండుటకు తగనిదియును, అగు జానకీదేవిని హనుమ గాంచెను.

శ్లో॥ అశోకవనికామధ్యే శోకసాగరమాప్లుతామ్,
తాభిః పరివృతాం తత్ర సగ్రహా మివ రోహిణీమ్. 23

పదచ్ఛేదము :- అశోకవనికామధ్యే - శోకసాగరం - ఆప్లుతామ్, తాభిః - పరివృతాం - తత్ర - సగ్రహాం - ఇవ - రోహిణీమ్.

ప్రతిపదార్థము – అశోకవనికామధ్యే=అశోకవనము నడుమ, శోకసాగరం అప్లుతాం = దుఃఖసముద్రమునందు తేలుచున్నదియును, సగ్రహాం రోహిణీం ఇవ = (క్రూర) గ్రహములతో కూడిన రోహిణీ నక్షత్రమువలె, తత్ర = ఆ శింశుపావృక్షము క్రింది, తాభిః పరివృతామ్= ఆ క్రూరరాక్షస స్త్రీలచే చుట్టబడియున్నట్టి, (సీతాం లక్షయామాస = జానకీ దేవిని చూచెను.

తాత్పర్యము :- ఆ యశోకవన మధ్యమునందు, దుఃఖసము ద్రమునందు మునిగితేలుచున్నదై, క్రూరగ్రహములతో కూడిన సుకుమారమైన రోహిణీనక్షత్రమువలె, భీకరాకారముగల ఆ రాక్షసస్త్రీలచే ఆవరింప బడియున్నట్టి ఆ సీతాదేవిని హనుమ గాంచెను.

శ్లో॥ దదర్శ హనుమాన్ దేవీం లతా మకుసుమా మివ. 24

పదచ్ఛేదము :- దదర్శ - హనుమాన్ - దేవీం - లతాం - అకుసుమాం - ఇవ.

ప్రతిపదార్థము :- అకుసుమాం లతామివ = పువ్వులులేనట్టి తీగవలెనున్న, దేవీం = సీతాదేవిని, హనుమాన్ = హనుమ, దదర్శ= చూచెను.

తాత్పర్యము :- హనుమంతునకు అప్పుడు ఆ సీతాదేవి ఒక్క పుష్పముగూడ లేనట్టి పూలతీగవలె గాన్పించెను.

శ్లో॥ సా మలేన చ దిగ్ధాంగీ వపుషా చా ప్యలంకృతా,
మృణాళీ పంకది గ్ధేవ విభాతి న విభాతి చ. 25

పదచ్ఛేదము :- సా - మలేన - చ - దిగ్ధాంగీ - వపుషా - చ - అపి - అలంకృతా, మృణాళీ - పంకదిగ్ధా - ఇవ - విభాతి - న - విభాతి - చ.

ప్రతిపదార్థము :- మలేన దిగ్ధాంగీ = ధూళిచే నిండిన శరీరము గలది, అపిచ = అయినప్పటికిని, వపుషా అలంకృతా = శరీరముచేత అలంకరింపబడినదై, పంకదిగ్ధా మృణాళీ ఇవ = బురదతోనిండిన తామర తీగవలె, సా = ఆ సీతాదేవి, విభాతి = ప్రకాశించుచున్నది, న విభాతి చ = ప్రకాశించుటలేదుకూడను.

శేషిపార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు:- విభాతి నవిభాతిచ - స్వభావ సౌందర్యమువలన ప్రకాశించు చున్నది, సంస్కారరాహిత్యముచే ప్రకాశించుట లేదుకూడను.

తాత్పర్యము :- ఒడలినిండ ధూళి క్రమ్మి తన సహజ సౌందర్య విశేషము మాత్రము వెల్లడియగుచుండగా సీతాదేవి బురదతో కూడిన తామరతీగవలె ప్రకాశించుచు గూడ ప్రకాశములేక యుండెను.

శ్లో॥ మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్,
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్కపిః.

శ్లో॥ తాం దేవీం దీనవదనా మదీనాం భర్తృతేజసా
రక్షితాం స్వేన శీలేన సీతా మసితలోచనామ్. 27

పదచ్ఛేదము :- మలినేన - తు - వస్త్రేణ - పరిక్లిష్టేన - భామినీమ్, సంవృతాం - మృగశాబాక్షీం - దదర్శ - హనుమాన్ - కపిః, తాం - దేవీం - దీనవదనాం - అదీనాం - భర్తృతేజసా - రక్షితాం - స్వేన - శీలేన - సీతాం - అసితలోచనామ్.

అన్వయక్రమము :- మలినేన, పరిక్లిష్టేన వస్త్రేణ సంవృతాం మృగశాబాక్షీం, భామినీం. దీనవదనాం, భర్తృతేజసా అదీనాం స్వేనశీలేన రక్షితాం, అసితలోచనాం. తాందేవీం సీతాం, కపిః హనుమాన్ దదర్శ.

ప్రతిపదార్థము :- మలినేన = మలినమైయున్నట్టి, పరిక్లిష్టేన = మిక్కిలి నలిగిపోయి యున్నట్టి, వస్త్రేణ = చీరచేత, సంవృతాం = కప్పబడి యున్నదియును, మృగశాబాక్షీం = లేడిపిల్ల కన్నులవంటి కన్నులు గల్గియున్నదియును, భామినీం = సుందరాంగియును, దీన వదనాం = దీనమైయున్న ముఖము గలదియును, భర్తృతేజసా అదీనాం = శ్రీరాముని తేజస్సుచే దైన్యము లేనిదైయున్నదియును, స్వేన శీలేన రక్షితాం = తన పాతివ్రత్యముచేత రక్షణ నొందియున్నదియును, అసితలోచనాం = నల్లని కన్నులు గలదియగు, తాం దేవీం సీతాం = ఆ మహనీయురాలైన సీతాదేవిని, కపిః హనుమాన్ = వానరశ్రేష్ఠుడైన హనుమ, దదర్శ = చూచెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- భర్తృతేజసా అదీనాం — భర్తయొక్క పరాక్రమమును మనస్సునందు స్మరించుచుండుటచే దైన్యములేని హృదయము గలదని భావము.

తాత్పర్యము :- మిక్కిలి నలిగిపోయి మలినమైన వస్త్రమును ధరించి, లేడిపిల్లవలె బెదురుచూపులతో, మిక్కిలి దీనస్థితిలోనున్నను భర్తయొక్క పరాక్రమమును స్మరించుకొనుటచే తన మనస్సునందు దైన్యములేనిదై, తన పాతివ్రత్యముచేతనే తనను కాపాడుకొనుచు, సుందరములైన నల్లని నేత్రములతో ప్రకాశించుచున్న ఆ సీతాదేవిని హనుమంతుడు చూచెను.

శ్లో॥ తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్
మృగకన్యా మివ త్రస్తాం వీక్షమాణాం సమంతతః. 28

శ్లో॥ దహంతీమివ నిశ్శ్వాసై ర్వృక్షాన్ పల్లవధారిణః,
సంఘాతమివ శోకానాం దుఃఖ స్యోర్మి మి వోత్థితాం.

శ్లో॥ తాం క్షమాం సువిభక్తాంగీం వినాభరణశోభితామ్,
ప్రహర్ష మతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీమ్. 30

పదచ్ఛేదము :- తాం - దృష్ట్వా - హనుమాన్ - సీతాం - మృగశాబనిభేక్షణామ్, మృగకన్యాం - ఇవ - త్రస్తాం - వీక్షమాణాం - సమంతతః -; దహంతీం - ఇవ - నిశ్వాసైః - వృక్షాన్ - పల్లవధారిణః - సంఘాతం - ఇవ - శోకానాం - దుఃఖస్య - ఊర్మిం - ఇవ - ఉత్థితాం - తాం - క్షమాం - సువిభక్తాంగీం - వినా - ఆభరణ శోభినీం - ప్రహర్షం - అతులం - లేభే - మారుతిః - ప్రేక్ష్య - మైథిలీమ్-

ప్రతిపదార్థము :- మృగశాబనిభేక్షణాం = లేడిపిల్ల కన్నుల వంటి కన్నులు గలిగినదియును, త్రస్తాం మృగకన్యాం ఇవ = బెదిరి పోయిన ఆడులేడిపిల్లవలె, సమంతతః వీక్షమాణాం = అన్నివైపుల కును చూచుచున్నదియును, నిశ్వాసైః = నిట్టూర్పులచే, పల్లవధారిణః వృక్షాన్ = చిగుళ్లతోడిగియున్న చెట్లను, దహంతీం ఇవ = కాల్చివేయు చున్నదివలె నున్నదియును, శోకానాం సంఘాతం ఇవ = దుఃఖముల రాశి వలె నున్నదియును, దుఃఖస్య ఉత్థితాం ఊర్మిం ఇవ = దుఃఖసముద్రము యొక్క ఉన్నతమైన కెరటమువలె నున్నదియును, క్షమాం = మూర్తీభ వించిన సహనమువలె నున్నదియును, సువిభక్తాంగీం = చక్కని శ్రేణిక గల అవయవములు గల్గినదియును, వినాభరణ శోభినీం = ఆభరణములు లేకయే ప్రకాశించు చున్నదియును అగు, మైథిలీం ... దిలా ధిపుని కుమార్తెయైన ఆ సీతాదేవిని, దృష్ట్వా ...చి, ప్రేక్ష్య= ...

CENTRAL LIBRARY
33082

పరికించి, మారుతిః హనుమాన్ = వాయునందనుడైన హనుమ, అతులం ప్రహర్షం = నిరుపమానమైన ఆనందమును, లేభే = పొందెను.

తాత్పర్యము :— బెదరిన ఆడులేడిపిల్లవలె తనను రక్షించువారి కొఱకై నలువైపుల చూచుచున్నదియును, తన వేడి నిట్టూర్పులచే చిగిర్చియున్న చెట్ల పల్లవములను మాడ్చివేయుచున్నట్లున్నదియును, ప్రోగుబడిన దుఃఖములవలె కాన్పించుచున్నదియును, ఉవ్వెత్తుగలేచియున్న దుఃఖసముద్రపు కెరటమువలె గానవచ్చుచున్నదియును, గొప్ప ఓర్పుగలిగియున్నదియును, సుందరమైన పొందికగల అవయవములతో ప్రకాశించుచున్నదియును, ఆభరణములు లేకయే గొప్ప శోభగల శరీరముగలదియును అగు ఆ సీతాదేవిని దర్శించి, వాయునందనుడు అమితమైన ఆనందము నొందెను.

శ్లో॥ హర్షజానిచ సో ఽ(శ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణా
ముమోచ హనుమాం స్తత్ర నమశ్చ క్రే చ రాఘవమ్.

పదచ్ఛేదము :— హర్షజాని - చ - సః - అశ్రూణి - తాం - దృష్ట్వా - మదిరేక్షణామ్ - ముమోచ - హనుమాన్ - తత్ర - నమః - చక్రే - చ - రాఘవమ్.

అన్వయక్రమము :— తాం మదిరేక్షణాం దృష్ట్వా, సః హనుమాన్ హర్షజాని అశ్రూణి ముమోచ. తత్ర రాఘవం నమః చక్రేచ.

ప్రతిపదార్థము :— మదిరేక్షణాం తాం దృష్ట్వా = సౌందర్యవతియైన ఆ సీతాదేవిని గాంచి, సః హనుమాన్ = ఆ హనుమంతుడు, హర్షజాని అశ్రూణి = ఆనందముచే కలిగిన బాష్పములను, ముమోచ = విడిచెను. తత్ర = అచ్చట, రాఘవం = శ్రీరామునిగూర్చి, నమః చక్రేచ = నమస్కారము చేసెనుకూడ.

తాత్పర్యము :- ఆ సీతాదేవిని కనులారగాంచి హనుమంతుడు తన కన్నులనుండి జలజల ఆనందబాష్పములను రాల్చెను. అప్పటినుండియే ఆ యానందముతో అతడు శ్రీరామునకు భక్తిపూర్వకముగ నమస్కారము చేసెను గూడను.

శ్లో॥ నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్,
సీతాదర్శన సంహృష్టః హనుమాన్ సంవృతో౽భవత్.

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకియే
ఆదికావ్యే సుందరకాండే
" రా క్ష సీ ప రీ వా రః " నామ
స ప్తదశ స్సర్గః.

...★...

పదచ్ఛేదము :- నమః - కృత్వా - చ - రామాయ-లక్ష్మణాయ- చ - వీర్యవాన్ సీతాదర్శన- సంహృష్టః - హనుమాన్ - సంవృతః - అభవత్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- రామాయ =శ్రీరామునకును, లక్ష్మణాయ చ = లక్ష్మణునకును, నమస్కృత్వా చ = నమస్కారముచేసి వెంటనే; సీతాదర్శన సంహృష్టః = సీతయొక్క దర్శనముచే కలిగిన ఆనందముతో నిండినట్టి, వీర్యవాన్ హనుమాన్ = పరాక్రమశాలియైన హనుమంతుడు, సంవృతః అభవత్ = దాగియున్నవాడయ్యెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :– 'సంవృతః అభవత్'— రాక్షసస్త్రీల దృష్టిని తప్పించుకొనుటకు సూక్ష్మరూపమునే ధరించి, ఆ చెట్టుకొమ్మలయందే అణగియుండెనని భావము.

తాత్పర్యము :– సీతమ్మను దర్శింపగలిగినందులకు మహానందమునొంది పరాక్రమశాలియైన ఆ హనుమ, రామునకును, లక్ష్మణునకును నమస్కరించి అచటి రాక్షసస్త్రీల కంట బడకుండుటకై ఆ శింశపావృక్షముయొక్క అకుల వెనుక సూక్ష్మరూపముతో దాగియుండెను.

ఇది శ్రీమత్సుందరకాండమున "సుబోధిని" అను
ఆంధ్ర వివరణమునందు "రాక్షసీపరీవారము" అను
పదునేడవ సర్గము.

శ్రీరామాయ నమః
శ్రీరామ శరణ గురుభ్యో నమః

అష్టాదశ స్సర్గః

శ్లో॥ తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్,
విచిన్వత శ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశా ఽభవత్.

పదచ్ఛేదము :– తథా - విప్రేక్షమాణస్య - వనం - పుష్పితపాదపమ్, విచిన్వతః - చ - వైదేహీం - కించిత్ శేషా - నిశా - అభవత్-

అన్వయక్రమము :- (తస్య) తథా పుష్పితపాదపం వనం విప్రేక్షమాణస్య వైదేహీం విచిన్వతశ్చ నిశా కించిత్ శేషా అభవత్.

ప్రతిపదార్థము :- (తస్య = ఆ హనుమ) తథా = అరీతిగా, పుష్పితపాదపం = చక్కగా పుష్పించియున్న వృక్షములు గల్గినట్టి, వనం = ఆ యశోకవనమును, విప్రేక్ష్యమాణస్య = అసక్తితో పరికించి చూచుచుండగాను, వైదేహీం విచిన్వతశ్చ = సీతాదేవిని వెదకుచుండగను, నిశా = ఆ రాత్రి, కించిత్ శేషా అభవత్ = కొంచెము మాత్రమే మిగిలిన దయ్యెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ' కించిత్ శేషానిశా '— చివరి జాము మాత్రము మిగిలినది. సీతను స్పష్టముగా చూచుటకొఱకై రాక్షసులు నిద్రించు సమయముకొఱకై వేచియుండి సీతను జూచునప్పటికి ఒక్కజాము రాత్రి మాత్రము మిగిలియుండెను.

తాత్పర్యము :- చక్కగా పూచియున్న పుష్పవృక్షములుగల ఆ యశోకవనిక సౌందర్యమును జూచుచు, రాక్షస్త్రీలు నిద్రించు సమయము కొఱకు వేచియుండి సీతను వెదుకుచున్న హనుమంతునకు రాత్రికాలము ఒక్క జాము మాత్రము మిగిలి యుండెను.

శ్లో॥ షడంగవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్,
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసామ్.

పదచ్ఛేదము :- షడంగవేదవిదుషాం - క్రతుప్రవరయాజినామ్, శుశ్రావ - బ్రహ్మఘోషాన్ - చ - విరాత్రే - బ్రహ్మరక్షసామ్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- (సః = ఆ హనుమ) విరాత్రే = రాత్రి యొక్క చివరి భాగమునందు, షడంగవేదవిదుషాం = వేదాంగము లారింటితో గూడినట్టి వేదములను తెలిసినవారును, క్రతుప్రవరయాజినాం = గొప్ప యజ్ఞములు గావించినవారును అగు, బ్రహ్మరక్షసాం = బ్రహ్మ రక్షస్సులయొక్క, బ్రహ్మఘోషాన్ = వేదఘోషలను, శుశ్రావ = ఆకర్ణించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- బ్రహ్మరక్షసామ్ — బ్రహ్మశబ్దమునకు వేదము అని కూడ అర్థము గలదు. గావున బ్రహ్మరక్షస్సులనగా వేదవేత్తలైన రాక్షసులు.

రామాయణ శిరోమణి :- బ్రహ్మరక్షసామ్ — బ్రాహ్మణ రాక్షసులయొక్క.

వాసుదాసస్వామి :- షడంగవేదవిదుల్, శిక్షావ్యాకరణాదు లగు నాఱంగములతోఁగూడిన వేదము నెఱిగినవారు. బ్రహ్మరాక్షసులు=రాక్ష సులందు బ్రాహ్మణులు. రావణాదులు క్షత్రియులు కావున వర్ణాశ్రమ విభా గము రాక్షసులందును గలదని యేర్పడుచున్నది. బ్రాహ్మణబీజోద్భవులగు పౌలస్త్యులు (కొందరు తలచునట్లు) అనార్యులుగారు. క్రూరకర్ములగుటచే రాక్షసులైరి. బ్రహ్మఘోషముల్ = వేదధ్వనులు, 'పరమాత్మా తపోవేదో బ్రహ్మ; బ్రహ్మఒజ్ఞజే ద్విజే' నానార్థ రత్నమాల.

తాత్పర్యము :- హనుమ ఆ బ్రాహ్మీముహూర్తమునందు వేద వేదాంగవేత్తలును, పెక్కు యాగములుచేసిన ఆహితాగ్నులును అగు బ్రాహ్మణరాక్షసులు గావించు వేదాధ్యయన ఘోషలను ఆలకించెను.

శ్లో॥ అథ మంగళవాదిత్రశబ్దై శ్శ్రోత్రమనోహరైః
ప్రాబోధ్యత మహాబాహు ర్దశగ్రీవో మహాబలః. 3

పదచ్ఛేదము :- అథ - మంగళవాదిత్రశబ్దైః - శ్రోత్రమనోహరైః - ప్రాబోధ్యత - మహాబాహుః - దశగ్రీవః - మహాబలః.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- అథ = పిమ్మట, మహాబాహుఃమహాబలః = మహాబలపరాక్రమములు కలిగినట్టి, దశగ్రీవః = దశకంఠుడు, శ్రోత్రమనోహరైః = చెవుల కింపుగనున్నట్టి, మంగళవాదిత్రః శబ్దైః = మంగళ వాద్య ధ్వనులచే ప్రాబోధ్యత = మేల్కొల్పబడెను.
ప్రాబుధ్యతయని పాఠాంతరము.

తాత్పర్యము :- అంతట మహావీరుడైన రావణుడు చెవుల కింపుగ వినబడుచున్న మంగళవాద్య ధ్వనులు వినుచు నిద్రనుండి మేల్కొనెను.

శ్లో॥ విబుధ్యతు యథాకాలం రాక్షసేంద్రః ప్రతాపవాన్,
స్రస్తమాల్యాంబరధరో వైదేహీ మన్వచింతయత్.

పదచ్ఛేదము :- విబుధ్య - తు - యథాకాలం-రాక్షసేంద్రః - ప్రతాపవాన్ - స్రస్తమాలాంబరధరః - వైదేహీం - అన్వచింతయత్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- ప్రతాపవాన్ రాక్షసేంద్రః = మహాప్రతాప శాలియైన రాక్షసరాజు, యథాకాలం విబుధ్య = యుక్తమైన కాలము న మేల్కొని, ప్రస్తమాల్యాంబరధరః = జారిపోయిన అభరణము లను, వస్త్రములను (సరిచేసికొని) ధరించినవాడై, వైదేహీం = సీతాదేవిని గూర్చి, అన్వచింతయత్ = ఆలోచించెను.

తాత్పర్యము :- ఆ రాక్షసాధిపతి సకాలమున మేల్కాంచి నిద్రావశముచే చెదరియున్న అభరణములను, వస్త్రములను సరిచేసికొని సీతాదేవినిగురించి చింతింపసాగెను.

శ్లో॥ భృశం నియుక్త స్తస్యాం చ మదనేన మదోత్కటః,
న స తం రాక్షసః కామం శశా కాత్మని గూహితుమ్.

పదచ్ఛేదము :- భృశం - నియుక్తః - తస్యాం - చ - సః - తం - రాక్షసః - కామం - శశాక - ఆత్మని - గూహితుమ్.

అన్వయక్రమము :- తస్యాం భృశంనియుక్తః, మదనేన మదోత్కటః రాక్షసః ఆత్మని తం కామం నిగూహితుం న శశాక.

ప్రతిపదార్థము :- తస్యాం = ఆ సీతాదేవియందు, భృశం = మిక్కిలిగ, నియుక్తః = వ్యామోహితుడై, మదనేన = కామముచే, మదోత్కటః = మిక్కిలి మదించియున్నవాడై, సః రాక్షసః = ఆ రాక్షసుడు, ఆత్మని = తనమనస్సునందు, తం కామం = ఆ సీతావిషయకమైన కామమును, నిగూహితుం = అణచిపెట్టుకొనుటకు, న శశాక = శక్తుడు గాకపోయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు :- 'మదనేన మదోత్కటః' అనుచోట,

మదనే = మన్మధ వికారము కలిగినప్పటికిని నమదోత్కటః = మదము నకు పరతంత్రుడు గానివాడుగా నుండెను. అందుచేతనే, తస్యాంభృశం నియుక్తః = ఆ సీతాదేవియందు మిక్కిలిగా తీవ్రమైన యుక్తమైన భావమే గలవాడయ్యెను, అనగా పూజ్యభావము గలవాడయ్యెను, 'కామం అత్మనిగూహితుం న శశాక ' = అను వాక్యమునకు, కాకుస్వరముతో పఠించి తన కామము నణచుకొనలేకపోయెనా? అనగా తప్పక రావణుడు కామమును తనలోనే అణచుకొనగల్గెను అని భావము.

తిలకము :- ఈ శ్లోకమునకు మహేశ్వరతీర్థుడు ఇచ్చిన వ్యాఖ్యా నము భ్రాంతిమూలకము. తమోగుణ విశిష్టుడై భగవన్మాయామోహితుడై యున్నట్టి ఆ రాక్షసునకు అకృత్యాచరణమునందే ఆసక్తి గానబడును. అట్లుగాక ఈతడు ఈ అకృత్యము చేయుచున్నను సీతారాముల పరమ పవిత్రనామములను స్మరించుచున్నాడు గదా! అందువలన ఉత్తమఫలము కలుగునుగదా! అనినచో తప్పక కలిగినది. ఎట్లనగా ఈతడు జన్మాంతర మునందు చేదివంశపు రాజకుటుంబమున శిశుపాలుడుగా జన్మించుటయను ఉత్తమ ఫలము నొందెను కదా!

ఇచ్చట వేదప్రామాణ్య మిట్లున్నది,

ఋశ్వమేదుడను పేరుగల రాజుయొక్క దానమును స్తుతించు నట్టి ఋగ్వేదమంత్రము - " న యుష్మే వాజబంధవో నినుత్సుశ్చ న మర్త్యం। అవద్య మధి దీధరత "॥

ఓ వాజబంధువులారా! (అనగా) " అన్నదానముచే ఎల్లరకును బంధువులైనవారా! మీపై నిందవేయు మనుష్యుడుగూడ చెడుగును బొందడు. ఎందుచేతననగా, మీరు మిమ్ము స్మరించుచు నిందించు వారికి గూడ ఉత్తమఫలము నొసంగుదురు. "

అదేవిధముగ సాక్షాత్ లక్ష్మీస్వరూపురాలైన సీతమ్మను దుష్టభావముతో నైనను పలుమారులు స్మరించినవాడు గావున రావణునకు అట్టి ఉత్తమ జన్మ లభించినది.

తాత్పర్యము :- రావణాసురుడు మదనతాపముచే పీడింపబడుచు సీతయందు లగ్నమైన భావము గలవాడై, తన మనస్సునందలి ఆ కామమును అణచుకొనజాలక పోయెను.

శ్లో॥ స సర్వాభరణై ర్యుక్తో బిభ్రచ్ఛ్రియ మనుత్తమామ్,
తాం నగై ర్బహుభి ర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః.

శ్లో॥ వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్,
సదామదైశ్చ విహగై ర్విచిత్రాం పరమాద్భుతామ్.

శ్లో॥ ఈహామృగైశ్చ వివిధై ర్జుష్టాం దృష్టిమనోహరైః,
వీథీః సంప్రేక్షమాణశ్చ మణికాంచనతోరణామ్.

శ్లో॥ నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితై ర్వృతాం,
అశోకవనికా మేవ ప్రావిశ త్సంతతద్రుమామ్.

పదచ్ఛేదము :- సః - సర్వాభరణైః - యుక్తః - బిభ్రత్ శ్రియం - అనుత్తమామ్, తాం - నగైః - బహుభిః - జుష్టాం - సర్వ పుష్పఫలోపగైః ॥ వృతాం - పుష్కరిణీభిః - చ - నానాపుష్పోపశోభితామ్ - సదామదైః - చ - విహగైః - విచిత్రాం - పరమాద్భుతామ్ ॥ ఈహామృగైః - చ - వివిధైః - జుష్టాం - దృష్టిమనోహరైః - వీథీః - సంప్రేక్షమాణః - చ - మణికాంచనతోరణామ్ ॥ నానామృగగణాకీర్ణాం - ఫలైః - ప్రపతితైః - వృతామ్, అశోకవనికాం - ఏవ - ప్రావిశత్ - సంతతద్రుమామ్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- సర్వాభరణైః యుక్తః = సమస్తమైన భూషణములతోకూడినవాడై, అనుత్తమాం శ్రియం బిభ్రత్ = మిక్కిలి శ్రేష్ఠమైన శోభను వహించుచున్నవాడై, సః = ఆ రావణుడు, సర్వపుష్పఫలోపగైః = సమస్తవిధములైన పుష్పములతోడను, ఫలములతోడను కూడినట్టి, బహుభిః = బహువిధములైన, నగైః = వృక్షములచే, జుష్టాం = సేవింపబడినదియును, పుష్కరిణీభిః = తామరకొలకులచే, వృతాం = చుట్టుకొనబడినదియును, నానాపుష్పోపశోభితాం = పలువిధములగు పుష్పములతో ప్రకాశించుచున్నదియును, సదామదైః = నిత్యమును మదించియుండు, విహగైః = పక్షులతో, విచిత్రాం = పలురంగులు గలిగియున్నదియును, పరమాద్భుతాం = మిక్కిలి ఆశ్చర్యకరముగ నున్నదియును, వివిధైః దృష్టిమనోహరైః ఈహామృగైః జుష్టాం = పలువిధములైన చూడముచ్చటగొలుపు తోడేళ్ళగుంపులచే సేవింపబడినదియును, నానామృగగణాకీర్ణాం = పలువిధములగు లేళ్ళగుంపులతో నిండినదియును, ప్రపతితైః ఫలైః వృతాం = నేలపైబడిన పండ్లతో కూడినదియును, సంతతద్రుమాం = దట్టమైన చెట్లుగలిగియున్నట్టిదియు నగు, అశోకవనికాంఏవ = అశోకవనమునే, మణికాంచనతోరణాః = రత్నసువర్ణనిర్మితములైన తోరణములుగల, వీథీః = శ్రేణులను (ఉద్యానవీధులను) సంప్రేక్షమాణః = పరికించి చూచుచున్నవాడై, ప్రావిశత్ = ప్రవేశించెను.

తాత్పర్యము - రావణాసురుడు సమస్తాభరణములను ధరించి, మిక్కిలి శోభతో వెలుగొందుచున్నవాడై సర్వఋతుపుష్ప ఫలములతో నిండిన చెట్లతోడను, తామరకొలనులతోడను, బహువిధ పుష్పములతోడను, మదించియున్న పక్షులతోడను, చూడముచ్చటగొలుపు తోడేళ్లతోడను, బహువిధమృగములతోడను, రాలిపడియున్న మధురఫలములతోడను సుంద

రముగా అద్భుతముగా గానవచ్చుచున్న ఆ వృక్షశ్రేణులను తిలకించుచు అశోకవనమునందు ప్రవేశించెను.

శ్లో॥ అంగనా శతమాత్రం తు తం వ్రజంత మనువ్రజత్,
మహేంద్రమివ పౌలస్త్యం దేవగంధర్వయోషితః. 10

పదచ్ఛేదము :- అంగనాశతమాత్రం - తు - తం - వ్రజంతం - అనువ్రజత్ - మహేంద్రం - ఇవ - పౌలస్త్యం - దేవగంధర్వయోషితః.

అన్వయక్రమము :- వ్రజంతం తం పౌలస్త్యం, మహేంద్రం దేవగంధర్వయోషితః ఇవ అంగనా శతమాత్రంతు అనువ్రజత్.

ప్రతిపదార్థము :- వ్రజంతం =వెడలుచున్నట్టి, తం పౌలస్త్యం = ఆ రావణాసురుని, మహేంద్రం = దేవేంద్రుని, దేవగంధర్వయోషితః ఇవ = అప్సరస్త్రీలును గంధర్వవనితలునువలె, అంగనాశతమాత్రంతు = వందమంది అంగనలుమాత్రము,అనువ్రజత్ = వెంబడించి వెళ్లుచుండిరి.

తాత్పర్యము :- దేవేంద్రుని అప్సరస్త్రీలును, గంధర్వాంగనలును, అనుసరించి నడచునట్లు, అశోకవనికకు పయనమై నడచుచున్న ఆ రావణాసురుని వందమంది సుందరీమణులు మాత్రము వెంట నడచుచుండిరి.

శ్లో॥ దీపికాః కాంచనీః కాశ్చి జ్జగృహు స్తత్ర యోషితః,
వాలవ్యజనహస్తాశ్చ తాలవృంతాని చాపరాః. 11

పదచ్ఛేదము :- దీపికాః - కాంచనీః - కాః - చిత్ - జగృహుః - తత్ర - యోషితః ॥ వాలవ్యజనహస్తాః - చ - తాలవృంతాని - చ - అపరాః.

అన్వయక్రమము :-తత్రకాశ్చిత్ యోషితః కాంచనీః దీపికాః జగృహుః, కాశ్చిత్ వాలవ్యజనహస్తాః చ అసన్; అపరాః తాలవృంతాని జగృహుః ॥

ప్రతిపదార్థము :- తత్ర = అందు, కాశ్చిత్‌యోషితః = కొంత మందిస్త్రీలు, కాంచనీః దీపికాః = బంగారు దీపికలను, జగృహుః = పట్టుకొనిరి. (కాశ్చిత్ = కొంతమంది) వాలవ్యజనహస్తాఃచ = వింజామరములు చేతియందు కలిగిన వారుగాను, అసన్ = ఉండిరి. అపరాః = మరికొంతమందిస్త్రీలు, తాలవృంతాని = విసనకర్రలను, జగృహుః = ధరించిరి.

తాత్పర్యము :- ఆ రావణునివెంట వచ్చుచున్న స్త్రీలలో కొందరు సువర్ణదీపికలను, కొందరు వింజామరలను, మరికొందరు విసనకర్రలను పట్టుకొని వచ్చుచుండిరి.

శ్లో॥ కాంచనై రపి భృంగారై ర్జహ్రు స్సలిల మగ్రతః,
మండలాగ్రాన్ బృసీం చైవ గృ హ్యాన్యాః పృష్ఠతో యయుః.

పదచ్ఛేదము :- కాంచనైః - అపి - భృంగారైః -జహ్రుః- సలిలం - అగ్రతః - మండలాగ్రాన్ - బృసీం - చ - ఏవ - గృహ్య - అన్యాః - పృష్ఠతః - యయుః.

అన్వయక్రమము :- కాశ్చిత్ అగ్రతః కాంచనైః భృంగారైః సలిలం జహ్రుః; అన్యాః మండలాగ్రాన్, బృసీంచైవ గృహ్య పృష్ఠతః యయుః ॥

ప్రతిపదార్థము :- కాశ్చిత్ = కొంతమంది, అగ్రతః = ముందు భాగమున, కాంచనైః భృంగారైః = బంగారు కలశములతో, సలిలం =

నీటిని, జహ్రుః = తెచ్చుచుండిరి. అన్యాః = మరికొంతమంది మండలాగ్రాన్ = ఖడ్గములను, బృసీం చైవ = కూర్చుండు ఆసనమును, గృహ్య = గ్రహించి, పృష్ఠతః = వెనుకభాగమున, యయుః = పోవుచుండిరి.

తాత్పర్యము :- కొందరు సుందరులు అతనికి ముందుభాగము నందు నడచుచు, బంగారు కలశములతో జలమును గొనివచ్చుచుండిరి. మరికొందరు ఖడ్గములను, కూర్చుండు ఆశనములను తమచేత ధరించి అతనివెంట నడచుచుండిరి.

శ్లో॥ కాచి ద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ,
దక్షిణా దక్షిణే నైవ తదా జగ్రాహ పాణినా. 13

పదచ్ఛేదము :- కా - చిత్ - రత్నమయీం - స్థాలీం - పూర్ణాం - పానస్య - భామినీ, ॥ దక్షిణా - దక్షిణేన - ఏవ - తదా - జగ్రాహ - పాణినా.

అన్వయక్రమము :- తదా దక్షిణా కాచిత్ భామినీ రత్నమయీం పూర్ణాం పానస్యస్థాలీం దక్షిణేన పాణినాఏవ జగ్రాహ.

ప్రతిపదార్థము :- తదా = ఆ సమయమునందు, దక్షిణా = సమర్థతకలిగిన, కాచిత్ భామినీ = ఒకానొక తరుణి, రత్నమయీం = రత్ననిర్మితమైనట్టి, పూర్ణాం = నిండియున్నట్టి, పానస్య స్థాలీం = మద్యపు పాత్రను, దక్షిణేన పాణినా ఏవ = కుడిచేతితోడనే, జగ్రాహ = పట్టుకొనెను.

తాత్పర్యము :- మంచి సామర్థ్యము కలిగినట్టి ఒకానొక సుందరి రత్ననిర్మితమైన పూర్ణమైన మద్యపాత్రను తన కుడి చేతితో జాగ్రత్తగ పట్టుకొని అతని ప్రక్కగా నడచి వచ్చుచుండెను.

శ్లో॥ రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభమ్,
సౌవర్ణదండ మపరా గృహీత్వా పృష్ఠతో యయౌ.

పదచ్ఛేదము .- రాజహంస ప్రతీకాశం - ఛత్రం - పూర్ణశశి ప్రభమ్, సౌవర్ణదండం - అపరా - గృహీత్వా - పృష్ఠతః - యయౌ

అన్వయక్రమము .- సుగమము.

ప్రతిపదార్థము .- అపరా = వేరొకస్త్రీ, రాజహంస ప్రతీకాశం = రాజహంసవలె నున్నదియును, పూర్ణశశిప్రభం = నిండు చంద్రుని కాంతివంటి కాంతి గలిగినదియును, సౌవర్ణదండం = బంగారు దండము గలదియును అగు, ఛత్రం = గొడుగును, గృహీత్వా = గ్రహించి, పృష్ఠతః యయౌ = వెనుకభాగమున నడచు చుండెను.

తాత్పర్యము .- ఇంకొక యువతి రాయంచవలె తెల్లగను, నిండు చంద్రునివలె సుందరముగను నున్నట్టి సువర్ణదండము గలశ్వేత, ఛత్రమును తన చేత పట్టుకొని అతని వెనుక భాగమున నడచుచుండెను.

శ్లో॥ నిద్రామదపరీతాక్ష్యో రావణస్యోత్తమాః స్త్రియః,
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ. 15

పదచ్ఛేదము .- నిద్రామదపరీతాక్ష్యః - రావణస్య-ఉత్తమాః- స్త్రియః - అనుజగ్ముః - పతిం - వీరం - ఘనం - విద్యుల్లతాః -ఇవ.

అన్వయక్రమము .- రావణస్య ఉత్తమాః స్త్రియః నిద్రామద పరీతాక్ష్యః (సత్యః) విద్యుల్లతాః ఘనం ఇవ, వీరం పతిం అనుజగ్ముః.

ప్రతిపదార్థము :- రావణస్య = రావణాసురునియొక్క, ఉత్తమాః స్త్రియః = ఉత్తమస్త్రీలు, నిద్రామద పరీతాక్ష్యః (సత్యః) = నిద్రయందలి మత్తుతో నిండిన కన్నులు గలవారై, విద్యుల్లతాః ఘనంఇవ =

మెరపుతీగలు మేఘములవలె, వీరం పతిం = వీరుడైన (తమ) భర్తను అనుజగ్ముః = వెంబడించిరి.

తాత్పర్యము :- మరికొందరు ఉత్తమస్త్రీలు నిద్రతోడను మత్తుతోడను వివశమైన కన్నులు గలవారై, మెరపుతీగలు మేఘము ననుసరించుచున్నట్లుగా, వీరుడైన తమ భర్తయగు రావణాసురుని వెంట నంటి నడచి వచ్చుచుండిరి.

శ్లో॥ వ్యావిద్ధహారకేయూరా స్సమామృదితవర్ణకాః,
సమాగళితకేశాంతా స్సస్వేదవదనా స్తథా.

శ్లో॥ ఘూర్ణంత్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః,
స్వేదక్లిష్టాంగకుసుమా స్సుమాల్యాకులమూర్ధజాః.

శ్లో॥ ప్రయాంతం నైరృతపతిం నార్యో మదిరలోచనాః
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యా స్త
మన్వయుః. 18

పదచ్ఛేదము :- వ్యావిద్ధహారకేయూరాః-సమామృదితవర్ణకాః - సమాగళితకేశాంతాః - సస్వేదవదనాః- తథా॥ ఘూర్ణంత్యః - మదశేషేణ - నిద్రయా - చ - శుభాననాః - స్వేదక్లిష్టాంగకుసుమాః - సుమాల్యాకుల మూర్ధజాః॥ ప్రయాంతం - తం - నైరృతపతిం - నార్యః- మదిరలోచనాః - బహుమానాత్ - చ - కామాత్ - చ - ప్రియాః - భార్యాః - తం - అన్వయుః.

అన్వయక్రమము .- సుగమము.

ప్రతిపదార్థము :- వ్యావిద్ధహారకేయూరాః- చెదిరిపోయియున్న ముత్యాలహారములును భుజకీర్తులును గలవారును, సమామృదితవర్ణకాః -

నలిగి రాలిపోయిన మైపూఁతగల వారును, సమాగళితకేశాంతాః - జారిన కేశాంతములు గలవారును, తథా = అట్లే, సస్వేదవదనాః = చెమటలరోఁ గాడిన ముఖము గలవారును, మదశేషణ = శేషించియున్న మత్తుచేతను, ఘూర్ణంత్యః = ఊఁగిపోవుచున్నవారును, శుభాననాః = మంగళకరమైన ముఖముగలవారును, స్వేదక్లిష్టాంగ కుసుమాః = చెమటతో తడిసిపోయిన శరీరమును, పుష్పములును గలవారును, సుమాల్యాకులమూర్ధజాః = పూల మాలలతో చిక్కుపడియున్నతలవెండ్రుకలు గలవారును, మదిరలోచనాః = ఎఱ్ఱనికన్నులుగలవారునగు, ప్రియాః భార్యాః నార్యః = ప్రియభార్యలైన నారీమణులు, బహుమానాత్ చ = గొప్పదైన గౌరవముచేతను, కామాత్ చ = ప్రేమచేతను, ప్రయాంతం = పోవుచున్నట్టి, తం నైరృతపతిం = ఆ రాక్షసరాజును, అన్వయుః = వెంట వెడలిరి.

తాత్పర్యము :- అట్లు నడచి వచ్చుచున్న ఆ రాక్షసరాజును చెదరిపోయిన ముత్యాలహారములు భుజకీర్తులు మున్నగు ఆభరణములతోడను, రాలిపోయిన మైపూఁతగల శరీరముతోడను, విడిపోయి జారిపోవుచున్న జుట్టుముడులతోడను, చెమటతోనిండిన ముఖములతోడను, శేషించిన మద్యపుమత్తుతోడను, నిద్రతోడను తడబడుచున్న నడకలతోడను, వాడియున్నను సుందరమైన ముఖములతోడను చెమటతోనిండిన సుకుమారమైన శరీరములోడను, పూలదండలతో చిక్కుపడియున్న తలవెండ్రుకలతోడను, రావణునకు ప్రియురాండ్రైన భార్యలు ఆతనిపైగల గౌరవాతిశయముచేతను, ప్రేమాతిశయముచేతను అతనిని వెంటనంటి వచ్చుచుండిరి.

శ్లో॥ సచ కామపరాధీనః పతి స్తాసాం మహాబలః,
సీతాసక్తమనా మందో మదాంచితగతి ర్బభౌ. 19

పదచ్ఛేదము :- సః - చ - కామపరాధీనః - పతిః - తాసాం - మహాబలః - సీతాసక్తమనాః - మందః - మదాంచితగతిః - బభౌ,

అన్వయక్రమము :- మహాబలః తాసాం పతిః సః సీతాసక్తమనాః కామపరాధీనః మందః మదాంచితగతిః (సన్) బభౌ.

ప్రతిపదార్థము :- మహాబలః = అమితబలాఢ్యుడైన, తాసాం పతిః = ఆ స్త్రీల భర్తయగు, సః = ఆ రావణుడు, సీతాసక్తమనాః = సీతాదేవియందు లగ్నమైన మనస్సుగలవాడై, కామపరాధీనః = మన్మథునకు వశమైనవాడై, మందః = మూర్ఖుడై, మదాంచితగతిః (సన్) మదముచే రీవిగానున్న గమనముగలవాడై, బభౌ = ప్రకాశించెను.

తాత్పర్యము :- మహాబలశాలియగు, ఆ స్త్రీల భర్తయైన ఆ రావణుడు సీతయందే లగ్నమైయున్న మనస్సుచే కామపరవశుడై, మూర్ఖుడై యుండి తన మదోద్రేకముచే హెచ్చియున్న రీవితో వెలయుచున్న గమనముతో అప్పుడు మిక్కిలి ప్రకాశించుచుండెను.

శ్లో॥ తతః కాంచీనినాదంచ నూపురాణాంచ నిస్స్వనమ్,
శుశ్రావ పరమస్త్రీణాం స కపి ర్మారుతాత్మజః. 20

పదచ్ఛేదము - తతః - కాంచీనినాదం - చ - నూపురాణాం - చ - నిస్స్వనమ్॥ శుశ్రావ - పరమస్త్రీణాం - సః - కపిః - మారుతాత్మజః।

అన్వయక్రమము :- తతః మారుతాత్మజః సః కపిః పరమస్త్రీణాం కాంచీనినాదంచ నూపురాణాం నిస్స్వనంచ శుశ్రావ.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, మారుతాత్మజః సః కపిః = వాయునందనుడైన యా హనుమ, పరమస్త్రీణాం = ఉత్తమ వనితలయొక్క, కాంచీనినాదంచ = మొల నూలిగంటల ధ్వనులను, నూపురాణాం నిస్స్వనంచ = కాలి యందెల మ్రోతలను, శుశ్రావ = ఆలకించెను.

తాత్పర్యము :- అప్పుడు చెట్టుపైనున్న హనుమకు కొలది దూరమునుండి వచ్చుచున్నట్టి ఆ రావణాంగనలయొక్క మొల నూలి చిఱు గంటల సవ్వడియు కాలియందెల మ్రోతలును వినబడెను.

శ్లో॥ తం చాప్రతిమకర్మాణ మచింత్యబలపౌరుషం,
ద్వారదేశ మనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః. 21

పదచ్ఛేదము :- తం - చ - అప్రతిమకర్మాణం - అచింత్య బలపౌరుషమ్, ద్వారదేశం - అనుప్రాప్తం - దదర్శ - హనుమాన్ - కపిః.

అన్వయక్రమము :- కపిః హనుమాన్ అప్రతిమకర్మాణం అచింత్యబలపౌరుషం ద్వారదేశం అనుప్రాప్తం తం చ దదర్శ.

ప్రతిపదార్థము :- కపిః హనుమాన్ = వానరశ్రేష్ఠుడైన హనుమ, ద్వారదేశం అనుప్రాప్తం = ద్వారదేశమును చేరవచ్చియున్నట్టి, అప్రతిమ కర్మాణం = సాటిలేని కర్మల నాచరించిన వానిని, అచింత్య బలపౌరుషం = ఊహింపజాలని బలపరాక్రమములు గలవానిని అగు తం చ = ఆ రావణునికూడ, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- పిమ్మట హనుమ సాటిలేని కృత్యములచే ప్రసిద్ధుడైనవాడును, ఊహింపనలవిగాని బలపరాక్రమములు గలవాడు నగు రావణుడు ఆ యశోకవన ద్వారమునకు వచ్చుచుండుట గాంచెను.

శ్లో॥ దీపికాభి రనేకాభి స్సమంతా దవభాసితమ్,
గంధతైలావసిక్తాభి ర్ధ్రియమాణాభి రగ్రతః. 22

పదచ్ఛేదము :- దీపికాభిః - అనేకాభిః - సమంతాత్ - అవ భాసితమ్, - గంధతైలావసిక్తాభిః - ధ్రియమాణాభిః - అగ్రతః.

అన్వయక్రమము .- సుగమము.

ప్రతిపదార్థము .- అగ్రతః ప్రియమాణాభిః = ఎదురుగ పట్టు కొనబడియున్నట్టి, గంధతైలావసిక్తాభిః = సుగంధతైలములతో తడుప బడుచున్నవగు, అనేకాభిః దీపికాభిః = పెక్కు కాగడాలతో, సమంతాత్ అవభాసితం = చుట్టుప్రక్కల ప్రకాశింపజేయుచున్నట్టి, (తం దదర్శ = ఆ రావణుని జూచెను.)

తాత్పర్యము :- తనకు ఎదుట నడచుచు స్త్రీలు సుగంధతైల ములతో తడుపుచు పట్టుకొని వచ్చుచున్న పెక్కు కాగడాల కాంతులు చుట్టుప్రక్కల ప్రదేశములనేన్నింటిని ప్రకాశింపజేయుచుండగా సమీపించుచున్న ఆ రావణుని హనుమ చూచెను.

శ్లో॥ కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్,
సమక్షమివ కందర్ప మపవిద్ధశరాసనమ్. 23

పదచ్ఛేదము :- కామదర్పమదైః-యుక్తం - జిహ్మతామ్రాయతేక్షణమ్, సమక్షం - ఇవ - కందర్పం - అపవిద్ధశరాసనమ్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము .- కామదర్పమదైః యుక్తం = కామము తోడను గర్వముతోడను మదముతోడను కూడినట్టి వాడును, జిహ్మతామ్రా యతేక్షణం = వంకరలై ఎఱ్ఱనివై విశాలములైయున్న కన్నులుగల వాడును, అపవిద్ధశరాసనం = విడచిన ధనుస్సు గలిగినట్టి, సమక్షం కందర్పం ఇవ (స్థితం)=కనులఎదుట నిలచిన మన్మథునివలెనున్న, (తం దదర్శ = ఆ రావణుని జూచెను.)

తాత్పర్యము :- గొప్పదైన కామము గర్వము మదముగలిగి ఎఱ్ఱనై వక్రమై విశాలములైయున్న కన్నులతో, ధనుస్సును విడిచిపెట్టిన

మన్మథునివలె మనోహరముగా గాన్పించుచున్న, ఆ రావణాసురుని హాసము చూచెను.

శ్లో॥ మథితామృతఫేనాభ మరజోవస్త్ర ముత్తమమ్,
సలీల మనుకర్షంతం విముక్తం సక్త మంగదే. 24

పదచ్ఛేదము :- మథితామృతఫేనాభం - అరజోవస్త్రం - ఉత్తమమ్, సలీలం - అనుకర్షంతం - విముక్తం - సక్తం - అంగదే.

అన్వయక్రమము :- మథితామృతఫేనాభం ఉత్తమం విముక్తం అంగదే సక్తం అరజోవస్త్రం సలీలం అనుకర్షంతం (తం దదర్శ)

ప్రతిపదార్థము :- మథితామృతఫేనాభం = చిక్కని మజ్జిగ వలెను, అప్పుడు పిదికిన పాల నురుగువలెను ప్రకాశించుచున్నట్టిదియును, ఉత్తమం = శ్రేష్ఠమైనదియును, విముక్త = జారినదై, అంగదే సక్తం = తన భుజకీర్తిని చిక్కుకొని యున్నదియునగు, అరజోవస్త్రమును, సలీలం అనుకర్షంతం = ఒయ్యారముగా లాగి సర్దుకొనుచున్నట్టి (తం దదర్శ = రావణుని జూచెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'మథిత అమృతఫేనాభం' = చిలికిన పాలనురుగు వంటి తెల్లని కాంతిగలది.

బొంబాయి ముద్రణము :- 'సలీల మను కర్షంతం'-అను దానికి బదులుగా 'సపుష్ప మవకర్షంతం' అని గలదు. అనగాపూలమాలలతో గూడిన వస్త్రమును విడిపించుకొనుచున్నాడని భావము. విముక్తం = విశేషమైన ముత్యములతో గూడినది.

మహేశ్వరతీర్థులు : విముక్తం — స్వస్థానమునుండి చలించి నట్టి,

గోవిందరాజీయము :— ' ధారోష్ణంతి. అమృతం పయః ' అప్పుడు పిదికి వేడి చల్లారనిపాలు అమృతమని ' వైజయంతి '. పఠితం తక్రము (చిలికిన మజ్జిగ).

తాత్పర్యము :— చిలికిన చిక్కని మజ్జిగవలెను, అప్పుడే పిదికిన పాలనురుగువలెను ప్రకాశించుచు మిక్కిలి ధవళమై సుందరమైనట్టి తన ఉత్తరీయము జారి భుజకీర్తులయందు చిక్కుపడియుండగా దానిని ఒయ్యారముగా విడిపించుకొనుచు వచ్చుచున్న రావణుని హనుమ గాంచెను.

శ్లో॥ తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః,
సమీపమివ సంక్రాంతం నిధ్యాతుముపచక్రమే. 25

పదచ్ఛేదము :— తం - పత్రవిటపే - లీనః - పత్రపుష్పఘనావృతః - సమీపం - ఇవ - సంక్రాంతం - నిధ్యాతుం-ఉపచక్రమే.

అన్వయక్రమము :— సుగమము.

ప్రతిపదార్థము :— పత్రవిటపే లీనః = ఆకులతోగూడిన కొమ్మపై దాగియున్నవాడై, పత్రపుష్పఘనావృతః = దట్టముగనున్న ఆకులతోడను పుష్పములతోడను ఆవరింపబడినవాడై, సమీపం సంక్రాంతం ఇవ (స్థితం) = మిక్కిలి దగ్గరకు వచ్చినట్లుగనున్న, తం = ఆరావణాసురుని, నిధ్యాతుం ఉపచక్రమే = పరికించి చూడదొడగెను.

తాత్పర్యము :— హనుమంతుడు దట్టమైన ఆకులుగల కొమ్మపై దాక్కొని ఆకొమ్మయొక్క ఆకులతోడను, పూవులతోడను కప్పబడి

యున్నవాడై, తనకు మిక్కిలి సమీపముగా వచ్చియున్నట్టి ఆ రావణాసురుని పరిశీలించి చూడసాగెను.

శ్లో॥ అవేక్షమాణ స్తు తతో దదర్శ కపికుంజరః,
రూపయౌవనసంపన్నా రావణస్య వర స్త్రియః. 26

పదచ్ఛేదము – అవేక్షమాణః – తు – తతః – దదర్శ – కపికుంజరః – రూపయౌవనసంపన్నాః – రావణస్య – వర స్త్రియః.

అన్వయక్రమము.— తతః కపికుంజరః అవేక్షమాణః రూపయౌవనసంపన్నాః రావణస్య వర స్త్రియః దదర్శ॥

ప్రతిపదార్థము :— తతః = పిమ్మట, కపికుంజరః = వానరశ్రేష్ఠుడైన హనుమ, అవేక్షమాణః = చూచుచున్నవాడై, రూపయౌవనసంపన్నాః = సౌందర్యముతోడను, యౌవనముతోడను నిండియున్నట్టి, రావణస్య వర స్త్రియః = రావణుని భార్యలను, దదర్శ = చూచెను.

తాత్పర్యము :— హనుమ రావణాసురుని చూచుచునే గొప్ప సౌందర్యసంపదయును యౌవనసంపదయును కలిగినట్టి ఆ రావణాసురుని భార్యలు ఆతనిచుట్టు నుండగ చూచెను.

శ్లో॥ తాభిః పరివృతో రాజా సురూపాభి ర్మహాయశాః,
తన్మృగద్విజసంఘుష్టం ప్రవిష్టః ప్రమదావనమ్. 27

పదచ్ఛేదము :— తాభిః – పరివృతః – రాజా – సురూపాభిః – మహాయశాః – తత్ – మదద్విజ సంఘుష్టం – ప్రవిష్టః – ప్రమదావనమ్॥

అన్వయక్రమము :— మహాయశాః రాజా తాభిః సురూపాభిః పరివృతః, మృగద్విజసంఘుష్టం తత్ ప్రమదావనం ప్రవిష్టః॥

ప్రతిపదార్థము :- మహాయశాః రాజా = గొప్ప కీర్తిశాలియైన ఆ రాక్షసరాజు, తాభిః సురూపాభిః = ఆ సుందరాంగనలచే, పరివృతః = పరివేష్టింపబడినవాడై, మృగద్విజసంఘుష్టం = జంతువులచేతను, పక్షుల చేతను ధ్వనింపచేయబడుచున్నట్టి, తత్ ప్రమదావనం = ఆ యుద్యాన వనమును, ప్రవిష్టః = ప్రవేశించెను.

తాత్పర్యము :- గొప్ప యశస్సుగలవాడైన ఆ రావణుడు అతి సౌందర్యవతులైన తన అంతఃపుర స్త్రీలతోగూడి రమణీయమైన మృగములయొక్కయు పక్షులయొక్కయు ధ్వనులతో నిండిన ఆ యశోకవనము నందు ప్రవేశించెను.

శ్లో॥ క్షీబో విచిత్రాభరణ శ్శంకుకర్ణో మహాబలః
తేన విశ్రవసః పుత్ర స్స దృష్టో రాక్షసాధిపః.
వృతః పరమనారీభి స్తారాభి రివ చంద్రమాః. 28

పదచ్ఛేదము :- క్షీబః - విచిత్రాభరణః - శంకుకర్ణః - మహాబలః - తేన - విశ్రవసః - పుత్రః - సః - దృష్టః - రాక్షసాధిపః - వృతః - పరమనారీభిః - తారాభిః - ఇవ - చంద్రమాః ।

అన్వయక్రమము :- క్షీబః, విచిత్రాభరణః, శంకుకర్ణః మహాబలః, విశ్రవసః పుత్రః, సః రాక్షసాధిపః తారాభిః వృతః చంద్రమాః ఇవ, పరమనారీభిః వృతః (సన్) తేన దృష్టః.

ప్రతిపదార్థము :- క్షీబః = మదించియున్నవాడును, విచిత్రాభరణః = వివిధవర్ణములుగల భూషణములు గలవాడును, శంకుకర్ణః = కొనదేరిన చెవులుగలవాడును, మహాబలః = గొప్ప బలముగలవాడును, విశ్రవసః పుత్రః = విశ్రవసుడను బ్రహ్మ కుమారుడును అగు, సః రాక్ష

సాధిపః = ఆ రాక్షసరాజు, తారాభిః = నక్షత్రములచే, వృతః = చుట్టు కొనబడియున్న, చంద్రమాః ఇవ = చంద్రుడువలె, పరమనారీభిః = ఉత్తమ స్త్రీలచే, వృతః (సన్) = పరివేష్టింపబడినవాడై, తేన = ఆ హనుమచే, దృష్టః = చూడబడెను.

తాత్పర్యము .- మిక్కిలి మెరిసియున్నవాడై వివిధ వర్ణము లగు భూషణములు ధరించి సూదిగనున్న చెవులతో మహాబలాఢ్యుడుగానున్న విశ్రవో బ్రహ్మ కుమారుడైన ఆ రావణుడు ఉత్తమస్త్రీలచే పరివేష్టింపబడిన వాడై నక్షత్రములమధ్య వెలయుచున్న చంద్రునివలె ప్రకాశించుచు హనుమకు గాన్పించెను.

శ్లో॥ తం దదర్శ మహాతేజా స్తేజోవంతం మహాకపిః. 29

పదచ్ఛేదము :- తం - దదర్శ - మహాతేజాః - తేజోవంతం - మహాకపిః.

అన్వయక్రమము :- మహాతేజాః మహాకపిః తం తేజోవంతం దదర్శ.

ప్రతిపదార్థము :- మహాతేజాః = గొప్ప తేజశ్శాలియైన, మహాకపిః = వానరశ్రేష్ఠుడు, తం = అట్టి, తేజోవంతం = తేజస్వియైన రావణుని, దదర్శ = చూచెను.

తాత్పర్యము :- గొప్ప తేజశ్శాలియైన హనుమ అట్టి తేజోవంతుడైన రావణుని గాంచెను.

శ్లో॥ రావణో౽యం మహాబాహు రితి సంచింత్య వానరః,
(సో౽యమేవ పురా శేతే పురమధ్యే గృహోత్తమే)
అవప్లుతో మహాతేజా హనుమా న్మారుతాత్మజః.

పదచ్ఛేదము :- రావణః - అయం - మహాబాహుః - ఇతి - సంచింత్య - వానరః, సః - అయం - ఏవ - పురా - శేతే - పురమధ్యే - గృహోత్తమే - అవప్లుతః - మహాతేజాః - హనుమాన్ - మారుతాత్మజః.

అన్వయక్రమము :- పురా పురమధ్యే అయమేవశేతే; మహాబాహుః అయం రావణః; ఇతి సంచింత్య, మహాతేజాః, మారుతాత్మజః వానరః హనుమాన్ అవప్లుతః ।

ప్రతిపదార్థము :- పురా = పూర్వము, పురమధ్యే = లంకానగరమునందు, గృహోత్తమే = శ్రేష్ఠమైన భవనమునందు, అయమేవ శేతే = ఈతడే నిద్రించుచుండెను. మహాబాహుః అయం రావణః = మహావీరుడైన ఇతడు రావణుడు, ఇతి సంచింత్య = ఇట్లని ఆలోచించి, మహాతేజాః = మహాతేజశ్శాలియును, మారుతాత్మజః = వాయునందనుడును, వానరః = వానరోత్తముడునగు, హనుమాన్=హనుమ, అవప్లుతః = క్రిందికి దిగెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము .- ' అవప్లుతః ' = అనగా క్రిందికొమ్మకి ఉరికెను అని భావము.

తిలకము :-	తన కొమ్మనుండి మీదకొమ్మమీదికి లంఘించెను.
రామాయణ శిరోమణి :-	
మహేశ్వరతీర్థులు :-	

తాత్పర్యము :- లంకానగరమున శ్రేష్ఠమైన అ భవనమునందు నిద్రించుచు నాకు గానవచ్చిన యాత డితడే. మహావీరుడైన రావణుడనగా

ఊతదేకదా అని నిశ్చయించుకొని మహాతేజశ్శాలియైన హనుమ క్రింది కొమ్మమీదికి దిగెను.

శ్లో॥ స తథా ఉప్యుగ్రతేజాస్స న్నిర్ధూత స్తస్య తేజసా,
పత్రగుహ్యాంతరే సక్తో హనుమాన్ సంవృతో ఉభవత్.

పదచ్ఛేదము :- సః - తథా - అపి - ఉగ్రతేజాః - సన్ - నిర్ధూతః - తస్య - తేజసా - పత్రగుహ్యంతరే - సక్తః - హనుమాన్ సంవృతః - అభవత్.

అన్వయక్రమము :- సః హనుమాన్ తథా ఉగ్రతేజాః సన్ అపి, తస్యతేజసా నిర్ధూతః సన్ పత్రగుహ్యంతరే సక్తః, సంవృతః అభవత్.

ప్రతిపదార్థము :- సః హనుమాన్ = ఆ హనుమంతుడు, తథా= అరీతిగా, ఉగ్రతేజాః సన్ అపి = తీక్ష్ణమైన తేజస్సుగలవాడైనప్పటికిని, తస్య తేజసా = ఆ రావణాసురునియొక్క తేజస్సుచే, నిర్ధూతః (సన్) = తిరస్కరింపబడినవాడై, పత్రగుహ్యాంతరే సక్తః = గుబురుగనున్న ఆకుల యందు లీనమైనవాడై, సంవృతః అభవత్ = చక్కగా కప్పబడినవాడుగా నుండెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- తథా ఉగ్రతేజాః = సముద్రలంఘనమొనర్చినట్టి మహాపరాక్రమశాలి యైనప్పటికిని, హనుమ రావణుని తేజస్సుచే జంకి, ఎదుట నిలచుటకు శక్తిలేకయే ఆకుల గుబురునందు దాగెను. అన్నిమాయ లను మించిన మహామాయలు కలిగిన రావణుని దృష్టిని భరింపలేక తన కామరూపాదికమైన శక్తి అతనిముందు అల్పమైనదని హనుమ భయపడె ననియే చెప్పవలెను.

రామాయణ శిరోమణి :- రావణుని తేజస్సుచే భీతుడై తన కార్యసిద్ధి కొరకు ఆకులవెనుకకు పోయి దాగెను.

తాత్పర్యము :- సహజముగా తాను మహోగ్రతేజశ్శాలియై నను రావణుని తేజోవిశేషము చూచునప్పటికి హనుమ కొద్ది జంకుతో వెనుకకుతగ్గి ఆకుల గుబురులో దాగికొనియుండెను.

శ్లో॥ స తాం మసితకేశాంతాం సుశ్రోణీం సంహతస్తనీం,
దిదృక్షు రసితాపాంగా ముపావర్తత రావణః. 32

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సున్దరకాండే
'రావణాగమనం' నామ
అష్టాదశ స్సర్గః

పదచ్ఛేదము :- సః - తాం - అసితకేశాంతాం - సుశ్రోణీం - సంహత స్తనీం, దిదృక్షుః - అసితాపాంగాం - ఉపావర్తత - రావణః

అన్వయక్రమము :- సః రావణః అసితకేశాంతాం, సుశ్రోణీం, సంహత స్తనీం, అసితాపాంగాం తాం దిదృక్షుః ఉపావర్తత.

ప్రతిపదార్థము :- సః రావణః = ఆ రావణాసురుడు, అసితకేశాంతాం = నల్లని కేశాగ్రములు గలదియును, సుశ్రోణీం = సుందర

మైన పిరుదులు గలదియును, సంహతస్తనీం = పరస్పరము ఒరసికొను చున్న స్తనములు గలదియును, అసితాపాంగాం = నల్లని కంటికొనలు గలదియును అగు, తాం = ఆ సీతాదేవిని, దిదృక్షుః = చూడగోరుచున్న వాడై, ఉపావర్తత = సమీపమునకు వచ్చెను.

తాత్పర్యము :- ఆ రావణుడు నల్లని కేశపాశమును, సుందరములగు పిఱుదులును, పరస్పరము ఒరసకొనుచున్న స్తనములును, నల్లని క్రీగంటి చూపులును గల ఆ సీతాదేవిని చూడగోరినవాడై ఆమె సమీపమునకు ఏచ్చుచుండెను.

ఇది శ్రీ మత్సుందరకాండమున

" సుబోధిని " అను ఆంధ్ర వివరణమునందు

" రావణాగమనము " అను

పదునెనిమిదవ సర్గము.

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకోనవింశ స్సర్గః

శ్లో॥ తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిందితా,
రూపయౌవనసంపన్నం భూషణోత్తమ భూషితమ్. 1

శ్లో॥ తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్,
ప్రావేపత వరారోహా ప్రవాతే కదళీయథా. 2

పదచ్ఛేదము :- తస్మిన్ - ఏవ - తతః - కాలే - రాజపుత్రీ - తు - అనిందితా - రూపయౌవన సంపన్నం - భూషణోత్తమ భూషితమ్॥ తతః - దృష్ట్వా - ఏవ - వైదేహీ - రావణం - రాక్షసాధిపమ్, ప్రావేపత - వరారోహా - ప్రవాతే - కదళీ యథా ॥

అన్వయక్రమము :- తతః తస్మిన్నేవ కాలే, అనిందితా, రాజపుత్రీ, వరారోహా, వైదేహీ, రూపయౌవనసంపన్నం, భూషణోత్తమ భూషితం, రాక్షసాధిపం, రావణం తతః, దృష్ట్వాఏవ, ప్రవాతే, కదళీ యథా, ప్రావేపత-

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, తస్మిన్నేవ కాలే = అదేసమయమున, అనిందితా = కళంకము లేనిదియును, రాజపుత్రీ = మహారాజు కుమార్తెయైనదియును, వరారోహా = గొప్ప పిఱుదులు గలదియును అగు, వైదేహీ= జానకీదేవి, రూపయౌవన సంపన్నం=సౌందర్య

సంపదయు, వయస్సంపదయు కలిగినవాడును,భూషణోత్తమభూషితం = శ్రేష్ఠమైన ఆభరణములచే అలంకరింపబడినవాడును, రాక్షసాధిపం = రాక్షసులకు ప్రభువును అగు, రావణం = రావణాసురుని, తతః = అచటి నుండి, దృష్ట్వైవ = చూచినంతనే, ప్రవాతే = పెనుగాలియందు, కదళీయథా = అరటిచెట్టువలె, ప్రావేపత = మిక్కిలి కంపించెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'తస్మిన్నేవకాలే = హనుమ వచ్చిననాటి రాత్రి యొక్క చివరిజామునందే.

తాత్పర్యము :- అంతట నిష్కళంక చరిత్రురాలైన రాజపుత్రియగు సీతాసుందరి, సౌందర్యముతోడను యౌవనముతోడను ప్రకాశించుచు ఉత్తమాభరణములు ధరించి తనకడకు వచ్చుచున్న రాక్షసరాజైన రావణుని దూరమునుండియే చూచి, ఝంఝూమారుతమునకు ఊగిపోవుచున్న అరటిచెట్టువలె కంపించిపోవుచుండెను.

శ్లో॥ ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాంచపయోధరౌ
ఉపవిష్టా విశాలాక్షీ రుదంతీ వరవర్ణినీ. 3

పదచ్ఛేదము :- ఆచ్ఛాద్య - ఉదరం - ఊరుభ్యాం - బాహుభ్యాం - చ - పయోధరౌ, ఉపవిష్టా - విశాలాక్షీ - రుదంతీ - వరవర్ణినీ.

అన్వయక్రమము - విశాలాక్షీ వరవర్ణినీ ఊరుభ్యాం ఉదరం, బాహుభ్యాం పయోధరౌచ ఆచ్ఛాద్య, రుదతీ ఉపవిష్టా.

ప్రతిపదార్థము :- విశాలాక్షీ వరవర్ణినీ = విశాలమైన కన్నులు గలదియును, ఉత్తమలక్షణములు గలదియును అగు సీతాదేవి, ఉదరం =

కడుపును, ఊరుభ్యాం = రెండు తొడలతోడను, పయోధరౌ = రెండు స్తనములను, బాహుభ్యాంచ = రెండు భుజములతోడను, ఆచ్ఛాద్య = కప్పుకొని, రుదంతీ ఉపవిష్టా = శోకించుచున్నదై కూర్చుండెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

పరమార్థచంద్రిక —— వరవర్ణినీ - ఉష్ణకాలమునందు, సుఖశీతలమును, శీతకాలమునందు సుఖోష్ణమునునగు అంగములు గలిగి భర్తయందనురాగము గల్గిన స్త్రీ.

వాసుదాసస్వామి - తన సొమ్ములు మూటగట్టి యుత్తరీయమును పారవైచిన కారణముచే పైటకొంగు సరిగ లేకయుండుటచే తన కడుపు కానరాకుండ తొడలును, వక్షస్థలము గానరాకుండ మోకాళ్ళను అడ్డముంచి ఆ కాళ్ళను రెండుచేతులతో పట్టుకొని బిగించెనని భావము.

తాత్పర్యము :- పెద్ద కన్నులుగలిగిన పతివ్రతయైనట్టి సీతాదేవి దూరమునుండి రావణుని చూచినవెంటనే తన కడుపును తొడలతోడను, తన స్తనములను భుజములతోడను, కప్పివైచుకొని కూర్చుండి రావణుని వలన భయమును శంకించుచున్నదై విలపించుచుండెను.

శ్లో॥ దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః,
దదర్శ సీతాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే. 4

పదచ్ఛేదము :- దశగ్రీవః - తు - వైదేహీం - రక్షితాం - రాక్షసీగణైః - దదర్శ - సీతాం - దుఃఖార్తాం - నావం - సన్నాం - ఇవ - అర్ణవే.

అన్వయక్రమము :- దశగ్రీవః, రాక్షసీగణైః రక్షితాం, అర్ణవే, సన్నాం నావంఇవ దుఃఖార్తాం, వైదేహీం సీతాం దదర్శ.

ప్రతిపదార్థము :— దశగ్రీవః = దశకంఠుడు, రాక్షసీగణైః రక్షితాం = రాక్షసస్త్రీలచే కావలియుంచబడినట్టిదియును, అర్ణవే = సముద్రమునందు, సన్నాం నావం ఇవ = శిథిలమైయున్న నావవలె (నావలోని జనమువలె) దుఃఖార్తాం = దుఃఖముతో దీనురాలైయున్నట్టి, వైదేహీం సీతాం = జనకరాజపుత్రియగు సీతను, దదర్శ = చూచెను.

తాత్పర్యము :— రావణాసురుడు, రాక్షసస్త్రీలచే కావలియుంచబడి, మహాసముద్రమునందు శిథిలమైపోయియున్న నావలో నిలచియున్నట్టి జనమువలె దుఃఖనిమగ్నురాలైయున్నట్టి సీతను గాంచెను.

శ్లో॥ అసంవృతాయా మాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్,
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః. 5

పదచ్ఛేదము :— అసంవృతాయాం - ఆసీనాం - ధరణ్యాం - సంశితవ్రతామ్, ఛిన్నాం - ప్రపతితాం - భూమౌ - శాఖాం - ఇవ - వనస్పతేః.

అన్వయక్రమము :— అసంవృతాయాం ధరణ్యాం ఆసీనాం, సంశితవ్రతాం, ఛిన్నాం, భూమౌ ప్రపతితాం వనస్పతేః శాఖామివ (స్థితాం) (సీతాం దదర్శ)

ప్రతిపదార్థము :— అసంవృతాయాం ధరణ్యాం = ఆస్తరణము లేని భూమిపై (కటికినేలపై) ఆసీనాం = కూర్చుండియున్నదియును, సంశితవ్రతాం = తీక్ష్ణమైన నియమములు గలదియును, ఛిన్నాం = తెగగొట్టబడినదై, భూమౌ ప్రపతితాం = నేలపై కూలియున్న, వనస్పతేః శాఖామివ (స్థితాం) = మహావృక్షముయొక్క కొమ్మవలె నున్నట్టి, (సీతాం దదర్శ = సీతను చూచెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- సంశితవ్రతామ్=రావణవధకై తీవ్రమైన వ్రతము నాచరించుచున్నదివలె నున్నది.

తాత్పర్యము :- తీవ్రమైన దీక్షతో వ్రతము నాచరించుచు కటికినేలపై కూర్చుండి, తెగగొట్టి నేలపై కూల్చబడిన మహావృక్షము యొక్క శాఖవలెనున్నట్టి సీతను రావణుడు చూచెను.

శ్లో॥ మలమండనచిత్రాంగీం మండనార్హా మమండితామ్,
మృణాళీ పంకదిగ్ధేవ న విభాతి విభాతిచ. 6

పదచ్ఛేదము :- మలమండన చిత్రాంగీం - మండనార్హాం - అమండితామ్, మృణాళీ - పంకదిగ్ధా - ఇవ - న - విభాతి - విభాతి-చ.

అన్వయక్రమము :- (యా) పంకదిగ్ధా మృణాళీ ఇవ నవిభాతి, విభాతిచ, (తాం) మలమండన చిత్రాంగీం, మండనార్హాం, అమండితాం (సీతాం దదర్శ).

ప్రతిపదార్థము :- (యా = ఏతరుణి) పంకదిగ్ధా మృణాళీఇవ= బురదచే కప్పబడియున్న తామరతీగవలె, నవిభాతి = ప్రకాశించుటలేదో, (మరియు) విభాతిచ = ప్రకాశించుచునే యున్నదో, తాం = అట్టి, మలమండన చిత్రాంగీం = దూళియే ఆభరణముగా చిత్రమైన వర్ణములుగల శరీరము కలిగియున్నదియును, మండనార్హాం = ఆభరణములకు తగియున్నదియును, అమండితాం = భూషణములు లేకయున్నదియునగు, (సీతాం దదర్శ = సీతాదేవిని చూచెను)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'మలమండనదిగ్ధాంగీ' యని బొంబాయి పాఠము. లేదా ధూళియే ఆభరణములుగా పూయబడియున్న శరీరము గలది.

మహేశ్వరత్థులు :- ధూళియను అభరణముచే పలురంగులు గల శరీరము గలది.

గోవిందరాజీయము :- మలినమైయున్న దేహముగలదై యున్నను, అశ్చర్యకరమైన సౌందర్యమునే కలిగియున్నది.

తాత్పర్యము :- ముఱికిపట్టి రంగు రంగుల పద్మములతో ప్రకాశించుచు, ఆ సీతాదేవి బురదతోనిండిన తామరతీగవలె ఒకవంక కొంత తన అందమును గోల్పోయినను సుందరముగనే గానవచ్చుచుండెను. ఒడలినిండ ఆభరణములు ధరింపవలసిన ఈమె ఒక్క ఆభరణముగూడ లేకయున్నదే యని అనిపించుచున్నట్టి ఆ సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః,
సంకల్పహయసంయుక్తై ర్యాంతీమివ మనోరథైః. 7

పదచ్ఛేదము - సమీపం - రాజసింహస్య - రామస్య - విదితాత్మనః - సంకల్పహయసంయుక్తైః -యాంతీం - ఇవ - మనోరథైః.

అన్వయక్రమము :- విదితాత్మనః, రాజసింహస్య రామస్య సమీపం, సంకల్పహయసంయుక్తైః, మనోరథైః యాంతీంఇవ, (స్థితాం సీతాం దదర్శ)

ప్రతిపదార్థము :- విదితాత్మనః = ఆత్మవేత్తయైనట్టి, రాజసింహస్య = రాజసింహమైన, రామస్య = శ్రీరామునియొక్క, సమీపం = సన్నిధికి, సంకల్పహయసంయుక్తైః = తన సంకల్పములనెడి అశ్వములతో గూడినట్టి, మనోరథైః = మనోరథములతో, యాంతీంఇవ = పయనించుచున్నట్టిదిగా, (స్థితాం సీతాం దదర్శ = ఉన్నట్టి సీతనుజూచెను.)

తాత్పర్యము :- తన హృదయమునందలి సంకల్పములనే గుఱ్ఱములుగాచేసి పూన్చిన మనోరథములతో, తన ఆత్మతత్త్వమును

గ్రహించినట్టి రాజసింహుడైన శ్రీరాముని ఎడబాటు మూలమున బాధ
చున్నదానియున్నట్లుగా కానవచ్చుచున్న సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ శుష్యంతీం రుదతీ మేకాం ధ్యానశోకపరాయణామ్,
దుఃఖ స్యాంత మపశ్యంతీం రామాం రామ మనువ్రతామ్.

పదచ్ఛేదము :— శుష్యంతీం - రుదతీం - ఏకాం - ధ్యాన
శోకపరాయణామ్, దుఃఖస్య - అంతం - అపశ్యంతీం - రామాం -
రామం - అనువ్రతామ్ ॥

అన్వయక్రమము :— సుగమము.

ప్రతిపదార్థము :— శుష్యంతీం - శుష్కించిపోవుచున్నదియును,
రుదతీం = విలపించుచున్నదియును, ఏకాం - ఒంటరిదైయున్నదియును,
ధ్యానశోకపరాయణాం = ఆలోచనమునందును దుఃఖమునందును మునిగి
యున్నదియును, దుఃఖస్య = తన దుఃఖమునకు, అంతం — అంతమును,
అపశ్యంతీం = చూడకున్నదియును, రామం అనువ్రతాం — శ్రీరాముని
అనుసరించుట యను వ్రతము గలదియును, రామాం — సుందరాంగియు
నగు, (సీతాం దదర్శ = సీతను రావణుడు చూచెను.)

తాత్పర్యము :— నానాటికి కృశించు చున్నదియును, ఒంటరిగ
దుఃఖించు చున్నదియును, నిత్యము చింతలందును, దుఃఖమునందును
నిమగ్నమై యున్నదియును, తన దుఃఖమునకు అంతము గానరాక దిగులు
చెందియున్నదియును, శ్రీరామునియందు లగ్నమైన మనస్సు గల్గినదియు
నగు సీతాసుందరిని రావణుడు గాంచెను.

శ్లో॥ వేష్టమానాం తథా ఽవిష్టాం పన్నగేంద్రవధూమివ,
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా. 9

పదచ్ఛేదము :- వేష్టమానాం - తథా - అవిష్టాం - పన్నగేంద్ర వధూం ఇవ - ధూప్యమానాం - గ్రహేణ - ఇవ - రోహిణీం - ధూమకేతునా,

అన్వయక్రమము :- అవిష్టాం, తథా వేష్టమానాం పన్నగేంద్రవధూం ఇవ, ధూమకేతునా గ్రహేణ ధూప్యమానాం రోహిణీం ఇవ స్థితాం (సీతాం దదర్శ)

ప్రతిపదార్థము :- అవిష్టాం = మంత్రముచేతను మణులచేతను బంధింపబడినదై, తథా = అట్లు, వేష్టమానాం = చుట్టుకొనుచున్నదై యున్నట్టి, పన్నగేంద్రవధూం ఇవ = గొప్ప జాతి త్రాచుపామువలెను, ధూమకేతునా గ్రహేణ = ధూమవర్ణముగల కేతుగ్రహముచే, ధూప్యమానాం = తపింపచేయబడుచున్నట్టి, రోహిణీం ఇవ = రోహిణీనక్షత్రమువలెను (స్థితాం = ఉన్నట్టి) (సీతాం దదర్శ = సీతాదేవిని చూచెను.)

తాత్పర్యము :- విషవైద్యులు ప్రయోగించిన మణి మంత్రములచే బంధింపబడి రోషముతో తనలోతాను చుట్టుకొనుచున్న గొప్ప జాతి త్రాచుపామువలెను, ధూమవర్ణము కలిగియున్న క్రూరమైన కేతుగ్రహముచే పట్టి పీడింపబడుచున్న రోహిణీనక్షత్రమువలెను కావవచ్చుచున్న అ సీతాదేవిని రావణుడు గాంచెను.

శ్లో॥ వృత్తశీలకులేజాతా మాచారవతి ధార్మికే,
పున స్సంస్కార మాపన్నాం జాతా మివచ దుష్కులే.

పదచ్ఛేదము :- వృత్తశీలకులే - జాతాం-అచారవతి-ధార్మికే - పునః - సంస్కారాం -అపన్నాం - జతాం - ఇవ - చ - దుష్కులే.

అన్వయక్రమము - అచారవతి ధార్మికే వృత్తశీలకులే జాతాం పునః దుష్కులే జాతాం ఇవ సంస్కారం అపన్నాం ఇవచ స్థితాం (సీతాం దదర్శ.)

ప్రతిపదార్థము :- ఆచారవతీ = గొప్ప సదాచారము కలిగినట్టిదియు, ధార్మికే = ధర్మనిష్ఠ గలిగినట్టిదియు నగు, వృత్తశీల కులే = ఉత్తమమైన నడతయు, పవిత్రమైన స్వభావమునుగల కులమునందు, జాతాం = జన్మించినదై, దుష్కులే జాతాం ఇవ = దుష్టవంశమునందు జన్మించినదానివలె, పునః సంస్కారం ఆపన్నాం ఇవ = తిరిగి ప్రాయశ్చిత్తాది సంస్కారములు పొందియున్న వధువువలె, (స్థితాం = ఉన్నట్టి, సీతాం దదర్శ = సీతాదేవిని రావణుడు చూచెను.)

తాత్పర్యము :- గొప్ప సదాచారము, ధర్మనిష్ఠ, సత్స్వభావము గల ఉన్నత వంశమునందు జన్మించి, అట్టివారిచే దుష్టమైన వంశమునందు జన్మించిన కన్యకువలె తిరిగి ప్రాయశ్చిత్తమువంటి సంస్కారములను చేయింపబడిన వధువువలె పరాభవదుఃఖము నొందుచున్నట్టి, సీతాదేవిని రావణుడు జూచెను.

శ్లో॥ అభూతే నాపవాదేన కీర్తిం నిపతితామివ,
ఆమ్నాయానా మయోగేన విద్యాం ప్రశిథిలామివ. 11

పదచ్ఛేదము :- అభూతేన - అపవాదేన - కీర్తిం - నిపతితాం - ఇవ - ఆమ్నాయానాం - అయోగేన - విద్యాం - ప్రశిథిలాం - ఇవ.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- అభూతేన అపవాదేన = మిథ్యాపవాదము చేత, నిపతితాం కీర్తిం ఇవ = కళంకితమైన కీర్తివలెను, ఆమ్నాయానాం అయోగేన = మననము చేయకుండుటచే, ప్రశిథిలాం విద్యాం ఇవ = మఱపునకువచ్చిన విద్యవలెను, (స్థితాం సీతాం దదర్శ = ఉన్న సీతను రావణుడు చూచెను.)

తాత్పర్యము :- కిట్టనివారు కల్పించిన అపవాదముచే కళంకము నొందిన కీర్తివలెను, తిరిగి మననము చేయకుండుటచే విస్మృతిపాలైన ఉత్తమ విద్యవలెను కానవచ్చుచున్నట్టి సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితామ్,
పూజామివ పరిక్షీణా మాశాం ప్రతిహతామివ. 12

పదచ్ఛేదము :- సన్నాం - ఇవ - మహాకీర్తిం - శ్రద్ధాం - ఇవ - విమానితామ్, పూజాం - ఇవ - పరిక్షీణాం - ఆశాం - ప్రతిహతాం - ఇవ.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- సన్నాం మహాకీర్తిం ఇవ = క్షీణించిపోయిన గొప్ప కీర్తివలెను, విమానితాం శ్రద్ధాం ఇవ = అవమానింపబడిన పూజ్యభావమువలెను, పరిక్షీణాం పూజాం ఇవ = సన్నగిల్లిపోయిన సత్కారభావము వలెను. ప్రతిహతాం ఆశాం ఇవ = భగ్నమైపోయిన ఆశవలెను, (స్థితాం = ఉన్నట్టి) (సీతాం దదర్శ = సీతను జూచెను.)

బొంబాయి ముద్రణము ,- 'పూజామివ పరిక్షీణాం' అనుదానికి బదులుగా 'ప్రజ్ఞామివ పరిక్షీణాం' అని గలదు.

తాత్పర్యము .- దురదృష్టవశమున క్షీణించిపోయినట్టి అద్భుత కీర్తివలెను, అజ్ఞులచే అవమానింపబడిన శ్రద్ధాభావమువలెను, అకారణముగా క్షీణించిపోయిన గౌరవము వలెను, భగ్నమైపోయిన ఆశవలెను దీనస్థితిలోనున్నట్టి సీతను రావణుడు చూచెను.

శ్లో॥ ఆయతీమివ విధ్వస్తా మాజ్ఞాం ప్రతిహతామివ,
దీప్తామివ దిశం కాలే పూజా మపహృతామివ. 13

పదచ్ఛేదము - అయశీం - ఇవ - విధ్వస్తాం - ఆజ్ఞాం - ప్రతిహతాం - ఇవ - దీప్తాం - ఇవ - దిశం - కాలే - పూజాం - అపహృతాం - ఇవ.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- విధ్వస్తాం ఆయతీం ఇవ = చెడగొట్టబడిన మహాలాభమువలెను, ప్రతిహతాం ఆజ్ఞాం ఇవ = ధిక్కరింపబడిన ఆజ్ఞవలెను, కాలే = ఉపద్రవ సమయమునందు, దీప్తాం = మండుచున్న, దిశం ఇవ = దిక్కువలెను, అపహృతాం = అపహరింపబడిన, పూజాం ఇవ = సత్కారమువలెను, (స్థితాం సీతాం దదర్శ = ఉన్నట్టి సీతను చూచెను.)

గోవిందరాజీయము :- ' పూజ ం అపహృతామివ '—అపహరింపబడిన పూజాద్రవ్యమువలె నున్నదని భావము.

తాత్పర్యము - పరులచే చెడగొట్టబడిన మహాలాభమువలెను, అగౌరవముచే ధిక్కరింపబడిన రాజాజ్ఞవలెను, ఉత్పాతకాలమునందు ఏరింపబడుచున్న ప్రదేశమువలెను, పరులచే అపహరింపబడిన ఘనసన్మానమువలెను, దయనీయమైన స్థితిలో నున్నట్టి సీతాదేవిని రావణాసురుడు చూచెను.

శ్లో॥ పద్మినీమివ విధ్వస్తాం హతశూరాం చమూమివ,
ప్రభామివ తమోధ్వస్తా ముపక్షీణా మి వాపగామ్. 14

పదచ్ఛేదము :- పద్మినీం - ఇవ - విధ్వస్తాం - హతశూరాం - చమూం - ఇవ - ప్రభాం - ఇవ - తమోధ్వస్తాం - ఉపక్షీణాం - ఇవ - అపగామ్.

అన్వయ క్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- విధ్వస్తాం పద్మినీం ఇవ = ధ్వంసముచేయబడిన తామరతీగవలెను, హతశూరాం చమూం ఇవ = చంపబడిన వీరులుగల సైన్యమువలెను, తమోధ్వస్తాం ప్రభాం ఇవ = రాహువుచే నశింపచేయబడిన (చంద్రసూర్యుల) కాంతివలెను, ఉపక్షీణాం ఆపగాం ఇవ = క్షీణించిపోయిన నదివలెను, (స్థితాం సీతాం దదర్శ = ఉన్నట్టి సీతను చూచెను.)

తాత్పర్యము :- మంచుచే చెడగొట్టబడిన తామరతీగవలెను, వధింపబడిన వీరులుగల సైన్యమువలెను, రాహువుచే నశింపచేయబడిన సూర్యకాంతి వలెను, క్షీణించిపోయిన జలముగల నది వలెను దీనస్థితిలో నున్నట్టి సీతను రావణుడు జూచెను.

శ్లో॥ వేదీమివ పరామృష్టాం శాంతా మగ్నిశిఖామివ,
పౌర్ణమాసీ మివ నిశాం రాహుగ్రస్తేందుమండలామ్.15

పదచ్ఛేదము :- వేదీం - ఇవ - పరామృష్టాం - శాంతాం - అగ్నిశిఖాం - ఇవ - పౌర్ణమాసీం - ఇవ - నిశాం - రాహుగ్రస్తేందు మండలామ్.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- పరామృష్టాం వేదీం ఇవ = (అపవిత్రునిచే) స్పృశింపబడిన యజ్ఞవేదికవలెను, శాంతాం అగ్నిశిఖాం ఇవ = చల్లారిన అగ్నిజ్వాలవలెను, రాహుగ్రస్తేందు మండలాం = రాహువుచే మ్రింగబడిన చంద్రబింబము గలిగినట్టి, పౌర్ణమాసీం నిశాం ఇవ =పున్నమనాటి రాత్రివలెను, (స్థితాం సీతాం దదర్శ = ఉన్నట్టి సీతను చూచెను.)

తాత్పర్యము:-అపవిత్రులచే అంటబడిన యజ్ఞాగ్ని వేదికవలెను, ఆరిపోయిన అగ్నిజ్వాలవలెను, చంద్రగ్రహణ సమయమునందలి రాత్రి సమయమువలెను క్షీణస్థితినొందియున్న సీతాదేవిని జూచెను.

శ్లో॥ ఉత్కృష్టపర్ణకమలాం విత్రాసిత విహంగమామ్,
హస్తిహస్తపరామృష్టా మాకులాం పద్మినీ మివ. 16

పదచ్ఛేదము :- ఉత్కృష్టపర్ణకమలాం - విత్రాసిత విహంగమాం - హస్తి హస్తపరామృష్టాం - ఆకులాం - పద్మినీం - ఇవ.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము - హస్తిహస్తపరామృష్టాం = ఏనుగుతొండముచే లాగివేయబడినదియును, ఉత్కృష్టపర్ణకమలాం = పెరికివేయబడిన ఆకులును తామరపుష్పములును గలదియును, విత్రాసిత విహంగమాం = బెదిరించివేయబడిన జలపక్షులు గలదియును అగు, ఆకులాం పద్మినీం ఇవ (స్థితాం) = నలగిపోయియున్న తామరతీగవలె నున్నట్టి, (సీతాం దదర్శ= సీతను రావణుడు జూచెను.)

తాత్పర్యము :- ఏనుగుతొండముచే లాగివేయబడుటచేతను, ఆకులును పువ్వులును పెరికివేయబడుటచేతను, జలపక్షులు బెదిరిపోయి వెళ్ళిపోవుటచేతను వాడి నలిగిపోయి శోభాహీనముగానున్న తామరతీగవలె గాన్పించుచున్నట్టి సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ,
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశా మివ. 17

పదచ్ఛేదము :- పతిశోకాతురాం - శుష్కాం - నదీం - విస్రావితాం - ఇవ - పరయా - మృజయా - హీనాం - కృష్ణపక్ష నిశాం - ఇవ.

అన్వయక్రమము : విస్రావితాం, శుష్కాం నదీం ఇవ పతి శోకాతురాం; కృష్ణపక్షనిశాం ఇవ పరయామృజయాహీనాం (సీతాం దదర్శ)

ప్రతిపదార్థము .– విస్రావితాం = ప్రక్కకు ప్రవహింప జేయబడిన, శుష్కాం = ఎండిపోయినట్టి, నదీం ఇవ = నదివలె, పతి శోకాతురాం = భర్తృవిరహ శోకముచే కృశించియున్నదియును; కృష్ణపక్ష నిశాం ఇవ = కృష్ణపక్షపు రాత్రివలె, పరయా మృజయా హీనాం = ఉత్తమమైన దేహసంస్కారము లేకయున్నదియును అగు (సీతాం దదర్శ= సీతమ్మను జూచెను.)

తాత్పర్యము .– నీటిని అంతను ప్రక్కకు ప్రవహింపజేయుటచే ఎండిపోయియున్న నదివలె పతి విరహదుఃఖముచే శుష్కించియున్నట్టిదియును, కృష్ణపక్షనిశవలె దేహసంస్కారము మానుటచే మలినమై యున్నదియును అగు సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ సుకుమారీం సుజాతాంగీం రత్నగర్భగృహోచితామ్,
తప్యమానా మివోష్ణేన మృణాలీ మచిరోద్ధృతామ్. 18

పదచ్ఛేదము .– సుకుమారీం – సుజాతాంగీం – రత్నగర్భ గృహోచితామ్, – తప్యమానాం – ఇవ – ఉష్ణేన – మృణాళీం – అచిరోద్ధృతామ్.

అన్వయక్రమము :– సుగమము.

ప్రతిపదార్థము .– సుకుమారీం = గొప్ప సౌకుమార్యముగలదియును, సుజాతాంగీం=సుందరమైన అవయవ సన్నివేశము గలదియును, రత్నగర్భ గృహోచితాం = రత్నభవనములందు నివసింపదగినదియును, అచిరోద్ధృతాం = అప్పుడే పీకివేయబడినట్టిదై, ఉష్ణేన తప్యమానాం = వేడిమిచే తపింపజేయబడుచున్న, మృణాళీం ఇవస్థితాం = తామరతూడువలెనున్నట్టి (సీతాం దదర్శ = సీతను చూచెను.)

తాత్పర్యము :- అతి సుకుమారురాలును, సుందరాంగియును మణిమయ భవనములయందు మాత్రమే నివసింపదగినదియును, అప్పుడే పెరికివేయబడి ఎండకు వడలిపోవుచున్న తామరతూడువలె కౌన్పించుచున్నదియు నగు సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ గృహీతా మాళితాం స్తంభే యూథపేన వినాకృతాం,
నిశ్శ్వసంతీం సుదుఃఖార్తాం గజరాజవధూ మివ. 19

పదచ్ఛేదము :- గృహీతాం - ఆళితాం - స్తంభే - యూథపేన - వినాకృతామ్, నిశ్శ్వసంతీం - సుదుఃఖార్తాం - గజరాజవధూం - ఇవ.

అన్వయక్రమము :- యూథపేన వినాకృతాం, గృహీతాం, స్తంభే ఆళితాం, నిశ్వసంతీం, సుదుఃఖార్తాం గజరాజవధూం ఇవ (స్థితాం సీతాం దదర్శ)

ప్రతిపదార్థము :- యూథపేన వినాకృతాం = నాయకుడైన ఏనుగుచే వియోగము కల్పింపబడినదై, గృహీతాం = బంధింపబడినదై, స్తంభే ఆళితాం = కట్టుగుంజకు కట్టివేయబడినదై, నిశ్శ్వసంతీం = నిట్టూర్చుచున్నట్టి, సుదుఃఖార్తాం గజరాజవధూంఇవస్థితాం = మిక్కిలి దుఃఖముచే మిగులనొందిన గొప్పజాతి ఆడుఏనుగువలెనున్న, (సీతాం దదర్శ = సీతాదేవిని జూచెను.)

తాత్పర్యము :- తన మందనుండి తొలగించి ఇాటికితెచ్చి, కట్టుస్తంభమునకు బంధింపబడి మహాదుఃఖముతో నిట్టూర్పులు విడుచుచున్నట్టి భద్రజాతి గజాంగనవలె కానవచ్చుచున్న సీతను రావణుడు చూచెను.

శ్లో॥ ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానా మయత్నతః,
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీ మివ. 20

పదచ్ఛేదము :— ఏకయా - దీర్ఘయా - వేణ్యా - శోభమానాం- అయత్నతః - నీలయా - నీరదాపాయే - వనరాజ్యా - మహీం - ఇవ.

అన్వయక్రమము .— నీరదాపాయే నీలయా వనరాజ్యా మహీం ఇవ అయత్నతః ఏకయా దీర్ఘయావేణ్యా శోభమానాం (సీతాందదర్శ)

ప్రతిపదార్థము :— నీరదాపాయే = వర్షాకాలము గడచినపిమ్మట, నీలయా వనరాజ్యా = నల్లనైన వృక్షశ్రేణిచే, మహీం ఇవ = వనభూమి వలె, అయత్నతః = సంస్కారము లేకపోవుటవలన, ఏకయా దీర్ఘయా వేణ్యా = ఒకటిగానున్న, పొడవైన కేశపాశముచే, శోభమానాం = ప్రకాశించుచున్నట్టి, (సీతాం దదర్శ = సీతను చూచెను.)

తాత్పర్యము :— వర్షాకాలము గడచినపిమ్మట నల్లబడిపోయిన చెట్లవరుసతో వనభూమి ఎట్లు కానవచ్చునో, అట్లే ఎట్టి సంస్కారము చేయకుండుటచే జడగట్టిపోయియున్న పొడవైన నల్లని కేశపాశముతో ప్రకాశించు చున్నట్టి సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ ఉపవాసేన శోకేన ధ్యానేనచ భయేనచ,
పరిక్షీణాం కృశాం దీనా మల్పాహారాం తపోధనామ్.

పదచ్ఛేదము .— ఉపవాసేన - శోకేన - ధ్యానేన-చ - భయేన - చ - పరిక్షీణాం - కృశాం - దీనాం - అల్పాహారాం - తపోధనామ్.

అన్వయక్రమము :— సుగమము.

ప్రతిపదార్థము .— ఉపవాసేన = ఉపవాసముచేతను, శోకేన = దుఃఖముచేతను, ధ్యానేన = తీవ్రమైన చింతచేతను, భయేనచ = భీతి చేతను, పరిక్షీణాం = మిక్కిలి క్షీణించి యున్నదియును, కృశాం = కృశించియున్నదియును, దీనాం = దీనస్థితి నొందియున్నదియును, అల్పా

హారాం = అల్పమైన ఆహారమునే స్వీకరించుచున్నదియును, తపోధనాం = తపస్సే ధనముగ కలదియు నగు, (సీతాం దదర్శ = సీతను జూచెను.)

తాత్పర్యము :- నిత్యోపవాసముచేతను, తీవ్రదుఃఖముచేతను, నిరంతర ధ్యానముచేతను, అధికమగు భయముచేతను, మిక్కిలి క్షీణించినదై, కృశించినదై, దీనురాలై స్వల్పమైన ఆహారమును భుజించుచు తపోనిమగ్నురాలైయున్న సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాంజలిం దేవతా మివ
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్. 22

పదచ్ఛేదము :- ఆయాచమానాం - దుఃఖార్తాం - ప్రాంజలిం - దేవతాం - ఇవ - భావేన - రఘుముఖ్యస్య - దశగ్రీవ పరాభవమ్.

అన్వయక్రమము :- రఘుముఖ్యస్యభావేన దశగ్రీవ పరాభవం దేవతాం ఆయాచమానాం ఇవ ప్రాంజలిం, దుఃఖార్తాం (సీతాం దదర్శ)

ప్రతిపదార్థము :- రఘుముఖ్యస్యభావేన = శ్రీరాముని ప్రభావముచేత, దశగ్రీవ పరాభవం = రావణుని పరాభవమును, దేవతాం = తన ఇష్టదైవమును. ఆయాచమానాం ఇవ = ప్రార్థించుచున్నదివలె, ప్రాంజలిం = దోసిలొగ్గియున్నదై, దుఃఖార్తాం = దుఃఖముచే కృంగియున్నట్టి, (సీతాం దదర్శ = సీతను చూచెను.)

తాత్పర్యము :- తన ప్రియుడైన శ్రీరాముని ప్రభావముచే రావణాసురునకు పరాభవము కలుగవలయునని మనస్సునందు కోరుచు తన ఇష్టదైవమును ప్రార్థించు చున్నట్లుగా దుఃఖార్తయై, చేతులు జోడించుకొనియున్న సీతాదేవిని రావణుడు చూచెను.

శ్లో॥ సమీక్షమాణాం రుదతీ మనిందితాం
సుపక్ష్మతామ్రాయత శుక్లలోచనామ్,
అనువ్రతాం రామ మతీవ మైథిలీం
ప్రలోభయామాస వధాయ రావణః. 23

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సున్దరకాండే
'క్లేశ గత సీతోపమా' నామ
ఏకోనవింశ స్సర్గః

—o—

పదచ్ఛేదము .- సమీక్షమాణాం - రుదతీం - అనిందితాం - సుపక్ష్మతామ్రాయత శుక్లలోచనామ్, అనువ్రతాం - రామం - అతి - ఇవ - మైథిలీం - ప్రలోభయామాస - వధాయ - రావణః.

అన్వయక్రమము. - సుగమము.

ప్రతిపదార్థము :- సమీక్షమాణాం = (నలువైపులను) చూచుచున్నదియును, రుదతీం = శోకించుచున్నదియును, అనిందితాం = ఉత్తమురాలును, సుపక్ష్మతామ్రాయత శుక్లలోచనాం = సుందరమైన రెప్పలతోగూడిన ఎఱ్ఱని విశాలమైన తెల్లని కన్నులు గలదియును, రామం అతీవ అనువ్రతాం = శ్రీరామునే మిక్కిలిగ నమ్మియున్నదియును అగు, మైథిలీం = జానకీదేవిని, రావణః = రావణాసురుడు, వధాయ = మరణము కొరకై, ప్రలోభయామాస = లోభపెట్టెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :– 'వధాయ' రావణునిదుష్టయత్నము తన వధ కొరకే యైనది; తన ఇష్టసిద్ధికి కాలేదని భావము.

తాత్పర్యము :– తనను రక్షించు వారినిగూర్చి పలువైపులకు చూచుచు, సహజముగా ఎఱ్ఱనైన తన విశాల సుందర నేత్రములు దుఃఖముచే తెల్లబడి యుండగా విలపించుచు, రామునియందే లగ్నమైన చిత్తములో నిర్దుష్టమైన వర్తనముతోనున్న సీతాదేవిని రావణాసురు డప్పుడు తన వధకొరకైయన్నట్లు ఆమెను లోభపెట్టుచు మాటలాడసాగెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
" సుబోధిని " అను ఆంధ్ర వివరణమునందు
" క్లేశగత సీతోపమానములు " అను
పందొమ్మిదవ సర్గము.

—0—

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

వింశ స్సర్గః

శ్లో॥ స తాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీమ్,
సాకారై ర్మధురై ర్వాక్యై ర్న్యదర్శయత రావణః.

పదచ్ఛేదము :- సః - తాం - పతివ్రతాం - దీనాం - నిరానందాం - తపస్వినీమ్, సాకారైః - మధురైః - వాక్యైః - న్యదర్శయత - రావణః.

అన్వయక్రమము :- పతివ్రతాం, దీనాం, నిరానందాం, తపస్వినీం, తాం, సః రావణః, సాకారైః, మధురైః, వాక్యైః (స్వాభిప్రాయం) న్యదర్శయత.

ప్రతిపదార్థము :- పతివ్రతాం = పతివ్రతయును, దీనాం = దీనురాలును, నిరానందాం = ఆనందమును గోల్పోయినదియును, తపస్వినీం = బాధలకులోనైనదియు నగు, తాం = ఆ సీతాదేవినిగూర్చి, సః రావణః = ఆ రావణాసురుడు, సాకారైః = తన భావమును వెల్లడించునట్టి, మధురైః = తీయనైనట్టి, వాక్యైః = మాటలతో (స్వాభిప్రాయం) న్యదర్శయత = (తన అభిప్రాయమును) వెలిబుచ్చెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'పతివ్రతాం' అనుటకు బదులుగా 'పరిష్కారాం' అని బొంబాయి ముద్రణము. అనగా రాక్షసులచే పరివేష్టింప బడియున్నది.

తాత్పర్యము :- పతివ్రతయై ఆనందమునకు దూరమై దీనావస్థలోనున్నట్టి ఆ సీతాదేవినిగూర్చి ఆమెకడకు వచ్చిన రావణుడు లియ్యనైన అభిప్రాయ గర్భితములగు మాటలతో తన హృదయము నిట్లు వెల్లడించెను.

శ్లో॥ మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరమ్,
అదర్శన మి వాత్మానం భయా న్నేతుం త్వ మిచ్ఛసి.

పదచ్ఛేదము :- మాం - దృష్ట్వా - నాగనాసోరు - గూహమానా - స్తనోదరమ్, అదర్శనం - ఇవ - ఆత్మానం - భయాత్ - నేతుం - త్వం - ఇచ్ఛసి.

అన్వయక్రమము :- నాగనాసోరు ! మాందృష్ట్వా, స్తనోదరం గూహమానా, భయాత్, ఆత్మానం అదర్శనం నేతుం ఇవ, త్వం (కుతః) ఇచ్ఛసి?

ప్రతిపదార్థము :- నాగనాసోరు = ఏనుగుతొండములవంటి ఊరువులుగల యో సుందరీ ! మాం దృష్ట్వా = నన్నుజూచి, స్తనోదరం గూహమానా= స్తనములను ఉదరమును కప్పివేసికొన్నదాన వై, భయాత్— భీతివలన, ఆత్మానం అదర్శనం నేతుంఇవ = నీ రూపమును కనబడకుండ చేయుటకువలె, త్వం (కుతః) ఇచ్ఛసి ? = నీవేల కోరుచున్నావు!

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు :- అదర్శనంనేతుం (కుతః) ఇచ్ఛసి ? వాస్తవమునకు పుత్రసమునైన భృత్యునిచూచునపుడు భయాదుల నొందుట ఉచితము కాదని రహస్యార్థము.

తాత్పర్యము :- ఓ సుందరాంగీ! నన్ను చూడగనే నీ స్తనములను ఉదరమును కప్పుకొనుచు నాకు నీ రూపము కనబడకుండ చేయుటకై భీతితో నీవేల ప్రవర్తించుచుంటివి?

శ్లో॥ కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే,
సర్వాంగగుణసంపన్నే సర్వలోకమనోహరే. 3

పదచ్ఛేదము :- కామయే - త్వాం - విశాలాక్షి - బహుమన్యస్వ - మాం - ప్రియే-సర్వాంగగుణసంపన్నే-సర్వలోకమనోహరే

అన్వయక్రమము .- సర్వాంగగుణసంపన్నే, సర్వలోకమనోహరే, విశాలాక్షి! త్వాం కామయే; ప్రియే! మాం బహుమన్యస్వ.

ప్రతిపదార్థము :- సర్వాంగగుణసంపన్నే = అన్ని అవయవములయందును శుభలక్షణములు కలిగినట్టి సర్వలోకమనోహరే = సమస్త లోకములకును మనోహరమైన సౌందర్యముగల, విశాలాక్షి = విశాలమైన నేత్రములుగల సుందరీ? త్వాం కామయే = నిన్ను కామించుచున్నాను. ప్రియే != ఓ ప్రియురాలా! మాం బహుమన్యస్వ = నన్ను గౌరవింపుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు : 'త్వాంకామయే'—నాకు పరమేశ్వరినిగా నిన్ను కోరుచున్నాను అని రహస్యార్థము.

తాత్పర్యము .- సర్వసద్గుణములతో ప్రకాశించుచు సర్వలోకములయొక్క మనస్సులను హరించునట్టి ఓ సుందరాంగీ! నిన్ను నేను కోరుచున్నాను, నాకు ప్రియురాలివై నన్ను ప్రేమతో మన్నింపుము.

శ్లో॥ నేహ కేచి న్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః,
వ్యపసర్పతు తే సీతే భయం మత్త స్సముత్థితమ్.

పదచ్ఛేదము :- న - ఇహ - కే - చిత్ - మనుష్యాః-వా - రాక్షసాః - కామరూపిణః - వ్యపసర్పతు - తే - సీతే - భయం - మత్తః - సముత్థితమ్.

అన్వయక్రమము : సీతే, ఇహ కేచిత్ మనుష్యాః వా, కామరూపిణః రాక్షసాః వాః న, మత్తః సముత్థితం భయం తే వ్యపసర్పతు.

ప్రతిపదార్థము :- సీతే ! = ఓ జానకీ ! ఇహ = ఇచట, కేచిత్ మనుష్యాః వా = ఏమనుష్యులుగాని, కామరూపిణః రాక్షసాః వా = కామరూపులైన రాక్షసులుగాని, న = లేరు. మత్తః సముత్థితం = నానుండి కలిగినట్టి, తే = నీయొక్క, భయం = భయము, వ్యపసర్పతు = తొలగిపోవుగాక !

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- నన్నుమించిన భయహేతువులైన మనుష్యులుగాని రాక్షసులుగాని ఇట నెవ్వరును లేరని భావము.

మహేశ్వరతీర్థులు :- ఇచ్చట మనుష్యులుగాని రాక్షసులుగాని నీకు భయముకలిగించువారు ఎవ్వరును లేరు. సర్వేశ్వరియైన నీకు ఎవ్వరి వలనను భయముగాని శంకగాని యుండదగదా యని రహస్యార్థము.

తాత్పర్యము :- ఓ జానకీ ! ఇవట నీవు సందేహింపవలసినట్టి మనుష్యులుగాని కామరూపులైన రాక్షసులుగాని ఎవ్వరునులేరు. నావలన భయపడవలసినది నీకెన్నడును లేదుసుమా !

శ్లో॥ స్వధర్మో రక్షసాం భీరు సర్వదైవ న సంశయః,
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా. 5

పదచ్ఛేదము :- స్వధర్మః - రక్షసాం - భీరు - సర్వథా -
ఏవ - న - సంశయః - గమనం - వా - పరస్త్రీణాం - హరణం -
సంప్రమథ్య - వా॥

అన్వయక్రమము :- భీరు, పరస్త్రీణాం గమనం వా, సంప్ర
మథ్య హరణంవా, రక్షసాం సర్వథా స్వధర్మః ఏవ, న సంశయః.

ప్రతిపదార్థము :- భీరు ! = ఓ భయస్వభావురాలవైన జానకీ!
పరస్త్రీణాం గమనం = పరస్త్రీలను పొందుటయు, సంప్రమథ్య హరణంవా =
బలాత్కరించి అపహరించుటయును, రక్షసాం = రాక్షసజాతివారికి,
సర్వథా = ఎల్లవిధములను, స్వధర్మః ఏవ = కులధర్మమే, న సంశ
యః = సందేహములేదు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'న సంశయః'— బలాత్కారముగా పట్టినచే
అపహరింపబడుచున్నది గావున సహజముగా అస్వతంత్రురాలగు స్త్రీకి
దోషశంక గూడ అక్కరలేదని రావణుని భావము.

రామాయణ శిరోమణి :- పరస్త్రీహరణాది దోష్కృత్యము
చేసిన పాతకుని చూచుటయు అధర్మము అని శంకింపనక్కరలేదు. అది
మా రాక్షసులకు సహజమైన ధర్మమేయని రావణాసురుడు తెలుపుచున్నాడు.

తాత్పర్యము :- ఓ భీతచిత్తురాలవైయున్న జానకీ ! పరస్త్రీల
ననుభవించుటయు బలాత్కరించి ఇంటికి తెచ్చుకొనుటయు, మా రాక్షస
వంశమువారికి సర్వవిధముల కులసిద్ధమైన ధర్మమైయున్నది, కాబట్టి నిన్ను
చేబట్టువిషయమున నీకు ఎట్టి శంకకును తావులేదు.

శ్లో॥ ఏవం చైత దకామాంతు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి,
కామం కామ శ్శరీరే మే యథాకామం ప్రవర్తతామ్.

పదచ్ఛేదము :- ఏవం - చ - ఏతత్ - అకామాం-తు - న-
త్వాం - స్పృక్ష్యామి - మైథిలి - కామం - కామః - శరీరే - మే -
యథాకామం - ప్రవర్తతామ్.

అన్వయక్రమము :- మైథిలి, ఏతత్ ఏవం; అకామాం త్వాంతు
న స్పృక్ష్యామి; మేశరీరే కామః కామం యథాకామం, ప్రవర్తతామ్.

ప్రతిపదార్థము :- మైథిలి = ఓ జానకీ ; ఏతత్ ఏవం = ఇది
ఇట్టిదైనను, అకామాం త్వాంతు = (నాపై) కామములేనట్టి నిన్నుమాత్రము,
న స్పృక్ష్యామి = తాకను. మే శరీరే = నా శరీరమునందే, కామః =(నా)
కామము, కామం యథాకామం = ఎంతయు ఇష్టమువచ్చిన రీతిగా, ప్రవ
ర్తతామ్ = చరించుచు నుండుగాక ;

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ' కామఃమేశరీరే యథాకామం కామంప్రవర్తతామ్ '
= మన్మథుడు నా శరీరమునందు స్వేచ్ఛగా కామమును విస్తరింపచేయు
గాక ;

రామాయణ శిరోమణి :- నాపై కామములేకయున్న నిన్ను
తాకుట యనునది జరుగనీయను. నిన్ను నా కన్నులతో మాత్రమే చూచె
దను. నీ దర్శనేచ్ఛారూపమైన కామము మాత్రమే నా శరీరమున చెలరేగు
చుండుగాక ;

మహేశ్వరతీర్థులు :- పరదారాహరణము మున్నగునవి రాక్ష
సులయొక్క స్వభావమైనను, నేను మాత్రము అకామమైన నిన్ను—(అ=
అనగా విష్ణుమూర్తియందు మాత్రమే; కామః=కోరికయున్న నిన్ను, నేను
తాకనైననుతాకను. నా మన్మథవికారము నా శరీరమునందే అణగియుండు
గాక ; నీఅజ్ఞలేనిదే పూజార్థముగాకూడ నిన్ను తాకను అని రహస్యార్థము.

తాత్పర్యము :- ఏమయినను, నన్ను కామింపనట్టి నిన్ను నేను ఏంతమాత్రము తాకను సుమా! ఓ జానకీ! నాలో విజృంభించుచున్న మన్మథవికారము నా శరీరమునందే అణగియుండుగాక.

శ్లో॥ దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే,
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూః శోకలాలసా. 7

పదచ్ఛేదము :- దేవి - న - ఇహ - భయం - కార్యం - మయి - విశ్వసిహి - ప్రియే - ప్రణయస్వ - చ - తత్త్వేన - మా - ఏవం - భూః - శోకలాలసా.

అన్వయక్రమము :- దేవి, ఇహ భయం నకార్యం; ప్రియే, మయి విశ్వసిహి, తత్త్వేన ప్రణయస్వచ, ఏవం శోకలాలసా మాభూః.

ప్రతిపదార్థము :- దేవి ! = ఓ పూజ్యురాలా ! ఇహ = నీ శీలరక్షణ విషయమున, భయం నకార్యం = భయపడనక్కఱలేదు. ప్రియే ! = ఓ ప్రియురాలా ! మయి విశ్వసిహి = నాయందు విశ్వాసముంచుము, తత్త్వేన ప్రణయస్వచ = వాస్తవముగనే నాయందు ప్రేమ గలిగి యుండుము. ఏవం = ఈరీతిగా, శోకలాలసా మాభూః = దుఃఖని మగ్నురాలవు గాకయుండుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- దేవి ! = అంతఃపురమునకెంతకును పూజ్యురాలపై యుండునట్టి ఓ రమణీ !.

తాత్పర్యము :- ఓ పూజ్యురాలా ! నీ శీలరక్షణమునుగూర్చి భయపడకుము. నాపై పూర్తిగా విశ్వాసమును కలిగియుండుము. నన్ను

హృదయపూర్వకముగ ప్రేమింపుము. ఈ విధముగా దుఃఖనిమగ్నురాలవై యుండకుము.

శ్లో॥ ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలిన మంబరమ్,
అస్థానే ఽప్యుపవాసశ్చ నైతా న్యౌపయికాని తే. 8

పదచ్ఛేదము _ ఏకవేణీ - ధరాశయ్యా - ధ్యానం - మలినం- అంబరమ్, అస్థానే - అపి - ఉపవాసః - చ - న - ఏతాని - ఔపయికాని - తే.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము _ ఏకవేణీ = జటకట్టిన కేశములు, ధరాశయ్యా = నేలపైపరుండుట, ధ్యానం = తీవ్రచింతనము, మలినం అంబరం = మలినవస్త్రము, అస్థానే ఉపవాసఃఅపి = అనావశ్యకముగ ఉపవసించి యుండుటయును, ఏతాని = ఇవి, తే = నీకు, ఔపయికాని న = యుక్తమయినవిగావు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- నఔపయికాని - పురుషార్థములకుఉపయుక్తములైనవిగావు.

రామాయణ శిరోమణి :- 'అస్థానే' అనుపదము ఏకవేణీ మున్నగు అన్నిటికిని అన్వయించును.

తాత్పర్యము : ఈరీతిగా కేశములను జడకట్టించుట, నేలపై పరుండుట, చింతానిమగ్నురాలవై యుండుట, మలినమైన వస్త్రములుధరించి యుండుట, నిష్కారణముగా ఉపవాసము చేయుచుండుట అను నీ కృత్యము లెంతమాత్రమును నీకు తగినవి కావుసుమా!

శ్లో॥ విచిత్రాణిచ మాల్యాని చందనా న్యగరూణి చ,
వివిధానిచ వాసాంసి దివ్యా న్యాభరణాని చ. 9

శ్లో॥ మహార్హాణిచ పానాని శయనా న్యాసనాని చ,
గీతం నృత్తంచ వాద్యంచ లభ మాం ప్రాప్య మైథిలీ.10

పదచ్ఛేదము .— విచిత్రాణి - చ - మాల్యాని - చందనాని - అగరూణి - చ - వివిధాని - చ, మహార్హాణి - చ - పానాని- శయనాని- ఆసనాని - చ - గీతం - నృత్యం - చ - వాద్యం - చ - లభ - మాం- ప్రాప్య - మైథిలి.

అన్వయక్రమము :— సుగమము.

ప్రతిపదార్థము :— మైథిలి = ఓ జానకీ ! మాం ప్రాప్య = నన్నుపొంది, విచిత్రాణి మాల్యాని = చిత్రవిచిత్రములైన పుష్పమాలిక లను, చందనాని = సుగంధములను, అగరూణిచ = అగరుధూపములను, వివిధాని వాసాంసిచ = బహువిధములైన వస్త్రములను, దివ్యాని ఆభరణా నిచ = లోకోత్తరములైన భూషణములను, మహార్హాణి = అమూల్యము లైనట్టి, పానాని=పానీయములను, శయనాని, = తల్పములను, ఆసనానిచ= పీఠములను, గీతం = సంగీతమును, నృత్యంచ = నాట్యమును, వాద్యంచ = వాద్యమును, లభ = సంపాదించుకొనుము.

తాత్పర్యము :— ఓ జానకీ ! నీవునన్ను స్వీకరించి చిత్ర విచిత్రములైన పుష్పమాలికలను, చందనాది సుగంధములను, అగరుప్రభృతి ధూపములను పలువిధములగు వస్త్రవిశేషములను, లోకోత్తరములగు భూషణములను, అమూల్యములైన పానీయములను, హంసతూలికా తల్ప ములను, వివిధమణిమయాసనములను నృత్యగీతవాద్యాది విలాసములను పొంది తనివితీర అనుభవింపుము.

శ్లో॥ స్త్రీరత్న మసి మైవం భూః కురు గాత్రేషు భూషణమ్,
మాం ప్రాప్యహి కథంను స్యా స్త్వ మనర్హా సువిగ్రహే.

పదచ్ఛేదము :- స్త్రీ రత్నం - అసి - మా - ఏవం - భూః - కురు - గాత్రేషు - భూషణమ్; మాం - ప్రాప్య - హి - కథం - ను - స్యాః - త్వం - అనర్హా - సువిగ్రహే.

అన్వయక్రమము :- స్త్రీరత్నం అసి, ఏవం మాభూః; గాత్రేషు భూషణంకురు, సువిగ్రహే ! మాం ప్రాప్య త్వం కథం ను అనర్హాస్యాః?

ప్రతిపదార్థము :- స్త్రీరత్నం అసి = స్త్రీలలో శ్రేష్ఠురాలవు, ఏవం మాభూః = ఈ రీతిగానుండకుము, గాత్రేషు భూషణం కురు = అవయవములయందు ఆభరణములను ధరింపుము, సువిగ్రహే! = ఓ సుందరాంగీ! మాంప్రాప్య = నన్నుపొంది, త్వం = నీవు, కథంను = ఎట్లుగా, అనర్హా స్యాః = అర్హురాలివి కాకుండ నుండగలవు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

రామాయణ శిరోమణి :- 'అనర్హా' = అపూజిత. నన్ను చేబట్టి పూజితురాలవుగాకుండగ ఎట్లుందువు.

తాత్పర్యము :- నీవు స్త్రీజాతికి మేలుబంతివి. ఈ రీతిగా మలినరూపముతో నుండకూడదు. ఒడలినిండ ఆభరణములను ధరింపుము, దివ్యమైన రూపసంపదగల ఓ సుందరీ ! నన్నుచేపట్టినపిమ్మట అలంకార యుక్తురాలవు గాకుండ ఎట్లుండగలవు ?

శ్లో॥ ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే,
యదతీతం పునర్నైతి స్రోతః శ్శీఘ్ర మపామివ. 12

పదచ్ఛేదము :- :- ఇదం - తే - చారు - సంజాతం - యౌవనం - వ్యతివర్తతే - యత్ - అతీతం - పున - న-ఏతి-స్రోతః - శీఘ్రం - అపాం - ఇవ

అన్వయక్రమము :- చారుసంజాతం తే యౌవనం వ్యతివర్తతే; అపాం శీఘ్రంస్రోతఃఇవ, యత్అతీతం, తత్ పునః న ఏతి.

ప్రతిపదార్థము .- చారుసంజాతం = సుందరముగా లభించినట్టి, తే = నీయొక్క, ఇదం = ఈ, యౌవనం = యౌవనవయస్సు, వ్యతివర్తతే = అతిక్రమించిపోవుచున్నది. అపాం = నీటియొక్క శీఘ్రం స్రోతః ఇవ = వేగమైన ప్రవాహమువలె. యత్ అతీతం = ఏది దాటిపోయినదో, తత్ = అది, పునః న ఏతి = తిరిగిరాజాలదు.

విశేషార్థములు - వ్యాఖ్యాతల అభిప్రాయములు

మహేశ్వరతీర్థులు :- భోగములను అనుభవించుటకిదియేతగిన కాలము, నీకు భృత్యుడనైన నావయస్సు వ్యర్థముగా గడచిపోవుచున్నది. అందుచే నాకు యోగ్యమైనట్టి నీయాజ్ఞకై అనుజ్ఞ కాసగుమని నిగూఢమైన భావము.

తాత్పర్యము .- నదియందు ప్రవహించు నీరువలె గడచిపోయినది వెనుకకురాదుగదా! అనన్యదుర్లభమైన నీయౌవనవయస్సు వ్యర్థముగా గడచిపోవుచున్నదిసుమా!

శ్లో॥ త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృట్,
నహి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే. 13

పదచ్ఛేదము :- త్వాం - కృత్వా - ఉపరతః - మన్యే - రూపకర్తా - సః - విశ్వసృట్ - నహి - రూపోపమా - తు - అన్యా-తవ - అస్తి - శుభదర్శనే.

అన్వయక్రమము :- శుభదర్శనే!, రూపకర్తా, సః విశ్వసృట్ త్వాం కృత్వా, ఉపరతః, (ఇతి) మన్యే, తవ రూపోపమా అన్యా నాస్తి హి.

ప్రతిపదార్థము :- రూపకర్తా = సుందరరూపమును సృష్టిచేయు, సః విశ్వసృట్ = ఆసృష్టికర్త, త్వాం = నిన్ను, కృత్వా = నిర్మాణము చేసి, ఉపరతః (ఇతి) = విరమించుకొన్నాడని, మన్యే = భావించుచున్నాను. శుభదర్శనే = మంగళకరమైన దర్శనముగల ఓ జానకీ !, తవ = నీకు రూపోపమా = సౌందర్యమునందు సాటివచ్చునట్టి, అన్యా = ఇంకొకస్త్రీ న అస్తి హి = లేదుగదా !

విశేషార్థములు; వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'రూపకర్తా' - దివ్యసౌందర్యమును సృష్టింప తలపెట్టిన బ్రహ్మదేవునకు తిరిగి అతడెంతయత్నించినను, ఇట్టినిర్మాణము సాధ్యముకాదని భావము. అందుచేతనే బ్రహ్మ ఇట్టి సౌందర్యనిర్మాణమును తిరిగి తలపెట్టడని తెలుపుచున్నాడు.

గోవిందరాజీయము :- ఉత్తరోత్తర సౌందర్య నిర్మాణము చేయగోరుచు, నీ సౌందర్యాతిశయమును సృష్టించి, ఇట్టినిర్మాణ మసాధ్యమనితెలిసికొని బ్రహ్మ తిరిగి ఆపనిని విరమించెను అనిభావము.

తాత్పర్యము :- లోకోత్తరసౌందర్యమును నిర్మింపదలచినట్టి ఆ సృష్టికర్తయైన బ్రహ్మ నిన్నే సౌందర్యరాశిగా నిర్మించి, ఇంతకంటెను ఉత్తమనిర్మాణము అసాధ్యమని తెలిసికొని అటుపిమ్మట అతడు సుందరరూప సృష్టినే మానుకొనెనని తలచుచున్నాను. ఎందుచేతననగా, మంగళకరమైన దివ్యసౌందర్యముగల నీకు సాటివచ్చునుంటవి సృష్టిలో వేరొకతె లేదుగదా!

శ్లో॥ త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవన శాలినీమ్,
కః పుమా నతివర్తేత సాక్షాదపి పితామహః. 14

పదచ్ఛేదము:- త్వాం - సమాసాద్య - వైదేహి - రూపయౌవనశాలినీమ్, కః - పుమాన్ - అతివర్తేత - సాక్షాత్ - (అపి) పితామహః.

అన్వయక్రమము:- వైదేహి ! రూపయౌవనశాలినీం త్వాం సమాసాద్య సాక్షాత్ పితామహః అపి కః పుమాన్ అతివర్తేత?

ప్రతిపదార్థము.- వైదేహి = ఓ జానకీ! రూపయౌవనశాలినీం = సౌందర్యముతోడను, యౌవనముతోడను ప్రకాశించుచున్నట్టి, త్వాం సమాసాద్య = నిన్నుచేరి, సాక్షాత్ పితామహః అపి = స్వయముగా బ్రహ్మదేవుడయినను, కః పుమాన్ = ఏపురుషుడు, అతివర్తేత = దాటి పోవగలడు !

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు - 'సీతా లక్ష్మీః భవాన్ విష్ణుః' అనిముందు చెప్పబోవురీతిగా, సాక్షాత్ బ్రహ్మదేవుడుకూడ సీత సన్నిధికివచ్చినప్పడు, ఆరాధింపక వెడలిపోవడు. ఇతరపురుషుడు ఎవడు అతిక్రమింపగలడు ? అని గూఢమైన భావము.

తాత్పర్యము :- లోకోత్తర రూపయౌవనములచే ప్రకాశించుచున్నట్టి నిన్నుజూచిన ఏపురుషుడు నిగ్రహించుకొనగలడు ! స్వయముగ బ్రహ్మదేవుడయినను మనస్సునందు క్షోభనుపొందక యుండగలడా !

శ్లో॥ యద్యత్పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే,
తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే. 15

పదచ్ఛేదము :– యత్ - యత్ - పశ్యామి - తే - గాత్రం - శీతాంశుసదృశాననే - తస్మిన్ - తస్మిన్ - పృథుశ్రోణి - చక్షుః - మమ - నిబధ్యతే.

అన్వయక్రమము :– శీతాంశు సదృశాననే, పృథుశ్రోణి ! తే యత్ యత్ గాత్రం పశ్యామి, తస్మిన్ తస్మిన్ మమచక్షుః నిబధ్యతే.

ప్రతిపదార్థము :– శీతాంశుసదృశాననే = చంద్రబింబము వంటి ముఖముగల ఓ సుందరీ! పృథుశ్రోణి = విశాలమైన కటిసీమగల ఓ కోమలీ ! తే యత్ యత్ గాత్రం పశ్యామి = నీయొక్క ఏ యే అవయవమును చూచుచున్నానో, తస్మిన్ తస్మిన్ = ఆయా అవయవమునందు, మమ చక్షుః నిబధ్యతే = నాదృష్టి కట్టివేయబడుచున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు :– ఇష్టదేవతవైన నీదర్శనము ముక్తిసాధన మగుటవలన నాదృష్టినీయందు బంధింపబడుచున్నది యని రహస్యార్థము.

రామాయణ శిరోమణి :– ఈ వర్ణనముచే సీతాదేవి చరణారవింద దర్శనమహిమయిచట వర్ణింపబడినది.

తాత్పర్యము :– హిమాంశు శీతలమైన ముఖ ప్రకాశముగల ఓ సుందరాంగి ! నీశరీరమునందలి ఏఅవయవమును జూచిన, ఆయవయవమునందే నాదృష్టి బంధింపబడిపోవుచున్నదిసుమా !

శ్లో॥ భవ మైథిలి భార్యా మే మోహ మేనం విసర్జయ,
బహ్వీనా ముత్తమస్త్రీణా మాహృతానా మితస్తతః,
సర్వాసా మేవ భద్రం తే మ మాగ్రమహిషీ భవ. 16

పదచ్ఛేదము :- భవ - మైథిలి - భార్యా - మే - మోహం - ఏనం - విసర్జయ, బహ్వీనాం - ఉత్తమస్త్రీణాం - ఆహృతానాం - ఇతః - తతః - సర్వాసాం - ఏవ - భద్రం - తే - మమ - అగ్రమహిషీ - భవ.

అన్వయక్రమము :- మైథిలి ! మే భార్యా భవ, ఏనం మోహం విసర్జయ, ఇతః తతః ఆహృతానాం, బహ్వీనాం, సర్వాణాం ఉత్తమస్త్రీణాం త్వమేవ మమ అగ్రమహిషీభవ, తే భద్రం (భవేత్).

ప్రతిపదార్థము .- మైథిలి = ఓజానకీ ! మే భార్యా భవ = నాకు భార్యవగుము. ఏనం మోహం విసర్జయ = ఈ భ్రాంతిని విడిచి పెట్టుము, ఇతః తతః ఆహృతానాం = ఇచటినుండి అచటినుండి తీసికొని రాబడినట్టి, బహ్వీనాం = అసంఖ్యాకములైన, సర్వాసాం ఉత్తమస్త్రీణాం = ఎల్ల ఉత్తమస్త్రీలలో, త్వమేవ = నీవే, మమ = నాకు, అగ్రమహిషీ భవ = పట్టమహిషివి అగుము. తే భద్రం (భవేత్) = నీకుక్షేమము అగును.

విశేషార్థములు వ్యాఖ్యాతల అభిప్రాయములు

తిలకము :- మోహం విసర్జయ - ఈతనికి నేనేలభార్యను గావలెను అను అజ్ఞానమును విడువుము.

మహేశ్వరతీర్థులు :- భార్యాభవ - (భయా కాంత్యా అర్యా - భార్యా) = నీ సహజప్రకాశముచే శ్రేష్ఠురాలవై యుండుము, ఏనంమోహంవిసర్జయ = నాయందుశత్రుత్వశంకను విడువుము.

ఉత్తమస్త్రీణాం, మమచ, యాఅగ్రమహిషీ తస్యాః చ ఈశ్వరీ భవ = ఉత్తమస్త్రీలైన నాఇతరభార్యలకును పట్టమహిషియైన మండోదరికి నాకును ఈశ్వరివిగానుండుమని రహస్యార్థము.

తాత్పర్యము:- ఓ జానకీ! నాకు భార్యవగుము. అనావశ్యకమైన శంకనువిడుము. నే నెల్ల లోకములనుండి తీసికొనివచ్చిన అసంఖ్యాక ములగా నున్ననాభార్యలందరకును, నీవే పట్టమహిషివిగానుండి గొప్ప మేలు సంపాదించుకొనుము.

శ్లో॥ లోకేభ్యో యాని రత్నాని సంప్రమథ్యాహృతాని వై,
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైత దహం చ తే. 17

పదచ్ఛేదము :- లోకేభ్యః - యాని - రత్నాని - సంప్రమథ్య - ఆహృతాని - వై - తాని - మే - భీరు - సర్వాణి - రాజ్యం - చ - ఏతత్ - అహం - చ - తే.

అన్వయక్రమము : భీరు ! లోకేభ్యః, యానిరత్నాని, సంప్రమథ్య, ఆహృతాని, తానిసర్వాణి, ఏతత్ మే రాజ్యంచ, అహంచ, తే (భవిష్యామః)

ప్రతిపదార్థము :- 'భీరు' = ఓభీతచిత్తురాలా ! లోకేభ్యః = లోకములనుండి, యాని రత్నాని = ఏశ్రేష్ఠవస్తువులైతే, సంప్రమథ్య = యుద్ధమునఓడించి, ఆహృతాని = తేబడినవో, తాని సర్వాణి = ఆవస్తువు లన్నియును, ఏతత్ రాజ్యంచ = ఈ సామ్రాజ్యమున్ను, అహంచ = నేనుకూడను, తే (భవిష్యామః) = నీవి (కాగలము)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు ,- ఇష్టదేవతయైన సీతాదేవికి రావణుడు ఇచ్చుట, ఆత్మసమర్పణముగావించుకొనుచున్నాడు, 'అహంచతే' -అనుటచే ఆత్మసమర్పణమును; "తానిసర్వాణి రత్నాని" - అనుటచే ఆత్మీయ సర్వ వస్తు సమర్పణమును చేయుచున్నాడు అని గూఢార్థము.

తాత్పర్యము .- భయస్వభావురాలవైన ఓ జానకీ ! యుద్ధములో జయించివచ్చునపుడు ఏ యే అమూల్యములైన శ్రేష్ఠవస్తువులను తెచ్చియుంటినో అవియన్నియును, ఈ నా సామ్రాజ్యమంతయును, నేనును నేటినుండి నీయధీనమైయుందుము సుమా !

శ్లో॥ విజిత్య పృథివీం సర్వాం నానా నగర మాలినీమ్,
జనకాయ ప్రదాస్యామి తవ హేతో ర్విలాసిని. 18

పదచ్ఛేదము .- విజిత్య - పృథివీం - సర్వాం - నానానగరమాలినీం - జనకాయ - ప్రదాస్యామి - తవ - హేతోః - విలాసిని.

అన్వయక్రమము :- విలాసిని ! నానానగరమాలినీం సర్వాం పృథివీం విజిత్య, తవహేతోః జనకాయ ప్రదాస్యామి.

ప్రతిపదార్థము :- విలాసిని = ఓసుందరాంగీ! నా నా న గ ర మాలినీం = బహువిధ పట్టణసమూహములతో గూడిన, సర్వాం పృథివీం, భూమండలమునంతను, విజిత్య = జయించి, తవ హేతోః = నీనిమిత్తమై, జనకాయ ప్రదాస్యామి - (నీతండ్రియైన) జనకునకొసగెదను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- తవహేతోః = నీకుప్రీతికలుగునిమిత్తము.

తాత్పర్యము :- ఓ సుందరాంగీ ! నీకుప్రీతిని కూర్చుటకై కావలసినచో నేనిప్పుడేపోయి వివిధ మహాపట్టణములతోకూడిన సమస్త భూమండలమును జయించి నీ జనకునకొసంగెదను.

శ్లో॥ నేహ పశ్యామి లోకే౽న్యం యో మే ప్రతిబలో భవేత్,
పశ్య మే సుమహ ద్వీర్య మప్రతిద్వంద్వ మాహవే. 19

పదచ్ఛేదము :- న - ఇహ - పశ్యామి - లోకే - అన్యం - యః - మే - ప్రతిబలః - భవేత్ - పశ్య - మే - సుమహత్ - వీర్యం - అప్రతిద్వంద్వం - ఆహవే.

అన్వయక్రమము :- యః మే లోకే ప్రతిబలః భవేత్ (తం) అన్యం ఇహ నపశ్యామి, అహవే అప్రతిద్వంద్వం మే సుమహద్ వీర్యం పశ్య.

ప్రతిపదార్థము :- యః = ఎవ్వడు, మే = నాకు, లోకే = లోకమునందు, ప్రతిబలః భవేత్ = ప్రతివీరుడుగా నుండగలడో, తం అన్యం = అట్టివానినిని, ఇహ = ఈభూమిపై, నపశ్యామి = చూడను, ఆహవే = యుద్ధమునందు, అప్రతిద్వంద్వం = ఎదురులేనట్టి, మే - నాయొక్క, సుమహత్ వీర్యం = మిక్కిలిగొప్పదైనపరాక్రమమును, పశ్య = చూడుము.

తాత్పర్యము :- నా కెదురునిలచి యుద్ధముచేయగల వీరుడు లోకమునందెక్కడను నాకుకాన్పింపలేదు. యుద్ధమునందు ఎదురులేనట్టి నా పరాక్రమమెట్టిదో నీవే తెలిసికొనుము.

శ్లో॥ అసకృత్సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః,
అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః. 20

పదచ్ఛేదము :- అసకృత్ - సంయుగే - భగ్నాః - మయా - విమృదితధ్వజాః - అశక్తాః - ప్రత్యనీకేషు - స్థాతుం - మమ - సురాసురాః

అన్వయక్రమము :- మమ సంయుగే, ప్రత్యనీకేషు స్థాతుం అశక్తాః, సురాసురాః అసకృత్ మయా విమృదిత ధ్వజాః (సంతః) భగ్నాః.

ప్రతిపదార్థము :- మమ సంయుగే = నాయొక్క యుద్ధమునందు, ...శత్యనీకేషు = విరోధిసైన్యమునందు, స్థాతుం = నిలచుటకు అశక్తాః = ...క్తి లేనివారై, సురాసురాః = దేవతలును రాక్షసులును, ...సకృత్ - ...బమారులు, మయా = నాచేత, విమృదితధ్వజాః (సంతః) = విరిగిపోయి...న ధ్వజములుగలవారై, భగ్నాః = భంగపాటునొందిరి.

తాత్పర్యము :- పెక్కు పర్యాయములు యుద్ధమునందు నా ...వలుగా శత్రుసైన్యమునందు నిలువలేక దేవతలును దానవులును గూడ ...హతమ రథధ్వజములు నేలగూలగా వెన్నిచ్చిపారిపోయిరి.

[6]॥ ఇచ్ఛయా క్రియతా మద్య ప్రతికర్మ త వోత్తరమ్,
స ప్రభాణ్యవ సజ్యంతాం త వాంగే భూషణాని చ. 21

పదచ్ఛేదము :- ఇచ్ఛయా - క్రియతాం - అద్య - పతికర్మ - ...౦ - ఉత్తరమ్; సప్రభాణి - అవసజ్యంతాం - తవ - అంగే - ...షణాని - చ.

అన్వయక్రమము :- ఇచ్ఛయా అద్య ఉత్తరం ప్రతికర్మ ...యతామ్; తవ అంగే సప్రభాణి భూషణానిచ అవసజ్యంతామ్.

ప్రతిపదార్థము :- ఇచ్ఛయా = కోరికతో, అద్య = నేడు, ... = నీకు, ఉత్తరం ప్రతికర్మ = మేలైనఅలంకరణము, క్రియతాం = ...యబడుగాక ; తవ అంగే = నీశరీరమునందు, సప్రభాణి భూషణానిచ= ...స్వప్రకాశముగల ఆభరణములుగూడ, అవసజ్యంతాం = అలంకరింప...గాక ;

" ఇచ్ఛయా " కు బదులుగా " ఇచ్ఛమాం " అని బొంబాయి ...దణము. అనగా నన్నుకోరుకొనుము అని అర్థము.

తాత్పర్యము .- నేడు నీవు మనస్ఫూర్తిగా నీ ఒడలిని అలంకరించుకొనుము. నీవంగీకరింపుము, నీశరీరమును నా పరిచారికలు అలంకరింతురు నీయొడలినిండ ధగధగమెఱయు ఆభరణములు ప్రకాశించుగాక,

శ్లో॥ సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా,
ప్రతికర్మాభిసంయుక్తా దాక్షిణ్యేన వరాననే,
భుఙ్క్ష్వ భోగా న్యథాకామం పిబ భీరు రమస్వ చ. 22

పదచ్ఛేదము :- సాధు - పశ్యామి - తే - రూపం-సంయుక్తం- ప్రతికర్మణా - ప్రతికర్మాభిసంయుక్తా - దాక్షిణ్యేన - వరాననే, భుఙ్క్ష్వ- భోగాన్ - యథాకామం - పిబ - భీరు - రమస్వ - చ.

అన్వయక్రమము :- తే సాధురూపం ప్రతికర్మణా సంయుక్తం పశ్యామి, వరాననే! దాక్షిణ్యేన ప్రతికర్మాభిసంయుక్తా (సతీ) యథాకామం, భోగాన్ భుంక్ష్వ; భీరు! పిబ, రమస్వచ.

ప్రతిపదార్థము :- తే = నీయొక్క, సాధురూపం = మేలైన రూపమును, ప్రతికర్మణా సంయుక్తం=అలంకరణములతో కూడినదానివిగా, పశ్యామి = చూచెదను. వరాననే = ఓ సుందరాంగీ! దాక్షిణ్యేన= దయతో, ప్రతికర్మాభిసంయుక్తా = అలంకరణములతోకూడినదానవై, యథాకామం- స్వేచ్ఛగా, భోగాన్ భుంక్ష్వ = భోగములను అనుభవింపుము. భీరు = భీతచిత్తురాలవైన ఓజానకీ! పిబ = త్రాగుము. రమస్వచ = మఱియు క్రీడింపుము.

తాత్పర్యము :- సుందరీ! నీరూపమును చక్కగా అలంకరించుకొనియుండగా, నాకు చూడవలెననియున్నది. ఓ కోమలీ! నాపైదయజూపి చక్కగాఅలంకరించుకొని స్వేచ్ఛగా సకలభోగములను అనుభవింపుము సుఖముగా త్రాగి క్రీడింపుము.

శ్లో॥ యథేష్టంచ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ,
లలస్వ మయి విస్రబ్ధా ధృష్ట మాజ్ఞాపయస్వ చ, 23
మత్ ప్రసాదా ల్లలంత్యాశ్చ లలంతాం బాంధవా స్తవ.

పదచ్ఛేదము :- యథేష్టం - చ - ప్రయచ్ఛ - త్వం-పృథివీం- వా - ధనాని - చ - లలస్వ - మయి - విస్రబ్ధా - ధృష్టం - ఆజ్ఞాప యస్వ - చ - మత్ప్రసాదాత్ - లలంత్యాః - చ -లలంతాం - బాంధవాః- తవ.

అన్వయక్రమము - త్వం పృథివీంవా ధనానిచ యథేష్టం ప్రయచ్ఛచ; విస్రబ్ధా, మయి లలస్వ, ధృష్టం ఆజ్ఞాపయస్వచ, మత్ ప్రసాదాత్ లలంత్యాః తవ బాంధవాఃచ లలంతామ్.

ప్రతిపదార్థము .- త్వం=నీవు, పృథివీంవా = భూమినిగాని, ధనానిచ = ధనములనుగాని, యథేష్టం = స్వేచ్ఛగా, ప్రయచ్ఛచ = ఇచ్చు కొనుము, విస్రబ్ధా = (నాపై) నమ్మకముకలిగినదానవై, మయి = నా యందు, లలస్వ = ప్రేమికలిగియుండుము, ధృష్టం = నిర్భయముగా, ఆజ్ఞాపయస్వచ = ఆజ్ఞాపింపుముకూడ. మత్ప్రసాదాత్ = నాఅనుగ్రహము వలన, తవ = నీవు, లలంత్యాః (సత్యాః) = సంతోషించుచున్నదాన వగుచుండగా, బాంధవాఃచ = నీబంధువులుగూడ, లలంతాం = సంతోషిం తురుగాక ।

తాత్పర్యము - నాకుపట్టమహిషివై స్వేచ్ఛగా కావలసినన్ని భూములను, సంపదలను నీయిష్టమువచ్చినవారికి ఇచ్చుకొనుము. నాయందు నమ్మకముంచి, నన్ను ప్రేమింపుము. నారాజ్యమున సమస్తమైన అధికార ములను కల్గి ఎదురులేనిదానవై నీఆజ్ఞను చెల్లించుకొనుము. నా అనుగ్ర హము బొంది నీవు సంతోషించుచుండగా నిన్నుజూచి నీబంధువులెల్లరును సంతోషింతురు గాక।

శ్లో॥ బుద్ధిం మ మానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే,

పదచ్ఛేదము :- బుద్ధిం - మమ - అనుపశ్య - త్వం - శ్రియం - భద్రె - యశః - చ - మే.

అన్వయక్రమము .- భద్రే ! త్వం, మమ బుద్ధిం, మే శ్రియం యశశ్చ అనుపశ్య.

ప్రతిపదార్థము :- భద్రే ! = ఓ మంగళస్వరూపురాలా ! త్వం = నీవు, మమ = నాయొక్క, బుద్ధిం = సమృద్ధిని, మే = నాయొక్క, శ్రియం = ఐశ్వర్యమును, యశః చ = కీర్తినికూడ, అనుపశ్య = తెలిసికొనుము.

తాత్పర్యము :-ఓ జానకీ ! నా సంపదలను, నా ఐశ్వర్యమును, నాకీర్తిప్రతిష్ఠలనుగూర్చి బాగుగా తెలిసికొనుము.

శ్లో॥ కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా,

నిక్షిప్తవిజయో రామో గతశ్రీ ర్వనగోచరః. 25

పదచ్ఛేదము :- కిం - కరిష్యసి - రామేణ - సుభగే చర వాససా నిక్షిప్తవిజయః - రామః - గతశ్రీః - వనగోచరః.

అన్వయక్రమము .- సుభగే ! చీరవాససా రామేణ కింకరిష్యసి? నిక్షిప్తవిజయః, గతశ్రీః రామః వనగోచరః (వర్తతే).

ప్రతిపదార్థము :- సుభగే ! = ఓ సుందరాంగీ ! చీరవాససా రామేణ = నారబట్టలు గట్టుకొన్న ఆ రామునితో, కిం కరిష్యసి = ఏమి చేయుదువు ? నిక్షిప్తవిజయః=తొలగిపోయిన విజయమును గలవాడై, గత

శ్రీః = నశించిన ఐశ్వర్యము గలవాడై, రామః = రాముడు, వనగోచరః (ప్రవర్తతే) = అడవులయందు తిఱుగువాడుగా నున్నాడు.

తాత్పర్యము :- ఓ సుందరాంగీ ! నారబట్టలు కట్టుకొని, అడవులవెంబడిని తిరుగుచు, రాజ్యమును ఐశ్వర్యమును, పోగొట్టుకొన్న ఆ రాముడు నీకేమి సౌఖ్యమును కూర్పగలడు ?

శ్లో॥ వ్రతీ స్థండిలశాయీచ శంకే జీవతివా నవా,
నహి వైదేహి రామ స్త్వాం ద్రష్టుంవా ప్యుపలప్స్యతే.
పురోబలాకై రసితై ర్మేఘై ర్జ్యోత్స్నా మివావృతాం.

పదచ్ఛేదము :- వ్రతీ - స్థండిలశాయీ - చ - శంకే - జీవతి - వా - న - వా - నహి - వైదేహి - రామః - త్వాం - ద్రష్టుం - వా - అపి - ఉపలప్స్యతే॥ పురోబలాకైః - అసితైః - మేఘైః - జ్యోత్స్నాం - ఇవ - ఆవృతామ్.

అన్వయక్రమము :- వ్రతీ, స్థండిలశాయీ చ రామః జీవతి వాన వా (ఇతి) శంకే; వైదేహి !, అసితైః, పురోబలాకైః, మేఘైః ఆవృతాం, జ్యోత్స్నాం ఇవ, త్వాం ద్రష్టుం రామః న ఉపలప్స్యతే.

ప్రతిపదార్థము :- వైదేహి ! = ఓ జానకీ !, వ్రతీ = వ్రతములను బూనియున్నవాడును, స్థండిలశాయీ చ=కటికినేలపై నిద్రించువాడునై, రామః = రాముడు, జీవతివా నవా = బ్రతికియున్నాడోలేదో, (ఇతి = అని) శంకే = సందేహించుచున్నాను, పురోబలాకైః = ముందు బెగ్గురుపక్షులుగల, అసితైః మేఘైః = నల్లనివైన మబ్బులచే, ఆవృతాం = కప్పబడియున్న, జ్యోత్స్నామివ = వెన్నెలనువలె, త్వాం = నిన్ను, ద్రష్టుం వాపి = చూచుటకుకూడ, న ఉపలప్స్యతే = లభింపడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .– 'ద్రష్టుంవాపి న ఉపలప్స్యసే = చూచుటకు కూడ లభింపవు అనగా నిన్ను తీసికొని వెళ్ళుట అసంభవమే యని భావము.

మహేశ్వరతీర్థులు – నేను జీవించియుండగా రాముడు నిన్ను తీసికొనివెళ్ళడు. అనగా నావధ జరిగినపిమ్మట రాముడు నిన్నుజూచి, తీసికొని వెళ్ళగలడు అని రావణుడు నిగూఢముగ తెలుపుచున్నాడు.

తాత్పర్యము – ఓ జానకీ! వానప్రస్థవ్రతమును పూనినవాడై కటికనేలపై శయనించుచు జీవితమును గడుపుచున్న రాముడు ప్రస్తుతము జీవించియున్నాడో లేదో యని కూడ నాకు అనుమానము. దట్టమైన పొగమరు పక్షులతోగూడిన మబ్బులచే కప్పబడిన వెన్నెలను చూచుటకు కనబడనట్లు, నిన్ను రాముడు చూచుటయే అసంభవము.

శ్లో॥ నచాపి మమ హస్తాత్త్వాం ప్రాప్తు మర్హతి రాఘవః,
హిరణ్యకశిపుః కీర్తి మింద్రహస్తగతామివ. 27

పదచ్ఛేదము – న – చ – అపి – మమ – హస్తాత్ – త్వాం – ప్రాప్తుం – అర్హతి – రాఘవః – హిరణ్యకశిపుః – కీర్తిం – ఇంద్రహస్తగతాం – ఇవ.

అన్వయక్రమము .– హిరణ్యకశిపుః ఇంద్రహస్తగతాం కీర్తిం ఇవ, రాఘవః మమహస్తాత్ త్వాం ప్రాప్తుం న అపి అర్హతి చ.

ప్రతిపదార్థము .– హిరణ్యకశిపుః = హిరణ్యకశిపుడు, ఇంద్రహస్తగతాం కీర్తిం ఇవ = ఇంద్రునిచేతికి చిక్కిన కీర్తినివలె, (భార్యను వలె) రాఘవః = రాముడు, మమ హస్తాత్ = నాచేతినుండి, త్వాం = నిన్ను, ప్రాప్తుం న అపి అర్హతి చ = పొందజాలడుకూడను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము.— "వ్యలుంపన్ రాజశిబిరం అమరా రాజ్యకాంక్షిణః, ఇంద్రస్తు రాజమహిషీం మాతరం మమ హ్యగ్రహీత్." అనగా, రాజ్యకాంక్షులైన దేవతలు మా రాజశిబిరమును ధ్వంసముచేసిరి. ఇంద్రుడు నా తల్లియైన రాజమహిషిని గొనిపోయెను. పిమ్మట నారదుడామెను హిరణ్యకశిపునికి అప్పగించె నని పూర్వగాథ.

వాసుదాసస్వామి.— ఇట్టిద కీర్తికారణమైన భార్యయని గ్రహించవలెను. భార్యాహరణము కీర్తిహరణమేగదా। హిరణ్యకశిపుని భార్యను ఇంద్రుడు హరింపగలిగెను గాని రాముడు నాచేత చిక్కిన నిన్ను మరల హరింపజాలడు, మరల రాముడు నిన్ను హరించెనేని నా కీర్తి హరించినట్లే. ఇంద్రుడు హిరణ్యకశిపుని భార్యను హరించి నారదాశ్రమమున నుంచెననియు మరల హిరణ్యకశిపుడు నారదుని మూలమున ఆమెను గ్రహించెననియు భాగవతమున గలదు. ఇది వైధర్మ్య దృష్టాంతము.

తాత్పర్యము : పూర్వము ఇంద్రుని చేతికి చిక్కిన తన భార్యను హిరణ్యకశిపుడు నారదుని సహాయముతో తిరిగి సంపాదించుకొన్నట్లు, నిన్ను రాముడు తిరిగి సంపాదించుకొనుననిఅనుకొను చుంటివేమో, నా చేతులనుండి శ్రీరాముడు నిన్నెంతమాత్రమును తిరిగి సంపాదించుకొనలేడు సుమా।

శ్లో॥ చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని,
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా. 28

పదచ్ఛేదము.— చారుస్మితే - చారుదతి - చారునేత్రే - విలాసిని - మనః - హరసి - మే - భీరు - సుపర్ణః - పన్నగం - యథా,

అన్వయక్రమము — చారుస్మితే, చారుదతి, చారునేత్రే, విలాసిని భీరు! సుపర్ణః పన్నగం యథా, (త్వం) మేమనః, హరసి.

ప్రతిపదార్థము :— చారుస్మితే = సుందరమైన చిరునగవుగల దానవును, చారుదతి = రమణీయమైన పలువరుసగల దానవును, చారునేత్రే = ఒప్పైన నేత్రములు గలదానవును, విలాసిని=విలాసములుగల దానవును అగు, భీరు! = ఓ భీతచిత్తవైన జానకీ!, సుపర్ణః = గరుత్మంతుడు, పన్నగం యథా = సర్పమునువలె, త్వం=నీవు, మే మనః= నా మనస్సును, హరసి = హరించుచున్నావు.

తాత్పర్యము :— మనోహరమైన చిరునగవు, సుందరమైన పలువరుస, విశాలనేత్రములు, దృష్టివిలాసములు కలిగి భయమును వెల్లడించుచున్న, ఓ జానకీ! గరుడపక్షి సర్పము నపహరించునట్లు నీవునా హృదయమును అపహరించు చున్నావుసుమా!

శ్లో॥ క్లిష్టకౌశేయవసనాం తన్వీ మ ప్యనలంకృతామ్,
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభా మ్యహం.

పదచ్ఛేదము :— క్లిష్టకౌశేయవసనాం - తన్వీం అపి - అనలంకృతామ్ - త్వాం - దృష్ట్వా - స్వేషు - దారేషు - రతిం - న - ఉపలభామి - అహమ్.

అన్వయక్రమము :— క్లిష్టకౌశేయవసనాంఅపి, తన్వీమపి అనలంకృతామపి, త్వాందృష్ట్వా, స్వేషుదారేషు అహం రతిం న ఉపలభామి.

ప్రతిపదార్థము :— క్లిష్టకౌశేయవసనాం అపి = నలిగిపోయియున్న పట్టుచీరను ధరించినదాన వైనను, తన్వీమపి = కృశించినదాన వై

నను, అనలంకృతామపి = ఆభరణములు ధరింపనిదాన వైయున్నను, త్వాం దృష్ట్వా = నిన్నుజూచి, అహం = నేను, స్వేషు దారేషు = సధార్మ్యల యందు, రతిం నఉపలభామి = ఆసక్తిని చూపలేకున్నాను.

తాత్పర్యము :— జానకీ ! నీవు నలిగిపోయిన పట్టుచీరను ధరించియుంటివి. మిక్కిలి కృశించియుంటివి ఏ ఆభరణములనుగూడ ధరింప కుంటివి. అటులయ్యును నిన్ను చూచుచుండగా, నాకు నా భార్యలమీద మనసు పోవుటలేదు.

శ్లో॥ అంతఃపురనివాసిన్య స్స్త్రియ స్సర్వగుణాన్వితాః,
యావంత్యో మమ సర్వాసా మైశ్వర్యం కురు జానకి.

పదచ్ఛేదము :— అంతఃపురనివాసిన్యః – స్త్రియః – సర్వ గుణాన్వితాః – యావంత్యః – మమ – సర్వాసాం – ఐశ్వర్యం – కురు – జానకి.

అన్వయక్రమము : జానకి ! సర్వగుణాన్వితాః యావంత్యః అంతఃపురనివాసిన్యః స్త్రియః మమ (సంతి)(తాసాం) సర్వాసాం ఐశ్వర్యం కురు.

ప్రతిపదార్థము :— జానకి = ఓసీతా ! సర్వగుణాన్వితాః = సమస్త సద్గుణములతో నిండియున్న, యావంత్యః = ఎంతమందిఅయితే, అంతఃపురనివాసిన్యః, స్త్రియః = అంతఃపురకాంతలు, (మమ) (సంతి = నాకున్నారో) తాసాం సర్వాసాం = వారందరకును, ఐశ్వర్యం కురు = ఆధిపత్యమును వహింపుము.

తాత్పర్యము :— నాయంతఃపురమునందు సమస్త సద్గుణము లతో వెలయుచున్నట్టి, సుందరీమణులు ఎంతమందియున్నారో వారందరిపై గూడ నీవు ఆధిపత్యమును వహింపుము.

శ్లో॥ మమ హ్యసితకేశాంతే త్రైలోక్యప్రవరా స్త్రియః,
తా స్త్వాం పరిచరిష్యంతి శ్రియ మప్సరసోయ థా. 31

పదచ్ఛేదము :- మమ - హి - అసితకేశాంతే - త్రైలోక్యప్రవరాః - స్త్రియః - తాః - త్వాం - పరిచరిష్యన్తి - శ్రియం - అప్సరసః - యథా.

అన్వయక్రమము :- అసితకేశాంతే, త్రైలోక్యప్రవరాః తాః మమ స్త్రియః, శ్రియం అప్సరసఃయథా, త్వాం పరిచరిష్యన్తి.

ప్రతిపదార్థము : అసితకేశాంతే = నల్లని కేశాగ్రములుగల ఓ జానకీ, త్రైలోక్యప్రవరాః = త్రిభువనములయందును శ్రేష్ఠులైనట్టి, తాః మమ స్త్రియః = ఆ నా భార్యలు, శ్రియం = లక్ష్మీదేవిని, అప్సరసః యథా = అప్సరస్త్రీలవలె, త్వాం = నిన్ను, పరిచరిష్యన్తి = సేవించుచుండగలరు.

తాత్పర్యము :- ఓ సుందరాంగీ ! ముల్లోకములందును శ్రేష్ఠలనిపించుకొన్న నాయొక్క అంతఃపురస్త్రీలు ఎల్లరును, లక్ష్మీదేవిని అప్సరస్త్రీలు సేవించువిధముగా, నిన్నుచేరి పరిచర్యలు చేయగలరుసుమా !

శ్లో॥ యాని వైశ్రవణే సుభ్రు రత్నానిచ ధనానిచ,
తాని లోకాంశ్చసుశ్రోణి మాంచ భుంక్ష్వ యథాసుఖమ్.

పదచ్ఛేదము :- యాని - వైశ్రవణే - సుభ్రు - రత్నాని - చ - ధనాని - చ - తాని - లోకాన్ - చ - సుశ్రోణి - మాం - చ - భుంక్ష్వ - యథాసుఖమ్.

అన్వయక్రమము:- సుభ్రు ! సుశ్రోణి ! వైశ్రవణే, యాని రత్నాని, ధనానిచ (సంతి), తాని, లోకాంశ్చ, మాంచ, యథాసుఖం భుంక్ష్వ.

ప్రతిపదార్థము .– సుభ్రు = సుందరమైన కనుబొమ్మలుగల దానవును, సుశ్రోణి = మనోహరమైన కటిసీమగల దానవును అగు ఓ జానకీ ! వైశ్రవణే = కుబేరుని అధీనమునందు, యాని రత్నాని చ = ఏ రత్నములును, ధనాని చ (సంతి) = సంపదలును గలవో, తాని = వానిని, లోకాంశ్చ = మరియు సమస్తలోకములను, మాం చ = నన్నునుగూడ, యథాసుఖం భుంక్ష్వ = తనివితీర అనుభవింపుము.

తాత్పర్యము – ఓ సుందరాంగీ ! కుబేరుని నవనిధులందు ఏ అపూర్వమైన రత్నములును, సంపదలును ఉన్నవో, వానినన్నింటిని, సమస్తలోకములందలి సంపదలను, నన్నును నా ఐశ్వర్యమునుగూడ నీ తనివితీర సుఖముగ అనుభవించుము.

శ్లో॥ న రామ స్తపసా దేవి న బలేన న విక్రమైః,
న ధనేన మయా తుల్య స్తేజసా యశసా పివా. 33

పదచ్ఛేదము :– న - రామః - తపసా - దేవి - న - బలేన - న - విక్రమైః - న - ధనేన మయా- తుల్య - తేజస్తాయశసా - అపి - వా.

అన్వయక్రమము :– దేవి, రామః, తపసా మయా తుల్యః న, బలేన న; విక్రమైః న, ధనేన న; తేజసా న: యశసాఅపి వాతుల్యః న.

ప్రతిపదార్థము :– దేవి = ఓ పూజ్యురాలా ! రామః = రాముడు, తపసా = తపస్సుచేత, మయా = నాతో, తుల్యః న = సమానుడుకాడు; బలేన న = శక్తిచేతను సమానుడుగాడు, విక్రమైః న = పరాక్రమములచేతను సమానుడుగాడు, ధనేన న = ఐశ్వర్యముచేతను సమానుడుగాడు ; తేజసా న = ప్రతాపముచేతను సమానుడుగాడు; యశసాపివా న = కీర్తిచేతనుగూడ సమానుడుగాడు,

తాత్పర్యము :- సుందరీ! నీ భర్తయైన శ్రీరాముడు తపస్సునందుగాని, బలపరాక్రమములందుగాని, ఐశ్వర్యమునందుగాని, ప్రతాపమునందుగాని కీర్తిప్రతిష్ఠలయందుగాని ఎందును గూడనాకు సాటి కాజాలడు సుమా;

శ్లో॥ పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీంచ,
మయి లల లలనే యథాసుఖం త్వం
త్వయిచ సమేత్య లలంతు బాంధవా స్తే. 34

పదచ్ఛేదము :- పిబ - విహర - రమస్వ - భుంక్ష్వ - భోగాన్ - ధననిచయం - ప్రదిశామి - మేదీం - చ - మయి - లల - లలనే - యథాసుఖం - త్వం - త్వయి - చ - సమేత్య - లలంతు - బాంధవాః - తే,

అన్వయక్రమము :- లలనే! ధననియంచ మేదినీంచప్రదిశామి; యథాసుఖంపిబ; విహర; రమస్వ; భోగాన్ భుంక్ష్వ; త్వం మయి లల; తే బాంధవాః సమేత్య త్వయి లలంతు.

ప్రతిపదార్థము :- లలనే = ఓ కామినీ! ధననిచయం = ఐశ్వర్యసమూహమును, మేదినీంచ = సమస్త సామ్రాజ్యమును, ప్రదిశామి = అర్పించెదను. యథాసుఖం = తనవితీరగా, పిబ = త్రాగుము, విహర = తిరుగుము, రమస్వ = క్రీడింపుము, భోగాన్భుంక్ష్వ = భోగములను అనుభవింపుము. త్వం = నీవు, మయి లల = నాపై ప్రేమగలిగియుండుము, తే బాంధవాః చ = నీ బంధువులును, సమేత్య = చేరి, త్వయి లలంతు = నీయందు ప్రేమతో నుండుదుగాక.

తాత్పర్యము :- సుందరీ! నీకు కావలసిన ధనరాశిని ఒసగెదను. రాజ్యము నంతయును నీకు అర్పించెదను. స్వేచ్ఛగా త్రాగుము,

విహరింపుము, వినోదింపుము. సమస్తభోగములను అనుభవింపుము. ఇట్లు సుఖముగానుండి నీవు నాపై ప్రేమను జూపుము. అప్పుడు నీ బంధువు లెల్లరును నీకడకు వచ్చి నీపై ప్రేమ చూపెదరు లెమ్ము.

శ్లో॥ కుసుమిత తరుజాలసంతతాని
ప్రభ్రమరయుతాని సముద్రతీరజాని,
కనకవిమలహార భూషితాంగీ
విహర మయాసహ భీరు కాననాని. 35

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సున్దరకాండే
'ప్రణయ ప్రార్థనా' నామ
వింశ స్సర్గః

—**—

పదచ్ఛేదము :- కుసుమితతరుజాలసంతతాని - భ్రమరయుతాని - సముద్రతీరజాని - కనకవిమలహారభూషితాంగి - విహర - మయా - సహ - భీరు - కాననాని.

అన్వయక్రమము :- భీరుః సముద్రతీరజాని, భ్రమరయుతాని, కుసుమిత తరుజాలసంతతాని కాననాని కనకవిమల హారభూషితాంగీ (సతీ) మయా సహ విహర.

ప్రతిపదార్థము :- భీరు ! = భీతచిత్తురాలవైన ఓ జానకీ, సముద్రతీరజాని = సముద్రతీరమందున్నట్టివియును, భ్రమరయుతాని =

ఛుమ్మెదలతో నిండియున్నట్టివియును, కుసుమితతరుజాల సంతరాని = పుష్ప వృక్షముల సమూహములతో నిండినట్టివియునగు, కాననాని = వనములను, కనకవిమలహారభూషితాంగీ (సతీ) = సువర్ణసుందరహారములతో అలంకరించుకొన్నదానవై, మయాసహ విహర = నాతోకూడి విహరింపుము.

తాత్పర్యము :- ఓ సుందరీ ! నీవు సువర్ణరత్నహారములను ధరించి, మా సముద్రతీరమునందున్నట్టి సురభిళపుష్పభరితములైన వృక్షములతో నిండియున్న వనములందు నాతోకలసి సుఖముగా విహరింపుము.

ఇది శ్రీమత్సుందరకాండమున

" సు బో ధి ని " అను ఆంధ్ర వివరణమునందు

" ప్ర ణ య ప్రా ర్థ న ము " అను

ఇఱువదియవ సర్గము.

— • —

శ్రీరామాయ నమః

శ్రీరామ శరణ గురుభ్యో నమః

ఏకవింశ స్సర్గః

శ్లో॥ తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః,
ఆర్తా దీనస్వరా దీనం ప్రత్యువాచ శనై ర్వచః.

పదచ్ఛేదము :– తస్య – తత్ – వచనం – శ్రుత్వా – సీతా – రౌద్రస్య – రక్షసః – ఆర్తా – దీనస్వరా – దీనం – ప్రత్యువాచ – శనైః – వచః.

అన్వయక్రమము :–రౌద్రస్య తస్య రక్షసః తద్వచనం శ్రుత్వా ఆర్తా దీనస్వరా (చ సతీ) సీతా శనైః దీనం వచః ప్రత్యువాచ.

ప్రతిపదార్థము :– రౌద్రస్య తస్య రక్షసః = క్రూరుడైన ఆరాక్షసునియొక్క, తద్వచనం = ఆమాటను, శ్రుత్వా = విని, ఆర్తా దీనస్వరా (చసతీ) =విషణ్ణురాలును, దీనమైన కంఠస్వరముగలదియు నగుచు సీతా = సీతాదేవి, శనైః = మెల్లగా, దీనం వచః = దీనమైన వచనమును, ప్రత్యువాచ = జవాబుగా పలికెను.

తాత్పర్యము :– దుర్మార్గుడైన ఆరాక్షసరాజుపలికిన ఆమాటలను విని, సీతాదేవి మిక్కిలి విషాదమునొంది దీనమైనస్వరముతో మెల్లగా రావణునకు ఇట్లు జవాబుచెప్పెను.

శ్లో॥ దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ,
చింతయంతీ వరారోహా పతిమేవ పతివ్రతా,
తృణ మంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా. 2

పదచ్ఛేదము :- దుఃఖార్తా - రుదతీ - సీతా - వేపమానా - తపస్వినీ-చింతయంతీ - వరారోహా - పతిం -ఏవ - పతివ్రతా - తృణం- అంతరతః - కృత్వా - ప్రత్యువాచ - శుచిస్మితా.

అన్వయక్రమము :- దుఃఖార్తా, రుదతీ, వేపమానా, తపస్వినీ, వరారోహా, శుచిస్మితా, పతివ్రతా సీతా పతిమేవ చింతయంతీ తృణం అంతరతః కృత్వా ప్రత్యువాచ॥

ప్రతిపదార్థము :- దుఃఖార్తా = దుఃఖముచేఆర్తురాలై యున్న దియును, రుదతీ = విలపించుచున్నదియును, వేపమానా = కంపించు చున్నదియును, తపస్వినీ = దీనురాలును, వరారోహా = సుందరమైన కటిసీమగలదియును, శుచిస్మితా = స్వచ్ఛమైనచిఱునగవుగలదియును, పతివ్రతా = పతివ్రతయునుఅగు, సీతా = సీతాదేవి, పతింఏవ చింతయంతీ = భర్తనుగూర్చియేచింతించుచు, తృణం అంతరతః కృత్వా =గడ్డిపోచను నడుమనుంచుకొని, ప్రత్యువాచ = జవాబుచెప్పెను.

తాత్పర్యము:- దుఃఖముచే పీడింపబడి శోకించుచు, దిగులుతో కంపించుచు, పతివ్రతయైనట్టి ఆసీతాదేవి మనస్సునందు భర్తనేధ్యానించుచు రావణుని నీచబుద్ధి తనకు ఊహదింపుతో చూడిన చిరునవ్వు కలిగించు చుండగా వానికిని తనకును నడుమనొక గడ్డిపోచనుంచి ఇట్లు జవాబు చెప్ప దొడగెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- 'తృణం అంతరతఃకృత్వా'-పరపురుషునితో ప్రత్య క్షముగా సంభాషించుట అనర్హముగనుక సీతమ్మ తృణమును వ్యవధానము చేసికొనెనని భావము. లేదా

నేలపై నేదేని అడ్డమునుంచుకొని మాత్రిమును వినర్జించుట ఆచార మైనట్లుగా రావణుని ముఖమునకు తృణమును అడ్డముగ నుంచి సీతమ్మ జవాబుచెప్పుచున్నదని భావము.

'శుచిస్మితా' – రజ స్తమోగుణముల విజృంభణముచే దుష్టబుద్ధియై యున్న ఈ దుర్మార్గునకు ఎట్టి దుర్బుద్ధి కలిగినదియని సీతకు చిరునగవు వచ్చినది ; అని భావము. మఱియు

అంతటి రావణుని తృణీకరించి సీతాదేవి నిర్భయముగా జవాబు చెప్పినదని భావము.

తనిశ్లోకీవ్యాఖ్యానము :– గడ్డిపోచవలె ఆతనిని నిర్లక్ష్యము చేయుచు, నేను చెప్పబోవు మాటలు వీనికి తృణప్రాయమే కాగలదు, అనుకొన్నదనిభావము. లేదా—

౨ తన దృష్టిపాతముచే అతడుమ హాభాగ్యశాలి కావలసియుండును. కాబట్టి అట్లుగాకుండ సీతమ్మ తృణమునేచూచుచు పలికెనని భావము– ఎట్లనగా–

స శ్లాఘ్య స్స గుణీ ధన్య స్స కులీన స్స బుద్ధిమాన్,
సశూర స్సచ విక్రాంతో యం త్వం దేవి నిరీక్షసే.

ఓ లక్ష్మీదేవి! నీవుఎవ్వనిపై నీదృష్టినిసారింతువో, అతడు శ్లాఘ్యుడగును; అతడే గుణవంతుడును అగును. అతడే ధన్యుడగును; అతడే మహోన్నతకుల జాతుడగును; అతడే బుద్ధిమంతుడగును, శూరుడగును, పరాక్రమవంతుడగును, అను వివిషయము ప్రసిద్ధముకదా ; లేదా—

౩ శ్రీరామచంద్రుడు తృణమునుగైకొని మున్ను కాకాసురుని పారద్రోలినట్లు రావణుడును ఇపుడు అట్టిగడ్డిపోచతోనే నిర్జింపదగినవాడు అని అమెభావము. లేదా —

౪ సమీపమునందున్న ఆదుర్జనునకు కొద్ది వ్యవధానముండుట ఉచితమనిభావము. లేదా –

౫ నీవు పశుసమానుడవుగనుక నీకిదే ఉచితపదార్థము అనిభావము. లేదా.

౬. రామవిరోధముచే నీవు సపరివారముగా నశింతువని ఈ తృణమును ఛేధించుచు నీకు తెలుపుచున్నాను అనిభావము.

వాసుదాసస్వామి :- వీడు నాయందు దుష్టభావముగలవాడయినను ప్రభుపు, క్షత్రియుడు. ఇట్టి వీడు తనయొద్దకువచ్చినపుడు అతిథి వంటివాడే. ఆ యతిథికి ఆసనమో అన్నమో నీరో యథాశక్తిగ నీయవలయును, 'ఆసనం చాన్న ముదకం దేయం' అని శాస్త్రవాక్యముగలదుగదా, కావున అప్పటికి తనకులభించిన ఆతృణమునే అట్లు ఆసనముగా త్రుంచి వైచెనని భావము.

2) అలకాపురిని మరియు లోకమున గల రత్నాభరణముల నన్నింటి నిచ్చెద నంటివే! అవియును, నీయొక్క ఐశ్వర్యమంతయును, నాకు ఈ తృణముతో సమానముసుమా! అని తెలుపుటకుగాను గడ్డిపోచ నెదురుగ వైచెనని భావము.

3) ఎంతటిశత్రువైనను గడ్డిపోచ తననోట గరచుకొన్నచో వానిని వీరులు చంపరు. కావున నీవు బ్రతుకగోరెదవేని దీనిని నీనోట గరచుకొని రామునియొద్దకుబొమ్ము ఆ కరుణాకాకుత్థ్సుడు నిన్ను రక్షించును. లేకుండిన అతడు నిన్ను చంపుట తథ్యము అనిబావము.

4) నన్ను నీవు బాధించితివా, హిరణ్యకశిపునిచే బాధపడు ప్రహ్లాదుని రక్షించుటకై స్తంభమునుండి నృసింహమూర్తి ఉద్భవించినట్లే ఈతృణమునందు శ్రీరామమూర్తి ఉద్భవించి 'నిన్నిచ్చటనే సంహరించుమ అని భావము.

5) నా అవయవములందు నీదృష్టినిలచి మరలుట లేదని యంటివి. నీదృష్టిమరలక అంతటితోనేహతమగునట్లు పూర్వము వామనుడు శుక్రాచార్యుని కన్నుదర్భతో పొడిచినట్లుగా నేనీదర్భతో నీకన్నులు పొడిచెదను అనిభావము.

6) నీవు రాముని గెలిచెదనంటివి, రామచంద్రమూర్తి విడిచిన అదర్భను బ్రహ్మరుద్రేం ద్రాదులును మరలింపలేకపోయిరి. అట్టివానిని నీవేమిచేయగలవు అని భావము.

7) ఈతృణమును త్రుంచునట్లు నీపదితలలను త్రుంచెదనుసుమీయని సూచింప గోరుచు సీతమ్మ తృణమును త్రుంచివైచెను అనిభావము.

8) పతివ్రతల కోపదృష్టి కోపింపజేసినవారిని దహించును. దమయంతి ఎరుకలవానిని దహించెను; గాంధారియొక్క చూపు ధర్మరాజు పదనఖములపైబడి అవి కమలిపోయెను.

(భారతము - స్త్రీపర్వము - 1అ - 176 శ్లో)

అట్లే వీడును తనదృష్టి పడెనా, భస్మమగును. అట్లువానిని ఒక్కనిని మాత్రమే భస్మముచేయుట తనకుసమ్మతముకాదు, (ఊతడు విష్ణుమందిర ద్వారపాలకులగు జయవిజయుల లోనివాడుగదా) వీడు పరస్త్రీ హరణము తనకులధర్మమని చెప్పెను. అందుచేత అట్టి కులమునే నిర్మూలింపవలెను. గాని కేవలమొకవ్యక్తిని మాత్రము నిర్దహించినలాభమేమి యనితలచి వాడు దగ్గుడుకాకుండుటకై సీతమ్మ తృణమును అడ్డముగ వైచెను అనిభావము

9) నీవు నాకు కోపమువచ్చునట్లు చేసితివేని నాకోపాగ్నికి నీవు తృణప్రాయము సుమా! కావున నాకు కోపమువచ్చునట్లు చేయకుము. అనిభావము.

"శుచిస్మితా" - పాము తనను మ్రింగుచుండగా తానుగండుచీమను మ్రింగబోవునట్టి కప్పవలె, తనను మృత్యుదేవత వాతవేసికొనుచుండుట ఎరుగలేక రావణుడు తన్నుఆశించుచున్నాడే! వీడెంతటిమూర్ఖుడని సీతమ్మ నవ్వెను అనిభావము.

రఘురాముడు బలపరాక్రమంబుల నాకు సరిగాడనియంటివే! దానికి సమాధానముచినుము-అమహావీరుఁడు "ధన్వినాం ధామః" అని ప్రసిద్ధి నొంది నట్టివాడు, అతడు ఆశ్రమమునలేనప్పుడుగదా నన్నుతెచ్చితివి. అట్టి పిరికి పందవు చాటున ఆడువారిముందు నీవు దంభములు పలికెదవే! యని సీతమ్మ నవ్వెను అని భావము.

ఈనవ్వు సామాన్యమైన నవ్వుగాదు.

'శుచిస్మిత' అనగా అగ్నిహోత్రమువంటి నవ్వు. అదియే వానిని నాశనముచేయగలదు. (శుచి అనగా అగ్నిఅని అర్థము).

శ్లో॥ నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః,

న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్. 3

పదచ్ఛేదము :- నివర్తయ - మనః - మత్తః - స్వజనే - క్రియతాం - మనః - న - మాం - ప్రార్థయితుం - యుక్తం - సుసిద్ధిం - ఇవ - పాపకృత్.

అన్వయక్రమము :- మత్తః మనః నివర్తయ; స్వజనే మనః క్రియతామ్; పాపకృత్ సుసిద్ధింఇవ (త్వం) మాం ప్రార్థయితుంనయుక్తమ్

ప్రతిపదార్థము :- మత్తః = నానుండి, మనః నివర్తయ = మనస్సును మరలించుకొనుము. స్వజనే = నీభార్యలయందు, మనః క్రియతాం = మనస్సును నిల్పుకొనుము, పాపకృత్ = పాపాత్ముడు, సుసిద్ధిం ఇవ = ఉత్తమమైనకార్యసిద్ధినివలె, త్వం = నీవు, మాం ప్రార్థయితుం నయుక్తమ్ = నన్నుకోరుకొనుటతగదు.

బొంబాయిముద్రణము - 'మనఃక్రియతాం' అను దానికి బదులుగా 'మనఃప్రీయతాం' అనిగలదు. అనగా మనస్సు ప్రీతినొందుగాక,

తిలకము :- "సుసిద్ధి" = అనగా బ్రహ్మలోకప్రాప్తి.

శ్రీ భాష్యం అప్పలాచార్యస్వామి :- "మనఃనివర్తయ" "మనః" అనుదానిని అనగా మనశ్శబ్దమును తిరుగవేసిన "నమః" అగును అనగా నాదికాదు అనిభావము. దానిని పెంపొందించుకొనుము అనిభావము.

తాత్పర్యము :- నీమనస్సును నానుండి మరలించుకొనుము. నీభార్యలందే మనస్సునిల్పి సంతోషమునొందుము. పాపాచరణపరుడు ఉత్తమగతిని పొందలేనట్లు నీవునన్ను కోరుటకే తగదు.

శ్లో॥ అకార్యం న మయా కార్య మేకపత్న్యా విగర్హితమ్,
కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా.

పదచ్ఛేదము :- అకార్యం - న - మయా - కార్యం - ఏక పత్న్యా - విగర్హితమ్, కులం - సంప్రాప్తయా - పుణ్యం - కులే - మహతి - జాతయా.

అన్వయక్రమము :- ఏకపత్న్యా, మహతికులే జాతయా పుణ్యం కులం సంప్రాప్తయా మయా విగర్హితం అకార్యం నకార్యమ్.

ప్రతిపదార్థము :- మహతి కులే జాతయా = గొప్పదైన కులమునందు జన్మించినట్టియు, పుణ్యం కులం సంప్రాప్తయా = పవిత్రమైన వంశమును పొందినట్టియు, ఏకపత్న్యా = పతివ్రతయైనట్టియు, మయా = నాచేత, విగర్హితం = నింద్యమైనట్టి, అకార్యం = పాపకృత్యము, నకార్యం - చేయదగినదిగాదు.

తాత్పర్యము :- ఉన్నతమైన వంశమునందుజన్మించి, పవిత్రమైన వంశమునందలి భర్తనుపొందినట్టి పతివ్రతనైననేను పెద్దలునిందించునట్టి పాపకృత్యమును తలపెట్టజాలను.

శ్లో॥ ఏవ ముక్తాతు వైదేహీ రావణం తం యశస్వినీ,
రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచన మబ్రవీత్.

పదచ్ఛేదము .- ఏవం - ఉక్త్వా-తు - వైదేహీ - రావణం - తం - యశస్వినీ - రాక్షసం - పృష్ఠతః - కృత్వా - భూయః - వచనం - అబ్రవీత్.

అన్వయక్రమము :- యశస్వినీ వైదేహీ రావణం ఏవం ఉక్త్వా తం రాక్షసం పృష్ఠతః కృత్వా, భూయః వచనం అబ్రవీత్.

ప్రతిపదార్థము .- యశస్వినీ వైదేహీ - కీర్తిసంపన్నురాలైన సీతాదేవి, రావణం ఏవంఉక్త్వా = రావణునిగూర్చి ఇట్లుపలికి,తం రాక్షసం= ఆరాక్షసుని, పృష్ఠతః కృత్వా = వెనుకచేసి, భూయః = తిరిగి, వచనం= మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- సీతాదేవి రావణునితో ఇట్లుపలికి వెంటనే వెనుకకుతిరిగి, మరల ఆరాక్షసునిగూర్చి ఈరీతిగా చెప్పదొడగెను.

శ్లో॥ నాహ మౌపయికీ భార్యా పరభార్యాసతీ తవ,
సాధుధర్మ మవేక్షస్వ సాధు సాధువ్రతం చర. 6

పదచ్ఛేదము .- న - అహం - ఔపయికీ - భార్యా - పర భార్యా - సతీ - తవ - సాధుధర్మం - అవేక్షస్వ - సాధు - సాధువ్రతం - చర.

అన్వయక్రమము .- పరభార్యాసతీ, అహం తవ ఔపయికీ భార్యా న (భవామి.) సాధుధర్మం సాధు అవేక్షస్వ; సాధువ్రతం సాధు చర.

ప్రతిపదార్థము :- పరభార్యాసతీ =ఇతరునిభార్యనైయున్నదాననై, అహం=నేను, తవ = నీకు, ఔపయికీ భార్యా న (భవామి) = యుక్త

పైన భార్యనుకాజాలను. సాధుధర్మం = సత్పురుషులధర్మమును, సాధు అవేక్షస్వ = చక్కగా గ్రహింపుము, సాధువ్రతం = సత్పురుషుల నియమమును, సాధు చర = చక్కగా ఆచరింపుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

మహేశ్వరతీర్థులు :- 'నాహంతవభార్యా'=నేను నీకు భరింప దగినదాననుగాను. పరభార్యా = శ్రేష్ఠుడైన రామునిచే మాత్రమే భరింప దగినదానను అని రహస్యార్థము.

తాత్పర్యము :- పరుని భార్యనైన నేను నీకు యోగ్యమైన భార్యనెట్లగుదును ? సత్పురుషుల ధర్మము చక్కగా గ్రహించి సత్పురుషుల నియమములను చక్కగాపాటించుట నేర్చుకొనుము.

శ్లో॥ యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర,
ఆత్మాన ముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్.

పదచ్ఛేదము :- యథా - తవ - తథా - అన్యేషాం -దారాః- రక్ష్యాః - నిశాచర - ఆత్మానం - ఉపమాం - కృత్వా - స్వేషు-దారేషు- రమ్యతామ్.

అన్వయక్రమము :- నిశాచర । యథా తవభార్యాః రక్ష్యాః, తథా అన్యేషాం దారాఃచ తవ రక్ష్యాః, ఆత్మానం ఉపమాం కృత్వా, స్వేషుదారేషు రమ్యతామ్.

ప్రతిపదార్థము :-నిశాచర । = ఓరాక్షసుడా । యథా=ఏరీతిగాః తవదారాః = నీభార్యలు, రక్ష్యాః = రక్షించుకొనదగియున్నారో, తథా= ఆరీతిగా, అన్యేషాం దారాఃచ= ఇతరులభార్యలును, తవ = నీకు, రక్ష్యాః = రక్షింపదగినవారే, ఆత్మానం ఉపమాం కృత్వా = నిన్ను (నీవు) ఉదాహర

ణముగాచేసికొని, స్వేషు దారేషు = నీభార్యలయందే, రమ్యతాం = విహ
రింపబడుగాక ।

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము – నీభార్యలకు నీయందే ప్రీతియుండవలెనని నీకు
ఎట్లు కోరికయుండునో, అట్లేపరులకును అట్టికోరికయుండునుగదా ।

మహేశ్వరతీర్థులు :– నీకు నీభార్యలు పవిత్రులుగా నుండ
వలెనని కోరికయున్నట్లే, ఆత్మదృష్టాంతముతో పరదారానిస్పృహుడవై
స్వదార నిరతుడ వగుము.

తాత్పర్యము :– నీకోరికను నీనిశ్చయమును పోలికగాచేసికొని,
నీభార్యల శీల మెట్లు రక్షింపబడవలెనని నీవుకోరుదువో అట్లేపరులభార్యల
శీలమునుగూడ నీవు కాపాడవలసియున్నదిసుమా ।

శ్లో॥ అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియమ్,
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్. 8

పదచ్ఛేదము .– అతుష్టం – స్వేషు – దారేషు – చపలం –
చలితేంద్రియమ్, నయంతి – నికృతిప్రజ్ఞం – పరదారాః – పరాభవమ్.

అన్వయక్రమము :– స్వేషు దారేషు అతుష్టం, చపలం, చలితేం
ద్రియం, నికృతి ప్రజ్ఞం, పరదారాః పరాభవం నయంతి.

ప్రతిపదార్థము .– స్వేషు దారేషు అతుష్టం = తనభార్యల
యందు తృప్తిని పొందనివాడును, చపలం = చాపల్యము గలవాడును,
చలితేంద్రియం = చలించిపోవు ఇంద్రియములు గలవాడును, నికృతి
ప్రజ్ఞం = నింద్యమైనప్రజ్ఞగలవాడును అగువానిని, పరదారాః = పరస్త్రీలు,
పరాభవం నయంతి = అవమానముపాలుచేయుదురు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము – 'పరాభవం' = అయురైశ్వర్యాదిక్షయ రూపమైన పరాభవము.

రామాయణ శిరోమణి :– 'పరదారాః' – అనగా పరభార్య లనుపంచించినట్టి దోషము.

తాత్పర్యము :– తనభార్యలయందు తృప్తినొందక ఇంద్రియ లోలుడై, చపలస్వభావము కలిగినట్టి నింద్యమైన ప్రజ్ఞగల పాపాత్ముడు చేసిన పరదారలను మోసగించుట అను అదోషము వాని అయురైశ్వర్యాదు లను క్షీణింప జేసి నశింపజేయును.

శ్లో॥ ఇహ సంతో నవా సంతి సతో వా నానువర్తసే,
తథాహి విపరీతా తే బుద్ధి రాచారవర్జితా. 9

పదచ్ఛేదము :– ఇహ – సంతః – న – వా – సంతి – సతః వా – న – అనువర్తసే ? తథా – హి – విపరీతా – తే – బుద్ధిః – ఆచా రవర్జితా.

అన్వయక్రమము :– ఇహసంతః నసంతివా? సంతః న అనువర్తసేవా? తథాహి, తే విపరీతాబుద్ధిః ఆచారవర్జితా।

ప్రతిపదార్థము :– ఇహ = ఇచట (ఈ రాజ్యమున) సతః= సత్పురుషులైనవారు, నసంతివా = లేనేలేరా। సతః = ఉన్నవారిని, న అనువర్తసేవా = నీవు అనుసరింపవా। తథాహి = అదిస్పష్టమే। తేబుద్ధిః = నీబుద్ధి, విపరీతా = విపరీతమైనదిగను, ఆచారవర్జితా = సదాచారమును విడచినదిగను, (స్థితా = ఉన్నది.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- సతవాః-విభీషణుడు మున్నగువారున్నారు గనుక లేరని చెప్పుటకు వీలులేదు.

తిలకము :- సంతః - ఇహలోక పరలోక హితమునుబోధించు సత్పురుషులు,

తాత్పర్యము:- నీ లంకారాజ్యమునందు మంచిచెడ్డలను బోధించు పెద్దలెవ్వరునులేరా ? అట్టివారున్నను నీవు వారిని సేవించి, సదాచారమును కోరి తెలిసికొనుటలేదా ? విరుద్ధమైన కోరికలతో సదాచారమును విడిచినట్టి నీ ప్రవర్తనవలననే, నీవు అట్టి సత్పురుషులసేవ చేయలేదని స్పష్టముగ తెలియుచున్నది.

శ్లో॥ వచో మిథ్యాప్రణీతాత్మా పథ్య ముక్తం విచక్షణైః,
రాక్షసానా మభావాయ త్వంవా న ప్రతిపద్యసే. 10

పదచ్ఛేదము :- వచః - మిథ్యాప్రణీతాత్మా - పథ్యం - ఉక్తం - విచక్షణైః - రాక్షసానాం - అభావాయ - త్వం - వా - న - ప్రతిపద్యసే.

అన్వయక్రమము :- మిథ్యాప్రణీతాత్మా. విచక్షణైః ఉక్తం పథ్యంవచః రాక్షసానాంఅభావాయ, త్వం నప్రతిపద్యసే వా.

ప్రతిపదార్థము :- మిథ్యాప్రణీతాత్మా = మిథ్యా వినయముగల స్వభావముగలవాడవై, విచక్షణైః ఉక్తం = పెద్దలచే చెప్పబడినట్టి, పథ్యం వచః = శ్రేయస్కరమైన మాటలను, రాక్షసానాం అభావాయ = రాక్షసకుల వినాశనముకొరకై, త్వం = నీవు, న ప్రతిపద్యసేవా = అనుచరించుట లేదా ?

గోవిందరాజీయము :- మిథ్యాప్రణీతాత్మా రాక్షసానామభావాయ పథ్యంవచః నప్రతిపద్యసే - రాక్షసులపై కపటప్రేమను ప్రక

టించుచు మనస్సునందుమాత్రము వారి వినాశనమునే కోరి పెద్దలమాటను పెడచెవిని పెట్టుచున్నావని భావము.

తాత్పర్యము :- నీ భావి హితము నాలోచించి పెద్దలుచెప్పిన హితవచనములను, మిథ్యా వినయములను ప్రదర్శించుచు నీ రాక్షసవంశము నకు వినాశనము తెచ్చుకొనుచు నీవే పెడచెవినిపెట్టుచున్నావేమో ।

శ్లో॥ అకృతాత్మాన మాసాద్య రాజాన మనయే రతమ్,
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణిచ. 11

పదచ్ఛేదము :- అకృతాత్మానం - ఆసాద్య - రాజానం - అనయే - రతమ్, సమృద్ధాని - వినశ్యంతి - రాష్ట్రాణి - నగరాణి - చ.

అన్వయక్రమము :- అనయే రతం అకృతాత్మానం రాజానం ఆసాద్య సమృద్ధాని నగరాణి రాష్ట్రానిచ వినశ్యంతి.

ప్రతిపదార్థము :- అనయే రతం = అవినీతియందు ఆసక్తుడైన, అకృతాత్మానం = మూర్ఖుడైనట్టి, రాజానం = ప్రభువును, ఆసాద్య= పొంది, సమృద్ధాని= ఐశ్వర్యవంతములైనట్టి, నగరాణి = పట్టణములును, రాష్ట్రానిచ = రాష్ట్రములునుగూడ, వినశ్యంతి = వినాశమునొందును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- అకృతాత్మా = సదుపదేశమును గ్రహింపలేని మంద బుద్ధి గలవాడు.

తాత్పర్యము :- అవినీతికి అలవాటుపడిన వాడై చెడునడతతో కూడియున్నట్టి ప్రభువునాశ్రయించిన నగరములును, రాష్ట్రములును, తమ

పూర్వపు ఐశ్వర్యమును క్షీణింపచేసికొని క్రమముగా పూర్తిగా నాశనమునొందును.

శ్లో॥ తథేయం త్వాం సమాసాద్య లంకా రత్నౌఘసంకులా,
అపరాధాత్తవైకస్య నచిరాద్వినశిష్యతి. 12

పదచ్ఛేదము :- తథా - ఇయం - త్వాం - సమాసాద్య - లంకా - రత్నౌఘసంకులా - అపరాధాత్ - తవ - ఏకస్య - న - చిరాత్ వినశిష్యతి -

అన్వయక్రమము :- తథా ఇయం రత్నౌఘసంకులా లంకా, త్వాం సమాసాద్య తవ ఏకస్య అపరాధాత్, నచిరాత్ వినశిష్యతి.

ప్రతిపదార్థము :- తథా = అరీతిగనే, రత్నౌఘసంకులా = అమూల్యమైన సంపదలతోనిండిన, ఇయం లంకా = ఈ లంకారాజ్యము, త్వాం సమాసాద్య = నిన్నుచేరి, తవ ఏకస్య అపరాధాత్ = నీ ఒక్కని అపరాధమువలన, నచిరాత్ = స్వల్పకాలములోనే, వినశిష్యతి = నశించి పోగలదు.

తాత్పర్యము :- అట్లే మహాసంపదలకు నిలయమైయున్న ఈ లంకారాజ్యమంతయు ఈనాటికి నిన్నుచేరి నీ వొక్కడవు చేసిన అపరాధము వలన అచిరకాలములోనే సర్వనాశనము కాబోవుచున్నదినుమా ॥

శ్లో॥ స్వకృతైర్హన్యమానస్య రావణాదీర్ఘదర్శినః,
అభినందంతి భూతాని వినాశే పాపకర్మణః. 13

పదచ్ఛేదము :- స్వకృతైః - హన్యమానస్య-రావణ-అదీర్ఘ దర్శినః అభినందంతి - భూతాని - వినాశే - పాపకర్మణః.

అన్వయక్రమము :– రావణః స్వకృతైః హన్యమానస్య, అదీర్ఘదర్శినః పాపకర్మణః వినాశే (సతి) భూతాని అభినందంతి.

ప్రతిపదార్థము :– రావణ=ఓరావణాసురుడా, అదీర్ఘదర్శినః= దూరదృష్టిలేనివాడై, స్వకృతైః హన్యమానస్య = తన కృత్యములచేతనే చెడిపోవుచున్నట్టి, పాపకర్మణః = పాపకృత్యములు చేయు వానియొక్క, వినాశే (సతి) = వినాశనము జరిగినప్పుడు, భూతాని = సమస్తప్రాణులును అభినందంతి = ఆనందింతురు.

తాత్పర్యము :– ఓరావణా ! భావికాలమున కలుగునట్టి మంచి చెడ్డలను గ్రహింపలేక తన దుష్టచేష్టలచేతనే తాను చెడిపోవుచున్న ఆ పాప కర్ముడు వినాశమునొంది కడతేరగా, సమస్తప్రాణులును ఎంతయో సంతో షింతురుగాని విచారించువా రెవ్వరు నుండరు.

శ్లో॥ ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యంతి నికృతా జనాః,
దిష్ట్యైత ద్వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః.

పదచ్ఛేదము :– ఏవం – త్వాం – పాపకర్మాణం–వక్ష్యంతి – నికృతాః – జనాః, దిష్ట్యా – ఏతత్ – వ్యసనం – ప్రాప్తః – రౌద్రః – ఇతి – ఏవ – హర్షితాః.

అన్వయక్రమము :– ఏవం నికృతాః జనాః పాపకర్మాణం త్వాం, రౌద్రః దిష్ట్యా ఏతత్వ్యసనం ప్రాప్తః ఇత్యేవ హర్షితా వక్ష్యంతి.

ప్రతిపదార్థము :– ఏవం = ఈరీతిగా, నికృతాః జనాః = అవమానింపబడినజనులు, పాపకర్మాణం త్వాం = పాపాచరణుడవైన నిన్ను గురించి, రౌద్రః = దుర్మార్గుడు, దిష్ట్యా = అదృష్టవశముచే,

ఏతత్ వ్యసనం = ఈవినాశమును, ప్రాప్తః = పొందియున్నాడు, ఇత్యేవ= అనియే, హర్షితాః = సంతోషించినవారై, వక్ష్యంతి = చెప్పుదురు.

తాత్పర్యము :— అవిధముగా వినాశమునొందినట్టి పాపకర్ము డవైన నిన్నుజూచి నీచే అవమానింపబడినట్టి జనులెల్లరును ఈ దుర్మార్గుడు మన అదృష్టవశముచేతనే ఇట్టినాశము నొందినాడు అని మహానందముతో చెప్పుకొందురు.

శ్లో॥ శక్యా లోభయితుం నాహ మైశ్వర్యేణ ధనేనవా,
అనన్యా రాఘవే ణాహం భాస్కరేణ ప్రభా యథా.

పదచ్ఛేదము .— శక్యా - లోభయితుం - న - అహం - ఐశ్వ ర్యేణ - ధనేన - వా - అనన్యా - రాఘవేణ - అహం - భాస్కరేణ - ప్రభా - యథా.

అన్వయక్రమము :— ఐశ్వర్యేణ, ధనేనవా అహం లోభ యితుం నశక్యా; భాస్కరేణ ప్రభాయథా, అహం రాఘవేణ అనన్యా.

ప్రతిపదార్థము : ఐశ్వర్యేణ = అధికారముచేతగాని, ధనే నవా = సంపదచేతగాని, అహం = నేను, లోభయితుం = ప్రలోభపెట్టు టకు, నశక్యా = శక్యమైనదానను గాను. భాస్కరేణ = సూర్యునితో, ప్రభాయథా = ప్రకాశమువలెనే, రాఘవేణ = శ్రీరామునితో, అహం = నేను, అనన్యా = వేఱుకానిదానను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము ·— ఐశ్వర్యేణ = అంతఃపురస్త్రీల ఆధి పత్యముచేతను, ధనేన = ఆభరణములు మున్నగు సంపదలచేతను.

రాఘవేణ అనన్యా = మహావిష్ణువేయే రూపముతో ఎచ్చటెచ్చట అవతరించుచుండునో అచ్చటచ్చట లక్ష్మీదేవికూడ అవతరించుచునేయుండునని భావము.

భాస్కరేణ ప్రభాయథా — సూర్యునికంటెను సూర్యప్రకాశమధికమైనట్లు తనయొక్క అధిక్యమును సీతమ్మ ఇచ్చట చక్కగా వెల్లడించినది.

అకారణముచేతనే 'అప్రమేయం హి తత్ తేజః, యస్య సా జనకాత్మజా' అని వెనుక మారీచుని హితవచనములందు తెలుపబడినట్టి, సీతతోకూడిన రాముని యొక్క తేజోతిశయము ఇచ్చట జ్ఞాపకము చేయబడుచున్నది.

తాత్పర్యము :— ఐశ్వర్యమునుజూపిగాని, వివిధ సంపదలను చూపిగాని, నన్ను లోభపెట్టుట సాధ్యము కాదుసుమా ! సూర్యునితో అతని ప్రకాశమును వేఱుచేయుట అసాధ్యమైనట్లు, నన్ను శ్రీరామునినుండి వేఱు చేయుట సాధ్యముగాని కార్యమని తెలిసికొనుము.

శ్లో॥ ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్,
కథం నామోపధాస్యామి భుజ మన్యస్య కస్యచిత్ . 16

పదచ్ఛేదము :— ఉపధాయ - భుజం - తస్య - లోకనాథస్య - సత్కృతమ్ - కథం - నామ - ఉపధాస్యామి - భుజం - అన్యస్య - కస్యచిత్.

అన్వయక్రమము : లోకనాథస్య తస్య సత్కృతం భుజం ఉపధాయ, అన్యస్య కస్యచిత్ భుజం, కథంనామ ఉపధాస్యామి?

ప్రతిపదార్థము :— లోకనాథస్య తస్య = జగన్నాథుడైనట్టి ఆమహనీయుని, సత్కృతం భుజం = పూజ్యమైనట్టి భుజమును. ఉప

చాయ = తిలగడగాచేసికొని, అన్యస్య కస్యచిత్ భుజం = పేరొకని యెవ్వనిభుజమునో, కథంనామ = ఎట్లుగా, ఉపధాస్యామి = తలగడగా చేసికొందును ?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము — లోకనాథస్య — బ్రహ్మాదిలోకపాలకులచే తమతమ ఉన్నతి కొఱకు ప్రార్థింప బడునట్టి దేవదేవునియొక్క, సత్కృతం భుజం = దక్షిణభుజము, కస్యచిత్ = అనామకుడైన క్షుద్రుడైన నీవంటివానియొక్క,

తాత్పర్యము — సర్వలోకప్రభువైన ఆమహాత్ముని దక్షిణభుజమును ఆశ్రయించు భాగ్యముకలిగిన నేను, క్షుద్రుడైన పరునిభుజమును ఎట్లుస్పృశింతును ?

శ్లో॥ అహం ఔపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః,
వ్రతస్నాతస్య విప్రస్య విద్యేవ విదితాత్మనః. 17

పదచ్ఛేదము :— అహం — ఔపయికీ — భార్యా — తస్య — ఏవ — వసుధాపతేః — వ్రతస్నాతస్య — విప్రస్య — విద్యా-ఇవ — విదితాత్మనః.

అన్వయక్రమము:— వ్రతస్నాతస్య, విదితాత్మనః విప్రస్య విద్యాఇవ, అహం తస్యవసుధాపతేః ఏవ ఔపయికీ భార్యా.

ప్రతిపదార్థము :— వ్రతస్నాతస్య = వేదవ్రతములనుముగించుకొన్నవాడును, విదితాత్మనః = ఆత్మసాక్షాత్కారము నొందిన వాడు నగు, విప్రస్య = విప్రునకు, విద్యాఇవ = బ్రహ్మవిద్యవలె, అహం = నేను, తస్య వసుధాపతేః ఏవ = ఆ రామభూపాలునికే, ఔపయికీ భార్యా = యోగ్యమైన భార్యను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- వ్రతస్నాతస్య, విదితాత్మనః తస్య రామస్య, అని ఈ రెంటివిశేషణములను విప్రునకేగాక రామునకుగూడ అన్వయించవలెను.

"విప్రస్య విద్యేవ" — బ్రాహ్మణునకే న్యాయప్రాప్తమైన స్వాధ్యాయము విధింపబడినది గనుకను బ్రహ్మవిద్య వేదసాధ్యము గావునను, వేదాధ్యయనపరుడైన బ్రాహ్మణునికే బ్రహ్మవిద్యాధికారమున్నదని భావము.

గోవిందరాజీయము :- విద్యఅనగా యోగాభ్యాసవిద్య. ఆత్మవేత్తకు మాత్రమే యోగాభ్యాసవిద్య లభించుననిభావము.

అహం తస్యైవ యోగ్యపయికీ భార్యా — తుల్యమైన వయస్సు శీలము ప్రవర్తనము గలిగి యుండుటచే నేను రామునకే తగినభార్య నని చెప్పబడినది.

తాత్పర్యము :- వేదాధ్యయనానంతరము వేద వ్రత మును ముగించుకొని, ఆత్మజ్ఞానమును సాధించుకొన్న విప్రునకుమాత్రమే ఎట్లు బ్రహ్మవిద్య యోగ్యమై యుండునో అట్లే తుల్య శీలవయోవృత్తములు గలిగిన నేను శ్రీరామచంద్రునికే తగిన భార్యనైయుందును.

శ్లో॥ సాధు రావణ రామేణ మాం సమానయ దుఃఖితామ్,
వనే వాశితయా సార్థం కరేణ్వేవ గజాధిపమ్. 18

పదచ్ఛేదము :- సాధు - రావణ - రామేణ - మాం - సమానయ - దుఃఖితామ్, వనే - వాశితయా - సార్థం - కరేణ్వా - ఇవ - గజాధిపమ్.

అన్వయక్రమము :- రావణ ! వనే వాశితయా కరేణ్వాసార్థం గజాధిపం ఇవ దుఃఖితాం మాం రామేణ సాధు సమానయ.

ప్రతిపదార్థము :- రావణ = ఓరావణుడా! వనే = అడవి యందు, వాశితయా = ఋతుమతియైన, కరేణ్వా సార్థం = ఆడఏనుగు తోడ, గజాధిపం ఇవ = పురుషగజమునువలె, దుఃఖితాం = శోకగ్రస్తురాల నైన, మాం = నన్ను, రామేణ = శ్రీరామునితో, సాధు = చక్కగా, సమానయ = కూర్చుము.

సూచన :- ఈశ్లోకమున ఉపమానోపమేయ వాక్యములలోని పదముల విభక్తులను మార్పుచేసి అర్థముచెప్పుకొనవలెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

వాసుదాసస్వామి :- రావణుడు శుద్ధ బ్రాహ్మణుడు కాడు, శుద్ధక్షత్రియుడును కాడు. అనులోమ సంకరజాతివాడు.

ఇచట సీతమ్మ తన్ను తీసికొనిపోయి రామునియొద్ద విడుపుమని చెప్పలేదు. ఏలనన అట్లు చెప్పినచో ఆ నెపమున తనను తాకునేమోయని భయపడినది. కావున రావణునితో రామునె ఇచటకు తెమ్మనెను. అట్లైన నీవు ఏయమతి వనిపించుకొందువు. నీకిప్పుడువచ్చిన దుర్నీతి పరుడను పేరు పోవును అనెను.

గోవిందరాజీయము :- "వాశితయా" యౌవన వయస్సునం దున్న గజయువతితో అని అర్థము. లేక వనే వాశితయా - వనమునందు బంధింపబడిన ఆడుఏనుగుతో అని అర్థము.

సాధురావణ :- సాధూన్ రావయతీతి సాధురావణః = అనగా సాధువులను విలపింపజేయువాడని అర్థము.

తాత్పర్యము :- రావణా! అరణ్యమునందు పతివియోగమును పొంది దుఃఖించుచున్న గజాంగనను, యూథనాథుడైన గజముతో కూర్చి

పుణ్యముకట్టుకొన్నట్లు, పతిశోకగ్రస్తురాలనైన నన్ను నా రామునితోకూర్చి నాకుమేలుగూర్చి నీకు క్షేమమును సంపాదించుకొనుము.

శ్లో॥ మిత్రమౌపయికం కర్తుం రామస్థానం పరీప్సతా,
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాఽసౌ పురుషర్షభః.

పదచ్ఛేదము :— మిత్రం - ఔపయికం - కర్తుం - రామః - స్థానం - పరీప్సతా - వధం - చ - అనిచ్ఛతా - ఘోరం - త్వయా - అసౌ - పురుషర్షభః.

అన్వయక్రమము :— స్థానం పరీప్సతా, ఘోరం వధంచ అనిచ్ఛతా త్వయా అసౌ పురుషర్షభః రామః మిత్రం కర్తుం ఔపయికమ్.

ప్రతిపదార్థము :— స్థానం పరీప్సతా = నీయునికిని పరిరక్షించుకొనగోరువాడవును, ఘోరం వధం అనిచ్ఛతా చ = దారుణమైనమారణమును కోరనివాడవులగు, త్వయా = నీచేత, అసౌ పురుషర్షభః = ఈ పురుషసింహుడైన, రామః = శ్రీరాముడు, మిత్రం కర్తుం = స్నేహితునిగా చేసికొనుటకు, ఔపయికమ్ = తగియుండును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :— స్థానం = (లంకాం) లంకను, ఘోరం వధం = సకల కుటుంబ మారణము.

గోవిందరాజీయము :— శరణువేడుకొనుము అనవలసిన సందర్భమున మిత్రునిగా చేసికొను మనుట దురభిమానియైన రావణునకు నచ్చునట్లు చెప్పవలెనను కోరికతోడనే అట్లు సీతమ్మ చెప్పినది. " మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన " అని శ్రీరాముని ప్రతిజ్ఞను ఆమె దృష్టికి తెచ్చుకొనియే అట్లు చెప్పినది.

ఘోరం వధం = చిత్రవధ అనిభావము.

బొంబాయి పాఠము :- "వధించ" అనిచ్ఛతాఅనుటకు బదులు "బంధించ" అనిచ్ఛతాయనియున్నది.

అసౌరామః — ఈరాముడు అనుటకు కారణము నిరంతరస్మరణముచే శ్రీరాముడామెకు ప్రత్యక్షముగనే కాన్పించుచున్నాడని తెలిసికొనవలెను.

పురుషర్షభః — నేనుచేసిన ఈ ఘోరపాపము నాతడెట్లు క్షమించునని శంకింపపనిలేదు. రఘురాముడు పురుషులలో ఉత్తమోత్తముడుగదా!

తాత్పర్యము :- నిన్ను, నీపట్టణమును; నీరాజ్యమును నీవు రక్షించుకొనదలచుకొందువేని, దారుణమైన మృత్యువును నీకును నీవారికిని తప్పింపదలచితివేని, పురుషులందు ఉత్తమోత్తముడగు రామచంద్రునితో మైత్రిని కోరుకొనుటయే నీకు కర్తవ్యమైయున్నది.

శ్లో॥ విదిత స్సహి ధర్మజ్ఞః శరణాగతవత్సలః,
తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి.

పదచ్ఛేదము :- విదితః - సః - హి - ధర్మజ్ఞః - శరణాగత వత్సలః - తేన - మైత్రీ - భవతు - తే - యది - జీవితుం - ఇచ్ఛసి.

అన్వయక్రమము :- సః ధర్మజ్ఞః, శరణాగతవత్సలః ఇతి విదితః హి; జీవితుం ఇచ్ఛసియది, తే తేన మైత్రీభవతు.

ప్రతిపదార్థము :- సః = ఆ శ్రీరామచంద్రుడు, ధర్మజ్ఞః = సర్వధర్మవేత్తయైనవాడు, శరణాగతవత్సలః = శరణుగోరినవారియెడ వాత్సల్యముకలిగియుండువాడు, ఇతి = అని, విదితః = సువిదితమైనవాడు, జీవితుం ఇచ్ఛసియది = బ్రతికియుండుటకుకోరుకొందువేని, తే = నీకు, తేన = ఆదీనవత్సలునితో, మైత్రీ భవతు = స్నేహముకలుగుగాక.

తాత్పర్యము :- ఆ శ్రీరామచంద్రుడు సర్వధర్మములు తెలిసిన వాడుగను, తననుశరణువేడిన వారియెడ వాత్సల్యభావము ప్రకటించు వాడుగను జగద్విదితుడుగదా! అందుచే నీకు జీవింపకోరికయే యున్నచో అతనితో మైత్రిని నెఱపుదువుగాక !

శ్లో॥ ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్,
మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితు మర్హసి.

పదచ్ఛేదము :- ప్రసాదయస్వ - త్వం - చ - ఏనం - శరణాగతవత్సలమ్, మాం - చ - అస్మై - ప్రయతః - భూత్వా - నిర్యాతయితుం - అర్హసి.

అన్వయక్రమము :- ఏనం శరణాగతవత్సలం త్వం చ, ప్రసాదయస్వ. ప్రయతః భూత్వా అస్మై మాం నిర్యాతయితుం చ అర్హసి.

ప్రతిపదార్థము :- శరణాగతవత్సలం ఏనం = శరణాగత రక్షణ తత్పరుడైన శ్రీరామచంద్రుని, త్వంచ ప్రసాదయస్వ = నీవు కూడ ప్రతిమాలుకొనుము. ప్రయతః భూత్వా = నిష్కళంకమైన చిత్తము గలవాడవై, అస్మై = ఈ శ్రీరామచంద్రునకు, మాం = నన్ను, నిర్యాతయితుం చ అర్హసి = తిరిగి అప్పచెప్పుటకును తగుదువు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

పరమార్థచంద్రిక :- "ఏనం త్వంచ ప్రసాదయస్వ" శ్రీరాముని నీవును ప్రతిమాలుకొనుము. అనగా నీకొరకై నేనుగూడ అతనిని నీపై ప్రేమయుక్తునిగా చేయుటకు, తోడుపడెదనని భావము. లేక— పూర్వము ఎందరో అతనికి అపకారము చేసినవారు, అతనిని శరణువేడి

రక్షింపబడిరి. అట్లే నీవుకూడ అట్లువేడుకొని అతనిదయకు పాత్రుడవు కమ్ము అని భావము.

తాత్పర్యము :- శరణాగతరక్షణ తత్పరుడైనట్టి ఆ రామచంద్రుని తప్పక నీవు ప్రతిమాలుకొనుము. నేనుకూడ నిన్ను క్షమింపకోరెదను, ఉత్తమమైన మనస్సుతో నన్ను వెంటనే ఆయనకప్పజెప్పుటయే ఇప్పుడు నీకు తగియున్నపని.

శ్లో॥ ఏవంహి తే భవే త్స్వస్తి సంప్రదాయ రఘూత్తమే,
అన్యథా త్వంహి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ. 22

పదచ్ఛేదము .- ఏవం - హి - తే - భవేత్ - స్వస్తి - సంప్రదాయ - రఘూత్తమే - అన్యథా - త్వం - హి - కుర్వాణః - వధం - ప్రాప్స్యసి - రావణ.

అన్వయక్రమము :- రావణ, రఘూత్తమే, (మాం) సంప్రదాయ, తే స్వస్తిభవేత్, అన్యథాకుర్వాణః, త్వం వధం, ప్రాప్స్యసిహి.

ప్రతిపదార్థము :- రావణ = ఓరావణుడా ; ఏవం = ఈరీతిగా, మాం రఘూత్తమే సంప్రదాయ = నన్ను శ్రీరామచంద్రునకు సమర్పించి (యున్నయెడల), తే స్వస్తి భవేత్ = నీకుక్షేమముకలుగును. అన్యథా కుర్వాణః = వేరుగాచేయుచున్న వాడవైనచో, వధం ప్రాప్స్యసిహి = మరణమునే పొందెదవుసుమా ;

తాత్పర్యము :- నేనుచెప్పినట్లుగా నన్ను శ్రీ రామచంద్రునకు సమర్పించితివేని నీకు క్షేమమేయగును, లేక వేఱువిధముగా ప్రవర్తించిన యెడల శ్రీరాముని వలన నీవు వధను పొందక తప్పదు.

శ్లో॥ వర్జయే ద్వజ్ర ముత్సృష్టం వర్జయే దంతక శ్చిరమ్,
త్వద్విధం తు న సంకృద్ధో లోకనాథ స్స రాఘవః. 23

పదచ్ఛేదము :- వర్జయేత్ - వజ్రం - ఉత్సృష్టం - వర్జయేత్ - అంతకః - చిరమ్, త్వద్విధం - తు - న - సంక్రుద్ధః - లోకనాథః - సః - రాఘవః.

అన్వయక్రమము :- ఉత్సృష్టం వజ్రం వర్జయేత్; అంతకః చిరం వర్జయేత్; సంకృద్ధః లోకనాథః, సః రాఘవః తు త్వద్విధం న వర్జయేత్.

ప్రతిపదార్థము :- ఉత్సృష్టం వజ్రం = (దేవేంద్రునిచే) ప్రయోగింపబడిన వజ్రాయుధము, వర్జయేత్ = విడువవచ్చును. అంతకః = యముడు, చిరం = శాశ్వతముగా, వర్జయేత్ = విడువవచ్చును, సంకృద్ధః = మిక్కిలి క్రోధము నొందియున్నట్టి, లోకనాథః = జగత్ప్రభువైనట్టి, సః రాఘవః తు = ఆ శ్రీరాముడుమాత్రము, త్వద్విధం = నీవంటిపాప కర్ముని, నవర్జయేత్ = విడిచిపెట్టడు.

తాత్పర్యము:- దేవేంద్రుడు ప్రయోగించినట్టి వజ్రాయుధము ఒకప్పుడు నిన్ను చంపక విడిచినను విడువవచ్చును. అట్లే యముడుగూడ చిరకాలము చంపక నిన్ను విడిచినను విడువవచ్చును గాని, నీపై క్రోధము నొందియున్న జగత్ప్రభుడైన ఆ శ్రీరాముడు మాత్రము నీవంటి పాతకిని ఎన్నడును విడువడు.

శ్లో॥ రామస్య ధనుష శ్శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్,
శతక్రతువిసృష్టస్య నిర్ఘోష మశనేరివ. 24

పదచ్ఛేదము :- రామస్య - ధనుషః - శబ్దం - శ్రోష్యసి - త్వం - మహాస్వనమ్, శతక్రతువిసృష్టస్య - నిర్ఘోషం - అశనేః ఇవ,

అన్వయక్రమము :- "శతక్రతువిసృష్టస్య అశనేః నిర్ఘోషం ఇవ" రామస్యధనుషః మహాస్వనం శబ్దం త్వంశ్రోష్యసి.

ప్రతిపదార్థము :- శతక్రతు విసృష్టస్య = దేవేంద్రునిచే ప్రయోగింపబడినట్టి, అశనేః నిర్ఘోషంఇవ = వజ్రాయుధముయొక్క భీకర ధ్వనినివలె, రామస్య ధనుషః = శ్రీరామునిధనుస్సుయొక్క, మహాస్వనం శబ్దం = గొప్పనిర్ఘోషముతో కూడినట్టి శబ్దమును, త్వం = నీవు శ్రోష్యసి = వినగలవు.

తాత్పర్యము : దేవేంద్రుడు ప్రయోగించినట్టి వజ్రాయుధము యొక్క భయంకరశబ్దమువలె శ్రీరాముని ధనుస్సుయొక్క ప్రతిధ్వనులతో భీకరమైయుండు వింటినారి శబ్దమును కొలదికాలములోనే నీవు తప్పక వినెదవుసుమా!

శ్లో॥ ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః,
ఇషవో నిపతిష్యంతి రామలక్ష్మణలక్షణాః. 25

పదచ్ఛేదము :- ఇహ-శీఘ్రం - సుపర్వాణః- జ్వలితాస్యాః - ఇవ - ఉరగాః - ఇషవః - నిపతిష్యంతి - రామలక్ష్మణలక్షణాః.

అన్వయక్రమము :- ఇహ జ్వలితాస్యాః ఉరగాఃఇవ రామలక్ష్మణలక్షణాః సుపర్వాణః ఇషవః శీఘ్రం నిపతిష్యంతి.

ప్రతిపదార్థము :- ఇహ = ఈ లంకానగరమునందు, జ్వలితాస్యాః ఉరగాః ఇవ = ప్రజ్వలించుచున్న నోరులుగల సర్పములవలె, రామలక్ష్మణ లక్షణాః = రామలక్ష్మణులయొక్క నామములతో ముద్రితములైనట్టి, సుపర్వాణః ఇషవః=మంచికణుపులు కలిగినట్టిబాణములు, శీఘ్రం= త్వరలో, నిపతిష్యంతి = పడును!

తాత్పర్యము .— కొలదికాలములోనే ఈ లంకానగరమందు మంటలను గ్రక్కు సర్పములవంటివియును, రామలక్ష్మణుల పేర్లు చెక్కబడిన అందమైన కణుపులు గలిగినట్టివియును అగు బాణములు వచ్చిపడి ముంచివేయగలవు సుమా!

శ్లో॥ రాక్షసేంద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్,
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్. 27

పదచ్ఛేదము .— రాక్షసేంద్రమహాసర్పాన్ - సః - రామగరుడః - మహాన్ - ఉద్ధరిష్యతి - వేగేన - వైనతేయః - ఇవ - ఉరగాన్.

అన్వయక్రమము .— మహాన్ సః రామగరుడః, వైనతేయః ఉరగాన్ ఇవ, రాక్షసేంద్రమహాసర్పాన్ వేగేన ఉద్ధరిష్యతి.

ప్రతిపదార్థము :— మహాన్ సః రామగరుడః = గొప్పదైనట్టి రాముడను గరుత్మంతుడు, వైనతేయః ఉరగాన్ ఇవ = గరుడుడు సర్పములనువలె, రాక్షసేంద్ర మహాసర్పాన్=రాక్షసవీరులనెడి మహాసర్పములను, వేగేన ఉద్ధరిష్యతి = శీఘ్రముగ ఎత్తుకొని పోగలడు.

తాత్పర్యము .— శ్రీరాముడనెడి గరుత్మంతుడు— గరుడపక్షి సర్పములను తన్నుకొనిపోయినట్లు, అతిశీఘ్రముగా ఇచటిరాక్షసులనెడి సర్పములను ఎత్తుకొనిపోవును సుమా!

శ్లో॥ అపనేష్యతి మాం భర్తా త్వత్తః శీఘ్ర మరిందమః,
అసురేభ్యః శ్రియం దీప్తాం విష్ణు స్త్రిభిరివ క్రమైః. 28

పదచ్ఛేదము — అపనేష్యతి - మాం - భర్తా - త్వత్తః - శీఘ్రం - అరిందమః - అసురేభ్యః - శ్రియం -దీప్తాం - విష్ణుః - త్రిభిః - ఇవ - క్రమైః.

అన్వయక్రమము :- విష్ణుః, త్రిభిఃక్రమైః, అసురేభ్యః, దీప్తాం శ్రియం ఇవ, అరిందమః (మమ) భర్తా, మాం త్వత్తః శీఘ్రం అపనేష్యతి.

ప్రతిపదార్థము :- విష్ణుః = శ్రీమహావిష్ణువు, అసురేభ్యః = రాక్షసులనుండి, త్రిభిఃక్రమైః = మూడుఅడుగులతో, దీప్తాం శ్రియంఇవ= ఉజ్జ్వలమైన సంపదనువలె, అరిందమః (మమ) భర్తా = శత్రుసంహారకుడైన నాభర్త, మాం = నన్ను, త్వత్తః = నీకడనుండి, శీఘ్రం అపనేష్యతి = త్వరలోనే తరలించుకొనిపోగలడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "నచాపి మమ హస్తాత్ త్వాం ప్రాప్తుం అర్హతి రాఘవః" అని ముందు రావణుడు పలికినట్టి ప్రగల్భములకు సీతమ్మ ఇట్లు సూటియైన జవాబుచెప్పినది.

వాసుదాసస్వామి :- ఇంద్రవిరోధియగు బలిచక్రవర్తి పూర్వమింద్రునిస్థానమాక్రమించి తానే ఇంద్రుడైయుండగా, విష్ణువు దానిని మరల తన వశముచేసికొనలేదా! అట్టులే రాముడు నీ స్వాధీన మందుండు నన్నుతోడ్కొనిపోవును. వామను డొంటరివాడు గాదా! బలపరాక్రమములు లెక్కగాని, యొంటరి సంటరితనము లెక్కగాదు.

తాత్పర్యము :- వామనరూపముతో పూర్వము శ్రీ మహావిష్ణువు మూడడుగులతోడనే బలిచక్రవర్తియొక్క మహైశ్వర్యమును గొనిపోయి నట్లు శత్రుమర్దనుడైన నాభర్త నీచేతులనుండి అతిత్వరలోనే నన్ను విడిపించుకొని పోవగలడుసుమా!.

శ్లో॥ జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే,
అశక్తేన త్వయా రక్షః కృత మేత దసాధు వై. 29

పదచ్ఛేదము :- జనస్థానే - హతస్థానే - నిహతే - రక్షసాం_ బలే - అశక్తేన - త్వయా - రక్షః - కృతం - ఏతత్ - అసాధు - వై.

అన్వయక్రమము :-రక్షః! జనస్థానే హతస్థానే (సతి) రక్షసాం బలే నిహతే (సతి) అశక్తేనత్వయా, ఏతత్ అసాధు కృతంవై.

ప్రతిపదార్థము :- రక్షః = ఓ రాక్షసుడా! జనస్థానే = దండకయందలి జనస్థానము, హతస్థానే (సతి) = పాడువడిపోయియుండగా, రక్షసాం బలే = రాక్షససైన్యము, నిహతే (సతి) = రూపుమాపబడి యుండగా, అశక్తేన త్వయా = అశక్తుడవైన నీచేత, ఏతత్ అసాధు = ఈ నీచమైనపని, కృతంవై = చేయబడినదిగదా!

తాత్పర్యము :- ఓ రావణా! దండకారణ్యమునందలి జనస్థానమున నీ రాక్షసబలమంతయును నిర్మూలమై పాడుపడియుండగా, నీవు నిర్వీర్యుడవై దొంగతనముగా నన్ను ఇచటికి తీసికొనివచ్చి అతినీచమైన కృత్యముచేసితివి కదా!

శ్లో॥ ఆశ్రమంతు తయో శ్శూన్యం ప్రవిశ్య నరసింహయోః,
గోచరం గతయో ర్భ్రాత్రో రపనీతా త్వయా ఽధమ.

పదచ్ఛేదము :- ఆశ్రమం - తు - తయోః - శూన్యం - ప్రవిశ్య - నరసింహయోః - గోచరం - గతయోః - భ్రాత్రోః - అపనీతా - త్వయా - అధమ.

అన్వయక్రమము :- అధమ!, నరసింహయోః, తయోః భ్రాత్రోః గోచరం గతయోః (సతోః) శూన్యం ఆశ్రమం ప్రవిశ్య త్వయా (అహం) అపనీతా.

ప్రతిపదార్థము :– అధమ ! = ఓ నీచుడా! నరసింహయోః = పురుషశ్రేష్ఠులైన, తయోః భ్రాత్రోః = ఆసోదరులిరువురును, గోచరం గతయోః (సతోః) = దూరముననుండగా, శూన్యం ఆశ్రమం = నిస్సహాయమైన ఆశ్రమమును, ప్రవిశ్య = ప్రవేశించి, త్వయా = నీచేత, (అహం = నేను) అపనీతా = దొంగిలింపబడితిని.

తాత్పర్యము:– ఆనాడు మాయలేడిని వెంబడించుచు పురుష సింహులైన యాసోదరులిరువురును దూరముగా వెడలిపోగా పురుషశూన్యమైన ఆశ్రమమున ప్రవేశించి నీచుడవై నీవు నన్ను అపహరించితివిగదా!

శ్లో॥ నహి గంధ ముపాఘ్రాయ రామలక్ష్మణయో స్త్వయా,
శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయోరివ. 31

పదచ్ఛేదము – న – హి – గంధం – ఉపాఘ్రాయ – రామలక్ష్మణయోః – త్వయా – శక్యం – సందర్శనే – స్థాతుం – శునా – శార్దూలయోః – ఇవ.

అన్వయక్రమము :– శార్దూలయోః గంధం ఉపాఘ్రాయ శునాఇవ, త్వయా, రామలక్ష్మణయోః గంధం ఉపాఘ్రాయ (తయోః) సందర్శనే స్థాతుం నశక్యంహి.

ప్రతిపదార్థము :– శార్దూలయోః = పెద్దపులుల యొక్క, గంధం = వాసనను, ఉపాఘ్రాయ = ఆఘ్రాణించి, శునాఇవ = కుక్కచేతవలె, రామలక్ష్మణయోః గంధం ఉపాఘ్రాయ=రామలక్ష్మణుల వాసనను ఆఘ్రాణించి, త్వయా = నీచేత (తయోః) సందర్శనే స్థాతుం = వారిఎదుట నిలచుటకు, న శక్యంహి=శక్యముగాదు సుమా!

తాత్పర్యము :- పెద్దపులులవాసనను పసిగట్టిన శునకమువలె వీరులైన రామలక్ష్మణులగాలి సోకినట్టి నీవు ఆ యన్నదమ్ముల కనుల ముందు నిలచుటకు గూడ శక్యముకాదుసుమా!

శ్లో॥ తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణ మస్థిరమ్,
వృత్రస్యేవేంద్రబాహుభ్యాం బాహో రేకస్యనిగ్రహః 32

పదచ్ఛేదము :- తస్య - తే - విగ్రహే - తాభ్యాం - యుగగ్రహణం - అస్థిరమ్, వృత్రస్య - ఇవ - ఇంద్రబాహుభ్యాం-బాహోః- ఏకస్య - నిగ్రహః.

అన్వయక్రమము :- తస్యతే తాభ్యాం విగ్రహే (సతి) యుగగ్రహణం అస్థిరమ్: ఇంద్రబాహుభ్యాం వృత్రస్య ఏకస్యబాహోః ఇవ (తవ) నిగ్రహః (స్థిరః).

ప్రతిపదార్థము :- తస్యతే=అట్టి అల్పుడవైన నీకు, తాభ్యాం= ఆవీరులైన సోదరులతో, విగ్రహే (సతి) =యుద్ధముకలుగగా, యుగగ్రహణం = జయసంపాదనము, అస్థిరం = అసాధ్యము. ఇంద్రబాహుభ్యాం = ఇంద్రునియొక్క రెండుభుజములతో. వృత్రస్య = వృత్రాసురునియొక్క, ఏకస్య బాహోః ఇవ =ఒంటిభుజమునకువలె, (తవ = నీకు) నిగ్రహః = బంధనము, స్థిరః = నిశ్చయముః

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

రామాయణశిరోమణి :- దేవేంద్రునిచేతిలో వృత్రాసురునకు బాహుచ్ఛేదము సంభవించినట్లు నీకును రామలక్ష్మణులచే అట్టిహాని తప్పదని సూచింపబడినది.

తాత్పర్యము :- పూర్వము వృత్రాసురుడు బాహుచ్ఛేదముకలిగి ఏకహస్తుడై, రెండుభుజములతో యుద్ధముచేయుచున్నట్టి దేవేంద్రునినుండి ఓటమిని పొందినట్లుగా అసమర్థుడవై ఒంటరివై యుండు నీకు ఆ సోదరు లిరువురితో యుద్ధము సంభవించినపుడు నీవు జయమును సంపాదించుట అసంభవము.

శ్లో॥ క్షిప్రం తవ స నాథో మే రామ స్సౌమిత్రిణా సహ,
తోయ మల్ప మి వాదిత్యః ప్రాణా నాదాస్యతే శరైః.

పదచ్ఛేదము :- క్షిప్రం - తవ - సః - నాథః - మే - రామః - సౌమిత్రిణా - సహ - తోయం - అల్పం - ఇవ - అదిత్యః - ప్రాణాన్ - ఆదాస్యతే - శరైః.

ప్రతిపదార్థము :- మే నాథః = నాభర్తయైనట్టి, సః రామః = ఆ శ్రీరాముడు, సౌమిత్రిణాసహ=లక్ష్మణునితోగూడ, ఆదిత్యః=సూర్యుడు, అల్పం తోయం ఇవ = స్వల్పముగనున్న నీటినివలె, క్షిప్రం = త్వరలో, తవ ప్రాణాన్ = నీ ప్రాణములను, శరైః = బాణములతో, ఆదాస్యతే = గ్రహింపగలడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

వాసుదాసస్వామి :- ఎండాకాలము సూర్యుడు నీళ్ళను తన కిరణములచే పీల్చువిధమున, నీవు కైలాసపర్వతములోనగు మూర్ధ్వలోకంబుల దాగినను, సముద్రములో వరుణుని పట్టణములోనగు నధోలోకము లందు దాగినను, నాభర్త తన తమ్మునితో వచ్చి పిడుగు వృక్షమును గూల్చునట్లు నిన్ను గూల్చును.

తాత్పర్యము :- మడుగులో అడుగుననున్న అల్పజలమును సూర్యుడు త్వరలోనే హరించివేయునట్లు, నాభర్తయైన రాముడు అనుజు

నితోకూడి యుద్ధమున నీపై బాణములను గురిపించి నీ ప్రాణములను త్వరలోనే తీయగలడు సుమా.

శ్లో॥ గిరిం కుబేరస్య గతో ఽపధాయవా
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః,
అసంశయం దాశరథే ర్న మోక్ష్యసే
మహాద్రుమః కాలహతో ఽ శనేరివ. 34

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
"రావణ తృణీకరణం" నామ
ఏక వింశ స్సర్గః

పదచ్ఛేదము :- గిరిం - కుబేరస్య - గతః - అపధాయ - వా, సభాం-గతః - వా - వరుణస్య - రాజ్ఞః, అసంశయం- దాశరథేః - న - మోక్ష్యసే - మహాద్రుమః - కాలహతః - అశనేః - ఇవ.

అన్వయక్రమము :- కాలహతః (త్వం) అపధాయ. కుబేరస్య గిరిం గతః వా, వరుణస్య రాజ్ఞః సభాంగతః వా, అశనేః, మహాద్రుమః ఇవ అసంశయం, దాశరథేః నమోక్ష్యసే.

ప్రతిపదార్థము :- కాలహతః = దైవోపహతుడవైన, త్వం = నీవు. అపధాయ = పరుగెత్తిపోయి, కుబేరస్యగిరిం గతః వా = కుబేరుని పర్వతమైన కైలాసమునుజేరినను, వరుణస్య రాజ్ఞః = వరుణదేవునియొక్క, సభాం గతః వా = ఆస్థానమునుచేరుకొన్నను. అశనేః = పిడుగునుండి, మహాద్రుమః ఇవ = మహావృక్షమువలె, అసంశయం = నిస్సందేహముగా, దాశరథేః = శ్రీరామునినుండి, నమోక్ష్యసే = విడిపింపబడవు.

విశేషార్థసులు, వ్యాఖ్యాతల అభిప్రాయము ఐ'

మహేశ్వరతీర్థులు - కుబేరస్యగిరిం=గంధమాదన ప
'కుబేరస్య గిరిం, వరుణస్యసభాం' అని ఈ రెంటిని పే
ఊర్థ్వలోకములును అధోలోకములును రెండును ఇచట సూచిం:

తాత్పర్యము .- రావణా, నీవు కుబేరుని పర్వత
పోయినను, వరుణదేవుని సభాస్థానములో దాగినను శ్రీరామునిచే
గింపబడినట్టి బాణములనుండి ఎంతమాత్రమును తప్పించుకొనలే వు
పడినప్పుడు భస్మమగుమహావృక్షమువలె శ్రీరామునిచేతినుండి నీకు
తప్పదుసుమా!

ఇది శ్రీమత్సుందరకాండమున
" సు బో ధి ని " అను ఆంధ్ర వివరణమునందు
" రా వ ణ తృ ణీ క ర ణ ము " అను
ఇరువదియొకటవ సర్గము.

— • —

శ్రీరామాయనమః

శ్రీరామశరణ గురుభ్యోనమః

ద్వావింశః సర్గః

శ్లో॥ సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసాధిపః,
ప్రత్యువాచ తత స్సీతాం విప్రియం ప్రియదర్శనామ్. 1

పదచ్ఛేదము :- సీతాయాః - వచనం - శ్రుత్వా, పరుషం - రాక్షసాధిపః - ప్రత్యువాచ - తతః - సీతాం-విప్రియం-ప్రియదర్శనామ్.

అన్వయక్రమము :- రాక్షసాధిపః సీతాయాః పరుషంవచనం శ్రుత్వా, తతః ప్రియదర్శనాంసీతాం విప్రియం వచనం ప్రత్యువాచ.

ప్రతిపదార్థము :- రాక్షసాధిపః =రాక్షసరాజైన రావణుడు, సీతాయాః = సీతాదేవియొక్క, పరుషం వచనం = పరుషమైన మాటను, శ్రుత్వా = విని, ప్రియదర్శనాం సీతాం = సుందరాంగియైన సీతాదేవిని గూర్చి, తతః = పిమ్మట, విప్రియం = కఠినముగా, ప్రత్యువాచ = జవాబుచెప్పెను.

తాత్పర్యము :- రావణాసురుడు సీతాదేవిచెప్పిన పరుషమైన మాటలు విని సుందరాంగియైన ఆమెను గూర్చి తిరిగి కఠినముగా ఇట్లు పలికెను.

శ్లో॥ యథాయథా సాంత్వయితా వశ్యః స్త్రీణాం తథాతథా,
యథాయథా ప్రియంవక్తా పరిభూత స్తథా తథా. 2

పదచ్ఛేదము :- యథా-యథా-సాంత్వయితా-వశ్యః-స్త్రీణాం-తథా - తథా - యథా - యథా - ప్రియం - వక్తా - పరిభూతః - తథా - తథా.

అన్వయక్రమము :- యథాయథా (పురుషః), సాంత్వయితా, తథాతథా స్త్రీణాం వశ్యః; యథాయథా ప్రియం వక్తా, తథాతథా పరిభూతః (భవతి).

ప్రతిపదార్థము :- యథాయథా=ఎంతవిశేషముగ, (పురుషః) సాంత్వయితా = (పురుషుడు) బ్రతిమాలుచుండువాడగునో, తథాతథా = అంతఅధికముగా, స్త్రీణాం = స్త్రీలకు, వశ్యః భవతి = లోబడిపోయినవాడగును, యథాయథా = ఎంతఅధికముగా, ప్రియంవక్తా=ప్రియముగా మాటలాడువాడగునో, తథాతథా = అంతఎక్కువగా, పరిభూతః భవతి = పరాభవింపబడువాడగును.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "వశ్యఃభవతి" - ఇష్టుడగును, ఇది లోకమునందలి సామాన్యధర్మము. కాని నీయెడల అది విరుద్ధమైనదని రావణుని తాత్పర్యము.

తాత్పర్యము :- లోకమున పురుషుడు స్త్రీలనెంతగ బ్రతిమాలుకొనుచుండునో అంతకు అంతగా వారికివశుడై లోబడిపోవుచుండును, వారితో ఎంతప్రియముగా మాటలాడుచుండునో అంతగావారిచే పరాభవింపబడుచుండును.

శ్లో॥ సన్నియచ్ఛతి మే క్రోధం త్వయి కామః సముత్థితః,
ద్రవతో౽మార్గమాసాద్య హయానివ సుసారథిః. 5

పదచ్ఛేదము :– సన్నియచ్ఛతి – మే – క్రోధం – త్వయి – కామః – సముత్థితః – ద్రవతః – అమార్గం – అసాద్య – హయాన్ – ఇవ – సుసారథిః.

అన్వయక్రమము :– త్వయి సముత్థితః కామః, అమార్గం అసాద్య ద్రవతః హయాన్ సుసారథిః ఇవ, త్వయి సముత్థితం క్రోధం సన్నియచ్ఛతి.

ప్రతిపదార్థము :– త్వయి సముత్థితః కామః = నీయందేర్పడినట్టికామము, అమార్గంఅసాద్య = పెడత్రోవనుబట్టి, ద్రవతః హయాన్= పరుగిడుచున్న గుఱ్ఱములను, సుసారథిః ఇవ = నేర్పరియైనసారథివలె, త్వయి సముత్థితం క్రోధం = నీయందుకలిగినట్టి క్రోధమును, సన్నియచ్ఛతి = అణచివేయుచున్నది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :– " క్రోధం తం నియచ్ఛతి " – క్రోధకార్యమైన నిన్ను చంపివేయుటను మాన్పించుచున్నది.

తాత్పర్యము :– తప్పుడుమార్గమునకు లాగికొని పోవుచున్న గుఱ్ఱములను నిపుణుడైన రథచోదకుడు పగ్గములను నేర్పుగా బిగబట్టి మఱలించినట్లు, నీయందు నాకున్న ప్రేమయే నీపైనాకు కలుగు క్రోధమునంతను అణచివేయుచున్నది సుమా ॥

శ్లో॥ వామః కామో మనుష్యాణాం యస్మిన్ కిల నిబధ్యతే,
జనే తస్మిం స్త్వనుక్రోశ స్స్నేహశ్చ కిల జాయతే. 4

పదచ్ఛేదము :– వామః – కామః – మనుష్యాణాం–యస్మిన్–కిల – నిబధ్యతే – జనే – తస్మిన్ – తు – అనుక్రోశః – స్నేహః–చ – కిల – జాయతే.

అన్వయక్రమము :– మనుష్యాణాం కామః వామః. (సః) యస్మిన్ జనేకిల నిబధ్యతే, తస్మిన్ జనే, అనుక్రోశః, స్నేహశ్చ, జాయతేకిల.

ప్రతిపదార్థము :– మనుష్యాణాం = మనుష్యులకు, కామః = కామమనునది, వామః = దుష్టమైనది. (సః = అది) యస్మిన్ జనేకిల = ఏమనుజునియందయితే, నిబధ్యతే = లగ్నమైయుండునో, తస్మిన్ జనే = ఆమనుష్యునియందు, అనుక్రోశః = కారుణ్యమును, స్నేహశ్చ = స్నేహమును, జాయతేకిల = పుట్టుచుండునుగదా।

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :– 'వామః' — క్రూరః. క్రోధముకంటెను కూడ కామము తీవ్రముగ క్రూరమైనది.

తాత్పర్యము :– మనుష్యులచే కామము మిగిలి విపరీతమైన పనులు చేయించుచుండును. నరునకు ఎవ్వరియందు ఈకామము జనించునో అట్టివారు ఎంతక్రోధమునకు గురికావలసిన వారయినప్పటికిని వారిపైని కరుణయును స్నేహమునుమాత్రమే కలుగుచుండును.

శ్లో॥ ఏతస్మాత్కారణాన్నత్వాం ఘాతయామి వరాననే,
వధార్హా మవమానార్హాం మిథ్యాప్రవ్రజితే రతామ్. 5

పదచ్ఛేదము :– ఏతస్మాత్ - కారణాత్ - న - త్వాం - ఘాతయామి - వరాననే - వధార్హాం - అవమానార్హాం - మిథ్యాప్రవ్రజితే - రతామ్.

అన్వయక్రమము :– వరాననే! ఏతస్మాత్ కారణాత్ వధార్హాం అవమానార్హాం మిథ్యాప్రవ్రజితే రతాం, త్వాం నఘాతయామి.

ప్రతిపదార్థము :- వరాననే = ఉత్కృష్టమైన ముఖము గల సీతా. ఏతస్మాత్ కారణాత్ = ఈకారణమువలన, వధార్హాం = వధించుటకు అర్హమైయున్నదానవును, అవమానార్హాం = అవమానించుటకు తగియున్నదానవును, మిథ్యాప్రవ్రజితే రతామ్ = కపటమైన వనవాస వ్రతమును చేయుచున్నవానియందు మనసుపడుచున్నదానవు నగు, త్వాం = నిన్ను, నఘాతయామి = చంపివేయుటలేదు.

బాం॥పాఠాయిముద్రణము :- 'ప్రవ్రజితేరతామ్' అనుదానికి బదులుగా 'ప్రవ్రజనేరతామ్' అనిగలదు అనగా నిష్ప్రయోజనముగా భోగత్యాగరూపమైన ప్రవ్రజన (సన్యాస) మార్గమునందు ఆసక్తురాలవై యున్నదానవని భావము.

తాత్పర్యము :- ఓ సుందరవదనా! నీపై నాకు ఉత్కృష్టమైన కామము కల్గియున్నకారణముచేతనే ఆకపటపరివ్రాజకునియందు మనస్సు నిల్పుకొన్ననీవు నాకువధ్యురాలవై నను, అవమానింప దగినదానవై నను నిన్ను నేను చంపక ఉపేక్షించుచున్నాను.

శ్లో॥ పరుషాణీహ వాక్యాని యానియాని బ్రవీషి మాం,
తేషు తేషు వధో యుక్త స్తవ మైథిలి దారుణః. 6

పదచ్ఛేదము :- పరుషాణి - ఇహ - వాక్యాని - యాని - యాని - బ్రవీషి - మామ్, తేషు - తేషు - వధః - యుక్తః - తవ - మైథిలి - దారుణః.

అన్వయక్రమము :- మైథిలి!, ఇహ యానియాని పరుషాణి వాక్యాని మాం బ్రవీషి, తేషు తేషు తవ దారుణః వధః యుక్తః.

ప్రతిపదార్థము :- మైథిలి = ఓజానకీ! మాం= నన్నుగూర్చి, ఇహ = ఈసందర్భమున, యానియాని పరుషాణి వాక్యాని = ఏయేపరుష

పచనములను, బ్రవీషి = పలుకుచున్నావో, తేషుతేషు = అయావాక్యములందు, తవ = నీకు, దారుణః వధః = క్రూరమైనవధ, యుక్తః = తగియున్నది.

తాత్పర్యము :— జానకీ ! ఇప్పుడు నన్నుగూర్చి ఏయే కటువచనములు నీవు పలికియున్నావో వానిలో ప్రతిఒక్క వాక్యమునకును నీకు మరణదండనమే విధింపవలసియున్నది సుమా !

శ్లో॥ ఏవ ముక్త్వాతు వైదేహీం రావణో రాక్షసాధిపః,
క్రోధసంరంభసంయుక్త స్సీతా ముత్తరమబ్రవీత్. 7

పదచ్ఛేదము :— ఏవం - ఉక్త్వా - తు - వైదేహీం-రావణః-రాక్షసాధిపః, క్రోధసంరంభ సంయుక్తః-సీతాం - ఉత్తరం - అబ్రవీత్.

అన్వయక్రమము :— రాక్షసాధిపః రావణః, వైదేహీం ఏవం ఉక్త్వాతు, క్రోధసంరంభసంయుక్తః, సీతాం ఉత్తరం అబ్రవీత్.

ప్రతిపదార్థము :— రాక్షసాధిపః రావణః = రాక్షసరాజైన రావణుడు, వైదేహీం = సీతనుగూర్చి, ఏవం ఉక్త్వాతు = ఈరీతిగాపలికిపిమ్మట: క్రోధసంరంభసంయుక్తః = క్రోధావేశపూరితుడై, సీతాం = సీతనుగూర్చి, ఉత్తరం అబ్రవీత్ = సమాధానము పలికెను.

తాత్పర్యము :— రాక్షసరాజైన రావణుడు సీతనుగూర్చి ఈరీతిగా పలికి తీవ్రమైన క్రోధావేశముతో తిరిగిఇట్లనెను.

శ్లో॥ ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే యోఽవధిస్తే మయాకృతః
తత శ్శయన మారోహ మమ త్వం వరవర్ణిని. 8

పదచ్ఛేదము — ద్వౌ - మాసౌ - రక్షితవ్యౌ - మే - యః-

అవధిః - తే - మయా - కృతః, తతః -శయనం-ఆరోహ- మమ-త్వం - వరవర్ణిని.

అన్వయ క్రమము .- వరవర్ణిని ! మయా యః అవధిః కృతః, (తదనుసారేణ) మే ద్వౌమాసౌ రక్షితవ్యౌ: తతః త్వం మమ శయనం ఆరోహ.

ప్రతిపదార్థము :- వరవర్ణిని = ఓ సుందరాంగీ ! తే = నీకు, మయా = నాచేత, యః అవధిః కృతః = ఏహద్దుఏర్పరచబడినదో (తదనుసారేణ = ఆహద్దుననుసరించి) మే = నాకు, ద్వౌ మాసౌ = రెండునెలలు, రక్షితవ్యౌ = వేచియుండవలసి యున్నది. తతః = పిమ్మట త్వం =నీవు, మమ శయనం = నాశయ్యను, ఆరోహ = అధిష్ఠింపుము.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'వర్త తే దశమో మాసో ద్వౌతు శేషౌ ప్లవంగమ' అని సీతమ్మముందు చెప్పబోవు వచనమునకీ రెండుమాసముల అవధి న్యల్పదినముల భేదమేకావున విరుద్ధముగాదు.

రామాయణ శిరోమణి .- "తతః మమ శయనం ఆరోహ" మమ = నాకు, శయనం=దీర్ఘ నిద్రారూపమైన మరణము అని, ఆరోహ= తెలిసికొనుము, అనగా నీవు రామస్మరణ విడువనిచో నీ ఎదుటనే నేను మరణింతునని రావణుని భావము.

తాత్పర్యము :- సుందరీ ! నీకొసగినట్టి సమయమును అనుస రించి ఇంకను నేను రెండు మాసములు కాచుకొని యుండవలసియున్నది ఆరెండు నెలలపిమ్మట నీవు నా శయనమును ఆరోహింపక తప్పదు సుమా!

శ్లో॥ ఊర్ధ్వం ద్వాభ్యాంతు మాసాభ్యాం భర్తారం మా
మనిచ్ఛతీమ్,
మమ త్వాం ప్రాతరాశార్థ మాలభంతే మహానసే. 9

పదచ్ఛేదము :— ఊర్ధ్వం - ద్వాభ్యాం - తు - మాసాభ్యాం- భర్తారం - మాం - అనిచ్ఛతీమ్, మమ-త్వాం - ప్రాతరాశార్థం - ఆల భంతే - మహానసే.

అన్వయక్రమము :— ద్వాభ్యాంమాసాభ్యాం ఊర్ధ్వంతు మాం భర్తారం అనిచ్ఛతీం త్వాం మమ మహానసే ప్రాతరాశార్థం ఆలభంతే.

ప్రతిపదార్థము : ద్వాభ్యాం మాసాభ్యాం ఊర్ధ్వంతు = రెండు నెలలు దాటినపిమ్మటమాత్రము; మాం = నన్ను, భర్తారం = భర్తగా, అనిచ్ఛతీం = అంగీకరించనట్టి, త్వాం = నిన్ను; మమ మహానసే= నా వంట ఇంటియందు, ప్రాతరాశార్థం= ఉదయకాలపు భోజనమునకై, ఆలభంతే = చంపివేయుదురు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

రామాయణశిరోమణి .— "భర్తారం" - నీ భర్తయైనట్టి రాముని వలెయు 'మాం అనిచ్ఛతీమ్ త్వాం' నాలంకైశ్వర్యమును ఒల్లని నిన్నును గూడ వధింతుము అనిభావము.

బొంబాయి ముద్రణము .— ఆలభంతేమహానసే అనుటకు - ఋముగా "సూదాశ్ఛేత్స్యంతిఖండశః" అనిగలదు (నా వంటలవారు నిన్ను ముక్కలుగా ఖండింతురు).

తాత్పర్యము — ఆ రెండునెలలు గడచిన పిమ్మట మాత్రము అప్పటికిని నీవు నన్ను భర్తగా అంగీకరింపక పోయినచో, నా వంటలవారు

నిన్ను నా వంటయింటిలో నా ప్రాతఃకాలభోజనముకొరకై నిన్ను చంపి వండిపెట్టుదురు సుమా !

శ్లో॥ తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేంద్రేణ జానకీమ్,
దేవగంధర్వకన్యా స్తా విషేదు ర్వికృతేక్షణాః. 10

పదచ్ఛేదము :- తాం - తర్జ్యమానాం - సంప్రేక్ష్య - రాక్షసేంద్రేణ - జానకీమ్, దేవగంధర్వకన్యాః - తాః - విషేదుః - వికృతేక్షణాః.

అన్వయక్రమము :- రాక్షసేంద్రేణ తర్జ్యమానాం, తాం జానకీం సంప్రేక్ష్య, తాః దేవగంధర్వకన్యాః వికృతేక్షణాః (సత్యః) విషేదుః.

ప్రతిపదార్థము :- రాక్షసేంద్రేణ = రాక్షసరాజుచే, తర్జ్యమానాం = గద్దింపబడుచున్నట్టి, తాం జానకీం = ఆ సీతాదేవిని, సంప్రేక్ష్య = చూచి, తాః దేవగంధర్వకన్యాః = ఆ దేవగంధర్వకన్యకలు, వికృతేక్షణాః (సత్యః) = వికారమునొందినట్టి కన్నులు గలవారై, విషేదుః = దుఃఖించిరి.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'దేవగంధర్వకన్యాః' - సీతవలెనే బలాత్కారముగా, తీసికొనిరాబడినట్టివారు, అతనిని విధిలేక అంగీకరించినట్టివారు.

తాత్పర్యము :- ఆ రాక్షసరాజుచే ఈవిధముగా క్రూరముగా గద్దింపబడుచున్నట్టి సీతాదేవినిజూచి, దేవగంధర్వకుమారికలు తమ తమ కన్నులు చెమ్మగిల్లుచుండగా మిక్కిలి విషాదమునుపొందిరి.

శ్లో॥ ఓష్ఠప్రకారై రపరా వక్త్రనేత్రై స్తథాపరాః
సీతా మాశ్వాసయామాసు స్తర్జితాం తేన రక్షసా. 11

పదచ్ఛేదము :- ఓష్ఠప్రకారైః - అపరాః - వక్త్రనేత్రైః - తథా - అపరాః - సీతాం - అశ్వాసయామాసుః - తర్జితాం - తేన - రక్షసా.

అన్వయక్రమము - తేనరక్షసా తర్జితాం సీతాం అపరాః ఓష్ఠప్రకారైః, తథాఅపరాః వక్త్రనేత్రైః అశ్వాసయామాసుః

ప్రతిపదార్థము :- తేనరక్షసా = ఆ రాక్షసునిచే, తర్జితాం సీతాం = బెదిరింపబడుచున్న సీతాదేవిని, అపరాః = కొంతమంది దేవ గంధర్వకన్యలు, ఓష్ఠప్రకారైః = పెదవుల కదలికచేతను, తథాఅపరాః = అట్లేమరికొందరు, వక్త్రనేత్రైః = నోటితోడను కన్నులతోడను, అశ్వాసయామాసుః = ఓదార్చుచుండిరి.

తాత్పర్యము :- ఈవిధముగా రావణుడు సీతను భయంకరముగా బెదరించుచుండగా, అచటి దేవగంధర్వ కన్యలు, దీనికి నీవేమియు బెదిరిపోవకు మని తమ పెదవులయొక్కయు, నోటియొక్కయు కన్నుల యొక్కయు, కదలికలతోగూడిన సంజ్ఞలతో ఓదార్చి సీతమ్మకు ధైర్యమును చెప్పుచుండిరి.

శ్లో॥ తాభి రాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపమ్,
ఉవా చాత్మహితం వాక్యం వృత్త శౌండీర్యగర్వితమ్, 12

పదచ్ఛేదము :- తాభిః - అశ్వాసితా - సీతా - రావణం - రాక్షసాధిపమ్ - ఉవాచ, ఆత్మహితం - వాక్యం - వృత్తశౌండీర్య గర్వితమ్.

అన్వయక్రమము :- తాభిః అశ్వాసితా సీతా, రాక్షసాధిపం రావణం వృత్తశౌండీర్య గర్వితం, ఆత్మహితం వాక్యం ఉవాచ.

ప్రతిపదార్థము :- తాభిః ఆశ్వాసితా = ఆదేవత గంధర్వకన్య లచే ఊరడింపబడినట్టి, సీతా = సీతాదేవి, రాక్షసాధిపం రావణం = రాక్షసరాజైన రావణుని గూర్చి, వృత్తశౌండీర్యగర్వితం =తనపాతివ్రత్య ప్రభావముచే కలిగినగర్వముతో కూడినట్టి, ఆత్మహితం వాక్యం = తనకు హితమైనవాక్యమును, ఉవాచ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- "ఆత్మహితం వాక్యం" — రా వ ణు ని ఆత్మకు హితమైన, వృత్తశౌండీర్య గర్వితం = తన పాతివ్రత్యము చేతను, భర్త యొక్క శౌర్యమహిమచేతను లభించిన గర్వముకలిగినట్టి.

తాత్పర్యము :- ఆ దేవగంధర్వకన్యలచే ఓదార్చ బడుచున్న సీతాదేవి, తనపాతివ్రత్యముచేతను, శ్రీరాముని పరాక్రమముచేతను కలిగిన గర్వముతో, తనకు హితమైన వచనములను తిరిగి ఇట్లుపలికెను.

శ్లో॥ నూనం న తే జనః కశ్చి దస్తి ని్శ్రేయసే స్థితః,
నివారయతి యో న త్వాం కర్మణో౽స్మా ద్విగర్హితాత్.

పదచ్ఛేదము :- నూనం - న - తే-జనః - కశ్చిత్ - అస్తి - నిశ్రేయసే - స్థితః - నివారయతి - యః - న-త్వాం - కర్మణః - అస్మాత్ - విగర్హితాత్,

అన్వయక్రమము ;- యః త్వాం అస్మాత్ విగర్హితాత్ కర్మణః నివారయతి, తేనిశ్రేయసేస్థితః, సఃజనః నూనం కశ్చిత్ నఅస్తి.

ప్రతిపదార్థము :- యః =ఎవడయితే, విగర్హితాత్ = నింద్యమైనట్టి, అస్మాత్ కర్మణః= ఈకృత్యమునుండి, నివారయతి = నివర్తింపజేయునో, తే నిశ్రేయసే స్థితః = నీక్షేమమునందుండునో, సః జనః = మనుష్యుడు, నూనం = నిశ్చయముగా, కశ్చిత్నఅస్తి = ఎవ్వడునులేడు.

తాత్పర్యము .- ఓ రావణాసురుడా ! ఈ లంకానగరమునందూ పరదారచౌర్యముఎంటి గర్హణీయమైన కృత్యము చేయకుండ నిన్ను నివారించునట్టి నీమేలుకోరినవ్యక్తి ఎవ్వరును నిశ్చయముగా లేనేలేరని అనుకొనుచున్నాను.

శ్లో॥ మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః,
త్వదన్య స్త్రిషు లోకేషు ప్రార్థయే న్మనసా ఽపి కః. 14

పదచ్ఛేదము :- మాం - హి - ధర్మాత్మనః - పత్నీం శచీం ఇవ - శచీపతేః - త్వత్ - అన్యః - త్రిషు - లోకేషు - ప్రార్థయేత్ - మనసా - అపి - కః.

అన్వయక్రమము :- శచీపతేః శచీంఇవ, ధర్మాత్మనః పత్నీం మాం త్రిషులోకేషు మనసాఅపి త్వదన్యః కఃప్రార్థయేత్ ?

ప్రతిపదార్థము :- శచీపతేః శచీంఇవ = దేవేంద్రుని పట్టమహిషియైన శచీదేవినివలె, ధర్మాత్మనః పత్నీం మాం=పరమధార్మికుడైన శ్రీరామునిభార్యనగునన్ను, త్రిషులోకేషు = ముల్లోకములందును, త్వదన్యః కః = నీకంటెవేరెవ్వడు, మనసాఅపి = మనస్సుచేగూడ, ప్రార్థయేత్ = కోరును ?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- "మనసాపి కఃప్రార్థయేత్" మాటలతో కోరువాడు ఉండుట పూర్తిగా అసంభవమనిభావము.

తాత్పర్యము . దేవేంద్రుని పట్టమహిషియైన శచీదేవిని భార్యగా కోరినట్లుగా, ధర్మాత్ముడైన యీ శ్రీరాముని భార్యనగునన్ను,

పుట్టగకులందును నీవుగాక మఱియెవ్వడును తనమనస్సునందైన వాంఛింపగలడా ।

శ్లో॥ రాక్షసాధమ రామస్య భార్యా మమితతేజసః,
ఉక్త్వా నసి యత్పాపం క్వ గత స్తస్య మోక్ష్యసే.15

పదచ్ఛేదము :- రాక్షసాధమ - రామస్య - భార్యాం - అమిత తేజసః - ఉక్తవాన్ - అసి - యత్ - పాపం - క్వ - గతః - తస్య - మోక్ష్యసే.

అన్వయక్రమము :- రాక్షసాధమ । అమితతేజసః రామస్య భార్యాం యత్ పాపం ఉక్తవాన్ అసి, క్వగతః తస్య మోక్ష్యసే ?

ప్రతిపదార్థము :- రాక్షసాధమ = రాక్షసులందెల్ల అధముడైన రావణా ! అమితతేజసః =అపారమైనపరాక్రమముగల, రామస్య=శ్రీరాముని యొక్క, భార్యాం = ధర్మపత్నియైన నన్నుగూర్చి, యత్ పాపం ఉక్తవాన్ అసి= ఏపాపవచనమును పలికినవాడవైతివో, తస్య (తస్మాత్) = అపాతకమునుండి, క్వగతః = ఎచటికిపోయినవాడవై, మోక్ష్యసే = విడుపబడగలవు ?

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "యత్పాపం" — ' మమశయనం ఆరోహ ' ఇత్యాదిరూపమ్ - నాశయ్యపై చేరవలసినదని నీవుపలికినపాపపు మాటలు. 'క్వగతః మోక్ష్యసే' —అ పాపముచే పలించునట్టి నీసమూల వినాశనమునకు పరిహారము ఎచటకుపోయినను అశక్యము అనిభావము.

తాత్పర్యము :- ఓరాక్షసాధమా ! అమిత ప్రతాపశాలియైన శ్రీరామునిభార్యనుగూర్చి ఏపాపవచనములు నీవుపలికియుంటివో అపాతకమును నీవుఎచటికిపోయి ఏమిచేసి పోగొట్టుకొనగలవు ?

శ్లో॥ యథా దృప్తశ్చ మాతంగః శశశ్చ సహితౌ వనే,
తథా ద్విరదవ ద్రామ స్త్వం నీచశశవ త్స్మృతః. 16

పదచ్ఛేదము – యథా – దృప్తః – చ – మాతంగః–శశః–చ – సహితౌ – వనే –తథా – ద్విరదవత్–రామః–త్వం – నీచశశవత్ – స్మృతః.

అన్వయక్రమము :– వనే యథా దృప్తః మాతంగశ్చ, శశశ్చ సహితౌ, తథా (అత్ర) రామఃద్విరదవత్, త్వం నీచశశవత్, స్మృతః.

ప్రతిపదార్థము :– వనే = అరణ్యమునందు, యథా = ఏవిధముగా, దృప్తః మాతంగశ్చ = మదించినట్టిఏనుగును, శశశ్చ=కుందేలును, సహితౌ = కూడియుందురో, తథా = ఆరీతిగా, అత్ర = ఇచ్చట, రామః ద్విరదవత్ = శ్రీరాముడు మత్తగజమువంటి వాడుగా, స్మృతః = తలచబడును. త్వం నీచశశవత్ =నీవుక్షుద్రమైన కుందేలువంటివాడవుగా, స్మృతః = తలచబడుదువు.

పాఠాంతరము — సహితోవనే – అని కలదు.

విశేషార్థములు, వాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము – ఇచట రావణుడు తనకు మదపు టేనుగుతో సామ్యము చెప్పబడుచున్నదని భ్రమచెందకుండ రాముడు ఏనుగువంటివాడు నీవు కుందేలువంటివాడవని సీతమ్మయే స్పష్టముచేసి చెప్పెను.

తాత్పర్యము :– అరణ్యమునందు మదపుటేనుగున్న చోటికి కుందేలుచేరి నీతోయుద్ధమునకు వచ్చితి నన్నట్లుగా, మత్తేభమువంటి శ్రీరామునితో కుందేలువంటినీవు సామ్యముచెప్పుకొనుచున్నావు.

శ్లో॥ స త్వ మిక్ష్వాకునాథం వై క్షిప న్నిహ న లజ్జసే,
చక్షుషో ర్విషయం తస్య న తావ దుపగచ్ఛసి. 17

పదచ్ఛేదము – సః – త్వం-ఇక్ష్వాకునాథం – వై – క్షిపన్- ఇహ – న – లజ్జసే, చక్షుషోః – విషయం – తస్య – న – తావత్ – ఉపగచ్ఛసి.

అన్వయక్రమము :– సఃత్వం ఇక్ష్వాకునాథం క్షిపన్ ఇహ న లజ్జసే, తస్య చక్షుషోః విషయం తావత్ న ఉపగచ్ఛసి.

ప్రతిపదార్థము :– సః త్వం = అట్టినీవు, ఇక్ష్వాకునాథం = ఇక్ష్వాకుప్రభువును, ఇహ = ఈలంకయందు, క్షిపన్ = నిందించుచు, నలజ్జసే = సిగ్గుపడుటలేదు, తస్య చక్షుషోః విషయం తావత్ = అమహాత్ముని కన్నులకు కాన్పించుటమాత్రము, న ఉపగచ్ఛసి=పొందలేకున్నావు

తాత్పర్యము :– కుంచేలువలె క్షుద్రుడవైననీవు మదగజము వంటి ఆ ఇక్ష్వాకుప్రభువును ఈలంకలోకూర్చుండి నిందించుటకు ఏమియును సిగ్గుపడకున్నావు, ఇంతకును అతనికన్నులఎదుట నిలుచుధైర్యము ఎప్పుడును నీవు చూపలేదుగదా।

శ్లో॥ ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపింగళే,
క్షితౌ న పతితే కస్మా న్మా మనార్య నిరీక్షతః. 18

పదచ్ఛేదము :– ఇమే – తే – నయనే – క్రూరే – విరూపే – కృష్ణపింగళే – క్షితౌ – న – పతితే – కస్మాత్ – మాం-అనార్య – నిరీక్షతః.

అన్వయక్రమము – తే ఇమే క్రూరే, విరూపే, కృష్ణ పింగళే నయనే కస్మాత్ క్షితౌ నపతితే ?

ప్రతిపదార్థము – అనార్య = ఓ నీచుడా। మాం నిరీక్షతః = నన్ను (దుష్టబుద్ధితో) చూచుచున్న, తే = నీయొక్క, ఇమే = ఈ

క్రూరే = క్రూరమైనట్టి, విరూపే = వికృతములైనట్టి, కృష్ణపింగళే = నల్లని పచ్చని రంగుతోనున్న, నయనే = రెండు కన్నులును, కస్మాత్ = ఎందువలన, క్షితౌ న పతితే = నేలపై రాలిపోకున్నవి ?

తాత్పర్యము .- ఓనీచుడా ! నన్నుపాపబుద్ధితో చూచుచున్నట్టి నీక్రూరమైన, వికారమైన, భీకరవర్ణములుగల ఈ నీ రెండుకన్నులును ఇంకను ఎందుచేత నేలపై రాలిపోవకున్నవి ?

శ్లో॥ తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ,
కథం వ్యాహరతో మాం తే న జిహ్వా వ్యవశీర్యతే. 19

పదచ్ఛేదము :- తస్య - ధర్మాత్మనః - పత్నీం - స్నుషాం- దశరథస్య - చ -కథం - వ్యాహరతః - మాం - తే - న - జిహ్వా - వ్యవశీర్యతే.

అన్వయక్రమము :- ధర్మాత్మనః తస్య పత్నీం, దశరథస్య స్నుషాం మాం వ్యాహరతః తే జిహ్వా కథం నవ్యవశీర్యతే ?

ప్రతిపదార్థము .- తస్య ధర్మాత్మనః పత్నీం = ఆ పరమ ధార్మికుడైన శ్రీరాముని భార్యనైనట్టి, తస్య దశరథస్య స్నుషాం = ఆ దశరథుని కోడలినైనట్టి, మాం= నన్ను, వ్యాహరతః = (ఇష్టమువచ్చి నట్లు) మాటలాడుచున్న, తే = నీయొక్క, జిహ్వా = నాలుక, కథం న వ్యవశీర్యతే = ఏల చీలికమైపోవుటలేదు ?

తాత్పర్యము:- ధర్మాత్ముడైన శ్రీరామునిభార్యను, దశరథుని కోడలిని అగునన్ను, నోటికివచ్చినట్లు దుర్భాషలాడుచున్న నీనాలుక ఏల వ్రక్కలు కాకున్నదోకదా !

శ్లో॥ అసందేశాత్తు రామస్య తపస శ్చానుపాలనాత్,
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా. 20

పదచ్ఛేదము .— అసందేశాత్ - తు - రామస్య - తపసః - చ - అనుపాలనాత్ - న - త్వాం - కుర్మి - దశగ్రీవ - భస్మ - భస్మార్హ తేజసా.

అన్వయక్రమము .— దశగ్రీవ ! రామస్య అసందేశాత్, తపసః అనుపాలనాత్ చ, త్వాం భస్మార్హ తేజసా, భస్మ నకుర్మి.

ప్రతిపదార్థము .— దశగ్రీవ ! = ఓ దశకంఠుడా ! రామస్య అసందేశాత్ = రాముని ఆజ్ఞలేకపోవుటవలనను, తపసః అనుపాలనాత్ చ = తపోవ్రతమును అనుసరించుటవలనను, భస్మార్హ తేజసా = భస్మముచేయుటకు శక్తిగల నాతేజముచేత, త్వాం = నిన్ను, భస్మ న కుర్మి = భస్మము చేయకున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము .— "భస్మార్హ తేజసా" అనుపదమునందు 'భస్మార్హ' అనునది సంబోధనముగా చేసి (భస్మమగుటకు తగినవాడా ! అని) అర్థముచెప్పవచ్చును.

వాసుదాసస్వామి :— నిన్ను చంపుటకు రామచంద్రమూర్తి రావలయునా ? నేనేనిన్ను భస్మము చేయలేనా ? నీకింతశక్తి యుండిన ఏల చేయరాదందువా ? నేనుకేవలము పరతంత్రురాలను; నాయొక్క రక్షణ భారమునాభర్తపైనే వైచియున్నదానను. అప్పట్లనేనుస్వతంత్రించి నిన్ను చంపితినా నాపారతంత్ర్యమునకు హానివచ్చును. భర్తయాజ్ఞ లేనికార్యము నేను చేసినచో నాపాతివ్రత్యమునకే హానివచ్చునుగదా !

తాత్పర్యము .— భస్మము చేయవలసియున్న పాతకివైన ఓదశకంఠుడా ! నా రాముడు నాకు అనుజ్ఞ ఇవ్వకుండుటచేతను, నా పాతివ్రత్య తపస్సునకు భంగముకలుగ గూడదనియును ప్రచండమైన నా తేజముచేత నిన్నుభస్మముచేయ దలచుకొనలేదు సుమా !

శ్లో॥ నాపహర్తు మహం శక్యా త్వయా రామస్య ధీమతః,
విధి స్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః. 21

పదచ్ఛేదము .— న - అపహర్తుం-అహం - శక్యా-త్వయా-రామస్య - ధీమతః, విధిః - తవ - వధార్థాయ - విహితః-న - అత్ర-సంశయః.

అన్వయక్రమము .— ధీమతః రామస్య అహం త్వయా అపహర్తుం నశక్యాః (ఏషః) విధిః,తవవధార్థాయ విహితః అత్ర సంశయః న.

ప్రతిపదార్థము :- ధీమతః రామస్య = ప్రజ్ఞాశాలియైన శ్రీరామునియొక్క, అహం = (భార్యనైన) నేను, త్వయా = నీచే, అపహర్తుం = దొంగిలింపబడుటకు, నశక్యా = సాధ్యురాలనుగాను ఏషః విధిః=ఈ ఘటనము, తవ వధార్థాయ = నీమృత్యువుకొరకు (విహితః)= విధింపబడినది. అత్రసంశయః న = ఇందుసందియములేదు.

తాత్పర్యము :- ప్రజ్ఞాశాలియైన శ్రీరాముని అధీనమందున్న నన్నుదొంగిలించుట నీకుశక్యమైన విషయముకాదు. కాని దైవమే నీకు మృత్యువునుకల్పించుటకు ఈవిధముగా ఏర్పాటుచేసినాడు. ఈ విషయమున సందేహములేదు.

శ్లో॥ శూరేణ ధనదభ్రాత్రా బలై స్సముదితేన చ,
అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్.

పదచ్ఛేదము .— శూరేణ - ధనదభ్రాత్రా - బలైః - సముదితేన - చ - అపోహ్య - రామం - కస్మాత్ - హి - దారచౌర్యం-త్వయా - కృతమ్.

అన్వయక్రమము :- శూరేణ, ధనదభ్రాత్రా, బలైః సముదితే నచ త్వయా రామం అపోహ్య కస్మాత్ దారచౌర్యం కృతమ్ ?

ప్రతిపదార్థము :- శూరేణ = మహావీరుడవును, ధనదభ్రాత్రా = కుబేరునకు తమ్ముడవును, బలైః సముదితే = బలములో తుల తూగు చున్నవాడవునగు, త్వయా = నీచేత, కిస్మాత్ = ఏకారణమువలన, రామం అపోహ్య = శ్రీరాముని మారముచేసి, దారచౌర్యం కృతం = భార్యాపహరణము చేయబడినది.

తాత్పర్యము :- మహావీరుడవున, కుబేరుని తమ్ముడవును, అమితబలసంపదలతో విరాజిల్లుచున్నవాడవునైనట్టి ఘనుడవు, ఆనాడు పర్ణశాలలో నాథిస్థుడైన శ్రీరాముని, అతనిసోదరుని మారముచేసి నన్ను ఏల దొంగిలించి తెచ్చితివి ?

శ్లో॥ సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః,
విపృత్య నయనే క్రూరే జానకీ మన్వవైక్షత. 23

పదచ్ఛేదము :- సీతాయాః - వచనం - శ్రుత్వా - రావణః రాక్షసాధిపః - విపృత్య - నయనే - క్రూరే - జానకీం - అన్వవైక్షత.

అన్వయక్రమము :- రాక్షసాధిపః రావణః, సీతాయాః వచనం శ్రుత్వా, క్రూరే నయనే విపృత్య, జానకీం అన్వవైక్షత,

ప్రతిపదార్థము :- రాక్షసాధిపః రావణః = రాక్షసరాజైన రావణుడు, సీతాయాః వచనం = సీతమ్మమాటలను, శ్రుత్వా = విని, క్రూరే = తీక్ష్ణములైన, నయనే = కన్నులను, విపృత్య = పెద్దవిగ చేసి, జానకీం = సీతాదేవిని, అన్వవైక్షత = చూచెను.

తాత్పర్యము :- రావణాసురుడు సీతాదేవి పలికిన పలు
విని భీకరమైన తన నేత్రములను పెద్దవిగచేసి ఆమెవైపు ఉగ్ర
చూచెను.

శ్లో॥ నీలజీమూత సంకాశః మహాభుజశిరోధరః,
సింహసత్త్వగతి శ్శ్రీమాన్ దీప్తజిహ్వాగ్రలోచనః.

పదచ్ఛేదము - నీలజీమూతసంకాశః - మహాభుజశిరో
సింహసత్త్వగతిః - శ్రీమాన్ - దీప్తజిహ్వాగ్రలోచనః.

అన్వయక్రమము :- సుగమము.

ప్రతిపదార్థము :- నీలజీమూత సంకాశః = నల్లని మేఘ
సమానుడును, మహాభుజశిరోధరః = గొప్పవైనభుజములును, క
మును గలవాడును, సింహసత్వగతిః = సింహమువంటిబలము ను
నమునుగలవాడును, శ్రీమాన్ = గొప్పశోభకల్గియున్నవాడును,
జిహ్వాగ్ర లోచనః = జ్వలించుచున్ననాలుకకొనయును, క న్ను
గల్గియున్నవాడునుఅగు, (రావణ = రావణుడు), ఉవాచ = పలికె

తాత్పర్యము :- రావణుడు అప్పుడు నల్లని పెద్దమేఘము
కానవచ్చుచుండెను. దీర్ఘమ్మైనబాహువులును కంఠమును కల్గి యుం
అతని బలమును గమనమును, సింహమునుబోలియుండెను. ప్రజ్వ
ఉన్న కనులును జిహ్వాగ్రమును గలవాడై అతడు సీతను
ఇట్లు పలికెను.

శ్లో॥ చలాగ్రమకుటప్రాంశు శ్చిత్రమాల్యానులేపనః,
రక్తమాల్యాంబరధర స్తప్తాంగద విభూషణః.

అన్వయక్రమము — సుగమము

పదచ్ఛేదము :— చలాగ్రమకుట ప్రాంశుః - చిత్రమాల్యాను లేపనః - రక్తమాల్యాంబరధరః - తప్తాంగదవిభూషణః.

ప్రతిపదార్థము :— చలాగ్రమకుటప్రాంశుః = చలించుచున్న చివరి భాగముగల కిరీటముతో మిక్కిలి పొడగరియైనవాడును, చిత్రమాల్యానులేపనః = రంగు రంగుల పూలమాలికలను, మైపూతలను గలవాడును, రక్తమాల్యాంబరధరః = ఎర్రని పుష్పమాలికలను వస్త్రములను ధరించినవాడును, తప్తాంగద విభూషణః = ప్రకాశించుచున్న భుజకీర్తులు ఆభరణములుగ ధరించినవాడును అగు (రావణః = రావణుడు, ఉవాచ = పలికెను).

తాత్పర్యము :— పొడవైన అతని శరీరమున కిరీటముయొక్క అగ్రము కదలుచుండెను అతడు రంగు రంగుల పూలమాలికలను, మైపూతలను ధరించియుండెను, మరియు నాతడు ఎఱ్ఱనిపుష్పమాలికలను వస్త్రములను ధరించియుండెను. అతని భుజకీర్తులు గొప్ప ప్రకాశముతో మెఱయుచుండెను. ఇట్టి అతడు సీతనుచూచి ఇట్లుపలికెను.

శ్లో॥ శ్రోణిసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః,
అమృతోత్పాదనద్ధేన భుజగేనేవ మందరః. 26

పదచ్ఛేదము :— శ్రోణి సూత్రేణ - మహతా - మేచకేన - సుసంవృతః - అమృతోత్పాదనద్ధేన - భుజగేన - ఇవ - మందరః.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :- అమృతోత్పాదనద్దేన = అమృతసంపాదనము కొరకు చుట్టబెట్టినట్టి, భుజగేన = సర్పముచే (వాసుకిచే) మందరః ఇవ = మందరపర్వతమువలె, మేచకేన = నల్లనైన (నెమలికన్నులవంటి) రంగుకలిగిన, మహతా క్షోటీసూత్రేణ = పెద్దదైన మొలనూలిచే, సుసంవృతః = చక్కగాచుట్టబడియున్న వాడునుఅగు (రావణః = రావణుడు, ఉవాచ = పలికెను).

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- మేచకేన — ఇంద్రనీలమణులచే పొదగబడి యుండుటచే మొలనూలు నల్లగ నున్నదని భావము. వాసుకి నల్లనిరంగు వాడనిచెప్పుదురు.

తాత్పర్యము :- అమృతోత్పాదనముకొరకై నల్లనైనవాసుకి యను సర్పముచేచుట్టబడినట్టి మందరపర్వతమువలె రావణుడు, ఇంద్రనీలములతో నల్లగనున్న పెద్దదైన కటిసూత్రమును తన నడుమున ధరించి యుండెను.

శ్లో॥ తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః,
శుశుభే௨చలసంకాశ శ్శృంగాభ్యామివ మందరః. 27

పదచ్ఛేదము :- తాభ్యాం - సః - పరిపూర్ణాభ్యాం - భుజాభ్యాం - రాక్షసేశ్వరః - శుశుభే - అచలసంకాశః - శృంగాభ్యాం - ఇవ - మందరః.

అన్వయక్రమము :- సః రాక్షసేశ్వరః శృంగాభ్యాం మందరః ఇవ, పరిపూర్ణాభ్యాం తాభ్యాం భుజాభ్యాం, అచలసంకాశః, (సన్) శుశుభే, (ఉవాచ చ॥)

ప్రతిపదార్థము :- సః రాక్షసేశ్వరః = ఆరాక్షసచక్రవర్తి, శృంగాభ్యాం మందరః ఇవ = రెండు శిఖరములతో నున్న మందరపర్వతమువలె, పరిపూర్ణాభ్యాం = నిండుగనున్నట్టి, తాభ్యాంభుజాభ్యాం = జగత్ప్రసిద్ధములైన రెండుబాహువులతో, అచలసంకాశః (సన్) పర్వతసన్నిభుడై, శుశుభే = శోభిల్లెను, (ఉవాచ = పలికెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "భుజాభ్యాం" — రావణునకు యుద్ధము మున్నగు సమయములందే ఇరువది బాహువులుండును, కాని అతడు నిత్యము ద్విభుజములతోమాత్రమే యుండునని తెలిసికొనవలెను. కొందరు వ్యాఖ్యాతలు ఆతని కుడి ఎడమ బాహువులను రెండింటిని మాత్రమే విభజించుచు ద్వివచనము వాడబడినదనిరి.

రామాయణశిరోమణి :- రావణుడు కామరూపిగావున అతడు తనఇష్టమువచ్చినట్లు స్వేచ్ఛగా ఎన్నిభుజములతోనైన నుండును.

తాత్పర్యము :- అప్పుడు బలిష్ఠములయిన తన రెండు భుజములతో గంభీరమైన దేహముకలిగిన రావణుడు, రెండు శిఖరములతో కూడిన మందరపర్వతమువలె శోభిల్లుచు సీతమ్మతో ఇట్లుపలికెను.

శ్లో॥ తరుణాదిత్యవర్ణాభ్యాం కుండలాభ్యాం విభూషితః,
రక్తపల్లవపుష్పాభ్యా మశోకాభ్యా మి వాచలః ॥ 28

పదచ్ఛేదము :- తరుణాదిత్యవర్ణాభ్యాం - కుండలాభ్యాం - విభూషితః - రక్తపల్లవపుష్పాభ్యాం - అశోకాభ్యాం - - ఇవ - అచలః.

అన్వయక్రమము :- రక్తపల్లవపుష్పాభ్యాం, అశోకాభ్యాం అచలఃఇవ, తరుణాత్యవర్ణాభ్యాం కుండలాభ్యాం విభూషితః (సన్) (ఉవాచ = పలికెను.)

ప్రతిపదార్థము :- రక్తపల్లవ పుష్పాభ్యాం = ఎఱ్ఱని చిగుళ్ళతోను, పుష్పములతోను నిండిన, అశోకాభ్యాం = రెండు అశోకవృక్షములతో, అచలఃఇవ = పర్వతమువలె, తరుణాధిత్యవర్ణాభ్యాం = లేత సూర్యుని వన్నెగల, కుండలాభ్యాం = కుండలద్వయముతో, విభూషితః (సన్) = అలంకరింపబడినవాడై, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :- లేతసూర్యునివలె ఎఱ్ఱనికాంతితో ప్రకాశించు కర్ణాభరణములతో విరాజిల్లుచున్నట్టి అతడు, ఎఱ్ఱని చివుళ్ళను పుష్పములును గల రెండు అశోకవృక్షములతో మెచ్చటగనున్న పర్వతమువలెనే శోభిల్లుచు సీతమ్మతో పలికెను.

శ్లో॥ స కల్పవృక్షప్రతిమో వసంతఇవ మూర్తిమాన్,
శ్మశానచైత్యప్రతిమో భూషితోపి భయంకరః. 29

పదచ్ఛేదము :- సః - కల్పవృక్షప్రతిమః - వసంతః - ఇవ - మూర్తిమాన్ - శ్మశానచైత్యప్రతిమః - భూషితః - అపి - భయంకరః

అన్వయక్రమము :- కల్పవృక్ష ప్రతిమఃసః, మూర్తిమాన్ వసంతఃఇవ, భూషితఃఅపి, శ్మశానచైత్య ప్రతిమః భయంకరః (సన్ ఉవాచ.)

ప్రతిపదార్థము :- కల్పవృక్షప్రతిమఃసః = కల్పవృక్షముతో సమానుడైన రావణుడు, మూర్తిమాన్ = శరీరమునుధరించిన, వసంతఃఇవ = వసంతుడువలె, భూషితఃఅపి = అలంకరింప బడినవాడైనప్పటికిని.

శ్మశాన చైత్య ప్రతిమః = శ్మశానము నందలి మండపము వంటివాడుగా, భయంకరః సన్ = భయంకరుడగుచు, (ఉవాచ = పలికెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- రావణుడు తన అలంకారములతోగూడి కల్పవృక్షమువలె సుందరముగానున్నను, తనయొక్క రాక్షసజాతి సహజ మైన భయంకరత్వముచే శ్మశానమండపమువలె భీతిగొల్పుచు నుండెనని భావము.

తిలకము :- "శ్మశానచైత్యప్రతిమః" — (చైత్యం బౌద్ధాయ తనం) శ్మశానమును, బౌద్ధమందిరమును చూడరానివిగదా !

తాత్పర్యము :- కల్పవృక్షము వలెను, మూర్తీభవించినట్టి వసంతమువలెను, చక్కని ఆభరణములతో నిండియున్నను, శ్మశానము నందలి బౌద్ధాయతనమువలె భయంకరముగ కాన్పించుచు, రావణుడు సీతమ్మతో ఇట్లు పలికెను.

శ్లో॥ అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః,
ఉవాచ రావణ స్సీతాం భుజంగఇవ నిశ్శ్వసన్. 30

పదచ్ఛేదము :- అవేక్షమాణః - వైదేహీం - కోపసంరక్త లోచనః - ఉవాచ - రావణః - సీతాం - భుజంగః - ఇవ - నిశ్శ్వసన్.

అన్వయక్రమము :- కోపసంరక్తలోచనః (సన్) రావణః వైదేహీం అవేక్షమాణః, భుజంగఃఇవ నిశ్శ్వసన్ సీతాం ఉవాచ.

ప్రతిపదార్థము :- రావణః = రావణుడు, కోప సంరక్త లోచనః = క్రోధముచే ఎఱ్ఱబారినట్టి కన్నులుగలవాడై, వైదేహీం అవే

క్షమాణః = సీతాదేవినిచూచుచు, భుజంగః ఇవ నిశ్శ్వసన్ = సర్పము వలె నిట్టూర్చుచు, సీతాం ఉవాచ = సీతనుగూర్చి పలికెను.

తాత్పర్యము :- రావణుడు అమితమైన క్రోధముచే ఎఱ్ఱబడిన కన్నులు గలవాడై, సీతను క్రూరముగాచూచుచు, మహాసర్పము బుసకొట్టుచున్నట్టు నిట్టూర్చుచు ఆమెతో తిరిగి ఇట్లు పలికెను.

శ్లో॥ అనయే నాభిసంపన్న మర్థహీన మనువ్రతే,
నాశయా మ్యహ మద్య త్వాం సూర్య స్సంధ్యామి
వౌజసా. 31

పదచ్ఛేదము :- అనయేన - అభిసంపన్నం - అర్థహీనం - అనువ్రతే - నాశయామి - అహం - అద్య - త్వాం - సూర్యః - సంధ్యాం - ఇవ - ఓజసా.

అన్వయక్రమము :- అనయేన అభిసంపన్నం, అర్థహీనం అనువ్రతే ! త్వాం అహం అద్య సూర్యః ఓజసా సంధ్యాంఇవ నాశయామి.

ప్రతిపదార్థము :- అనయేన అభిసంపన్నం = అక్రమములతో నిండి యున్నవాడును; అర్థహీనం = ధనహీనుడునగు (రాముని) అనువ్రతే = అనుసరించుచున్నదానా, త్వాం = నిన్ను, అహం = నేను, అద్య = నేడు, సూర్యః = సూర్యుడు, ఓజసా=(తన) ప్రభచే, సంధ్యాం ఇవ = (ఉదయకాలపు) సంధ్యనువలె, నాశయామి = నశింపజేసెదను.

తాత్పర్యము :- నీతిమాలినవాడును, ధనహీనుడును అగు రామునియందు అనురక్తిగల ఓ అజ్ఞానురాలా ! సూర్యుడు ఉదయకాలము నందలి చీకటిని నాశనము చేసినట్లుగా నిన్ను ఇప్పుడే నశింప చేసెదను చూడుము.

శ్లో॥ ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణ శ్శత్రురావణః,
సందిదేశ తత స్సర్వా రాక్షసీ ర్ఘోరదర్శనాః. 32

పదచ్ఛేదము :- ఇతి - ఉక్త్వా - మైథిలీం - రాజా - రావణః - శత్రురావణః - సందిదేశ - తతః - సర్వాః - రాక్షసీః - ఘోరదర్శనాః.

అన్వయక్రమము :- శత్రురావణః, రాజా రావణః, మైథిలీం ఇతిఉక్త్వా, తతః ఘోరదర్శనాః, సర్వాఃరాక్షసీః సందిదేశ.

ప్రతిపదార్థము :- శత్రురావణః = శత్రువుల నాక్రోశింప చేయునట్టి, రాజా రావణః = రాక్షసరాజైనరావణుడు, మైథిలీం = సీతా దేవినిగూర్చి, ఇతి ఉక్త్వా = ఈరీతిగా పలికి, తతః = పిమ్మట, ఘోర దర్శనాః = భయంకరమైనదర్శనముగల, సర్వాః రాక్షసీః = అచ్చటరాక్షస స్త్రీలనందరిను, సందిదేశ = ఆజ్ఞాపించెను.

తాత్పర్యము :- శత్రుభీకరుడైన ఆ రావణుడు సీతాదేవితో ఈరీతిగాబలికి, పిమ్మట అచ్చటనున్న మహాభయంకరులైన రాక్షసాంగనల నెల్లరనుజూచి ఈవిధముగా నాజ్ఞాపించెను.

శ్లో॥ ఏకాక్షీ మేకకర్ణాంచ కర్ణప్రావరణాం తథా,
గోకర్ణీం హస్తికర్ణీంచ లంబకర్ణీ మకర్ణికామ్. 33

పదచ్ఛేదము :- ఏకాక్షీం - ఏకకర్ణాం - చ - కర్ణప్రావరణాం - తథా - గోకర్ణీం - హస్తికర్ణీం - చ - లంబకర్ణీం - అకర్ణికామ్.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము .- ఏకాక్షీం = ఒంటికన్ను గలదానిని, ఏకకర్ణాం = ఒంటిచెవి గలదానిని, తథా = అట్లు, కర్ణప్రావరణాం =

చెవులే ఉత్తరీయముగా గలదానిని, గోకర్ణీం = ఆవుచెవులవంటి చెవులుగల దానిని, హస్తికర్ణీం = ఏనుగుచెవులవంటి చెవులుగలదానిని, లంబకర్ణీం = పాదవుగ్రేలాడు చెవులుగలదానిని, అకర్ణికాం = చెవులులేనిదానిని. ఆదిదేశ = ఆజ్ఞాపించెను.)

తాత్పర్యము :- ఆ భీకరాకారలగు రాక్షసాంగనలలో ఏకాక్షి యు, ఏకకర్ణయు, దుప్పటివంటికర్ణములు గలదియు, గోకర్ణియు, హస్తికర్ణియు, లంబకర్ణియు, కర్ణములేలేనిదియునగు ఆయా రాక్షసస్త్రీలను జూచి రావణు డిట్లాజ్ఞాపించెను.

శ్లో॥ హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూళికామ్,
ఏకాక్షీ మేకపాదీంచ పృథుపాదీ మపాదికామ్. 3

పదచ్ఛేదము :- హస్తిపాద్యశ్వపాద్యౌ - చ - గోపాదీం - పాదచూళికామ్, ఏకాక్షీం - ఏకపాదీం - చ - పృథుపాదీం - అపాదికామ్.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :- హస్తిపాద్యశ్వపాద్యౌచ = ఏనుగుపాదము వంటి పాదములుగలదానిని, గుఱ్ఱము పాదమువంటి పాదములు కలదానిని, గోపాదీం = గోవుపాదములవంటి పాదములుగలదానిని, పాదచూళికాం = పాదములయందు జుట్టుకలదానిని, ఏకాక్షీం = ఒక్కకన్నుగలదానిని, పృథుపాదీం = స్థూలమైనపాదములుగలదానిని, అపాదికాం = పాదములే లేనట్టిదానిని, (ఆదిదేశ = ఆజ్ఞాపించెను.)

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ఏకాక్షీం — ఇచటతెలుపబడిన ఏకాక్షి మరియొక్క రాక్షసి, అనగా ఇరువురు ఏకాక్షరాక్షసవనితలు గలరనిచెప్పబడెను.

రామాయణ శిరోమణి :- ఏకాక్షీం — చిన్ని కన్నులుగల దానిని అని అర్థము.

గోవిందరాజీయము :- ఏకాక్షీం - అక్షమనగా ఇంద్రియము; ఇచ్చట ఏకాక్షికి నేత్రశ్రోత్రాదీంద్రియములు ఒక్కొక్కటిగలవని తెలుప బడినది.

తాత్పర్యము :- మఱియు హస్తిపాదియు అశ్వపాదియు గోపాదియు, పాదములయందు కేశములుగలదియును, ఒంటికన్ను, ఒంటి చెవి, ఒంటి ముక్కును గలదియును, ఏకపాదియు, స్థూలపాదియు పాదములే లేనట్లుగ నున్నదియునగు ఆ యారాక్షసవనితలనుచూచి రావణుడిట్లాజ్ఞాపించెను.

శ్లో॥ అతిమాత్రశిరోగ్రీవా మతిమాత్రకుచోదరీం,
అతిమాత్రాస్యనేత్రాంచ దీర్ఘజిహ్వా మజిహ్వికామ్. 35

పదచ్ఛేదము :- అతిమాత్రశిరోగ్రీవాం- అతిమాత్రకుచోదరీం అతిమాత్రా స్యనేత్రాం - చ - దీర్ఘజిహ్వాం - అజిహ్వికామ్,

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :- అతిమాత్రశిరోగ్రీవాం =విపరీతమైనతలయు కంఠము గలదానిని, అతిమాత్రకుచోదరీం = మిక్కిలిస్థూలమైన స్తనములును ఉదరమును గలదానిని, అతిమాత్రాస్యనేత్రాం = మిక్కిలి పెద్దదయిన నోరును, నేత్రములును గలదానిని, దీర్ఘజిహ్వాం = మిక్కిలి

పొడవైన నాలుక గలదానిని, అజిహ్వాకాం = నాలుకయే లేనిదానిని, (ఆదిదేశ = ఆజ్ఞాపించెను)

తాత్పర్యము :- మరియు పెద్దదయిన శిరస్సు, కంఠమును కల దియు, మిక్కిలి స్థూలమైన కుచములు, పొట్ట గలదియును, మిక్కిలి పెద్దదయిననోరు, కన్నులును గలదియును, అతిదీర్ఘమైన నాలుక గలది యును, నాలుకయే లేనిదిగనున్నట్టిదియునగు ఆయా రాక్షస స్త్రీలను జూచి రావణు డిట్లాజ్ఞాపించెను.

శ్లో॥ అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీమ్,
యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ.
తథా కురుత రాక్షస్య స్సర్వాః క్షిప్రం సమేత్యచ. 36

పదచ్ఛేదము :- అనాసికాం - సింహముఖీం - గోముఖీం - సూకరీముఖీం, యథా - మద్వశగా - సీతా - క్షిప్రం - భవతి - జానకీ, తథా - కురుత - రాక్షస్యః - సర్వాః - క్షిప్రం - సమేత్య - చ.

అన్వయక్రమము —— సుగమము

ప్రతిపదార్థము :- అనాసికాం = ముక్కులేనిదానిని, సింహ ముఖీం = సింహముఖమువంటి ముఖముకలదానిని, గోముఖీం = గోవు ముఖము వంటి ముఖముగలదానిని, సూకరీముఖీం = పందిమూతివంటి ముఖముగలదానిని (ఏవం సందిదేశ = ఇట్లాజ్ఞాపించెను)సర్వాః రాక్షస్యః = ఎల్ల రాక్షసాంగనలారా ! జానకీ సీతా = జనకరాజ తనయమైన సీత, యథా = ఏరీతిగా, క్షిప్రం = శీఘ్రముగా, మద్వశగా భవతి = నాకు వశ మైనదగునో, తథా = అరీతిగా, క్షిప్రం = తొందరగా, సమేత్యచ = (మీరందరును) కలసియు, కురుత = నిర్వహింపుడు.

తాత్పర్యము :- అనాసికయు, సింహముఖియు, గోముఖియు, సూకరీముఖియు నగు ఆయా రాక్షసవనితలను రావణుడు ఇట్లాజ్ఞాపించెను.

అచ్చటనున్నట్టి మీరు ఎల్లరును, అనగా మీరు ఒక్కొక్కరునుగాని లేక ఎల్లరును కలసియుగాని ఈ జానకి అతిత్వరలో ఎట్లు నాకు వశమగునో ఆవిధానమును ఆలోచించి పని నిర్వహింపుడు.

శ్లో॥ ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః,
ఆవర్జయత వైదేహీం దండస్యోద్యమనేనచ॥ 37

పదచ్ఛేదము – ప్రతిలోమానులోమైః – సామదానాదిభేదనైః, అవర్జయత – వైదేహీం – దండస్య – ఉద్యమనేన–చ.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :– ప్రతిలోమానులోమైశ్చ = ప్రతికూలానుకూలములైనట్టి, సామదానాదిభేదనైః = సామదాన భేదోపాయముల చేతను, దండస్య ఉద్యమనేనచ = దండోపాయముయొక్క ప్రయోగము చేతను, వైదేహీం = జానకిని, అవర్జయత = వశముచేసికొనుడు.

తాత్పర్యము :– ఆమెకు అనుకూలముగా మాటలాడియు పరుషముగ మాటలాడియు, సామదాన భేదదండములనెడి చతుర్విధోపాయములను ప్రయోగించి, జానకిని త్వరలో నాకు వశమునుచేయుడు.

శ్లో॥ ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేంద్రః పునఃపునః,
కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్. 38

పదచ్ఛేదము :– ఇతి – ప్రతిసమాదిశ్య – రాక్షసేంద్రః – పునః – పునః – కామమన్యుపరీతాత్మా – జానకీం – పర్యతర్జయత్.

అన్వయక్రమము :– రాక్షసేంద్రః ఇతి ప్రతిసమాదిశ్య, కామమన్యుపరీతాత్మాసన్ జానకీం పునఃపునః పర్యతర్జయత్.

ప్రతిపదార్థము :- రాక్షసేంద్రః = రావణుడు, ఇతి = ఈరీతిగా, ప్రతిసమాదిశ్య = ఆజ్ఞాపించి, కామమన్యుపరీతాత్మా సన్ = కామక్రోధములతోనిండిన మనస్సుగలవాడై, జానకీం = సీతాదేవిని, పునః పునః = తిరిగితిరిగి, పర్యతర్జయత్ = బెదిరించెను.

తాత్పర్యము :- రావణుడు రాక్షస స్త్రీలను ఈరీతిగా ఆజ్ఞాపించి, కామక్రోధావిష్టచిత్తుడై సీతాదేవిని చూచుచు మఱలమఱల బెదిరించుచుండెను.

శ్లో॥ ఉపగమ్య తతః క్షిప్రం రాక్షసీ ధాన్యమాలినీ,
పరిష్వజ్య దశగ్రీవ మిదం వచన మబ్రవీత్. 39

పదచ్ఛేదము :- ఉపగమ్య - తతః - క్షిప్రం - రాక్షసీ - ధాన్యమాలినీ - పరిష్వజ్య - దశగ్రీవం - ఇదం - వచనం - అబ్రవీత్.

అన్వయక్రమము :- తతః ధాన్యమాలినీ రాక్షసీ క్షిప్రం ఉపగమ్య దశగ్రీవం పరిష్వజ్య ఇదంవచనం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, ధాన్యమాలినీ = ధాన్యమాలినియను, రాక్షసీ = రాక్షసి, క్షిప్రం = వెంటనే, ఉపగమ్య = దగ్గరకువచ్చి, దశగ్రీవం పరిష్వజ్య = రావణుని కౌగలించుకొని, ఇదం వచనం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- 'ధాన్యమాలినీ' శబ్దముచేతనే మండోదరినిగూడ గ్రహించవలసియున్నది.

తిలకము :- పరిష్వజ్య = రావణపట్టమహిషి ఆసమయమున

వానిని కౌగలించుకొని ఈనెలకులాగి, ఆతడు సీతచెంతకు పోకుండగా నేర్పుగా నివారించినది.

రామాయణ శిరోమణి :- 'రాక్షసి, ధాన్యమాలిని' —రాక్షసీ స్వామినియైన మండోదరియు, ధాన్యమాలినియు అనిఅర్థము చెప్పవచ్చును. ముందుకథలో హనుమ మండోదరివచ్చి ఈ సమయమున అడ్డుకొనెనని చెప్పబోవునుగదా ;

వాసుదాసస్వామి .- ఇట్లడ్డమువచ్చిన స్త్రీనిగూర్చి పిమ్మట హనుమంతుడు అంగదాదులతో చెప్పునపుడు మందోదరియని చెప్పెను. రూపసామ్యముచేతనే భ్రమించెనో, సుప్రసిద్ధురాలగు మందోదరిపేరు తెలిసియుండి ఈమెపేరు తెలియకపోవుటచేతనో, లేక ఇరువురును అడ్డము రాగా, ఒకరిపేరిచ్చుట, ఒకరిపేరచ్చుటను వాల్మీకిచెప్పెనో ;

మహాపతివ్రతయగు సీత తలాలున శపించిన రావణుడుచచ్చినచో తనకు వైధవ్యము వచ్చునని అడ్డమువచ్చియుండవచ్చును.

తాత్పర్యము :- అప్పుడు వెంటనే ధాన్యమాలిని రావణునిదగ్గరకుబోయి వానివి కౌగలించుకొని సీతనుండి వానిని ప్రక్కకుమరలించి ఆతనితో నిట్లు పలికెను.

శ్లో॥ మయా క్రీడ మహారాజ సీతయా కిం త వానయా,
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర. 40

పదచ్ఛేదము.- మయా - క్రీడ - మహారాజ - సీతయా - కిం - తవ - అనయా - వివర్ణయా - కృపణయా - మానుష్యా - రాక్షసేశ్వర.

అన్వయక్రమము :- రాక్షసేశ్వర ; మహారాజ ; మయా క్రీడ ; వివర్ణయా, కృపణయా, మానుష్యా అనయా సీతయా తవకిమ్. ;

ప్రతిపదార్థము :- రాక్షసేశ్వర మహారాజ = రాక్షస ప్రభువైన ఓమహారాజా ! మయా క్రీడ = నాతో క్రీడింపుము, వివర్ణయా = కాంతిహీనురాలును, కృపణయా = దీనురాలును, మానుష్యా = మనుష్య స్త్రీయునగు, అనయా సీతయా = ఈసీతతో, తవ కిమ్ = నీకు ఏమి ప్రయోజనము ?

తాత్పర్యము :- ఓరాక్షసేశ్వరా ! నీవు నాతోడ స్వేచ్ఛగా విహరింపుము. మలినురాలును, దీనురాలును, మానవాంగనయునగు ఈ సీత నీకేల?

శ్లో॥ నూన మస్యా మహారాజ న దివ్యాన్ భోగసత్తమాన్,
విదధా త్యమరశ్రేష్ఠ స్తవ బాహుబలార్జితాన్. 41

పదచ్ఛేదము :- నూనం - అస్యాః - మహారాజ - న - దివ్యాన్ - భోగసత్తమాన్ - విదధాతి - అమరశ్రేష్ఠః - తవ - బాహుబలార్జితాన్.

అన్వయక్రమము :- మహారాజ ! నూనం అమరశ్రేష్ఠః దివ్యాన్ తవ బాహుబలార్జితాన్ భోగసత్తమాన్ అస్యాః నవిదధాతి.

ప్రతిపదార్థము :- మహారాజ ! = ఓరాక్షసరాజా, అమరశ్రేష్ఠః = బ్రహ్మదేవుడు, నూనం = నిశ్చయముగా, తవ బాహుబలార్జితాన్ = నీభుజశక్తిచే సంపాదింపబడినట్టి, దివ్యాన్ భోగసత్తమాన్ = దివ్యములైన మహాభోగములను, అస్యాః = ఈమెకు, న విదధాతి = సమకూర్చలేదు.

తాత్పర్యము :- మహారాజా ! నీ బాహుబలముచే సంపాదించిపెట్టినట్టి ఈ మహాభోగములు ఈమెనుదుట బ్రహ్మదేవుడు వ్రాసిపెట్టలేదు. సందేహములేదు. అందులకే ఈమె ఇట్టి మూర్ఖపు పట్టుదలతోనున్నది.

శ్లో॥ అకామాం కామయానస్య శరీరముపతప్యతే.
ఇచ్ఛంతీం కామయానస్య ప్రీతి ర్భవతి శోభనా. 42

పదచ్ఛేదము :_ అకామాం - కామయానస్య - శరీరం - ఉప తప్యతే - ఇచ్ఛంతీం - కామయానస్య - ప్రీతిః - భవతి - శోభనా.

అన్వయక్రమము :_ అకామాం కామయానస్య శరీరం ఉప తప్యతే; ఇచ్ఛంతీంకామయానస్య శోభనా ప్రీతిః భవతి.

ప్రతిపదార్థము .- అకామాం = అనురాగములేని వనితను, కామయానస్య = కామించుచున్నవానియొక్క, శరీరం = దేహము, ఉపతప్యతే = తాపమునొందుచుండును, ఇచ్ఛంతీం = ప్రేమించుచున్నట్టి తరుణిని, కామయానస్య = కామించువానికి, శోభనా ప్రీతిః = మంగళకరమైన ఆనందము, భవతి = కలుగును.

తాత్పర్యము :_ తనపై ప్రేమలేనట్టి వనితను కామించినట్టి పురుషునకు శరీరమునగొప్పతాపము కలుగును. అట్లుగాక తనను ప్రేమించుచున్న కోమలిని కామించినచో తనకు మంగళకరమైన ఆనందము కల్గును.

శ్లో॥ ఏవ ముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్త స్తతో బలీ,
ప్రహాస న్మేఘసంకాశో రాక్షస స్స న్యవర్తత. 43

పదచ్ఛేదము :_ ఏవం - ఉక్తః - తు - రాక్షస్యా - సముత్క్షిప్తః - తతః - బలీ - ప్రహసన్ - మేఘసంకాశః - రాక్షసః - సః - న్యవర్తత.

అన్వయక్రమము :_ తతః రాక్షస్యా ఏవం ఉక్తః సముత్క్షిప్తః, మేఘసంకాశః, బలీ సః, రాక్షసః ప్రహసన్ న్యవర్తత.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, రాక్షస్యా = ధాన్యమాలి నిచే, ఏవం ఉక్తః = ఈవిధముగా చెప్పబడినవాడై, సముత్క్షిప్త = పైకిలేప నెత్తబడినవాడై, మేఘసంకాశః = మేఘసన్నిభుడైనట్టి, బలీ సః రాక్షసః = బలాఢ్యుడైన అరావణుడు, ప్రహసన్ = పెద్దగానవ్వుచు, న్యవర్తత = మఱలెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- "ప్రహసన్" —ధాన్యమాలిని సమయోచితముగా వ్యవహరించి తాను ఆవేశముతో స్త్రీపై చేయిచేసికొను అపకీర్తిని తప్పించి నది యని ప్రసన్నతా పూర్వకముగా నవ్వుచు;

రామాయణశిరోమణి - సముత్క్షిప్తః — ప్రక్కకు తొల గింపబడినవాడై,

తాత్పర్యము:- ధాన్యమాలిని రావణునితో నిట్లుపలుకుచు అత నిని ప్రక్కకుతీసికొనిపోగా, నల్లని కాఱుమేఘమువలె మహాబలాఢ్యుడై యున్న రావణుడు ఆమెయొక్క సమయోచితమైన వర్తనమునకు మన స్సునందు సంతోషించుచు బిగ్గరగ నవ్వుచు అటనుండి వెడలెను.

శ్లో॥ ప్రస్థిత స్స దశగ్రీవః కంపయ న్నివ మేదినీమ్,
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనమ్. 44

పదచ్ఛేదము :- ప్రస్థితః - సః - దశగ్రీవః - కంపయన్ - ఇవ - మేదినీమ్ - జ్వలద్భాస్కరవర్ణాభం - ప్రవివేశ - నివేశనమ్.

అన్వయక్రమము :- సః దశగ్రీవః, మేదినీం కంపయన్నివ ప్రస్థితః సన్, జ్వలద్భాస్కరవర్ణాభం నివేశనం ప్రవివేశ.

ప్రతిపదార్థము :— సః దశగ్రీవః = ఆ దశకంఠుడు, మేదినీం కంపయన్నివ = భూమిని కంపింపజేయుచున్నవాడువలె, ప్రస్థితః = (అటనుండి) బయలువెడలినవాడై, జ్వలత్ భాస్కరవర్ణాభం= ప్రజ్వలించుచున్న సూర్యునితో సమానమైన తేజస్సుకలిగినట్టి, నివేశనం= (తన) భవనమును, ప్రవివేశ = ప్రవేశించెను

తాత్పర్యము :— రావణు డప్పుడు భూమినంతను వదకించుచు అటనుండి బయలువెడలినవాడై మధ్యాహ్నకాలపు సూర్యునివలె తీక్ష్ణమైన ప్రకాశముతో శోభిల్లుచున్న తన భవనమునందు ప్రవేశించెను.

శ్లో॥ దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః,
పరివార్య దశగ్రీవం వివిశుస్తం గృహోత్తమమ్. 45

పదచ్ఛేదము .— దేవగంధర్వకన్యాః - చ - నాగకన్యాః - చ - సర్వతః - పరివార్య - దశగ్రీవం - వివిశుః - తం - గృహోత్తమమ్.

అన్వయక్రమము :— దేవగంధర్వకన్యాఃచ, నాగకన్యాఃచ, దశగ్రీవం, సర్వతః పరివార్య తం గృహోత్తమం వివిశుః.

ప్రతిపదార్థము :— దేవగంధర్వకన్యాఃచ = దేవగంధర్వకన్యలును, నాగకన్యాఃచ = నాగకన్యలును, దశగ్రీవం = రావణాసురుని, సర్వతః పరివార్య = చుట్టునుచేరి, తం గృహోత్తమం=ఆ రావణభవనమును, వివిశుః = ప్రవేశించిరి.

తాత్పర్యము .— రావణుని వెంటనున్న ఆ దేవగంధర్వ కన్యలును, నాగకన్యలును అతనిచుట్టునుండి నడచుచు అతనివెంబడినే రావణుని భవనములోనికి ప్రవేశించిరి.

శ్లో॥ స మైథిలీం ధర్మపరా మవస్థితాం
ప్రవేపమానాం పరిభర్త్స్య రావణః,
విహాయ సీతాం మదనేన మోహితః
స్వ మేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్. 46

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
"మాసద్వయావధికరణం" నామ
ద్వావింశ స్సర్గః

పదచ్ఛేదము :— సః - మైథిలీం - ధర్మపరాం - అవస్థితాం - ప్రవేపమానాం - పరిభర్త్స్య - రావణః - విహాయ - సీతాం - మదనేన - మోహితః - స్వం - ఏవ - వేశ్మ - ప్రవివేశ - భాస్వరమ్.

అన్వయక్రమము .— సః రావణః, ధర్మపరాం, ప్రవేపమానాం అవస్థితాం, మైథిలీం, సీతాం పరిభర్త్స్య, (తాం) విహాయ, మదనేన మోహితః (సన్) భాస్వరం, స్వంవేశ్మఏవ ప్రవివేశ.

ప్రతిపదార్థము :— సః రావణః = ఆ రావణుడు, ధర్మపరాం = ధర్మపరాయణురాలును, అవస్థితాం = దృఢచిత్తురాలును, ప్రవేపమానాం = వణకుచున్నదియునగు, మైథిలీం = జానకిని, పరిభర్త్స్య = మిక్కిలిగా గద్దించి, సీతాం విహాయ = ఆమెనువిడచి, మదనేన మోహితః = మన్మధ రాపముచే మోహమునొందియున్నవాడై, భాస్వరం = గొప్ప ప్రకాశము గల్గిన, స్వం వేశ్మ ఏవ = తన భవనమునే, ప్రవివేశ = ప్రవేశించెను.

తాత్పర్యము :— రావణుడు ఈరీతిగా ధర్మతత్పరురాలును, దృఢచిత్తురాలును, భయముచేతవణకుచున్నదియునగు సీతాదేవిని పలువిధ

ములుగ గద్దించుచు మాటలాడి తుదకామెను వీడి మదనపరవశుడై తిరిగి తన భవనమును చేరుకొనెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
" సు బో ధి ని " అను ఆంధ్ర వివరణమునందు
" మా స ద్వ యా వ ధి క ర ణ ము " అను
ఇరువదిరెండవ సర్గము.

— • —

శ్రీరామాయనమః
శ్రీరామశరణ గురుభ్యోనమః

త్ర యో వి ం శః స ర్గ ః

శ్లో॥ ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణ శ్శత్రురావణః,
సందిశ్యచ తత స్సర్వా రాక్షసీ ర్నిర్జగామ హ. 1

పదచ్ఛేదము :- ఇతి - ఉక్త్వా - మైథిలీం - రాజా - రావణః - శత్రురావణః - సందిశ్య - చ - తతః - సర్వాః - రాక్షసీః - నిర్జగామ - హ.

అన్వయక్రమము :- శత్రురావణః, రాజా రావణః మైథిలీం ఇతిఉక్త్వా, సర్వాఃరాక్షసీః సందిశ్య, తతః నిర్జగామ హ.

ప్రతిపదార్థము :- శత్రురావణః = శత్రువులను ఆక్రోశింప చేయునట్టి, రాజా రావణః= (రాక్షస) రాజైన రావణుడు, మైథిలీం = సీత నుగూర్చి, ఇతి ఉక్త్వా = ఈరీతిగాపలికి, సర్వాః రాక్షసీః = రాక్షస స్త్రీల నెల్లరను, సందిశ్య = ఆజ్ఞాపించి, తతః నిర్జగామ హ = అటనుండి వెడలి పోయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము - :- "శత్రురావణః" — తన శత్రువులను హాహాకారము చేయించువాడు.

తాత్పర్యము :- శత్రుభయంకరుడైన రాక్షసరాజగు రావణుడు సీతాదేవితో ఈరీతిగాపలికి అచ్చటనున్నట్టి రాక్షస స్త్రీలకు తగు ఆజ్ఞల నొసగి అటనుండి మరలి తన భవనమున కేగెను.

శ్లో॥ నిష్క్రాంతే రాక్షసేంద్రే తు పున రంతఃపురం గతే,
రాక్షస్యో భీమరూపా స్తా స్సీతాం సమభిదుద్రువుః. 2

పదచ్ఛేదము :- నిష్క్రాంతే -రాక్షసేంద్రే - తు - పునః - అంతఃపురం - గతే - రాక్షస్యః - భీమరూపాః - తాః - సీతాం - సమభిదుద్రువుః.

అన్వయక్రమము :- రాక్షసేంద్రే నిష్క్రాంతే, పునః అంతఃపురంగతే (సతి) భీమరూపాః తాః రాక్షస్యః సీతాం సమభిదుద్రువుః.

ప్రతిపదార్థము :- రాక్షసేంద్రే = రాక్షస రాజైన రావణుడు, నిష్క్రాంతే = వెడలిపోయినవాడై, పునః అంతఃపురం గతే (సతి) = తిరిగి అంతఃపురము చేరుకొనగానే, భీమరూపాః = భయంకరాకారము కల్గినట్టి, తాః రాక్షస్యః = ఆ రాక్షసవనితలు, సీతాం సమభిదుద్రువుః = సీతమీదికి పరుగెత్తిరి.

తాత్పర్యము :- రావణుడు అటనుండి వెడలి తన అంతఃపురము నకు చేరుకొనగనే సీతకడనున్న ఘోరరూపములుగల రాక్షస స్త్రీలు అందరు ఒక్కమ్మడిగా ఆమె మీదికి పరుగెత్తుకొనిపోయిరి.

శ్లో॥ తత స్సీతా ముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః,
పరం పరుషయా వాచా వైదేహీ మిద మబ్రువన్. 3

పదచ్ఛేదము :- తతః - సీతాం - ఉపాగమ్య - రాక్షస్యః - క్రోధమూర్ఛితాః - పరం - పరుషయా - వాచా - వైదేహీం - ఇదం - అబ్రువన్.

అన్వయక్రమము :- తతః, రాక్షస్యః, క్రోధమూర్ఛితాః(సత్యః) సీతాం ఉపాగమ్య, పరం పరుషయా వాచా వైదేహీం ఇదం అబ్రువన్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, రాక్షస్యః = రాక్షస స్త్రీలు, క్రోధమూర్ఛితాః (సత్యః) క్రోధపరవశ లగుచున్నవారై, సీతాం ఉపాగమ్య = సీతను సమీపించి, పరం పరుషయా వాచా = మిక్కిలి కఠినమైన మాటతో, వైదేహీం = సీతనుగూర్చి, ఇదం అబ్రువన్ = ఈ మాటను పలికిరి.

తాత్పర్యము :- అటుపిమ్మట ఆ రాక్షసవనితలు అమితమైన క్రోధావేశముతో సీతను జేరి ఆమెతో ఇట్లు పలికిరి.

శ్లో॥ పౌలస్త్యస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః,
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే. 4

పదచ్ఛేదము :- సీతే - పౌలస్త్యస్య - వరిష్ఠస్య - రావణస్య - మహాత్మనః - దశగ్రీవస్య - భార్యాత్వం - సీతే - న - బహుమన్యసే.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :- సీతే = ఓ జానకీ! పౌలస్త్యస్య = పులస్త్యుని పౌత్రుడును, వరిష్ఠస్య = శ్రేష్ఠుడును, మహాత్మనః = మహా పూజ్యుడునుఅగు, దశగ్రీవస్య రావణస్య = దశకంఠుడయినరావణునకు, భార్యాత్వం = భార్యగానుండుటను, న బహుమన్యసే = గొప్పగా ఎంచుకొనకున్నావు.

తాత్పర్యము :- పులస్త్య బ్రహ్మకు పౌత్రుడును, లోక విఖ్యాతి గన్నవాడు నగు దశకంఠునకు భార్యవగు భాగ్యమును నీవు తృణీకరించుచున్నావు. ఓ జానకీ! నీవు ఎంత అజ్ఞానురాలవు!

శ్లో॥ తత స్త్వేకజటా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
ఆమంత్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్. 5

పదచ్ఛేదము :- తతః - తు- ఏకజటానామ- రాక్షసీ-వాక్యం- అబ్రవీత్ - ఆమంత్ర్య - క్రోధతామ్రాక్షీ - సీతాం - కరతలోదరీమ్.

అన్వయక్రమము .- తతః కరతలోదరీం సీతాం ఆమంత్ర్య క్రోధతామ్రాక్షీ (సతీ) ఏకజటానామ రాక్షసీ వాక్యం అబ్రవీత్.

ప్రతిపదార్థము .- తతః = అటుపిమ్మట, కరతలోదరీం సీతాం = అరచేయివంటి ఉదరము కలిగినట్టి సీతాదేవిని, ఆమంత్ర్య = పిలిచి, క్రోధతామ్రాక్షీ (సతీ) = కోపముచే నెఱ్ఱబారిన కన్నులుగలదై, ఏకజటానామ రాక్షసీ = ఏకజటయనెడి రక్కసి, వాక్యం అబ్రవీత్ = (ఈ) మాటను బలికెను.

తాత్పర్యము :- పిమ్మట ఏకజటయను పేరుగల ఒకానొకరాక్షసిసోంగిని సుకుమారిమైన ఆ సీతాదేవిని క్రోధముచే ఎర్రబారిన కన్నులతో గద్దించుచు ఈ విధముగా పలికెను.

శ్లో॥ ప్రజాపతీనాం షణ్ణాంతు చతుర్థో యః ప్రజాపతిః,
మానసో బ్రహ్మణః పుత్రః పులస్త్య ఇతి విశ్రుతః. 6

పదచ్ఛేదము :- ప్రజాపతీనాం - షణ్ణాం - తు-చతుర్థః-యః-ప్రజాపతిః - మానసః - బ్రహ్మణః - పుత్రః - పులస్త్యః - ఇతి - విశ్రుతః.

అన్వయక్రమము :- యః షణ్ణాం ప్రజాపతీనాం చతుర్థః ప్రజాపతిః, బ్రహ్మణః మానసఃపుత్రః సః, పులస్త్యఃఇతి విశ్రుతఃఆసీత్.

ప్రతిపదార్థము :- షణ్ణాం ప్రజాపతీనాం = ప్రసిద్ధులైన ఆరుగురు ప్రజాపతులలో, యః = ఎవడు, చతుర్థః ప్రజాపతిః = నాల్గవప్రజాపతియైనట్టివాడో, బ్రహ్మణః మానసః పుత్రః = బ్రహ్మదేవునకు మానసపుత్రుడైన, సః = అతడు, పులస్త్యః ఇతి = పులస్త్యుడు అని, విశ్రుతః = ప్రసిద్ధుడు, ఆసీత్ = అయెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- మరీచి అత్రి అంగిరసుడు పులస్త్యుడు పులహుడు క్రతువు అను వరుసలో పులస్త్యుడు నాల్గవవాడు.

తాత్పర్యము :- మరీచి మున్నగు ఆరుగురు ప్రజాపతులలో నాలుగవవాడు బ్రహ్మమానస పుత్రుడు పులస్త్యుడుగా లోకవిఖ్యాతి నొందెను.

శ్లో॥ పులస్త్యస్యతు తేజస్వీ మహర్షి ర్మానస స్సుతః,
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః. 7

పదచ్ఛేదము :- పులస్త్యస్య - తు - తేజస్వీ - మహర్షిః -

మానసః - సుతః - నామ్నా - సః-విశ్రవాః - నామ - ప్రజాపతి సమ ప్రభః

అన్వయక్రమము - సుగమము.

ప్రతిపదార్థము.- పులస్త్యస్యతు = పులస్త్య బ్రహ్మకు, మానసః సుతః = మానసపుత్రుడు, తేజస్వీ=మహాతేజశ్శాలియై, నామ్నా విశ్రవాఃనామ = పేరుచే విశ్రవసుడనబడువాడు, సః = అతడు, ప్రజాపతిసమప్రభః = ప్రజాపతులతో సమానమైన తేజస్సుగలవాడు.

తాత్పర్యము - ఆ పులస్త్య ప్రజాపతియొక్క మానసపుత్రుడైన విశ్రవసుడనువాడు మహాతేజస్వి; ప్రజాపతులతో సమానమైనట్టి తేజస్సుగలవాడై మహాప్రసిద్ధుడై యుండెను.

శ్లో॥ తస్య పుత్రో విశాలాక్షి రావణ శ్శత్రురావణః,
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితు మర్హసి. ౮

పదచ్ఛేదము :- తస్య - పుత్రః - విశాలాక్షి - రావణః - శత్రురావణః - తస్య - త్వం - రాక్షసేంద్రస్య - భార్యా - భవితుం - అర్హసి.

అన్వయక్రమము :- విశాలాక్షి ! శత్రురావణః రావణః తస్య పుత్రః, తస్యరాక్షసేంద్రస్య త్వం భార్యా భవితుం అర్హసి.

ప్రతిపదార్థము .- విశాలాక్షి = ఓసుందరీ ! శత్రురావణః రావణః = శత్రువులనాక్రోశింపచేయువాడైన రావణుడు. తస్య పుత్రః = ఆ విశ్రవోబ్రహ్మయొక్క కుమారుడు, తస్య రాక్షసేంద్రస్య = ఆ రాక్షస రాజునకు, త్వం = నీవు, భార్యా భవితుం అర్హసి = భార్యవు కాదగి యున్నావు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- తస్యపుత్రః — అట్టివానిపుత్రుడనుటచే లోకోత్తరమైన రావణుని మహాకులీనత్వము ఇట సూచింపబడుచున్నది.

వాసుదాసస్వామి .- ఆర్వురు ప్రజాపతులలో నాల్గవవాడు పులస్త్యుడు. ఆయన బ్రహ్మకు మానసపుత్రుడు. ఆయన సంకల్పమువలన కలిగినవాడు విశ్రవుడు. ఆయనకొడుకు రావణుడు. ఇక ఇతడు బలమునందా! శత్రువుల నేడిపించువాడు. అట్టి గొప్పవాడు తానైవచ్చి నిన్ను ప్రార్థింప నీకేల ఊబిగువని ప్రశ్నించుచున్నది.

తాత్పర్యము :- ఓసుందరీ! శత్రుభీకరుడైన రావణాసురుడనగా బ్రహ్మదేవునకు నాల్గవతరమువాడుసుమా! అట్టి మహాకులీనుడైన వానికి భార్యగానుండుట నీ అదృష్టముగదా!

శ్లో॥ మయోక్తం చారుసర్వాంగి వాక్యం కిం నానుమన్యసే?

పదచ్ఛేదము .- మయా - ఉక్తం - చారుసర్వాంగి - వాక్యం - కిం - న - అనుమన్యసే.

ప్రతిపదార్థము :- చారుసర్వాంగి = ఓ సుందరమైన సమస్తావయవములుకల్గిన తరుణీ!, మయా = నాచే, ఉక్తం = చెప్పబడిన, వాక్యం = మాటను, కిం న అనుమన్యసే = ఏల అంగీకరింపకున్నావు?

తాత్పర్యము .- ఓ సర్వాంగసుందరీ! నేను నీ హితమును కోరి చెప్పినమాటలను తెలివిమాలి ఏల అంగీకరింపకున్నావు?

శ్లో॥ తతో హరిజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్,
వివర్త్య నయనే కోపా న్మార్జార సదృశేక్షణా. 10

పదచ్ఛేదము :- తతః - హరిజటా నామ రాక్షసీ - వాక్యం - అబ్రవీత్ - వివర్త్య - నయనే - కోపాత్ - మార్జార సదృశేక్షణా.

అన్వయక్రమము :- తతః మార్జారసదృశేక్షణా హరిజటానామ రాక్షసీ కోపాత్ నయనే వివర్త్య వాక్యం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, మార్జారసదృశేక్షణా = పిల్లి కన్నులవంటి కన్నులుగల, హరిజటా నామ రాక్షసీ = హరిజటయనురాక్షసి, నయనే వివర్త్య = (తన) రెండుకన్నులను త్రిప్పి, కోపాత్ = క్రోధమువలన, వాక్యం అబ్రవీత్ = (ఈ) వాక్యముపలికెను.

తాత్పర్యము :- పిమ్మట హరిజటయనురాక్షసి పిల్లి కన్నుల వంటి కనకన్నులను క్రిందికిని మీదికిని త్రిప్పుచు కోపముతో సీతాదేవిని చూచి ఇట్లు పలికెను.

శ్లో॥ యేన దేవా స్త్రయ స్త్రింశ ద్దేవరాజశ్చ నిర్జితాః,
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితు మర్హసి. 11

పదచ్ఛేదము :- యేన - దేవాః - త్రయస్త్రింశత్ - దేవరాజః - చ - నిర్జితాః - తస్య - త్వం - రాక్షసేంద్రస్య - భార్యా - భవితుం - అర్హసి.

అన్వయక్రమము — యేన, త్రయస్త్రింశత్ దేవాః, దేవరాజః చ, నిర్జితాః, తస్యరాక్షసేంద్రస్య భార్యా భవితుం త్వం అర్హసి.

ప్రతిపదార్థము :- యేన = యేదశకంఠునిచే, త్రయస్త్రింశత్ దేవాః = ముప్పదిమూడు (కోట్ల) దేవతలును, దేవరాజశ్చ = దేవేంద్రుడును, నిర్జితాః = ఓడింపబడియుండిరో, తస్య రాక్షసేంద్రస్య =

అరాక్షసప్రభువైన రావణునకు, భార్యా భవితుం = భార్యవగుటకు, త్వం అర్హసి = నీవు తగియున్నావు.

తాత్పర్యము :- ఓసీతా! ఏమహావీరునిచే ముప్పదిమూడుకోట్ల దేవతలును, దేవేంద్రుడును ఓడిపోయియున్నారో, అట్టి రాక్షసప్రభువునకు భార్యవగు భాగ్యమునకు నీవే తగుదువు.

శ్లో॥ తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భర్త్సయంతీ తదా ఘోర మిదం వచన మబ్రవీత్. 12

పదచ్ఛేదము :- తతః - తు - ప్రఘసా నామ రాక్షసీ - క్రోధ మూర్ఛితా - భిర్త్సయంతీ -తదా - ఇదం - ఘోరం - వచనం - అబ్రవీత్.

అన్వయక్రమము —— సుగమము

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, ప్రఘసా నామ రాక్షసీ = ప్రఘసయను పేరుగల రక్కసి, క్రోధమూర్ఛితాసతీ = క్రోధా విష్టురాలై, భర్త్సయంతీ = గద్దించుచు, తదా = అప్పుడు, ఇదం ఘోరం వచనం = ఈ దారుణమైన మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- పిమ్మట ప్రఘసయనురక్కసి క్రోధపరవశురాలై సీతాదేవిని గద్దించుచు ఈవిధముగా పలికెను.

శ్లో॥ వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామే ష్వనివర్తినః,
బలినో వీర్యయుక్తస్య భార్యాత్వం కిం న లప్స్యసే. 13

పదచ్ఛేదము :- వీర్యోత్సిక్తస్య - సంగ్రామేషు - అనివర్తినః - బలినః - వీర్యయుక్తస్య - భార్యాత్వం - కిం - న - లప్స్యసే.

అన్వయక్రమము — సుగమము.

ప్రతిపదార్థము : వీరోత్సిక్తస్య = శౌర్యముచే గర్వితుడును, శూరస్య = వీరుడును, సంగ్రామేషు అనివర్తినః = యుద్ధములందు వెన్ను జూపనివాడును, వీర్యయుక్తస్య =పరాక్రమముకలిగినట్టివాడును, బలినః= బలాఢ్యుడునుఅగు, తస్య = ఆ రావణునకు, భార్యాత్వం = భార్యయగుటను, కిం న లప్స్యసే — ఏల పొందకున్నావు ?

తాత్పర్యము :- మహాశూరుడును, వీర్యాతిరేకముచే గర్వితుడైయున్నవాడును, యుద్ధమునందపజయము ఎరుగనివాడును అగు ఆ దశగ్రీవుని భార్యననిపించుకొనుభాగ్యమును నీవు ఏల వలదనుచున్నావు?

శ్లో॥ ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః,

సర్వాసాంచ మహాభాగాం త్వా ముపైష్యతి రావణః.14

పదచ్ఛేదము :- ప్రియాం - బహుమతాం - భార్యాం - త్యక్త్వా - రాజా - మహాబలః - సర్వాసాం - చ -మహాభాగాం - త్వాం - ఉపైష్యతి - రావణః.

అన్వయక్రమము :- మహాబలః రాజారావణః సర్వాసాం బహుమతాం ప్రియాం భార్యాం,త్యక్త్వా మహాభాగాం త్వాం ఉపైష్యతి.

ప్రతిపదార్థము :- మహాబలః రాజా రావణః = మహాబలశాలియైన రాజు రావణుడు, సర్వాసాం= (తనభార్య) లెల్లరిలోను, బహుమతాం= మెచ్చిన ఇష్టురాలును, ప్రియాం= ప్రియురాలునగు, భార్యాం = మండోదరిని, త్యక్త్వా = విడిచి, మహాభాగాం త్వాం = భాగ్యవంతురాలవైన నిన్ను, ఉపైష్యతి = చేరుకొనుచున్నాడు.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

రామాయణశిరోమణి :- బహుమతాం = పెక్కుమందిచే కోరబడినట్టి (మందోదరిని).

తాత్పర్యము :- మహాపరాక్రమశాలియైన రావణుడు తనకు మిక్కిలి గౌరవార్హురాలును ప్రియురాలునగు మందోదరిని సైతము విడిచి అదృష్టవంతురాలవైన నిన్ను కోరుకొనుచున్నాడు.

శ్లో॥ సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్,
అంతఃపురం సముత్సృజ్య త్వాం ముపైష్యతి రావణః. 15

పదచ్ఛేదము :- సమృద్ధం - స్త్రీసహస్రేణ - నానారత్నోపశోభితం - అంతఃపురం - సముత్సృజ్య - త్వాం-ఉపైష్యతి - రావణః।

అన్వయక్రమము :- రావణః స్త్రీసహస్రేణ సమృద్ధం, నానారత్నోపశోభితం అంతఃపురం సముత్సృజ్య త్వాం ఉపైష్యతి.

ప్రతిపదార్థము :- రావణః = రావణుడు, స్త్రీసహస్రేణ సమృద్ధం = వేలకొలది భార్యలతో నిండి యున్నదియును, నానారత్నోపశోభితం = బహువిధరత్నములతో వెలయుచున్నదియునగు, అంతఃపురం = అంతఃపురమును, సముత్సృజ్య = విడిచిపెట్టి, త్వాం = నిన్ను, ఉపైష్యతి = చేరుచున్నాడు.

తాత్పర్యము :- వేలకొలదియువతులతో కూడినదియును, సమస్తభాగ్యములతో నిండినదియునగు తన అంతఃపురమునంతను విడిచిపెట్టి రావణుడు భాగ్యవంతురాలవైన నిన్ను వరించుచున్నాడుగదా।

శ్లో॥ అన్యాతు వికటా నామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
అసకృ ద్దేవతాయుద్ధే నాగగంధర్వదానవాః,
నిర్జితా స్సమరే యేన స తే పార్శ్వ ముపాగతః. 16

పదచ్ఛేదము :- అన్యా - తు - వికటా - నామ - రాక్షసీ - వాక్యం - అబ్రవీత్ - అసకృత్ - దేవతాయుద్ధే - నాగగంధర్వదానవాః - నిర్జితాః - సమరే - యేన - సః - తే - పార్శ్వం - ఉపాగతః.

అన్వయక్రమము :- వికటానామ అన్యారాక్షసీ వాక్యం అబ్రవీత్, యేన దేవతాయుద్ధే, నాగగంధర్వదానవాః, అసకృత్ సమరే నిర్జితాః, సః తే పార్శ్వం ఉపాగతః.

ప్రతిపదార్థము :- వికటానామ = వికటయను పేరుకలిగినట్టి, అన్యా రాక్షసి = వేరొకరక్కసి వాక్యం అబ్రవీత్ = ఈ మాటను పలికెను, యేన = ఏమహావీరునిచే, దేవతాయుద్ధే = దేవతల యుద్ధము నందు నాగగంధర్వ దానవాః = నాగులును, గంధర్వులును, దానవులును, సమరే = యుద్ధమునందు, అసకృత్ = పలుమారులు, నిర్జితాః = ఓడింపబడిరో, సః = ఆమహావీరుడు, తే పార్శ్వం = నీపజ్జను, ఉపాగతః = చేరినాడు.

తాత్పర్యము :- పిమ్మట వికటయను వేరొకరక్కసి ఈరీతిగ పలికెను. ఏమహావీరుడు పలుమారులు యుద్ధమునందు దేవతలను, గంధర్వులను, దైత్యులను ఓడించియున్నాడో ఆతడు నేడు నిన్నుగోరి నీపజ్జను చేరినాడు సుమా!

శ్లో॥ తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః,
కి మద్య రాక్షసేంద్రస్య భార్యాత్వం నేచ్ఛసేఽధమే.

పదచ్ఛేదము :- తస్య - సర్వసమృద్ధస్య - రావణస్య - మహాత్మనః - కిం - అస్య - రాక్షసేంద్రస్య - భార్యాత్వం - న - ఇచ్ఛసే - అధమే.

అన్వయక్రమము - అధమే ! సర్వసమృద్ధస్య, మహాత్మనః రాక్షసేంద్రస్య తస్య రావణస్య భార్యాత్వం కిం నేచ్ఛసే ?

ప్రతిపదార్థము :- అధమే = ఓ అధమురాలా ! సర్వసమృద్ధస్య = సమస్తసమృద్ధులుకలిగినట్టి, మహాత్మనః = మహనీయుడైన, రాక్షసేంద్రస్య = రాక్షసప్రభువగు, తస్య రావణస్య = ఆ రావణునకు, భార్యాత్వం = భార్యయగుటను, కిం నేచ్ఛసే = ఏల కోరకున్నావు?

తాత్పర్యము :- సర్వసమృద్ధులును కలిగిన మహా ప్రభావశాలి యగు రావణునికి భార్యవగు భాగ్యమును ఓసీ ! నీవేల ఒల్లకుంటివి ?

శ్లో॥ తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః,
న వాతి స్మాయతాపాంగే కిం త్వం తస్య న తిష్ఠసి. 18

పదచ్ఛేదము :- తతః - తు - దుర్ముఖీనామ రాక్షసీ - వాక్యం - అబ్రవీత్ - యస్య - సూర్యః - న - తపతి - భీతః - యస్య- చ - మారుత, - న - వాతి - స్మ - ఆయతాపాంగే - కిం - త్వం - తస్య- న- తిష్ఠసి.

అన్వయక్రమము :- తతః దుర్ముఖీనామ రాక్షసీ వాక్యం అబ్రవీత్ - ఆయతాపాంగే! యస్యభీతః, (సూర్యఃనతపతి; మారుతఃచ యస్య (భీతః) నవాతిస్మ, త్వం తస్య (వశే) కిం నతిష్ఠసి ?

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, దుర్ముఖీ నామ రాక్షసీ - దుర్ముఖి యనురక్కసి, వాక్యం అబ్రవీత్ = (ఈ) మాటనుబలికెను. ఆయతాపాంగే ! = దీర్ఘమైన నేత్రాంతములు గల ఓసుందరీ ? యస్య భీతః = ఎవనికి భయపడినవాడై, సూర్యః = సూర్యుడు, నతపతి = తపింపజేయకుండునో, మారుతఃచ = వాయుదేవుడును, యస్య భీతః = ఎవనికిభయపడినవాడై, నవాతిస్మ = వీవకుండునో, తస్య వశే = అతని ఆధీనమునందు, త్వం = నీవు, కిం నతిష్ఠసి = ఏల నుండవు.

తాత్పర్యము :- అటుపిమ్మట దుర్ముఖియనెడు రాక్షసాంగన సీతతో ఇట్లుపలికెను, ఓసుందరాంగీ ! ఏప్రభావశాలికి భయపడి సూర్యుడు హెచ్చుగ వేడిమిని ప్రసరింపజేయడో, వాయువు అననుకూలముగా వీచకుండునో అట్టి అమహనీయుని వశములోనుండుటకు నీవేల నొల్లవు ?

శ్లో॥ పుష్పవృష్టించ తరవో ముముచు ర్యస్య వై భయాత్,
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి. 19

శ్లో॥ తస్య నైరృతరాజస్య రాజరాజస్య భామిని,
కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి. 20

పదచ్ఛేదము :- పుష్పవృష్టిం - చ - తరవః - ముముచుః - యస్య - వై - భయాత్ - శైలాః - చ - సుభ్రు - పానీయం - జలదాః - చ - యదా - ఇచ్ఛతి - తస్య - నైరృతరాజస్య - రాజరాజస్య - భామిని కిం - త్వం - న - కురుషే - బుద్ధిం - భార్యార్థే - రావణస్య - హి.

అన్వయక్రమము :- సుభ్రు ! యస్యభయాత్, తరవఃపుష్పవృష్టిం, ముముచుః, యథా (సః) ఇచ్ఛతి, (తదా) జలదాఃచ, శైలాఃచ, పానీయం ముముచుః, భామిని, తస్య, నైఋతరాజస్య, రాజరాజస్య, రావణస్య, భార్యార్థే బుద్ధిం త్వం కిం న కురుషే ?

ప్రతిపదార్థము :- సుభ్రు = సుందరమైన కనుబొమలుగల ఓజానకీ ! యస్యభయాత్ = ఎవనియొక్క భయము వల్లనైతే, సః = అతడు. యదాఇచ్ఛతి = ఎప్పుడుకోరునో, (తదా) ఏవ = అప్పుడే, తరవః = వృక్షములు, పుష్పవృష్టిం = పుష్పవర్షమును, ముముచుః = విడచునో, శైలాఃచ జలదాఃచ = పర్వతములును, మేఘములును, పానీయం ముముచుః = జలమును కురిపించునో, భామిని = ఓ సుందరీ, తస్య = అట్టి, నైఋతరాజస్య = రాక్షసప్రభువైనట్టి, రాజరాజస్య = రాజాధిరాజయిన, రావణస్య = రావణునకు, భార్యార్థే = భార్యవగుట కొరకై, త్వం = నీవు, బుద్ధిం కిం నకురుషే = ఎందులకు నిశ్చయించు కొనవు ?

తాత్పర్యము :- ఓసుందరీ ! ఎవరికి భయము నొంది కోరిన వెంటనే ఆయావృక్షములు, పుష్పవర్షమును కురిపించుచుండునో, అట్లే పర్వతములును, మేఘములును, జలమును వర్షించుచుండునో, అట్టి రాక్షసాధిపతియైన రావణునికి భార్యగానుండుటకు, ఏల నిశ్చయించు కొన లేకున్నావు ?

శ్లో॥ సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని,
గృహాణ సుస్మితే వాక్య మన్యథా న భవిష్యసి. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
"రాక్షసీ ప్రరోచనం" నామ
త్రయో వింశస్సర్గః

పదచ్ఛేదము :_ సాధు - తే - తత్వతః - దేవి - కథితం - సాధు - భామిని! గృహాణ - సుస్మితే - వాక్యం - అన్యథా - న- భవిష్యసి.

అన్వయక్రమము :_ దేవి ! భామిని ! తే, తత్త్వతః సాధు కథితం వాక్యం సాధుగృహాణ; సుస్మితే ! అన్యథా (త్వం) నభవిష్యసి.

ప్రతిపదార్థము :_ దేవి ! = ఓ పూజ్యురాలా, భామిని = ఓసుందరీ ! తే = నీకు, సాధు = లెస్సగా, తత్త్వతః = యథార్థమునను సరించి, కథితం = చెప్పబడిన, వాక్యం = వచనమును, సాధు గృహాణ = లెస్సగా స్వీకరింపుము, సుస్మితే = చక్కని చిరునవ్వుగలయోతరుణీ ! అన్యథా = వేరొకరీతిగా, (నడచిన) (త్వం = నీవు,) న భవిష్యసి = జీవింపవు.

తాత్పర్యము .- ఓ సీతాదేవీ ! మేము నీకు వాస్తవ విషయమును చక్కగా తెలిపియుంటిమి. నీవుకూడ మేము చెప్పినదానిని చక్కగా గ్రహింపుము. రావణుని భర్తగా స్వీకరింపుము. అట్లు గానియెడల నీవు జీవములతో నుండవు సుమా !

ఇది శ్రీమత్సుందరకాండమున
" సు బో ధి ని " అను ఆంధ్ర వివరణమునందు
'' రా క్ష సీ ప్ర రో చ న ము '' అను
ఇరువదిమూడవ సర్గము.

— • —

శ్రీరామాయనమః

శ్రీరామశరణ గురుభ్యోనమః

చతుర్వింశః సర్గః

శ్లో॥ తత స్సీతా ముపాగమ్య రాక్షస్యో వికృతాననాః,
పరుషం పరుషా నార్యో ఊచు స్తాం వాక్య మప్రియమ్.

పదచ్ఛేదము :- తతః - సీతాం - ఉపాగమ్య - రాక్షస్యః - వికృతాననాః - పరుషం - పరుషాః-నార్యః- ఊచుః - తాం - వాక్యం- అప్రియమ్.

అన్వయక్రమము :- తతః వికృతాననాః, పరుషాః, రాక్షస్యః నార్యః తాంసీతాం ఉపాగమ్య, పరుషం, అప్రియం వాక్యం ఊచుః.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, వికృతాననాః = వికారమైన ముఖములు కలిగియున్న, పరుషాః=పరుషస్వభావముకలిగినట్టి, రాక్షస్యః నార్యః=రాక్షసస్త్రీలు, తాం సీతాం = ఆసీతాదేవిని, ఉపాగమ్య= చేరి, పరుషం = పరుషమైనరీతిగా, అప్రియం వాక్యం = అప్రియమైన వచనమును, ఊచుః=పలికిరి.

తాత్పర్యము :- అటుపిమ్మట వికారమైన రూపములు కలిగినట్టి ఆరాక్షసస్త్రీలు సీతాదేవిని సమీపించి ఆమెనుగూర్చి అతిపరుషముగా అప్రియములైనట్టి వచనములను ఈరీతిగా బలుకదొడగిరి.

శ్లో॥ కిం త్వ మన్తఃపురే సీతే సర్వభూతమనోహరే,
మహార్హశయనోపేతే న వాస మనుమన్యసే. 2

పదచ్ఛేదము :– కిం – త్వం – అంతఃపురే – సీతే – సర్వభూతమనోహరే – మహార్హశయనోపేతే – న –వాసం – అనుమన్యసే.

అన్వయక్రమము :– సీతే ! సర్వభూతమనోహరే మహార్హశయనోపేతే, అంతఃపురే, వాసం త్వం కిం న అనుమన్యసే ?.

ప్రతిపదార్థము :– సీతే ! = ఓ జానకీ !, సర్వభూతమనోహరే = సమస్తప్రాణులకును ఆనందకరమైయున్నట్టి, మహార్హశయనోపేతే = అమూల్యములైన శయనములతో కూడినట్టి, అంతఃపురే = (రావణుని) అంతఃపురమున, వాసం = వసించుటను, త్వం = నీవు, కిం న అనుమన్యసే = ఏల అంగీకరింపకున్నావు ?

తాత్పర్యము :– ఓ జానకీ ! సర్వజనుల హృదయములను ఆకర్షించునట్టి అద్భుతమైన శయ్యలతో విరాజిల్లుచున్న రావణుని దివ్యమైన అంతఃపురమునందు సుఖముగా భోగముల ననుభవించుటకు నీవేల సమ్మతింపకున్నావు ?

శ్లో॥ మానుషీ మానుష స్యైవ భార్యాత్వం బహుమన్యసే.
ప్రత్యాహర మనో రామా న్న త్వం జాతు భవిష్యసి. 3

పదచ్ఛేదము :– మానుషీ – మానుషస్య – ఏవ – భార్యాత్వం – బహుమన్యసే – ప్రత్యాహర – మనః – రామాత్ – న – త్వం – జాతు – భవిష్యసి.

అన్వయక్రమము :– మానుషీ (త్వం) మానుషస్య భార్యా

త్వం ఏవ బహుమన్యసే, రామాత్ మనః ప్రత్యాహర; త్వం నజాతు భవిష్యసి.

ప్రతిపదార్థము :- మానుషీ = మనుష్యస్త్రీవైన, త్వం = నీవు, మానుషస్య = మానవునకు, భార్యాత్వం ఏవ = భార్యగా నుండుటను మాత్రమే, బహుమన్యసే = గొప్పగా తలచుకొనుచున్నావు, రామాత్ = రామునినుండి, మనః = మనస్సును, ప్రత్యాహర = మఱలించుకొనుము; త్వం = నీవు, నజాతు భవిష్యసి = ఎన్నటికిని (అతనికి భార్యగా) నుండబోవు.

విశేషార్థములు, వాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము .- 'నజాతు భవిష్యసి' - రావణుని అంగీకరింపకున్నచో మేము నిన్ను చంపివేయుదుము కాబట్టి రామునకుకూడ భార్యగా నుండబోవని భావము.

తాత్పర్యము :- నీవు మనుష్యస్త్రీవి కాబట్టి, ఒక మనుష్యనకు భార్యగా నుండుటమాత్రమే ఘనమైనదని భావించుచున్నావు తప్పుడు భావమును సరిదిద్దుకొని మానవమాత్రుడైన రామునినుండి నీ మనస్సును మఱలించుకొనుము. రావణుని చేపట్టుము. ఏది ఏమియినను, నీవు రామునకు భార్యగానుండుట భవిష్యత్తులో జరుగని పని సుమా !

శ్లో॥ త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరమ్,
భర్తార ముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్. 4

పదచ్ఛేదము :- త్రైలోక్యవసుభోక్తారం - రావణం - రాక్షసేశ్వరమ్, భర్తారం - ఉపసంగమ్య - విహరస్వ - యథాసుఖమ్.

అన్వయక్రమము .- త్రైలోక్యవసుభోక్తారం రాక్షసేశ్వరం రావణం భర్తారం ఉపసంగమ్య యథాసుఖం విహరస్వ.

ప్రతిపదార్థము :- త్రైలోక్య వసుభోక్తారం = ముల్లోకము లందలి ఐశ్వర్యములను అనుభవించు చున్నట్టి రాక్షసేశ్వరం రావణం = రాక్షసరాజైన రావణుని, భర్తారం ఉపసంగమ్య=నాదునిగా చేపట్టి, యథా సుఖం = సుఖముగా, విహరస్వ = క్రీడింపుము.

తాత్పర్యము :- ముల్లోకములందలి సంపదలను అనుభవించు భాగ్యశాలియైన రావణాసురుని భర్తగా స్వీకరించి నీవు స్వేచ్ఛగా విహరింపవచ్చును గదా ।

శ్లో॥ మానుషీ మానుషం తంతు రామ మిచ్ఛసి శోభనే,
రాజ్యా ద్భ్రష్ట మసిద్ధార్థం విక్లబం త్వ మనిన్దితే. 5

పదచ్ఛేదము :- మానుషీ - మానుషం - తం - తు - రామం ఇచ్ఛసి - శోభనే - రాజ్యాత్ - భ్రష్టం - అసిద్ధార్థం - విక్లబం - త్వం అనిందితే.

అన్వయక్రమము :- శోభనే । అనిందితే। మానుషీ త్వం మానుషం, రాజ్యాత్భ్రష్టం, అసిద్ధార్థం, విక్లబం తం రామం ఇచ్ఛసి.

ప్రతిపదార్థము :- శోభనే = ఓ మంగళ ప్రద మైన దానా, అనిందితే । = ఓ ఉత్తమురాలా । మానుషీ = మానవస్త్రీవైన, త్వం = నీవు, మానుషం = మానవుడును, రాజ్యాత్ = రాజ్యమునుండి, భ్రష్టం = తొలగింపబడినవాడును, అసిద్ధార్థం = సిద్ధించని కోరికలు గలవాడును, విక్లబం = దైన్యహీనుడును అగు, తం రామం = ఆ రాముని, ఇచ్ఛసి= కోరుకొనుచున్నావు.

తాత్పర్యము :- ఓ ఉత్తమురాలా । నీవు మానవస్త్రీవి కాబట్టి రాజ్యమునుండి తరిమివేయబడినప్పటికిని ఏ ప్రయోజనము సాధింపలేని

వాడై నప్పటికిని ధైర్యహీనుడై నప్పటికిని ఒకానొక మానవమాత్రుడనే ఇప్పటికిని భర్త గా ప్రేమించుచున్నావు.

శ్లో॥ రాక్షసీనాం వచ శ్శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా,
నేత్రాభ్యా మశ్రుపూర్ణాభ్యా మిదం వచన మబ్రవీత్. 6

పదచ్ఛేదము :– రాక్షసీనాం – వచః – శ్రుత్వా–సీతా – పద్మ నిభేక్షణా – నేత్రాభ్యాం – అశ్రుపూర్ణాభ్యాం – ఇదం – వచనం – అబ్రవీత్.

అన్వయక్రమము :– పద్మనిభేక్షణా సీతా రాక్షసీనాం వచః శ్రుత్వా అశ్రుపూర్ణాభ్యాం నేత్రాభ్యాం ఇదం వచనం అబ్రవీత్.

ప్రతిపదార్థము :– పద్మనిభేక్షణా = పద్మములవంటి కన్నులు గల, సీతా = సీతాదేవి, రాక్షసీనాం = రాక్షసాంగనలయొక్క, వచః = వచనమును, శ్రుత్వా = విని, అశ్రుపూర్ణాభ్యాం = దుఃఖబాష్పములతో నిండిన, నేత్రాభ్యాం = కన్నులతో, ఇదం వచనం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :– రాక్షసవనితలు పలికిన ఆ మాటల నాలకించి సీతాదేవి తామరపువ్వులవలె విశాలములైన తనకన్నులనిండ దుఃఖబాష్పములు అలముకొనుచుండ వారికీవిధముగ ప్రత్యుత్తర మొసగెను.

శ్లో॥ య దిదం లోకవిద్విష్ట ముదాహారథ సంగతాః,
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః. 7

పదచ్ఛేదము :– యత్ – ఇదం – లోకవిద్విష్టం–ఉదాహరథ – సంగతాః – న – ఏతత్ – మనసి – వాక్యం – మే – కిల్బిషం – ప్రతిభాతి – వః

అన్వయక్రమము :— సంగతాః లోకవిద్విష్టం ఇదం యత్ ఉదాహరధ, ఏతత్ వాక్యం మేమనసి న; వః కిల్బిషం ప్రతిభాతి.

ప్రతిపదార్థము :— సంగతాః = గుమికూడినవారై, లోకవిద్విష్టం = లోకనింద్యమైనట్టి, ఇదం = ఈ మాటను, యత్ ఉదాహరధ = ఏది చోధించుచున్నారో, ఏతత్ వాక్యం = ఈ వచనము, మే మనసి న = నామనస్సునందు నిలువదు, వః = మీకు, కిల్బిషం = పాపహేతువుగా, ప్రతిభాతి = (నాకు) తోచుచున్నది.

తాత్పర్యము :— ఓ రాక్షసాంగనలారా! మీరందరును కలసి లోకనింద్యములైన మాటలను పలుకుచు నాకు బోధించుచున్న ఈ విషయమేమియు నా మనస్సున కొప్పదు. మీకు ఇది మహాపాతకమును కలిగించు కార్యమని నా నిశ్చయము.

శ్లో॥ న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 8

పదచ్ఛేదము :— న - మానుషీ - రాక్షసస్య - భార్యా - భవితుం - అర్హతి - కామం - ఖాదత - మాం - సర్వాః - న-కరిష్యామి - వః - వచః -

అన్వయక్రమము — మానుషీ రాక్షసస్య భార్యాభవితుం న అర్హతి; మాం సర్వాః కామం ఖాదత; వఃవచః నకరిష్యామి.

ప్రతిపదార్థము :— మానుషీ = మానవస్త్రీ, రాక్షసస్య = రాక్షసునకు, భార్యా = పత్ని, భవితుం = అగుటకు, న అర్హతి = తగియుండదు, సర్వాః=(మీరు) అందరును, కామం = యథేచ్ఛగా, మాం =

నన్ను, ఖాదత = తినివేయుడు, వః వచః = మీ మాటను, న కరిష్యామి = ఆచరింపను.

తాత్పర్యము :- మనుష్యకాంత ఎన్నడును రాక్షసునకు భార్య కాజాలదు. మీ రందరును కలసి నన్ను తినివేయుడు. మీరేమి చేయ బూనినను మీ మాటలను మాత్రము నేను ఆలకింపను, పాటింపను.

శ్లో॥ దీనోవా రాజ్యహీనోవా యో మే భర్తా స మే గురుః,
తం నిత్య మనురక్తా ఽస్మి యథా సూర్యం సువర్చలా.

పదచ్ఛేదము :- దీనః - వా - రాజ్యహీనః - వా - యః - మే - భర్తా - సః - మే - గురుః - తం - నిత్యం - అనురక్తా - అస్మి - యథా - సూర్యం - సువర్చలా.

అన్వయక్రమము :- దీనోవా రాజ్యహీనోవా, యః మేభర్తా, సః మే గురుః; సువర్చలా సూర్యం యథా (అహం) తం నిత్యం అనురక్తా అస్మి ॥

ప్రతిపదార్థము :- దీనః వా = దీనుడైనను, రాజ్యహీనః వా = రాజ్యము లేనివాడైనను, యః = ఎవ్వడు, మే = నాకు, భర్తా = ప్రభువో, సః = అతడు, మే = నాకు, గురుః = సేవనీయుడు, సువర్చలా = సువర్చలాదేవి, సూర్యం యథా = సూర్యునివలె, (అహం = నేను) తం = అతనినిగూర్చి, నిత్యం = ఎల్లప్పుడు, అనురక్తా అస్మి = అనురాగముగలదాననై యున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- సువర్చలా - సూర్యాభిముఖములైన పుష్పములు గల్గియుండు ఒక మొక్కయని కొందరిభావము.

తాత్పర్యము :- అతడు దీనుడై యుండవచ్చును, రాజ్యభ్రష్టుడై యుండవచ్చును; ఆ పురుషుడు నా పెనిమిటికాబట్టి నాకు దైవసమానుడేయగును. సువర్చలాదేవి సూర్యభగవానుని యెడవలెనే నేను నా భర్తయైన ఆ రాముని యెడనే ఎట్టిపరిస్థితియందైనను అనురాగపూర్ణురాలనై యుందును.

శ్లో॥ యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి,
అరుంధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా ॥ 10

శ్లో॥ లోపాముద్రా యథా ఽగస్త్యం సుకన్యా చ్యవనం యథా,
సావిత్రీ సత్యవంతం చ కపిలం శ్రీమతీ యథా ॥ 11

శ్లో॥ సౌదాసం మదయంతీవ కేశినీ సగరం యథా,
నైషధం దమయంతీవ భైమీ పతి మనువ్రతా । 12

శ్లో॥ తథా ఽహ మిక్ష్వాకువరం రామం పతి మనువ్రతా ॥ 13

పదచ్ఛేదము :- సుగమము.

అన్వయక్రమము :- యథా మహాభాగా శచీ శక్రంసముపతిష్ఠతి యథా అరుంధతీ చ వసిష్ఠం సముపతిష్ఠతి; యథా రోహిణీ శశినం సముపతిష్ఠతి; యథా లోపాముద్రా అగస్త్యం సముపతిష్ఠతి, యథా సుకన్యా చ్యవనం సముపతిష్ఠతి, యథా సావిత్రీచ సత్యవంతంసముపతిష్ఠతి; యథా శ్రీమతీ కపిలం సముపతిష్ఠతి; మదయంతీ సౌదాసం ఇవ, భైమీ దమయంతీ నైషధం ఇవ, యథా కేశినీ పతిం సగరం అనువ్రతా, తథా అహం ఇక్ష్వాకువరం పతిం రామం అనువ్రతా ॥

ప్రతిపదార్థము :- యథా = ఎట్లు, మహాభాగా శచీ = భాగ్యశాలినియైన శచీదేవి, శక్రం = దేవేంద్రుని, సముపతిష్ఠతి = సేవించునో,

యథా = ఎట్లు, అరుంధతీ చ = అరుంధతియును, వసిష్ఠం సముపతిష్ఠతి= వసిష్ఠుని సేవించునో, యథా = ఎట్లు, రోహిణీ = రోహిణీతార, శశినం= చంద్రుని సేవించునో; యథా = ఎట్లు, లోపాముద్రా = లోపాముద్ర, అగస్త్యం = అగస్త్యమహర్షిని సేవించునో, యథా = ఎట్లు, సుకన్యా = సుకన్య, చ్యవనం = చ్యవన మహర్షిని సేవించునో; యథా = ఎట్లు, సావిత్రీచ = సావిత్రియును, సత్యవంతం = సత్యవంతుని సేవించునో, యథా = ఎట్లు, శ్రీమతీ = శ్రీమతి యనుసాధ్వి, కపిలం = కపిల మహర్షిని సేవించునో, మదయంతీ = మదయంతియనునామె, సౌదాసం ఇవ = సౌదాసునివలె, భైమీ దమయంతీ = భీమభూపాలుని తనయయైన దమయంతి, నైషధం ఇవ = నిషధమహీపతియై నలునివలె, యథా = ఎట్లుగా, కేశినీ = కేశినియనుసాధ్వి, పతిం సగరం = భర్తయైన సగర భూపతిని, అనువ్రతా = అనుసరించునట్టిదో, తథా = అట్లుగా, అహం = నేను, ఇక్ష్వాకువరం = ఇక్ష్వాకు కులతిలకుడైన, పతిం రామం = భర్తయైన రాముని, అనువ్రతా = అనుసరించునట్టిదానను.

తాత్పర్యము :— జగద్విఖ్యాతి నొందిన మహాసాధ్వులుగా కీర్తింపబడు శచీదేవి దేవేంద్రునివలె, అరుంధతి వసిష్ఠమహర్షినివలె, రోహిణీతార చంద్రునివలె, లోపాముద్ర అగస్త్యమహర్షినివలె, రాజకన్యయైన సుకన్య చ్యవన మహర్షినివలె, మద్రరాజపుత్రియైన సావిత్రి సత్యవంతునివలె, శ్రీమతి కపిలమహర్షినివలె, మదయంతి సౌదాసునివలె, భీమరాజసుతయైన దమయంతి నలమహారాజునువలె, కేశిని సగర భూపాలునివలె, నేనుకూడ అచంచలమైన గౌరవానురాగములతో నానాధుడైన ఆ ఇక్ష్వాకుకులతిలకునే సహ ధర్మచారిణినై సేవించునట్టిదానను అని తెలిసికొనుడు.

శ్లో॥ సీతాయా వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః
భర్త్సయంతిస్మ పరుషై ర్వాక్యై రావణచోదితాః 14

పదచ్ఛేదము :- సీతాయాః - వచనం - శ్రుత్వా - రాక్షస్యః - క్రోధమూర్ఛితాః, భర్త్సయంతి - స్మ - పరుషైః - వాక్యైః - రావణ చోదితాః.

అన్వయక్రమము :- సీతాయాః వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః రావణచోదితాః పరుషైః వాక్యైః (సీతాం) భర్త్సయంతిస్మ.

ప్రతిపదార్థము :- సీతాయాః = సీతాదేవియొక్క, వచనం = మాటను, శ్రుత్వా = విని, రాక్షస్యః = రాక్షసవనితలు, క్రోధమూర్ఛితాః = కోపముచే వివశురాండ్రై, రావణచోదితాః = రావణునిచే ప్రేరేపింపబడిన వారై, పరుషైః = కటువైన, వాక్యైః = మాటలతో, (సీతాం = సీతాదేవిని) భర్త్సయంతిస్మ = భయపెట్టసాగిరి.

తాత్పర్యము :- సీత చెప్పినమాటలువిని అచ్చటి రాక్షసాంగనలు క్రోధావేశమునొంది రావణుడు తమ్ము ఆదేశించిన రీతిగా సీతాదేవిని కటువైన మాటలతో తిరిగి బెదరింపసాగిరి.

శ్లో॥ అవలీన స్స నిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే,
సీతాం సంతర్జయంతీ స్తా రాక్షసీ రశృణోత్కపిః 15

పదచ్ఛేదము :- అవలీనః - సః-నిర్వాక్యః - హనుమాన్ - శింశుపాద్రుమే - సీతాం - సంతర్జయంతీః - తాః - రాక్షసీః - అశృణోత్ - కపిః

అన్వయక్రమము :- శింశుపాద్రుమే అవలీనః సః కపిః హనుమాన్ నిర్వాక్యః (సన్) సీతాం సంతర్జయంతీః తాః రాక్షసీః అశృణోత్.

ప్రతిపదార్థము :- శింశుపాద్రుమే = శింశుపావృక్షముపై, అవలీనః = దాగియున్నట్టి, సః కపిః హనుమాన్ = ఆ వానరశ్రేష్ఠుడైన

హనుమ, నిర్వాక్యః(సన్)=ఏమియుపలుకనివాడై, సీతాంసంతర్జయంతీః= సీతాదేవిని గర్జించుచున్నట్టి, తాః రాక్షసీః=ఆ రాక్షసస్త్రీలను, అశృణోత్= వినుచుండెను.

తాత్పర్యము :— ఆ శింశుపావృక్షముపై కొమ్మలమాటున దాగి యున్న హనుమ సీతాదేవిని ఇట్లు భీకరముగా గద్దించుచు రాక్షసస్త్రీలు పల్కిన మాటలను మౌనముగా నుండి వినుచుండెను.

శ్లో॥ తా మభిక్రమ్య సంక్రుద్ధా వేపమానాం సమంతతః,
భృశం సంలిలిహుః దీప్తాన్ ప్రలంబాన్ దశనచ్ఛదాన్.

పదచ్ఛేదము :— తాం - అభిక్రమ్య - సంక్రుద్ధాః - వేపమానాం - సమంతతః - భృశం - సంలిలిహుః - దీప్తాన్ - ప్రలంబాన్ - దశనచ్ఛదాన్.

అన్వయక్రమము :— వేపమానాం తాం సమంతతః అభిక్రమ్య సంకృద్ధాః తాః దీప్తాన్, ప్రలంబాన్ దశనచ్ఛదాన్ భృశం సంలిలిహుః,

ప్రతిపదార్థము :— వేపమానాం = వణకిపోవుచున్న, తాం = ఆ సీతాదేవిని, సమంతతః = చుట్టును, అభిక్రమ్య = గుమిగూడి, సంక్రుద్ధాః = మిక్కిలి క్రోధావేశము నొందిన, తాః=ఆ రాక్షస్త్రీలు, దీప్తాన్ = ప్రకాశించుచున్నట్టి, ప్రలంబాన్ = వ్రేలాడుచున్న, దశనచ్ఛదాన్ = పెదవులను, భృశం = మాటిమాటికి, సంలిలిహుః = నాకికొనుచుండిరి.

తాత్పర్యము :— భయముచే మిక్కిలి వణకిపోవుచున్న సీతాదేవిచుట్టును ఆ రాక్షసస్త్రీలు ఎల్లరును మూగి వ్రేలాడుచున్న తమ ఎఱ్ఱని పెదవులను క్రోధముతో మాటిమాటికి నాకుకొనుచుండిరి.

శ్లో॥ ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యాశు పరశ్వధాన్,
నేయ మర్హతి భర్తారం రావణం రాక్షసాధిపమ్. 17

పదచ్ఛేదము :- ఊచుః - చ - పరమక్రుద్ధాః - ప్రగృహ్య - అశు - పరశ్వధాన్ - న - ఇయం - అర్హతి - భర్తారం - రావణం - రాక్షసాధిపమ్.

అన్వయక్రమము :- అశు పరశ్వధాన్ ప్రగృహ్య పరమక్రుద్ధాః ఊచుశ్చ, ఇయం, రాక్షసాధిపంరావణం భర్తారం న అర్హతి.

ప్రతిపదార్థము :- అశు = శీఘ్రముగ, పరశ్వధాన్ = గండ్రగొడ్డళ్ళను, ప్రగృహ్య = చేతబూని, పరమక్రుద్ధాః = మిక్కిలి క్రోధోద్రిక్తలై, ఊచుశ్చ = పలికిరి, ఇయం = ఈమె, రాక్షసాధిపం రావణం = రాక్షసప్రభువైనరావణుని, భర్తారం = భర్తనుగా, న అర్హతి = (చేసికొనుటకు) తగదు.

తాత్పర్యము :- మఱియు వారు తమ ఆయుధములైన గండ్రగొడ్డళ్ళనుచేతబూనితీవ్రమైన క్రోధముతో "ఈ జానకికి మనరాక్షస ప్రభువైన రావణుని భర్తగాపొందు యోగ్యతలేదు" అని పలుకదొడగిరి.

శ్లో॥ సా భర్త్స్యమానా భీమాభీ రాక్షసీభి ర్వరాననా,
సా బాష్ప మపమార్జంతీ శింశుపాం తా ముపాగమత్ .18

పదచ్ఛేదము :- సా - భర్త్స్యమానా - భీమాభిః - రాక్షసీభిః - వరాననా, సా - బాష్పం-అపమార్జంతీ - శింశుపాం - తాం - ఉపాగమత్

అన్వయక్రమము:- సావరాననా భీమాభిః రాక్షసీభిః భర్త్స్యమానా (అభూత్;) సాబాష్పం అపమార్జంతీ తాం శింశుపాం ఉపాగమత్.

ప్రతిపదార్థము :- సా వరాననా = ఆసీతాసుముఖి, భీమాభిః = భయమునుగొల్పునట్టి, రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, భర్త్స్యమానా = గద్దింపబడుచున్నది, (అభూత్ = ఆయెను;) సా = ఆమె, బాష్పం =

కన్నీటిని, అపమార్జంతీ = తుడుచుకొనుచు, తాం శింశుపాం = ఆ శింశుపా వృక్షమును, ఉపాగమత్ = చేరుకొనెను.

తాత్పర్యము :– సీతాదేవి క్రూరురాండ్రైన అరాక్షస వనితలు తనను నిర్దయగా గద్దించుచుండగా కన్నులనుండి వచ్చుచున్న దుఃఖబాష్పములను తుడుచుకొనుచు లేచి అచటనున్న శింశుపావృక్షము క్రిందకుచేరెను

శ్లో॥ తత స్తాం శింశుపాం సీతా రాక్షసీభి స్సమావృతా,
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా. 19

పదచ్ఛేదము :– తతః – తాం – శింశుపాం – సీతా – రాక్షసీభిః – సమావృతా – అభిగమ్య – విశాలాక్షీ – తస్థౌ – శోకపరిప్లుతా.

అన్వయక్రమము :– తతః విశాలాక్షీ సీతా రాక్షసీభిః సమావృతా, శోకపరిప్లుతా (సతీ) తాంశింశుపాం అభిగమ్య తస్థౌ.

ప్రతిపదార్థము .– తతః = అటుపిమ్మట, విశాలాక్షీ = విశాలములైన నేత్రములుగల, సీతా = సీతాదేవి, రాక్షసీభిః = రాక్షస వనితలచే, సమావృతా = చుట్టుకొనబడినదై, శోకపరిప్లుతా (సతీ) = దుఃఖముతో నిండినదై, తాం శింశుపాం = ఆ శింశుపావృక్షమును, అభిగమ్య = చేరి, తస్థౌ = నిలిచియుండెను.

తాత్పర్యము :– భయంకరులైన అరాక్షసస్త్రీలు తనను చుట్టుముట్టి యుండగా దుఃఖసంతప్తురాలగుచు సీతాదేవి శింశుపా వృక్షము క్రిందకు పోయి నిలచియుండెను.

శ్లో॥ తాం కృశాం దీనవదనాం మలినాంబరధారిణీమ్,
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్య స్తాం సమంతతః.20

పదచ్ఛేదము :- తాం - కృశాం - దీనవదనాం - మలినాంబర ధారిణీమ్, భర్త్సయాం - చక్రిరే - సీతాం - రాక్షస్యః, - తాం - సమంతతః.

అన్వయక్రమము :- తాం కృశాం దీనవదనాం, మలినాంబర ధారిణీం సీతాం, రాక్షస్యః సమంతతః, (అభిగమ్య) భర్త్సయాం, చక్రిరే

ప్రతిపదార్థము :- తాం = అవిధమైన, కృశాం = కృశించి యున్నది. దీనవదనాం = దీనమైనముఖముతో నున్నదియును, మలినాంబర ధారిణీం = మలినవస్త్రముతో నున్నదియునగు, సీతాం = సీత దేవిని, సమంతతః = చుట్టును, అభిగమ్య = గుమికూడి, రాక్షస్యః ఆ రాక్షసస్త్రీలు భర్త్సయాంచక్రిరే = భయపెట్టసాగిరి.

తాత్పర్యము .- అట్లుకృశించి దీనవదనయై మలిన వస్త్రముతో నున్న ఆ సీతాదేవిని ఆ రాక్షసస్త్రీలెల్లరును అచ్చటగూడ చుట్టుముట్టి తిరిగి ఆమెను బహువిధములుగ భయపెట్టసాగిరి.

శ్లో॥ తత స్తాం వినతానామా రాక్షసీ భీమదర్శనా,
అబ్రవీ త్కుపితా కారా కరాళా నిర్ణతోదరీ. 21

పదచ్ఛేదము :- తతః - తాం - వినతా - నామ - రాక్షసీ - భీమదర్శనా - అబ్రవీత్ - కుపితా - కారా - కరాళా - నిర్ణతోదరీ.

అన్వయక్రమము :- తతః భీమదర్శనా, కుపితాకారా, కరాళా నిర్ణతోదరీ. వినతానామరాక్షసీతాం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, భీమదర్శనా = భయంకరాకారముగలదియును, కుపితాకారా = క్రోధమూర్తియును, కరాళా = భీకరురాలును, నిర్ణతోదరీ = అణగియున్న పొట్టగలదియును అగు,

వినతానామరాక్షసీ = వినతయను రాక్షసవనిత, తాం = ఆసీతాదేవినిగూర్చి, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- అప్పుడు భయంకరమైన రూపముగలదియును మూర్తీభవించినక్రోధమువలె నున్నదియును, లోతైన పొట్టగలదియు నైన వినతయను ఒకానొక రాక్షస వనిత సీతాదేవిని సందోధించుచు ఈరీతిగా పలుకదొడగెను.

శ్లో॥ సీతే పర్యాప్త మేతావ ద్భర్తృస్నేహో నిదర్శితః,
సర్వ త్రాతికృతం భద్రే వ్యసనా యోపకల్పతే. 22

పదచ్ఛేదము :- సీతే - పర్యాప్తం-ఏతావత్-భర్తృస్నేహః-నిదర్శితః - సర్వత్ర - అతికృతం - భద్రే - వ్యసనాయ - ఉపకల్పతే.

అన్వయక్రమము :- సీతే, (త్వయా) భర్తృస్నేహః, నిదర్శితః; ఏతావత్ పర్యాప్తం. భద్రే ! సర్వత్ర అతికృతం వ్యసనాయ ఉపకల్పతే.

ప్రతిపదార్థము .- సీతే = ఓ దానకీ ! త్వయా = నీచేత, భర్తృస్నేహః = భర్తపై (నుండవలసిన) ప్రేమ, నిదర్శితః = ప్రదర్శింపబడినది, ఏతావత్ = ఇంతమాత్రము, పర్యాప్తం = చాలును, భద్రే = ఓ మంగళస్వరూపురాలా ! సర్వత్ర = ఎల్లయెడలను, అతికృతం = మితిమీఱిచేయబడినది, వ్యసనాయ = కష్టమునకే, ఉపకల్పతే = కారణము కాగలదు.

తాత్పర్యము .- ఓ జానకీ ! నీభర్తపై చూపవలసిన ప్రేమ నంతయు నీవు చక్కగనే ప్రదర్శించితివి; ఇప్పటికిది ఇంతమాత్రము చాలును; ఎచ్చటనైనను మితిమీరిగావించిన ఎట్టిపనియైనను చెడు కష్టమునే కలిగించును సుమా !

30

శ్లో॥ పరితుష్టాస్మి భద్రం తే మానుష స్తే కృతో విధిః,
మమాపి తు వచః పథ్యం బ్రువంత్యాః కురు మైథిలి. 23

పదచ్ఛేదము :- పరితుష్టా - అస్మి - భద్రం - తే - కృతః - విధిః - మమ - అపి - తు - వచః-పథ్యం- బ్రువంత్యాః - కురు - మైథిలి.

అన్వయక్రమము :- పరితుష్టా అస్మి; తే భద్రం; మానుషః తే విధిః కృతః; మైథిలి, బ్రువంత్యాః మమాపి పథ్యంవచః తు కురు.

ప్రతిపదార్థము :- పరితుష్టాఅస్మి =మిక్కిలి సంతోషించితిని, తే = నీకు, భద్రం = క్షేమము, మానుషః = మానవప్రయత్నమైన, తే విధిః = నీ ధర్మము, కృతః = నెరవేర్చబడినది, మైథిలి =ఓ జానకీ, బ్రువంత్యాః = చెప్పుచున్నట్టి, మమ = నాయొక్క, పథ్యం వచః అపి= మేలునుగూర్చు మాటలనుగూడ, కురు = ఆచరింపుము.

తాత్పర్యము :- నీవ ర్తనము నాకు చాలా సంతసము కల్గించినది. నీకు మేలు కలుగుగాక । నీవు చేయవలసిన మనుష్య ప్రయత్నమంతయును చక్కగా చేసితివి. ఓ జానకీ । ఇప్పుడు నీ శ్రేయస్సుగోరి చెప్పుచున్న నామాటలనుగూడ, కొంచెమువిని ఆ ప్రకారము నడచుకొనుము.

శ్లో॥ రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్,
విక్రాంతం రూపవంతంచ సురేశమివ వాసవమ్. 24

పదచ్ఛేదము - రావణం - భజ - భర్తారం - భర్తారం - సర్వరక్షసామ్, విక్రాంతం - రూపవంతం - చ - సురేశం - ఇవ - వాసవమ్.

అన్వయక్రమము .- సర్వరక్షసాం భర్తారం, సురేశం వాసవంఇవ విక్రాంతం, రూపవంతం రావణం భర్తారం భజ.

ప్రతిపదార్థము :- సర్వరక్షసాం = సర్వదానవులకును, భర్తారం = ప్రభువైనవాడును, సురేశం వాసవమివ = దేవరాజైన ఇంద్రుని వలె, రూపవంతం = రూపవంతుడును అగు, రావణం = రావణుని, భర్తారం = భర్తనుగా, భజ = సేవింపుము.

తాత్పర్యము :- సర్వరాక్షస వంశములకును ప్రభువైనవాడును దేవరాజైన మహేంద్రునివలె సౌందర్య వంతుడును పరాక్రమ వంతుడును అగు రావణుని భర్తగా చేపట్టుము.

శ్లో॥ దక్షిణం త్యాగశీలంచ సర్వస్య ప్రియదర్శనమ్,
మానుషం కృపణాం రామం త్యక్త్వా రావణ మాశ్రయ.

పదచ్ఛేదము :- దక్షిణం - త్యాగశీలం-చ - సర్వస్య -ప్రియ దర్శనమ్, మానుషం - కృపణం - రామం - త్యక్త్వా - రావణం - ఆశ్రయ.

అన్వయక్రమము :- మానుషం, కృపణం, రామం త్యక్త్వా, దక్షిణం, త్యాగశీలం, సర్వస్య ప్రియదర్శనం, రావణం ఆశ్రయ.

ప్రతిపదార్థము :- మానుషం = మానవమాత్రుడును, కృపణం = దీనుడును అగు, రామం = రాముని, త్యక్త్వా= విడిచి, దక్షిణం= సమర్థుడును, త్యాగశీలం = త్యాగ స్వభావము గలవాడును, సర్వస్య = ఎల్లరకును, ప్రియదర్శనం = ప్రియముగా గానవచ్చు వాడును అగు, రావణం = రావణుని, ఆశ్రయ = ఆశ్రయింపుము.

తాత్పర్యము - మానవ మాత్రుడును, దీనుడైన వాడు నగు రాముని విడచి, ఎల్లరకును ప్రియంకరమైన రూపముకలిగి త్యాగశీలుడై సర్వసమర్థుడైయున్న రావణుని ఆశ్రయింపుము.

శ్లో॥ దివ్యాంగరాగా వైదేహీ దివ్యాభరణభూషితా,
అద్యప్రభృతి సర్వేషాం లోకానా మీశ్వరీ భవ. 26

పదచ్ఛేదము – దివ్యాంగరాగా – వైదేహీ – దివ్యాభరణ భూషితా – అద్య – ప్రభృతి – సర్వేషాం – లోకానాం – ఈశ్వరీ – భవ.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :– వైదేహీ = ఓ జానకీ ! దివ్యాంగరాగా = దివ్యములైన అంగరాగములు గలదానవై, దివ్యాభరణభూషితా = దివ్యములైనభూషణములతో అలంకరించుకొనినదానవై, అద్యప్రభృతి = నేటి నుండి, సర్వేషాం = సమస్తమైన, లోకానాం = లోకములకును, ఈశ్వరీ = ఆధిపత్యముగలదానవు, భవ = అగుము.

తాత్పర్యము :– ఓ జానకీ ! దివ్యమైన మైపూతలను ఉపయోగించుకొనుచు అమూల్యములైన ఆభరణములతో అలంకరించు కొనుచు నేటినుండి నీవు సమస్తలోకములకును అధీశ్వరివి గమ్ము !

శ్లో॥ అగ్నేః స్వాహా యథా దేవీ శచీ వేంద్రస్య శోభనే,
కిం తే రామేణ వైదేహీ కృపణేన గతాయుషా. 27

పదచ్ఛేదము :– అగ్నేః – స్వాహా – యథా – దేవీ – శచీ – ఇవ – ఇంద్రస్య – శోభనే – కిం – తే – రామేణ – వైదేహీ – కృపణేన – గతాయుషా.

అన్వయక్రమము :– అగ్నేః స్వాహా యథా, ఇంద్రస్య దేవీ శచీ ఇవ, శోభనే ! (త్వం రావణస్య దేవీ భవ) వైదేహీ ! కృపణేన, గతాయుషా రామేణ తే కిమ్ ?

ప్రతిపదార్థము :— అగ్నేః = అగ్నిదేవునకు, స్వాహాభా స్వాహాదేవివలెను, ఇంద్రస్య = దేవేంద్రునకు, దేవీ శచీవ = శచీదేవివలెను, శోభనే=ఓ మంగళస్వరూపురాలా ! (త్వం రావణస్య భార్యా భవ — నీవు రావణునకు భార్యవగుము.) వైదేహి — ఓ జానకీ! కృపణేన దీనుడైనట్టి, గతాయుషా = ఆయుర్దాయము చెల్లిపోయినట్టి, రామేణ — రామునితో, తే = నీకు, కిం = ఏమిప్రయోజనమున్నది ?

తాత్పర్యము :— ఓ జానకీ ! అగ్నిదేవునకు స్వాహాదేవి భార్య యైనట్లును, దేవేంద్రునకు శచీదేవి పట్టమహిషి యైనట్లును, నీవు రావణునకు ఇష్టురాలైన పత్నివైయుండుటయే ఉచితమగును. దీనుడై రావణునిచేతిలో ఆయువును పోగొట్టుకొనువాడయిన ఆరామునివలన నీకేమి ప్రయోజనము ?

శ్లో॥ ఏత దుక్తంచ మే వాక్యం యది త్వం న కరిష్యసి
అస్మిన్ముహూర్తే సర్వా స్త్వాం భక్షయిష్యామహే వయమ్. 28

పదచ్ఛేదము :— ఏతత్ - ఉక్తం - చ - మే - వాక్యం - యది - త్వం - న - కరిష్యసి - అస్మిన్ - ముహూర్తే - సర్వాః - త్వాం - భక్షయిష్యామహే - వయమ్.

అన్వయక్రమము :— త్వం ఉక్తం మే ఏతత్ వాక్యం, న కరిష్యసి యది, అస్మిన్ ముహూర్తే, వయం సర్వాః, త్వాం భక్షయిష్యామహే.

ప్రతిపదార్థము :— ఉక్తం = చెప్పబడినట్టి, మే ఏతత్ వాక్యం = నా యీవచనమును, త్వం = నీవు, న కరిష్యసి యది = చేయకుంటివేని, అస్మిన్ ముహూర్తే = ఈ క్షణమునందే, వయం సర్వాః = మేమందరము, త్వాం = నిన్ను, భక్షయిష్యామహే = భక్షించివేసెదము.

తాత్పర్యము :- నీమేలునుగోరి నేను చెప్పిన వాక్యమును నీ వనుసరింపనియెడల ఈ క్షణమే మేమందరము గలసి నిన్ను చంపి తిని వేసెదము సుమా!

శ్లో॥ అన్యాతు వికటానామ లంబమాన పయోధరా,
అబ్రవీత్కుపితా సీతాం ముష్టి ముద్యమ్య గర్జతీ. 29

పదచ్ఛేదము :- అన్యా - తు - వికటా - నామ - లంబమాన పయోధరా - అబ్రవీత్ - కుపితా - సీతాం - ముష్టిం - ఉద్యమ్య - గర్జతీ.

అన్వయక్రమము :- లంబమానపయోధరా, వికటానామ, అన్యా కుపితా (సతీ) ముష్టిం ఉద్యమ్య గర్జతీ, సీతాం అబ్రవీత్.

ప్రతిపదార్థము :- లంబమాన పయోధరా = వ్రేలాడుచున్న స్తనములుగల, వికటానామ = వికటయనుపేరుగల, అన్యా = వేరొక వనిత, కుపితా (సతీ) =కోపముగలిగినదై, ముష్టిం=పిడికిలిని, ఉద్యమ్య= మీదికి ఎత్తి, గర్జతీ = గర్జించుచున్నదై, సీతాం=సీతాదేవినిగూర్చి అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- వికారముగా వ్రేలాడుచున్న స్తనములుగల వికటయను వేరొకరక్కసి మిక్కిలి క్రోధమునొందినదై తన పిడికిలిని బిగించి మీదికిఎత్తి పెద్దగర్జనచేయుచు సీతాదేవినిగూర్చి ఈరీతిగాపలికెను.

శ్లో॥ బహూని హ్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే,
అనుక్రోశాన్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి. 30

పదచ్ఛేదము :- బహూని - అప్రియరూపాణి - వచనాని - సుదుర్మతే - అనుక్రోశాత్ - మృదుత్వాత్ - చ-సోఢాని- తవ - మైథిలి,

అన్వయక్రమము :— సుదుర్మతే ! మైథిలి ! అనుక్రోశాత్, మృదుత్వాత్ చ, అప్రియరూపాణి, బహూని తవ వచనాని సోఢాని.

ప్రతిపదార్థము :— సుదుర్మతే = ఓ దుర్మార్గురాలా ! మైథిలి = ఓ జానకీ, అనుక్రోశాత్ = దయవలనను, మృదుత్వాత్ చ = మృదుస్వభావమువలనను, అప్రియరూపాణి = మిక్కిలి అనిష్టములైనట్టి, బహూని = అనేకములైన, తవ వచనాని = నీమాటలు, సోఢాని = ఓర్చుకొనబడినవి.

తాత్పర్యము :— దుర్మార్గురాలవైన ఓ జానకీ ! ఇంతవఱకును మాలోని దయా స్వభావము చేతను, మా మృదు స్వభావము చేతను, మేము మాకు అనిష్టకరముగా నీవెన్ని మాటలు చెప్పుచున్నను ఓర్పు వహించియుంటిమి.

శ్లో॥ నచ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్,
ఆనీతాసి సముద్రస్య పార మన్యై ర్దురాసదం.,
రావణాంతఃపురం ఘోరం ప్రవిష్టాచాసి మైథిలి. 31

పదచ్ఛేదము :— న - చ - నః - కురుషే - వాక్యం - హితం - కాలపురస్కృతమ్ - ఆనీతా - అసి - సముద్రస్య - పారం - అన్యైః - దురాసదమ్, రావణాంతఃపురః - ఘోరం - ప్రవిష్టా - చ - అసి - మైథిలి.

అన్వయక్రమము :— మైథిలి, హితం, కాలపురస్కృతం, నః వాక్యం నకురుషే; అన్యైః దురాసదం, సముద్రస్య పారం, ఆనీతా అసి; ఘోరం రావణాంతఃపురం ప్రవిష్టా అసిచ.

ప్రతిపదార్థము :— మైథిలి ! = ఓ జానకీ ! హితం = పథ్యమైనదియును, కాలపురస్కృతం = కాలోచిత మైనట్టిదియు నగు, నః వాక్యం = మా వచనమును, న కురుషే = ఆచరింపకున్నావు,

అన్యైః = ఇతరులచే, దురాసదం = చేరుటకు అశక్యమైనట్టి, సముద్రస్య = సముద్రముయొక్క, పారం = దూరతీరమునకు, అనీతాఅసి = తీసికొనిరాబడితివి, ఘోరం = భయంకరమైనట్టి, రావణాంతఃపురం = రావణాసురుని అంతఃపురమును, ప్రవిష్టా అసిచ = ప్రవేశించియుంటివి కూడను.

తాత్పర్యము :- మేము నీశ్రేయస్సునుగోరి కాలోచితముగ చెప్పినమాటలను నీవెంతమాత్రము అవలంబింపకున్నావు. ఇతరులు సహింపుటకు శక్యముగాని సముద్రమును, దాటించి ఆవలితీరముదాక తెచ్చి, భయంకరమైన రావణుని అంతఃపురమునందు ప్రవేశపెట్టబడియుంటివి అని తెలిసికొనుము.

శ్లో॥ రావణస్య గృహే రుద్ధా మస్మాభిస్తు సురక్షితామ్,
న త్వాం శక్తః పరిత్రాతు మపి సాక్షాత్పురందరః. ౩౭

పదచ్ఛేదము :- రావణస్య - గృహే - రుద్ధాం - అస్మాభిః - తు - సురక్షితామ్, న - త్వాం - శక్తః - పరిత్రాతుం - అపి - సాక్షాత్ - పురందరః.

అన్వయక్రమము :- రావణస్య గృహే రుద్ధాం, అస్మాభిః, సురక్షితామ్, త్వాం పరిత్రాతుం సాక్షాత్ పురందరఃఅపి, పరిత్రాతుం శక్తఃన.

ప్రతిపదార్థము :- రావణస్య = రావణునియొక్క, గృహే = భవనమునందు, రుద్ధాం = బంధింపబడినదానవును, అస్మాభిః = మాచే, సురక్షితాం = సంరక్షింపబడుచున్న దానవును అగు, త్వాం = నిన్ను, పరిత్రాతుం = సంరక్షించుటకు, సాక్షాత్ = సాక్షాత్తుగా, పురందరః అపి = దేవేంద్రుడైనను, శక్తఃన = సమర్థుడుకాడు.

తాత్పర్యము .– రావణుని వంటివాని వధనములో బంధింపబడి యావంటివారిచే కాంచితాయబడుచున్న నిన్ను మావశమునుండి రక్షించుటకు దేవేంద్రుడు దిగివచ్చినను సాధ్యము కాదుసుమా!

శ్లో॥ కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి,
అల మశ్రుప్రపాతేన త్యజ శోక మనర్థకమ్. 33

పదచ్ఛేదము :– కురుష్వ - హితవాదిన్యాః - వచనం - మమ - మైథిలి! - అలం - అశ్రుప్రపాతేన - త్యజ - శోకం - అనర్థకమ్.

అన్వయక్రమము .– మైథిలి! హితవాదిన్యాః మమ వచనం కురుష్వ; అశ్రుప్రపాతేన అలం; అనర్థకం శోకం త్యజ.

ప్రతిపదార్థము :– మైథిలి! = ఓ జానకీ, హితవాదిన్యాః = హితకరముగా పలుకుచున్న, మమ = నాయొక్క, వచనం = మాటను, కురుష్వ = ఆచరింపుము, అశ్రుప్రపాతేన అలం = కన్నీరుకార్చుట చాలును, అనర్థకం = అనర్థకరమైన, శోకం = శోకమును, త్యజ = విడువుము

తాత్పర్యము :– ఓ జానకీ! నీమేలుకోరి చెప్పుచున్నాము. కాబట్టి మామాటలుగ్రహించి అనుసరింపుము. ఈ కన్నీటిధారలు ఎందుకు? నిరర్థకమైన నీశోకము మానుము.

శ్లో॥ భజ ప్రీతించ హర్షం చ త్యక్త్వైతాం నిత్యదైన్యతామ్,
సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్. 34

పదచ్ఛేదము .– భజ - ప్రీతిం - చ - హర్షం - చ - త్యజ - ఏతాం - నిత్యదైన్యతాం - సీతే - రాక్షసరాజేన - సహ - క్రీడ - యథాసుఖమ్.

అన్వయక్రమము :- సీతే, ప్రీతించ హర్షంచ, భజ; ఏతాం నిర్వ్యదైన్యతాం, త్యజ; రాక్షసరాజేనసహ యథాసుఖం క్రీడ.

ప్రతిపదార్థము :- సీతే ! = ఓ జానకీ, ప్రీతించ = ప్రీతిని, హర్షంచ = ఆనందమును, భజ = సంపాదించుకొనుము, ఏతాం నిర్వ్యదైన్యతాం = ఈ విధమైన నిరంతర దైన్యమును, త్యజ = విడచి పెట్టుము. రాక్షసరాజేనసహ = రాక్షసరాజైన రావణునితో కూడి, యథాసుఖం = సుఖముగా, క్రీడ = విహరింపుము.

తాత్పర్యము :- ఓ జానకీ ! రావణునిపై ప్రేమనుచూపుము; ఆనందమును సంపాదించుకొనుము. ఈ రీతిగా ఎల్లప్పుడును దీనురాలై యుండుట నీకు తగదు. రాక్షస ప్రభువైన రావణునితో గూడి స్వేచ్ఛగా విహరింపుము.

శ్లో॥ జానాసిహి యథా భీరు స్త్రీణాం యౌవన మధ్రువమ్,
యావ న్న తే వ్యతిక్రామే త్తావ త్సుఖ మవాప్నుహి. 35

పదచ్ఛేదము - జానాసి - హి - యథా - భీరు - స్త్రీణాం - యౌవనం - అధ్రువమ్, యావత్ - న - తే - వ్యతిక్రామేత్ - తావత్ - సుఖం - అవాప్నుహి.

అన్వయక్రమము :- భీరు ! స్త్రీణాం యౌవనం యథా అధ్రువం, జానాసి హి. తే (తత్ యౌవనం) యావత్ నవ్యతిక్రమేత్ తావత్ సుఖం అవాప్నుహి.

ప్రతిపదార్థము :- భీరు ! = భీతస్వభావురాలైన ఓ సీతా ! స్త్రీణాం = స్త్రీలకు, యౌవనం = యౌవనవయస్సు, యథా అధ్రువం = ఎట్లు అశాశ్వతముగానుండునో, జానాసిహి = ఎరిగియేయున్నావుగదా! తత్ యౌవనం = ఆ యౌవనము, తే = నీకు, యావత్ = ఎంతలో , న

వ్యతిక్రమేత్ = గడచిపోవకుండునో, తావత్=అంతలోనే, సుఖం = సుఖమును, అవాప్నుహి = పొందుము.

తాత్పర్యము :- భయస్వభావురాలవైన ఓ సీతా ! స్త్రీలకు యౌవనదశ చిరకాలముండునదిగాదని నీకు తెలియునుగదా ! కాబట్టి అట్టి యౌవనవయస్సు తొలగిపోయి వార్ధక్యము రాకుండగనే యౌవన సుఖములు యథేచ్ఛగా అనుభవింపుము.

శ్లో॥ ఉద్యానానిచ రమ్యాణి పర్వతోపవనాని చ,
సహ రాక్షస రాజేన చర త్వం మదిరేక్షణే. 36

పదచ్ఛేదము :- ఉద్యానాని - చ - రమ్యాణి - పర్వతోపవనాని - చ - సహ - రాక్షసరాజేన - చర - త్వం - మదిరేక్షణే.

అన్వయక్రమము - మదిరేక్షణే! త్వం రాక్షసరాజేనసహ, రమ్యాణి ఉద్యానాని, పర్వతోపవనానిచ, చర.

ప్రతిపదార్థము :- మదిరేక్షణే ! = ఎఱ్ఱని కన్నులుగల ఓ జానకీ ! త్వం = నీవు, రాక్షసరాజేనసహ =రాక్షసప్రభువైన రావణునితో గూడి, రమ్యాణి = సుందరములైట్టి, ఉద్యానాని = ఉద్యానవనములను, పర్వతోప వనానిచ = క్రీడాపర్వతములను, ఆరామములను, చర = విహరింపుము.

తాత్పర్యము - ఓసుందరీ! మా రాక్షసప్రభువుతో గూడి, మనోహరములైన ఉద్యానవనము లందును, క్రీడాపర్వతములందును, అందలి ఆరామములందును యథేచ్ఛగా విహరింపుము.

శ్లో॥ స్త్రీసహస్రాణి తే సప్త వశే స్థాస్యంతి సుందరి,
రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్. 37

పదచ్ఛేదము :- స్త్రీసహస్రాణి - తే - సప్త - వశే - స్థాస్యంతి - సుందరి - రావణం - భజ - భర్తారం-భర్తారం - సర్వరక్ష-సామ్.

అన్వయక్రమము :- సుందరి! సప్త స్త్రీసహస్రాణి తే వశే స్థాస్యంతి, సర్వరక్షసాంభర్తారం రావణం, భర్తారం భజ.

ప్రతిపదార్థము :- సుందరి - ఓ సౌందర్యవంతురాలా! సప్త స్త్రీ సహస్రాణి = ఏడువేలమంది అంతః పురస్త్రీలు, తే వశే = నీ యధీనమునందు, స్థాస్యంతి = ఉండగలరు. సర్వ రక్షసాం భర్తారం - రాక్షసులెల్లరికిని ప్రభువైనట్టి, రావణం = రావణాసురుని, భర్తారం = భర్తగాను, భజ = సేవింపుము.

తాత్పర్యము :- సమస్త రాక్షసలోకమునకును ప్రభువైనట్టి రావణాసురుని నీవు భర్తగా చేసికొనుము. అట్లైన అంతఃపురమునందలి ఏడువేలమందియు నీకు అధీనులై వర్తించెదరు.

శ్లో॥ ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి,
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్ కరిష్యసి.

పదచ్ఛేదము :- ఉత్పాట్య - వా - తే - హృదయం - భక్షయిష్యామి - మైథిలి! యది - మే - వ్యాహృతం - వాక్యం - న - యథావత్ - కరిష్యసి.

అన్వయక్రమము :- మైథిలి! వా, వ్యాహృతం మే వాక్యం, యథావత్ నకరిష్యసి యది, తే హృదయం ఉత్పాట్య భక్షయిష్యామి.

ప్రతిపదార్థము :- మైథిలి = ఓ జానకీ! వా = అట్లుగాక, వ్యాహృతం=చెప్పబడిన, మే వాక్యం = నామాటను, యథావత్ = చెప్పి

నట్లుగా, న కరిష్యసియది = ఆచరింపకుంటివేని, తే హృదయం = నీ గుండెకాయను, ఉత్పాట్య = పెల్లగించి, భక్షయిష్యామి=తినివేసెదను.

తాత్పర్యము :- ఓ జానకీ! ఇంతగా చెప్పుచున్నట్టి నామాటలను నేను చెప్పినరీతిగ నీవాచరింపక పోయినచో నేనిప్పుడే నీ గుండెకాయను పెల్లగించి తీసి తినివేసెదను సుమా!

శ్లో॥ తత శ్చండోదరీనామ రాక్షసీ క్రోధమూర్ఛితా,
భ్రామయంతీ మహా చ్ఛూల మిదం వచన మబ్రవీత్. 39

పదచ్ఛేదము - తతః - చండోదరీ - నామ - రాక్షసీ - క్రోధమూర్ఛితా - భ్రామయంతీ - మహత్ - శూలం - ఇదం - వచనం - అబ్రవీత్.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము - తతః = అటుపిమ్మట, చండోదరీనామ = చండోదరియను పేరుగల, రాక్షసీ = రక్కసి, క్రోధమూర్ఛితా = క్రోధముచే ఒడలుతెలియనిదై, మహత్ = గొప్పదైన, శూలం = శూలాయుధమును, భ్రామయంతీ = త్రిప్పుచున్నదై, ఇదం వచనం = ఈ మాటను, అబ్రవీత్ = పలికెను.

తాత్పర్యము :- అటుపిమ్మట చండోదరియను రక్కసి క్రోధముచే ఒడలు తెలియనిదై తనచేతిలోని పెద్దదైన శూలమును హేలగా త్రిప్పుచు సీతాదేవితో ఈ విధముగా పలికెను.

శ్లో॥ ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కంపిపయోధరామ్,
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహా నభూత్,

పదచ్ఛేదము – ఇమాం – హరిణలోలాక్షీం – త్రాసోత్కంపి పయోధరామ్, రావణేన – హృతాం – దృష్ట్వా – దౌహృదః – మే – మహాన్ – అభూత్,

అన్వయక్రమము :– రావణేన హృతాం, త్రాసోత్కంపిపయోధరాం, హరిణలోలాక్షీం ఇమాం దృష్ట్వా మే మహాన్ దౌహృదః అభూత్.

ప్రతిపదార్థము :– రావణేన = రావణునిచే, హృతాం = అపహరింప బడినదియును, త్రాసోత్కంపి పయోధరాం = భయముచే కంపించుచున్నట్టి స్తనములు గలదియును అగు, హరిణలోలాక్షీం ఇమాం = లేడివలె చంచలములైన కన్నులు గల ఈమెను, దృష్ట్వా = చూచి, మే = నాకు, మహాన్ = గొప్పదైన, దౌహృదః = చూలింతలకు గల్గు కోరిక, అభూత్ = కలిగెను.

తాత్పర్యము :– రావణుడు తెచ్చి నిర్బంధించుట వలన, భయముచే వణకి పోవుచున్న స్తనములును, చంచలములైన లేడి చూపులవంటి చూపులను గల ఈమెను చూడగనే చూలింత రాలినగు నాకు ఒకగొప్ప కోరిక కలిగినది

శ్లో॥ యకృత్ప్లీహా మ థోత్పీడం హృదయంచ సబంధనమ్,
అంత్రాణ్యపి తథా శీర్షం ఖాదేయ మితి మే మతిః. 41

పదచ్ఛేదము :– యకృత్ – ప్లీహం – అథ – ఉత్పీడం – హృదయం – చ – సబంధనమ్, అంత్రాణి – అపి – తథా – శీర్షం – ఖాదేయం – ఇతి – మే – మతిః.

ప్రతిపదార్థము :– యకృత్ = ఎడమవైపు కడుపునందుండు యకృత్తు అను మాంసమును, ప్లీహమను మాంసమును, ఉత్పీడం =

ఉత్పీడమును గుండెకాయకు పైనుండు మాంసఖండమును, సబంధనం = నాడులతో గూడిన, హృదయంచ = గుండెకాయను, అంత్రాణి అపి = ప్రేగులనుగూడ, తథా = అట్లే, శీర్షం = కపాలము నందలిమెదడును, ఖాదేయం = తినివేయవలెను, ఇతి = అని, మే = నాయొక్క మతిః = కోరిక.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :— 'యకృత్' - కడుపులో దక్షిణ భాగమునందుండు కాలఖండమను మాంస విశేషము.
ప్లీహము — గుండెకాయకు ఎడమ భాగము నందుండు గుల్మమను మాంస విశేషము. ఉత్పీడం — గుండెకు పై భాగమున నుండు మాంస బంధనము.

తాత్పర్యము :— ఈమె ఉదరము నందు కుడిఎడమలందు ఉండు యకృత్ ప్లీహము లనెడి రుచికరమైన మాంస ఖండములను, గుండె పైనుండు ఉత్పీడనమును, అన్ని నాడులతో కూడినగుండెకాయను, కడుపులోని ప్రేగులను, శిరము నందలి మెదడు మాంసమును, తృప్తిగా భక్షింపవలెనని నా కోరికయై యున్నది.

శ్లో॥ తతస్తు ప్రఘసానామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
కంఠ మస్యా నృశంసాయాః పీడయామ కి మాస్యతే. 43

పదచ్ఛేదము :— తతః - తు - ప్రఘసా - నామ - రాక్షసీ - వాక్యం - అబ్రవీత్ - కంఠం - అస్యాః - నృశంసాయాః - పీడయామ - కిం - అస్యతే.

అన్వయక్రమము — సుగమము

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, ప్రఘసానామ = ప్రఘసయను పేరుగల, రాక్షసీ = రాక్షసి, వాక్యం అబ్రవీత్ = మాటను పలికెను, అస్యాః నృశంసాయాః = ఈ క్రూరురాలియొక్క, కంఠం = కంఠమును. పీడయామ = నులిమి వేసెదము, కిం ఆస్యతే = ఏల ఊరకుందుట.

తాత్పర్యము :- పిమ్మట ప్రఘసయను రాక్షసాంగన ఈ రీతిగా పలికెను, క్రూరురాలైన ఈమెకంఠమును మనమందరమును నులిమి వేయుదము, ఆలస్యమెందులకు?

శ్లో॥ నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ,
నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి. 48

పదచ్ఛేదము :- నివేద్యతాం - తతః - రాజ్ఞే - మానుషీ - సా - మృతా - ఇతి - హ - న - అత్ర - కః - చన - సందేహః - ఖాదత - ఇతి - సః - వక్ష్యతి.

అన్వయక్రమము :- తతః రాజ్ఞే సా మానుషీ మృతా ఇతి నివేద్యతాం; సః ఖాదత ఇతి వక్ష్యతి; అత్ర కశ్చన సందేహః నాస్తి.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, రాజ్ఞే = రావణునకు, సా మానుషీ = ఆ మనుష్యస్త్రీ, మృతా = చనిపోయినది, ఇతి = అని, నివేద్యతాం = చెప్పబడుగాక ; సః = ఆ రావణుడు, ఖాదత = మీరు తిని వేయుడు, ఇతి = అని, వక్ష్యతి = చెప్పగలడు, అత్ర = ఈ విషయమున, కశ్చన సందేహః నాస్తి = ఏమియును సందేహములేదు.

తాత్పర్యము :- వెంటనే మనము రాజుకడకుబోయి నీవు మాకు అప్పగించిన ఆ మనుష్య స్త్రీ ఇప్పుడే చనిపోయిన దని చెప్పెదము. రావ

ణుడు, అట్లయిన ఆమెను మీరందరు కలసి తినివేయుడని వెంటనే మనకు చెప్పగలడు. ఇందుసందేహ మిసుమంతయులేదు.

శ్లో॥ తత స్త్వజాముఖీనామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
విశ స్యేమాం తత స్సర్వా స్సమాన్ కురుత పీలుకాన్.

పదచ్ఛేదము :- తతః - తు - అజాముఖీ - నామ - రాక్షసీ - వాక్యం - అబ్రవీత్ - విశస్య - ఇమాం - తతః - సర్వాః - సమాన్- కురుత - పీలుకాన్.

ప్రతిపదార్థము :- తతః = అటుపిమ్మట, అజాముఖీనామ = అజాముఖియను, రాక్షసీ = రక్కసి, వాక్యం అబ్రవీత్ = మాటను పలికెను, సర్వాః = అందఱును, ఇమాం = ఈమెను, విశస్య = ఖండించి సమాన్=సమానమైన, పీలుకాన్ = మాంసఖండములను, కురుత=చేయుడు.

తాత్పర్యము :- అంతట అజాముఖియను రాక్షసాంగన వారితో "మీరందరును ఈమెను ముక్కలుగా నరికి ఆ మాంసమును సమానమైన భాగములుగా వేరువేరుగా నుంచుడు" అని పలికెను.

శ్లో॥ విభజామ తత స్సర్వా వివాదో మే న రోచతే,
పేయ మానీయతాం క్షిప్రం లేహ్య ముచ్చావచం బహు.

పదచ్ఛేదము :- విభజామ - తతః - సర్వాః - వివాదః - మే - న - రోచతే - పేయం - ఆనీయతాం - క్షిప్రం - లేహ్యం - ఉచ్చావచం - బహు.

అన్వయక్రమము :- తతః, సర్వాః విభజామ; మే వివాదః నరోచతే; క్షిప్రం పేయం, ఉచ్చావచం లేహ్యంచ, బహు ఆనీయతామ్.

ప్రతిపదార్థము :- తతః = పిమ్మట, సర్వాః=అందఱును, విభజామ = పంచుకొందము, మే = నాకు, వివాదః = కలహము, నరోచతే = ఇష్టముండదు, క్షిప్రం = శీఘ్రమే, పేయం=మద్యమును, ఉచ్చావచం = శ్రేష్ఠమైన, లేహ్యంచ = లేహ్యమును, బహు = ఎక్కువగా, ఆనీయతాం = తేబడుగాక !

తాత్పర్యము :- తరువాత మన మందరమును కలసి సమానముగా పంచుకొందము, వివాదములకు తావిచ్చుట నాకెప్పుడును ఇష్టముండదు, శీఘ్రముగా స్వేచ్ఛగా త్రాగుటకు మద్యమును, నంజుకొనుటకై చక్కని నంజుళ్ళనుగూడ కావలసినన్ని గైకొని రండు.

శ్లో॥ తత శూర్పణఖానామ రాక్షసీ వాక్య మబ్రవీత్,
అజాముఖ్యా యదుక్తం హి త దేవ మమ రోచతే. 40

పదచ్ఛేదము .- తతః - శూర్పణఖా - నామ - రాక్షసీ-వాక్యం-అబ్రవీత్ - అజాముఖ్యా - యత్ - ఉక్తం - తత్ - ఏవ - మమ-రోచతే.

ప్రతిపదార్థము :- తతః - పిమ్మట, శూర్పణఖానామరాక్షసీ = శూర్పణఖయనురక్కసి, వాక్యం అబ్రవీత్ = మాటను పలికెను, అజాముఖ్యా = అజాముఖిచే, యత్ ఉక్తం = ఏ మాట చెప్పబడియున్నదో, తత్ఏవ = అదియే, మమ = నాకు, రోచతే = నచ్చినది.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ఇచ్చట పేర్కొనబడిన ఈ శూర్పణఖ రావణుని సోదరిగాక వేఱొకతె.

తాత్పర్యము :- అప్పుడు శూర్పణఖయను దైత్యవనిత ఇట్లు పలికెను. అణాముఖి న్యాయముగా చెప్పినదేనాకు బాగుగానచ్చినది.

శ్లో॥ సురా చానీయతాం క్షిప్రం సర్వశోకవినాశినీ,
మానుషం మాంస మాస్వాద్య నృత్యామో ఽథ
నికుంభిలామ్. 47

పదచ్ఛేదము :- సురా - చ - ఆనీయతాం - క్షిప్రం - సర్వ శోకవినాశినీ - మానుషం - మాంసం - ఆస్వాద్య - నృత్యామః అథ - నికుంభిలామ్.

అన్వయక్రమము :- క్షిప్రం, సర్వశోకవినాశినీ, సురాచ ఆనీయతామ్, అథ మానుషం మాంసం ఆస్వాద్య నికుంభిలాం నృత్యామః॥

ప్రతిపదార్థము :- క్షిప్రం = వెంటనే, సర్వశోకవినాశినీ = సమస్తశోకముల నశింపచేయునట్టి, సురాచ = మద్యముగూడ, ఆనీయతాం = కొనిరాబడుగాక ; అథ = పిమ్మట, మానుషం మాంసం = మనుష్య మాంసమును, ఆస్వాద్య =భుజించి, నికుంభిలాం=నికుంభిలానృత్యమును, నృత్యామః = నాట్యముగావింతము.

గోవిందరాజీయము :- నికుంభిల — లంకయొక్క పశ్చిమ ద్వారముననున్న భద్రకాళియనుదేవత.

తాత్పర్యము :- సమస్తశోకములను పారద్రోలునట్టి మద్యమునువెంటనే తీసికొనిరండు; మనుష్యమాంసమును చక్కగాభుజించి వెంటనే నికుంభిలాదేవికి ప్రీతికరముగా నృత్యముగావింతము.

శ్లో॥ ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా,
రాక్షసీభి స్సుఘోరాభి ర్ధైర్య ముత్సృజ్య రోదితి. 48

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
"రాక్షసీ భర్త్సనమ్" నామ
చతుర్వింశ స్సర్గః

పదచ్ఛేదము :- ఏవం - సంభర్త్స్యమానా - సా - సీతా - సుర సుతోపమా - రాక్షసీభిః - సుఘోరాభిః - ధైర్యం - ఉత్సృజ్య - రోదితి.

అన్వయక్రమము :- సుగమము

ప్రతిపదార్థము :- సురసుతోపమా = దేవకన్యలతో సమానురాలైన, సా సీతా = ఆసీతాదేవి, సుఘోరాభిః = మిక్కిలి భయంకరులైన, రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, ఏవం = ఈరీతిగా, సంభర్త్స్యమానా = బెదిరింపబడుచున్నదై, ధైర్యం = ధైర్యమును, ఉత్సృజ్య = వీడి, రోదితి = విలపించుచుండెను.

తాత్పర్యము :- దేవకన్యలతో సమానమైన సర్వలక్షణములు కల్గిన ఆసీతాదేవి దైవవశమున క్రూరస్వభావులైన రాక్షసస్త్రీలచే ఈ విధముగ భయంకరముగా గద్దింపబడుచు తన సహజ ధైర్యమును గోల్పోయి విలపింపదొడగెను.

ఇది శ్రీమత్సుందరకాండమున
" సు బో ధి ని " అను ఆంధ్ర వివరణమునందు
" రా క్ష సీ భ ర్త్స న ము " అను
ఇఱువదినాల్గవ సర్గము.

— • —

శ్రీరామాయనమః

శ్రీరామశరణ గురుభ్యోనమః

పంచవింశః సర్గః

శ్లో॥ తథా తాసాం వదంతీనాం పరుషం దారుణం బహు,
రాక్షసీనా మసౌమ్యానాం రురోద జనకాత్మజా. 1

పదచ్ఛేదము :- తథా - తాసాం - వదంతీనాం - పరుషం - దారుణం - బహు - రాక్షసీనాం - అసౌమ్యానాం - రురోద - జనకాత్మజా.

అన్వయక్రమము :- తథా, పరుషం, బహు దారుణం వదంతీనాం, అసౌమ్యానాం, తాసాంరాక్షసీనాం (వచనంశ్రుత్వా) జనకాత్మజా రురోద.

ప్రతిపదార్థము :- తథా = అవిధముగా, పరుషం = కటువుగాను. బహుదారుణం = మిక్కిలిక్రూరముగాను, వదంతీనాం = మాటలాడుచున్నట్టి, అసౌమ్యానాం = దుర్మార్గురాండ్రయిన. తాసాం రాక్షసీనాం = ఆ రాక్షసస్త్రీలయొక్క, వచః శ్రుత్వా = మాటలనువిని. జనకాత్మజా = సీతాదేవి, రురోద = విలపించెను.

తాత్పర్యము :- అవిధముగా కఠోరముగను, మిక్కిలి దారుణముగను లినను గర్జించుచున్న క్రూరురాండ్రైన ఆ రాక్షసవనితల మాటలు విని సీతాదేవి చేయునదిలేక మిక్కిలి విలపించుచుండెను.

శ్లో॥ ఏవ ముక్తాస్తు వైదేహీ రాక్షసీభి ర్మనస్వినీ,
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా. 2

పదచ్ఛేదము :— ఏవం - ఉక్తా-తు - వైదేహీ - రాక్షసీభిః - మనస్వినీ - ఉవాచ - పరమత్రస్తా - బాష్పగద్గదయా - గిరా.

అన్వయక్రమము :— ఏవం రాక్షసీభిః ఉక్తా మనస్వినీ వైదేహీ పరమత్రస్తా (సతీ) బాష్పగద్గదయా గిరా ఉవాచ.

ప్రతిపదార్థము :— రాక్షసీభిః = రాక్షసాంగనలచే, ఏవం = ఈ రీతిగా. ఉక్తా = పలుకబడినదై. మనస్వినీ = దృఢమనస్కురాలైన, వైదేహీ = సీతాదేవి, పరమత్రస్తా (సతీ) = మిక్కిలి భీతిచెందినదగుచు, బాష్పగద్గదయా = కన్నీటిబిందువులచేడగ్గుతికపడిన, గిరా = కంఠముతో, ఉవాచ = పలికెను.

తాత్పర్యము :— రాక్షసవనితలు తనను ఈరీతిగా బెదిరించు చుండగా, తన పాతివ్రత్య రక్షణమునకు దృఢముగా నిశ్చయించుకొన్న సీతాదేవి మిక్కిలి ఉద్వేగమునొందినదై దుఃఖబాష్పములలో డగ్గుతిక బడిన స్వరముతో ఈ రీతిగా పలికెను.

శ్లో॥ న మానుషీ రాక్షసస్య భార్యా భవితు మర్హతి,
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః. 8

పదచ్ఛేదము :— న - మానుషీ - రాక్షసస్య - భార్యా - భవితుం - అర్హతి - కామం - ఖాదత - మాం - సర్వాః - న - కరిష్యామి - వః - వచః.

అన్వయక్రమము :— మానుషీ రాక్షసస్య భార్యా భవితుం నఅర్హతి. సర్వాః మాం కామం ఖాదత; వః వచః నకరిష్యామి.

ప్రతిపదార్థము :— మానుషీ = మనుష్యస్త్రీ, రాక్షసస్య = రాక్షసునకు, భార్యా భవితుం = భార్యగనుండుటకు, న అర్హతి = తగదు, సర్వాః = అందరును, కామం = స్వేచ్ఛగా. మాం = నన్ను, ఖాదత =

తినివేయుడు. వః = మీయొక్క. వచః = మాటలను. న కరిష్యామి = ఆచరింపను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ఈ సందర్భమునందలి సీతా విలాపమంతయును, మానవరూపము ధరించినందులకు తగినట్లుగా ఆమె ఒక నటివలె నరులను అనుకరించుచు పలికిన మాటలని తెలిసికొనవలెను.

తాత్పర్యము :- ఓరాక్షసవనితలారా ! మనుష్యస్త్రీ ఎన్నడును మీరాక్షసునకు భార్యగనుండజాలదు. మీరందరునుకలసి మీయిష్టమువచ్చి నట్లు నన్ను తినివేయుడు. నేనుమాత్రము మీమాటలను అంగీకరింపను.

శ్లో॥ సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా,
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా. 4

పదచ్ఛేదము :- సా - రాక్షసీమధ్యగతా - సీతా - సురసుతోపమా - న - శర్మ - లేభే - దుఃఖార్తా - రావణేన - చ - తర్జితా.

అన్వయక్రమము :- రాక్షసీమధ్యగతా, సురసుతోపమా సా సీతా, రావణేన తర్జితా, దుఃఖార్తాచ (సతీ) శర్మ నలేభే.

ప్రతిపదార్థము :- రాక్షసీమధ్యగతా = రాక్షసస్త్రీల నడుమ నున్న, సురసుతోపమా = దేవకన్యలను బోలినట్టి, సా సీతా = ఆ సీతాదేవి, దుఃఖార్తా = దుఃఖముచే పీడింపబడినదియును, రావణేన తర్జితాచ (సతీ) = రావణునిచే బెదరింపబడినదియునగుచు, శర్మ న లేభే = సుఖము నొంద కుండెను.

తాత్పర్యము :- దేవకన్యలను బోలినట్టి ఆ సీతాదేవి రాక్షస స్త్రీల నడుమను చిక్కుకొని మిక్కిలి శోకార్తురాలై రావణునిచే భయంక రముగా గద్దింపబడి అమితమైన వ్యథ నొందెను.

శ్లో॥ వేపతే స్మాధికం సీతా విశంతీ వాంగ మాత్మనః,
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకైరి వార్దితా. 5

పదచ్ఛేదము :- వేపతే - స్మ - అధికం - సీతా - విశంతీ - ఇవ - అంగం - ఆత్మనః - వనే - యూథపరిభ్రష్టా - మృగీ - కోకైః - ఇవ - అర్దితా.

అన్వయక్రమము :- వనే యూథపరిభ్రష్టా, కోకైః అర్దితా మృగీ ఇవ సీతా ఆత్మనః అంగం విశంతీ ఇవ అధికం వేపతే స్మ.

ప్రతిపదార్థము :- వనే = అరణ్యమునందు, యూథపరిభ్రష్టా = తన మందనుండి విడిపోయినదై, కోకైఃఅర్దితా = తోడేళ్ళచే బాధింప బడుచున్నట్టి, మృగీఇవ = ఆడులేడివలె, ఆత్మనః అంగం = తనయొక్క శరీరమును, విశంతీ ఇవ = ప్రవేశించుచున్నట్లు, సీతా = సీతాదేవి, అధికం = మిక్కిలిగా, వేపతేస్మ = కంపించిపోవుచుండెను.

విశేషార్థములు, వాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- ఆత్మనః అంగం విశంతీఇవ = రావేలు తన శరీరమును తనలోనికి ముడుచుకొన్నట్లుగా.

తాత్పర్యము :- అడవిలో తన మందనుండి తప్పిపోయి తోడేళ్ళనడుమ చిక్కుకొన్నదై వాటిచే వేధింపబడుచున్నట్టి ఆడులేడివలె సీతాదేవి తాపేలువలె తన శరీరమును సిగ్గుచేతను, దుఃఖముచేతను సంకోచ పరచుకొనుచున్నదై మిక్కిలిగా వణకదొడగెను.

శ్లో॥ సా త్వశోకస్య విపులాం శాఖా మాలంబ్య పుష్పితాం,
చింతయామాస శోకేన భర్తారం భగ్నమానసా. 6

పదచ్ఛేదము :- సా - తు - అశోకస్య - విపులాం - శాఖాం - ఆలంబ్య - పుష్పితాం - చింతయామాస - శోకేన - భర్తారం - భగ్నమానసా.

అన్వయక్రమము :- సా = ఆ సీతాదేవి, విపులాం = పెద్దదియును, పుష్పితాం = చక్కగ పూచియున్నదియునగు, అశోకస్య = అశోకవృక్షముయొక్క, శాఖాం = కొమ్మను, ఆలంబ్య = పట్టుకొని, శోకేన = దుఃఖముచే, భగ్నమానసా సతీ = బద్ధలైన మనస్సుగలదై, భర్తారం = భర్తనుగూర్చి, చింతయామాస = చింతింపదొడగెను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :- అశోకవనమునందు శింశుపావృక్షమునకు ప్రక్కగనే ఇంకొక అశోకవృక్షమున్నదని భావము.

తాత్పర్యము :- సీతాదేవి తాను కూర్చుండిన శింశుపావృక్షమునకు చేరి చక్కగా పుష్పించియున్న అశోకవృక్షముయొక్క ఒక పెద్ద కొమ్మను తన చేతితో పట్టుకొని శోకముచే చెదరిన మనస్సుతో తన భర్తయైన శ్రీరామునిగూర్చి చింతింపసాగెను.

శ్లో॥ సా స్నాపయంతీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః,
చింతయంతీ న శోకస్య తదాంత మధిగచ్ఛతి. 7

పదచ్ఛేదము :- సా - స్నాపయంతీ - విపులౌ - స్తనౌ - నేత్రజలస్రవైః - చింతయంతీ - న - శోకస్య - తదా - అంతం - అధిగచ్ఛతి.

అన్వయక్రమము :- సా విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః స్నాపయంతీ, చింతయంతీ, తదా శోకస్య అంతం న అధిగచ్ఛతి.

ప్రతిపదార్థము :- సా = ఆ సీతాదేవి, విపులౌ = స్థూలములైన, స్తనౌ = స్తనములను, నేత్రజలస్రవైః = కన్నీటిధారలచే, స్నాపయంతీ = తడపివైచుచు, చింతయంతీ = దుఃఖించుచు, శోకస్య = శోకమునకు, తదా = ఆ సమయమున, అంతం = సమాప్తిని, న అధిగచ్ఛతి = పొందలేకుండెను.

తాత్పర్యము :- సీతాదేవి, నిరంతరముగ స్రవించుచున్న కన్నీటిధారలు స్థూలములైన తన స్తనములను తడిపివేయుచుండగా, మిక్కిలిగ విలపించుచు తన శోకమున కాసమయమున అంతమును గానలేకుండెను.

శ్లో॥ సా వేపమానా పతితా ప్రవాతే కదళీ యథా,
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనా௨భవత్. 8

పదచ్ఛేదము - సా - వేపమానా - పతితా - ప్రవాతే - కదళీ - యథా - రాక్షసీనాం - భయత్రస్తా - వివర్ణవదనా - అభవత్.

అన్వయక్రమము :- సా ప్రవాతే పతితా కదళీయథా వేపమానా, రాక్షసీనాం (వచోభిః), భయత్రస్తా (సతీ) వివర్ణవదనా అభవత్.

ప్రతిపదార్థము :- సా = ఆ సీతాదేవి, వేపమానా = కంపించిపోవుచున్నదై, ప్రవాతే = పెనుగాలియందు, కదళీయథా = అరటిచెట్టువలె, పతితా = పడినదై, రాక్షసీనాం = రాక్షసాంగనలయొక్క, (వచోభిః = వాక్కులచే) భయత్రస్తా = భీతిచే వ్యథనొందినదై, వివర్ణవదనా = పాలిపోయినట్టి ముఖముగలది, అభవత్ = అయెను.

తాత్పర్యము సీతాదేవి రాక్షసుల క్రూరత్వమునకు మిక్కిలి భయపడుచున్నదై, కంపించిపోవుచు పెనుగాలికి ఊగి నేలపైబడిన అరటి చెట్టువలె నేలకొరిగి, పాలిపోయినట్టి ముఖముతో శోకమగ్నురాలై యుండెను.

శ్లో॥ తస్యాస్సా దీర్ఘవిపులా వేపంత్యాస్సీతయా తదా,
దదృశే కంపినీ వేణీ వ్యాళీవ పరిసర్పతీ. 9

పదచ్ఛేదము :- తస్యాః - సా - దీర్ఘవిపులా - వేపంత్యాః - సీతయా - తదా - దదృశే - కంపినీ - వేణీ - ఇవ - పరిసర్పతీ.

అన్వయక్రమము. వేపంత్యాః తస్యాః సీతయా (సీతాయాః) కంపినీ, దీర్ఘవిపులా సా వేణీ తదా పరిసర్పతీ వ్యాళీఇవ దదృశే.

ప్రతిపదార్థము .- వేపంత్యాః = కంపించుచున్నట్టి, తస్యాః సీతయా (సీతాయాః) = ఆ సీతాదేవియొక్క, దీర్ఘవిపులా = పొడవుగను లావుగనున్నట్టి, కంపినీ = కదలుచున్నట్టి, వేణీ = కేశపాశము, తదా = అ సమయమునందు. పరిసర్పతీ = చరచర ప్రాకుచున్న, వ్యాళీఇవ = స్త్రీ సర్పములె, దదృశే = కానవచ్చెను.

తాత్పర్యము :- అట్లు పొడవుగను లావుగను నున్నట్టి ఆమె కేశపాశము ఇటునటు కదలుచుండగా అది చరచర ప్రాకుచున్న నల్లత్రాచు వలె గానవచ్చుచుండెను.

సూచన :- ఈ శ్లోకమున 'సీతయా' అను తృతీయావిభక్తి పదమునకు ఆర్షప్రయోగముగా షష్ఠీవిభక్తి అర్థము చెప్పుకొనవలెను.

శ్లో॥ సా నిశ్శ్వసంతీ దుఃఖార్తా శోకోపహతచేతనా,
ఆర్తా వ్యసృజ దశ్రూణి మైథిలీ విలలాప హ. 10

పదచ్ఛేదము :— సా - నిశ్శ్వసంతీ - దుఃఖార్తా - శోకోప పహతచేతనా - ఆర్తా - వ్యసృజత్ - అశ్రూణి - మైథిలీ - విలలాప - హ.

అన్వయక్రమము :— సా మైథిలీ శోకోపహతచేతనా, దుఃఖార్తా నిశ్శ్వసంతీ అశ్రూణి వ్యసృజత్; ఆర్తా విలలాప హ.

ప్రతిపదార్థము :— సా = ఆ సీతాదేవి, దుఃఖార్తా = దుఃఖముచే దీనురాలై, శోకోపహతచేతనా = దుఃఖముచే కోల్పోయిన చైతన్యము గలదై, నిశ్శ్వసంతీ = నిట్టూర్పులు విడుచుచు, అశ్రూణి = దుఃఖ బాష్పములను, వ్యసృజత్ = విడిచెను. ఆర్తా = వ్యథనొందియున్న, మైథిలీ = జానకి, విలలాప హ = శోకించెను.

తాత్పర్యము :— ఆ సీతాదేవి రాక్షసులయొక్క మాటలచే కలిగిన దుఃఖమును భరించలేనిదై, చైతన్యమును గోల్పోయి, దీర్ఘమైన నిట్టూర్పులు విడుచుచు తన కన్నులనుండి దుఃఖబాష్పములు స్రవించు చుండగా మిక్కిలి ఆర్తురాలై శోకించుచుండెను.

శ్లో॥ హా రామేతి చ దుఃఖార్తా హా పున ర్లక్ష్మ ణేతిచ,
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ. 11

పదచ్ఛేదము :— హా - రామ - ఇతి - చ - దుఃఖార్తా - హా - పునః - లక్ష్మణ - ఇతి - చ - హా - శ్వశ్రు - మమ - కౌసల్యే - హా - సుమిత్రే - ఇతి - భామినీ.

అన్వయక్రమము :— దుఃఖార్తా భామినీ హా రామ ఇతి (చ), పునః, హా లక్ష్మణ ఇతి చ, హా మమ శ్వశ్రు కౌసల్యే, హా సుమిత్రే ఇతి (చ) విలలాప.

ప్రతిపదార్థము :- దుఃఖార్తా = దుఃఖపీడితురాలైన, భామినీ- సీతమ్మ, హా రామ ఇతిచ = హారామా యనియు, పునః = తిరిగి హా లక్ష్మణ ఇతిచ = హా లక్ష్మణాయనియును, హా మమ శ్వశ్రు కౌసల్యే = నా అత్తగారయిన హా కౌసల్యా యనియును, హా సుమిత్రే ఇతిచ = హా సుమిత్రాయనియును, విలలాప = విలపించెను.

తాత్పర్యము :- దుఃఖనిమగ్నురాలైన ఆ సీతాదేవి హా రామా యనియు, హా లక్ష్మణాయనియు, అయ్యో మా అత్త కౌసల్యా యనియును, హా సుమిత్రా యనియును విలపించుచుండెను.

శ్లో॥ లోకప్రవాద స్సత్యో ఽయం పండితై స్సముదాహృతః,
అకాలే దుర్లభో మృత్యు స్త్రియా వా పురుషస్య వా,

శ్లో॥ యత్రాహ మేవం క్రూరాభీ రాక్షసీభి రి హార్దితా,
జీవామి హీనా రామేణ ముహూర్త మపి దుఃఖితా. 13

పదచ్ఛేదము :- లోకప్రవాదః - సత్యః - అయం - పండితైః- సముదాహృతః - అకాలే - దుర్లభః - మృత్యుః - స్త్రియాః - వా - పురుషస్య - వా - యత్ర - అహం - ఏవం - క్రూరాభిః - రాక్షసీభిః - అర్దితా - జీవామి - హీనా - రామేణ - ముహూర్తం - అపి - దుఃఖితా.

అన్వయక్రమము :- యత్ర ఏవం క్రూరాభిః రాక్షసీభిః అర్దితా అహం దుఃఖితా, రామేణహీనా ముహూర్తమపి జీవామి; తత్ స్త్రియాఃవా, పురుషస్యవా మృత్యుఃఅకాలే దుర్లభః, ఇతి పండితైః సముదాహృతః, అయం లోకప్రవాదః, సత్యః.

ప్రతిపదార్థము :- యత్ర = ఏకారణమున, క్రూరాభిః రాక్షసీభిః = క్రూరురాండ్రయిన రాక్షసస్త్రీలచే, ఇహ = ఇచ్చట, ఏవం =

ఈరీతిగా, అర్దితా = పీడింపబడుచున్నదాననై, దుఃఖితా = దుఃఖము నొందుచున్నదాననై, రామేణ హీనా = రాముడులేకుండ, ముహూర్త మపి - క్షణకాలమైనను, జీవామి = బ్రతుకుచున్నానో (తత్ = ఆ కారణమున) స్త్రియాఃవా పురుషస్యవా = స్త్రీకిగాని, పురుషునకుగాని, మృత్యుః = మరణము, అకాలే = కాలము కానప్పుడు, దుర్లభః = అలభ్యమే; ఇతి = అను, పండితైః = విద్వాంసులచే, సముదాహృతః = పేర్కొనబడినట్టి, అయం లోకప్రవాదః = ఈ లోకోక్తి, సత్యః = యథార్థము.

తాత్పర్యము :- ఈ క్రూర రాక్షసస్త్రీలచే ఈవిధముగా బాధల నొందుచు, దుఃఖగ్రస్తురాలనై నారాముని విడిచి కొద్దికాలమైనను జీవముతో నున్నందువలన. నాకిప్పుడు బోధపడినది; లోకమున పురుషునకుగాని స్త్రీకిగాని దైవసంకల్పము లేనిదే కోరుకొన్నంతమాత్రమున మరణము లభింపదు'' అని పెద్దలుచెప్పుమాట పరమసత్యము ;

శ్లో॥ ఏషాఽల్పపుణ్యా కృపణా వినశిష్యా మ్యనాథవత్,
సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగైరి వాహతా॥

పదచ్ఛేదము :- ఏషా - అల్పపుణ్యా - కృపణా - వినశిష్యామి - అనాథవత్ - సముద్రమధ్యే - నౌః - పూర్ణా - వాయువేగైః ఇవ - ఆహతా.

అన్వయక్రమము :- సముద్రమధ్యే వాయువేగైః ఆహతా. పూర్ణానౌః ఇవ, ఏషా అల్పపుణ్యా, కృపణా (అగాం) అనాథవత్ వినశిష్యామి.

ప్రతిపదార్థము :- సముద్రమధ్యే - నడిసముద్రమునందు, వాయువేగైః = పెద్దగాలులవడిచే, అహతా = ఒరగిపోయినట్టి, పూర్ణా నౌః ఇవ = నిండుఓడవలె, అల్పపుణ్యా = పుణ్యహీనురాలనై, కృపణా =

కీనురాలనై యున్న, ఏషా (అహం) = ఈనేను, అనాధవత్ = దిక్కు-లేనిదానివలె వినశిష్యామి = నశించిపోవుదును.

తాత్పర్యము :- సముద్రమధ్యమునందు పెనుగాలులయొక్క-తాకిడికి ఒరగిపోయిన నిండైన ఓడవలె, క్షీణపుణ్యురాలనై దీనురాలనై యున్ననే నిప్పుడు దిక్కు-లేనిదానివలె నశించిపోవుదునుగదా!

శ్లో॥ భర్తారం త మపశ్యంతీ రాక్షసీవశ మాగతా,
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా. 15

పదచ్ఛేదము :- భర్తారం - తం - అపశ్యంతీ - రాక్షసీవశం - ఆగతా - సీదామి-ఖలు - శోకేన - కూలం - తోయహతం - యథా.

అన్వయక్రమము :- తంభర్తారం అపశ్యంతీ, తోయహతం కూలంయథా రాక్షసీవశం ఆగతా, (అహం) శోకేన సీదామిఖలు.

ప్రతిపదార్థము :- తం భర్తారం=జగత్ప్రసిద్ధుడైన నా నాథుని, అపశ్యంతీ = చూడలేనిదాననై, రాక్షసీశవం ఆగతా = ఈ రాక్షసస్త్రీల కధీనురాలనై, తోయహతం కూలంయథా=జలముచే కూల్చబడిన గట్టువలె, అహం = నేను, శోకేన = దుఃఖముతో, సీదామిఖలు = నశించిపోవుదునుగదా!

తాత్పర్యము :- లోకనాథుడైన నా నాథుని కానలేనట్టి నేను రాక్షసస్త్రీలచేతికి చిక్కి-నదాననై, ప్రవాహజలముయొక్క- ఒరపిడికి దెబ్బ తిన్న ఏటిగట్టువలె దుర్భరమైన దుఃఖముతో నశించిపోవుదునుగదా!

శ్లో॥ తం పద్మదళపత్రాక్షం సింహావిక్రాంతగామినమ్,
ధన్యాః పశ్యంతి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్. 16

పదచ్ఛేదము :- తం - పద్మదళపత్రాక్షం - సింహవిక్రాంత గామినం - ధన్యాః - పశ్యంతి - మే - నాథం - కృతజ్ఞం - ప్రియవాదినమ్.

అన్వయక్రమము :- పద్మదళపత్రాక్షం, సింహవిక్రాంతగామినం, కృతజ్ఞం, ప్రియవాదినం, తం మే నాథం ధన్యాః పశ్యంతి.

ప్రతిపదార్థము :- పద్మదళపత్రాక్షం = తామరరేకులవంటి కన్నులుగలవాడును, సింహవిక్రాంతగామినం = సింహగమనమువంటి నడకగలవాడును, కృతజ్ఞం = ఉపకారమును స్మరించువాడును, ప్రియవాదినం = ప్రియముగ మాటలాడువాడునగు, తం మే నాథం = విఖ్యాతుడైన నాభర్తను, ధన్యాః = అదృష్టవంతులు, పశ్యంతి = చూచెదరు

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

గోవిందరాజీయము :- 'తం మే నాథం' అనగా— "బహవో నృప కళ్యాణగుణాః పుత్రస్య సంతి తే" రాజా నీపుత్రుడైన రామునిలో లెక్కలేనన్ని కళ్యాణగుణములున్నవిసుమా। యనికీర్తింపబడినట్టి సుప్రసిద్ధుడైన ఆ శ్రీరాముడు అనిభావము.

"ధన్యాః పశ్యంతి"—అనగా నేను గతించిపోవుచున్నాను గనుక మిగిలిన ధన్యులుమాత్రమే నాసర్వస్వము అని భావించుకొన్న నా నాధుని చూచు అదృష్టము కల్గియుందురని భావము.

వాసుదాసస్వామి :- ఇందాత్మగుణములు, దేహగుణములు కలిపి చెప్పుటచే సగుణబ్రహ్మమే సేవ్యమని యట్టివాని సాక్షాత్కారము గలవారే పుణ్యాత్ములని మోక్షార్హులని యేర్పడుచున్నది. "వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా" యన్నట్లు సాక్షాద్వేద

మైన శ్రీమద్రామాయణము "ఎవ్వడు గుణవంతుడని ప్రారంభించి శ్రీరామ చంద్రమూర్తియందు అనురాగముగలవారందరును ముక్తులైరని యుపక్రమోపసంహారములయందు ఏకవిధము గలదయ్యెను.

అటులనే పంచమవేదము ''నారాయణం నమస్కృత్య, నారాయణ కథా మిమా'' మ్మని ప్రారంభించి ముఖ్యములైన విష్ణుసహస్రనామములు, భగవద్గీత - సగుణబ్రహ్మోపాసనమే మోక్షసాధనమని నిర్వచించెను.

"శ్రీమద్భాగవతము - విశ్వజన్మస్థితి విలయంబు లెవ్వనివలన" నని సగుణ బ్రహ్మముతోనే ప్రారంభించి "హరిం దలంచు మిక జన్మము కలుగ'' దని ముగించెను. బ్రహ్మసూత్రములు "బ్రహ్మజిజ్ఞాస" యని ప్రారంభించుచు ''జన్మాద్యస్య యతః'' యని సగుణబ్రహ్మోపాసనతో ప్రారంభించి, ముగింపులో అట్టి వారికి శ్రుతిప్రమాణమున పునర్జన్మలేదని'' నపునరావృత్తి శబ్దాత్" అని సూత్రించెను.

తాత్పర్యము :- తామరతేకులవలె అతివిశాలములైన సుందరములగు నయనములుగలవాడు; మృగరాజముయొక్క విక్రమముతో నొప్పు గమనముగలవాడు; పరులుచేసిన చిన్నమేలును గొప్పగా నెంచునట్టి శీలముగలవాడు; ఎల్లరతోడను మధురముగ మాటలాడువాడు; ఇట్టి సద్గుణసాగరుడైన నా నాథుని దర్శించుభాగ్యము ఇకమీదట నాకులేదు. ఏపుణ్యాత్ములకో మాత్రమే యుండును.

శ్లో॥ సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా,
తీక్ష్ణం విషమివా స్వాద్య దుర్లభం మమ జీవితమ్. 17

పదచ్ఛేదము :- సర్వథా - తేన - హీనాయాః - రామేణ - విదితాత్మనా - తీవ్రం - విషం - ఇవ - ఆస్వాద్య - సుల్లభం - మమ - జీవితమ్.

అన్వయక్రమము :- విదితాత్మనా తేన రామేణ హీనాయాః మమ జీవితం తీక్ష్ణం విషం ఆస్వాద్యఇవ, సర్వథా దుర్లభమ్.

ప్రతిపదార్థము :- విదితాత్మన :- = ఆత్మవేదియైన, తేన = రామేణ - ఆ శ్రీరామునిచే, హీనాయాః= ఎడబాటునొందిన, మమ = నాకు, తీక్ష్ణం = గాఢమైన, విషం = విషమును, ఆస్వాద్యఇవ = మింగినట్లుగ, సర్వథా = ఎల్ల విధములను, జీవితం = జీవితము, దుర్లభం = దుర్లభము.

తాత్పర్యము - ఉత్తమజ్ఞానసంపన్నుడుగా జగత్ప్రసిద్ధుడైన నారామునినుండి దీర్ఘమైన యెడబాటునొందితిని ఇట్టినాకు గాఢమైన విషము త్రాగిన నరునికివలె ఎల్ల విధముల జీవితాశ దుర్లభమైనదే।

శ్లో॥ కీదృశం తు మయా పాపం పురా జన్మాంతరే కృతమ్,
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరంసుదారుణమ్॥

పదచ్ఛేదము .- కీదృశం - తు - మయా - పాపం - పురా - జన్మాంతరే - కృతమ్, యేవ్య - ఇదం - ప్రాప్యతే - దుఃఖం - మయా - ఘోరం - సుదారుణమ్.

అన్వయక్రమము :- యేన మయా ఇదం ఘోరం సుదారుణం దుఃఖం ప్రాప్యతే, (తేన) మయా పురా జన్మాంతరే కీదృశం తు పాపం కృతమ్.

ప్రతిపదార్థము :- యేన = ఏకారణముచే, మయా = నాచేత, ఇదం = ఈ, ఘోరం=భయంకరమైనదియును, సుదారుణం = మిక్కిలి= తీవ్రమైనదియునగు, దుఃఖం = దుఃఖము, ప్రాప్యతే = పొందబడు చున్నదో, (తేన = ఆకారణముచే) మయా = నాచేత, పురా =

పూర్వము, జన్మాంతరే = వేఱుజన్మమునందు, కీదృశంతు = ఎంతటి దారుణమైనట్టి, పాపం = పాతకము, కృతమ్ = చేయబడినదో ।

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి :- పూర్వజన్మమనగా ఇచ్చట బాల్యమని అర్థము గ్రహించవలెను. తనను అరణ్యమునకు తనతోతీసికొనిపోనని శ్రీరామచంద్రమూర్తి పలికినపుడు నీవు పురుషవిగ్రహము దాల్చినస్త్రీవని సీతమ్మ శ్రీరామచంద్రుని దూషించెనుగదా। ఆ పాపమిట్లు తనను బాధించు చున్నదని ఆమె తలపోయుచున్నదని గ్రహించవలెను. జన్మాంతరమనగా దేహముపోయి వేఱుదేహము వచ్చుచేకదా। ఏడుసంవత్సరములకు పరిపూర్ణనూతనదేహము, వచ్చుచుండును కావున ఇచ్చట సీతమ్మ అనాలోచిత వాక్యముచెప్పలేదని గ్రహించవలెను.

తాత్పర్యము .- నేడు భయంకరమై మహాదారుణమైనట్టి, ఈ విధమగు దుఃఖము నాకు సంప్రాప్తించుటకు, వెనుకటిజన్మమునందు నే నెట్టి, మహాపాతకమును చేసి యుంటినోగదా ।

శ్లో॥ జీవితం త్యక్తు మిచ్ఛామి శోకేన మహతా వృతా,
రాక్షసీభి శ్చ రక్ష్యంత్యా రామో నాసాద్యతే మయా,

పదచ్ఛేదము .- జీవితం - త్యక్తుం - ఇచ్ఛామి - శోకేన - మహతా - ఆవృతా - రాక్షసీభిః - చ - రక్ష్యంత్యా - రామః-న-ఆసాద్యతే- మయా,

అన్వయక్రమము :- రాక్షసీభిః రక్ష్యంత్యా మయా రామః న ఆసాద్యతే। (అతః) మహతా శోకేన ఆవృతా (అహం) జీవితం త్యక్తుం ఇచ్ఛామి.

ప్రతిపదార్థము:- రాక్షసీభిః = రాక్షసస్త్రీలచే, రక్షంత్యా = కాపలి కాయబడుచున్న, మయా = నాచేత, రామః = శ్రీరాముడు, న అసాద్యతే= పొందబడుటలేదు. (అతః = అందువలన) మహతా = గొప్పదైన, శోకేన = దుఃఖముతో, ఆవృతా = చుట్టుకొనబడినట్టి, (అహం = నేను) జీవితం = జీవితమును, త్యక్తుం ఇచ్ఛామి = విడువగోరుచున్నాను.

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు

వాసుదాసస్వామి .— భక్తుడు తన సర్వస్వము ధార పోసినను భగవంతుడు తనకు సాక్షాత్కరింపనప్పుడు "కలడు కలండ నెడువాడు గలడోలేడో"యని అతనికి సందేహము గలుగవచ్చును, కాని అప్పట్లు నాస్తికునివలె భగవంతుడు లేడనుకొనరాదు, తనయందేదో లోప మున్నది. అందువలన భగవంతుడు కరుణించలేదని ఊహించుకొనవలెను.

తాత్పర్యము :- రాక్షసస్త్రీల రక్షణలో పరితపించుచున్న, నాకు ఎప్పటికిని రఘురాముడు లభించుటలేదు, దుర్భరమైన ఈశోకములో మునిగియున్న నేను ఈ జీవితమునే విడువ దలచుచున్నాను.

శ్లో॥ ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతాం,
న శక్యం యత్పరిత్యక్తు మాత్మచ్ఛందేన జీవితమ్. 21

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే
ఆదికావ్యే సుందరకాండే
"సీతా నిర్వేదః" నామ
పంచవింశ స్సర్గః

పదచ్ఛేదము :— ధిక్ - అస్తు - ఖలు - మానుష్యం - ధిక్ - అస్తు - పరవశ్యతామ్ - న - శక్యం - యత్ - పరిత్యక్తుం - ఆత్మచ్ఛందేన - జీవితమ్.

అన్వయక్రమము :— యత్ ఆత్మచ్ఛందేన జీవితం పరిత్యక్తుం నశక్యం, (తత్) మానుష్యం ధిక్ అస్తు ; పరవశ్యతాం ధిక్ అస్తు.

ప్రతిపదార్థము :—యత్=ఏకారణమువలన, ఆత్మచ్ఛందేన=తన కోరికచేత, జీవితం=జీవితమును, పరిత్యక్తుం = విడుచుటకు, నశక్య= శక్యముగాకున్నదో, (తత్ = అకారణమువలన) మానుష్యం = మానవ జన్మమునుగూర్చి, ధిక్ అస్తు =నిందయగుగాక ; పరవశ్యతాం =పరాధీన జీవితమునుగూర్చి, ధిక్ అస్తు = నిందయగుగాక ;

విశేషార్థములు, వ్యాఖ్యాతల అభిప్రాయములు.

తిలకము :— 'ధిక్ అస్తుఖలు మానుష్యం' — మానవుడు విషాగ్ని ప్రభృతిసాధనములచే దేహత్యాగముచేసికొనుటకు వీలున్నను, అవి పాపహేతువులుగా నిశ్చయించబడుటచే ఎంతటి ఘోరదుఃఖముల నైనను భరించుటయేతప్ప గత్యంతరములేకపోవుటచే ఈ మనుష్య దేహము నింద్యమైనదని చెప్పబడుచున్నది.

వాసుదాసస్వామి .— "సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మ వశం సుఖ'మ్మని స్మృతిప్రమాణము. మనుష్యజన్మమేల నింద్యమనిన, నది పరవశమైన బ్రతుకుగావున; సంసారబద్ధుడైన జీవుడు స్వతంత్రించి చచ్చినను, అసురలోకములు తప్పవు. స్త్రీపర్యాయంబున నేను పతివ్రతను భర్తకు పరాధీనురాలను. కావున బతియాజ్ఞలేక చచ్చుటకు అధికారములేని ఈ యస్వతంత్రపు బ్రతుకు, పాడుబ్రతుకుగదా యని సీతమ్మ భావము. దీనివలన దేహికి సుఖమో దుఃఖమో ప్రారబ్ధమనుభవింపవలయునే గాని దానినితప్పించుకొన యత్నింపరాదని యేర్పడుచున్నది.

ఇక నీదుఃఖము వాయుటెట్లు? ఎన్నాళ్లని ఈ దుఃఖ మనుభవింపవలె ననిన, దాని కుపాయ మిక సీతాదేవి చెప్పినట్లు రామచంద్రమూర్తిని దలచుకొని తలచుకొని సర్వథా ధ్యానించుట, గుణవర్ణనము చేయుట, నిర్వేద పడుటయేగాని, వేఱుపాయములేదు. దీనికే అభ్యాసయోగమని పేరు.

ఆధ్యాత్మరామాయణము:- "తచ్చింతనం తత్కథన మన్యోన్యం తత్ప్రబోధనమ్, ఏకాంత తత్పరత్వంచ తదభ్యాసం విదుర్బుధాః"

భగవద్గీత:-

అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయి స్థిరమ్,
అభ్యాసయోగేన తతో మా మిచ్ఛాప్తుం ధనంజయ.

ఈ తీవ్రనిర్వేదన ఫలమే ఆచార్యప్రాప్తి, అదియే ఇకమీదట ఆమెకు కలుగబోవు హనుమత్సమాగము.

తాత్పర్యము :- తన కోరికనుబట్టి జీవితమును విడుచుటకు వీలులేనట్టి, ఈ మానవజన్మము అతి నింద్యమైనది అల్పపరాధీనమైన జీవితము కూడ పరమనింద్యమైనదే। (భగవంతుని సమీపములో తన జీవితము గడపవలసిన నరుడు ఆతనికి దూరమైనచో తిరిగి ఆతనిని చేరునంతకును ఆ నరుని జీవితము దుఃఖభాజనమై నింద్యమగునని సీతామాత ఇచట మనకు ఇట్లు సందేశము ఇచ్చుచున్నది అని గ్రహించవలెను.

ఇది శ్రీమత్సుందర కాండమున
"సుబోధిని" యను ఆంధ్రవివరణమునందు
"సీతానిర్వేదము" అను
ఇఱువదియైదవ సర్గము.
హరిః ఓం తత్సత్

—0—